KHAZANA JEWELLERY

ఈనాడు

ఖజానా జ్యువలరీ

విజయవాడ 26-7-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 347

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అనుభవమా.. యువ శరమా!

● హంపి-దివ్య తుదిపోరు నేటి నుంచే ● ఫిడే ప్రపంచకప్ చెస్

బాటుమి

చెస్‌లో భారత అభిమానులు ఎన్నో టోర్నీలు చూసుంటారు. ఈసారి ఫిడే మహిళల ప్రపంచకప్ అన్నింటికంటే ప్రత్యేకం. ఇద్దరు భారత అమ్మాయిలే టైటిల్ సమరంలో పోటీపడడమే ఇందుకు కారణం. శనివారం ఆరంభం కానున్న ఫైనల్లో వెటరన్ కోనేరు హంపి.. యువ కెరటం దివ్య దేశ్‌ముఖ్‌తో తలపడనుంది. ఒకరు రెండు దశాబ్దాలుగా భారత చెస్‌లో వెలుగుతున్న స్టార్ అయితే.. మరొకరు ఉవ్వెత్తున ఎగసిన తారాజువ్వ. అనుభవం, యువ కెరటం మధ్య పైచేయి ఎవరిదో! ఎవరు గెలిచినా చరిత్రే. ఫలితం ఏదైనా కప్ దక్కేది భారత్‌కే.

అవకాశం ఎవరికి?

భిన్న తరాల మధ్య పోరిది. అనుభవంతో పాటు ఒత్తిడిని నిలవగల హంపి.. దివ్యతో ఫైనల్లో గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెమీఫైనల్లో చైనా ప్లేయర్, టాప్‌సీడ్ లీ టింగ్ జీతో పోరులో గట్టిపోటీ ఎదురైనా నిలిచి గెలవడమే ఇందుకు నిదర్శనం. అంచనాలకు మించి రాణించి తొలిసారి ప్రపంచకప్ ఫైనల్ చేరిన దివ్యను తక్కువ అంచనా వేయలేం. ఈ టోర్నీలో బలమైన ప్రత్యర్థులపై నెగ్గిన ఈ టీనేజర్ ఆత్మవిశ్వాసంతో ఉంది. ఒత్తిడిని తట్టుకుని నిలిస్తే దివ్య చరిత్ర సృష్టించగలదు.



వెటరన్ స్టార్

భారత చెస్‌లో 38 ఏళ్ల హంపిది ప్రత్యేక ప్రస్థానం. రెండు దశాబ్దాల కెరీర్‌లో ఈ విజయవాడ అమ్మాయి ఎన్నో ఘనతలను సొంతం చేసుకుంది. రెండు సార్లు ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్ అయింది. పెళ్లి అయి.. బిడ్డ పుట్టిన తర్వాత విరామం వచ్చినా.. పునరాగమనంలో అదరగొడుతోంది. ఒత్తిడిలోనూ స్థిరంగా ఆడగలడం, దుర్భేద్యమైన డిఫెన్స్, అనుభవం హంపి బలాలు. కెరీర్‌లో ఇప్పటిదాకా దక్కని ప్రపంచకప్ సాధించాలని ఆమె కృతనిశ్చయంతో ఉంది.

కొత్త కెరటం

దివ్య దేశ్‌ముఖ్.. హంపితో పోలిస్తే పెద్దగా అనుభవం లేని ప్లేయర్. నాగపూర్‌కు చెందిన 19 ఏళ్ల దివ్య.. సీనియర్ విభాగంలో ఆడిన టోర్నీలు కూడా తక్కువే. ఇంకా గ్రాండ్‌మాస్టర్ కూడా కాలేదు. 2021లో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను పొందిన ఆమె 2023లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఒలింపియాడ్‌లో మూడు పసిడి పతకాలు కూడా ఆమె ఖాతాలో ఉన్నాయి. గతేడాది తొలిసారి 2500 ఎలో రేటింగ్‌ను అందుకుంది. దూకుడైన ఆటతో గ్రాండ్‌మాస్టర్లను కంగుతినిపిస్తోంది. తాజాగా ప్రపంచకప్‌లో తనకన్నా మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారిక (క్వార్టర్‌ఫైనల్), జు జినర్ (ప్రీక్వార్టర్స్)పై నెగ్గడమే ఇందుకు ఉదాహరణ. సెమీస్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ జాంగ్ యిపై గెలవడం ఆమెను మరో మెట్టు ఎక్కించింది.

రెండు రోజుల సమరం

ఫైనల్ క్లాసికల్ ఫార్మాట్లో రెండు రోజులు జరుగుతుంది. రెండు రోజుల్లో ఫలితం తేలకపోతే సోమవారం ర్యాపిడ్ ఫార్మాట్లో టైబ్రేక్ నిర్వహిస్తారు.

గెలిచినవాళ్లకు..

ప్రపంచకప్ విజేతకు టైటిల్‌తో పాటు రూ.43 లక్షలు ప్రైజ్‌మనీగా దక్కనున్నాయి. రన్నరప్‌కు రూ.30 లక్షలు లభిస్తాయి.

సెమీస్‌లో శ్రీజ



లాగోస్: నైజీరియాలో జరుగుతున్న లాగోస్ డబ్ల్యూటీటీ కంటెండర్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి ఆకుల శ్రీజ దూసుకెళ్తోంది. ఈ డిఫెండింగ్ ఛాంపియన్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో శ్రీజ 11-7, 11-7, 11-7తో జెని షావో (పోర్చుగల్)ను చిత్తు చేసింది. అంతకుముందు ప్రీక్వార్టర్స్‌లో 9-11, 11-9, 11-3, 11-1తో దెబోరా (ఇటలీ)పై పైచేయి సాధించింది. ఈ టోర్నీ తొలి రౌండ్లో ఒలింపిక్ కాంస్య పతక విజేత హినా హయాటా (జపాన్)కు శ్రీజ షాకిచ్చింది. ఆమె 11-7, 11-8, 11-3తో హయాటాను ఓడించింది.

దయాల్‌పై పోక్సో కేసు


యశ్ దయాల్

జైపూర్: మైనర్ బాలికపై అత్యాచారం వ్యవహారంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పేసర్ యశ్ దయాల్ (ఉత్తర్‌ప్రదేశ్)పై ఎఫ్ఐఆర్ నమోదైంది. 27 ఏళ్ల దయాల్ ఇప్పటికే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. తనను వివాహం చేసుకుంటానని అయిదేళ్లు సహజీవనం చేసి, మోసం చేశాడంటూ ఘజియాబాద్‌కు చెందిన ఒక మహిళ అతనిపై ఆరోపణలు చేసింది. తాజాగా మైనర్ బాలికపై అత్యాచారం కేసులో జైపూర్ పోలీసులు అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎస్‌హెచ్ఓ అనిల్ జైమన్ ప్రకారం తనకు 17 ఏళ్లు ఉన్నప్పుడు 2023లో తొలిసారిగా అత్యాచారానికి గురైనట్లు బాధితురాలు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో సీతాపుర ప్రాంతంలోని హోటల్‌లో యశ్‌దయాళ్ మరోసారి అత్యాచారానికి పాల్పడినట్లు పేర్కొంది. "పోక్సో (లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ) చట్టం, బీఎన్ఎస్ ప్రకారం దయాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. తన క్రికెట్ కెరీర్‌కు సహాయం, మద్దతు అందిస్తానని దయాల్ హామీ ఇచ్చినట్లు బాధితురాలు ఆరోపించింది. ఏప్రిల్‌లో ఐపీఎల్ కోసం జైపూర్‌లో ఉన్నప్పుడు బాధితురాలిని హోటల్‌కు పిలిచి, అత్యాచారం చేసినట్లు ఫిర్యాదులో ఆమె పేర్కొంది" అని అనిల్ వివరించారు. ఈ వ్యవహారంపై దయాల్ ఇంకా స్పందించలేదు.

యూపీ వారియర్స్ కోచ్‌గా నాయర్

ముంబయి: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఫ్రాంఛైజీ యూపీ వారియర్స్‌కు భారత జట్టు మాజీ సహాయక శిక్షకుడు అభిషేక్ నాయర్ చీఫ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. నాలుగో సీజన్‌లో వారియర్స్‌కు నాయర్ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తాడని శుక్రవారం ఫ్రాంఛైజీ ప్రకటించింది. గత మూడు సీజన్లలో చీఫ్ కోచ్‌గా పనిచేసిన జాన్ లూయిస్ స్థానంలో అతడు బాధ్యతలు స్వీకరిస్తాడని వెల్లడించింది.

తొలి టెస్టు వాళ్లది.. రెండో టెస్టు మనది.. మూడో టెస్టు వాళ్లది.. ఈ లెక్క ప్రకారం మనోళ్లు మళ్లీ పుంజుకుంటారని.. నాలుగో టెస్టు మనదవుతుందని.. సిరీస్ సమమవుతుందనే అంచనాతో ఉన్నారు అభిమానులు. కానీ టీమ్‌ఇండియా అంచనాలను అందుకోలేకపోయింది. ఇక భారత్ పోరాడాల్సింది గెలుపు కోసం కాదు.. డ్రా కోసమే! ఇంగ్లిష్ పరుగుల యంత్రం జో రూట్‌ను ఆపలేకపోయిన భారత జట్టు.. ఇప్పటికే 186 పరుగుల ఆధిక్యాన్ని సమర్పించుకుంది. రెండు రోజుల ఆట మిగిలున్న ఈ మ్యాచ్‌లో విజయావకాశాలున్నది ఇంగ్లాండ్‌కే. భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లో అసాధారణంగా పోరాడితేనో, వరుణుడు కరుణిస్తేనో మ్యాచ్ డ్రా అవుతుంది. లేదంటే సిరీస్ చేజారినట్లే.



ఇక పోరాటం.. డ్రా కోసమే

● భారత బౌలర్లు విఫలం
● నాలుగో టెస్టులో ఇంగ్లాండ్ 544/7
● రూట్.. వరుసగా రెండో శతకం

మాంచెస్టర్

బ్యాటర్లు ఓ మోస్తరు ప్రదర్శన చేశారు. బౌలర్లైనా గొప్పగా రాణించి ప్రత్యర్థి జట్టును కట్టడి చేస్తారనుకుంటే.. అలాంటిదేమీ జరగలేదు. బుమ్రా సహా బౌలర్లందరూ వరుసగా రెండో రోజూ తేలిపోవడంతో ఇంగ్లాండ్ పరుగుల పంట పండించుకుంది. భీకర ఫామ్‌తో పరుగులు, శతకాల్లో దిగ్గజ బ్యాటర్లు ఒక్కొక్కరినే దాటుకుంటూ వెళ్లిపోతున్న జో రూట్ (150; 248 బంతుల్లో 14×4).. వరుసగా రెండో సెంచరీ కొట్టేశాడు. బంతితో 5 వికెట్లు తీసిన ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ (77 బ్యాటింగ్; 134 బంతుల్లో 6×4) బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడం, ఓలీ పోప్ (71; 128 బంతుల్లో 7×4) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడడంతో మూడో రోజు, శుక్రవారం ఆట చివరికి ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 544/7తో నిలిచింది. ఆ జట్టు ఆధిక్యం 186కు చేరుకుంది. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ తలో రెండు వికెట్లు తీశారు.

వికెట్ పడదు.. పరుగులు ఆగవు

సిరీస్‌లో 2-1 ఆధిక్యం సంపాదించినప్పటికీ.. గత మూడు టెస్టుల్లో ఇంగ్లాండ్ తన సహజ శైలితో దూకుడుగా ఆడని మాట వాస్తవం. సెషన్ల వారీగా చూస్తే భారతే ఎక్కువగా ఆధిపత్యం చలాయించింది. కానీ నాలుగో టెస్టులో కథ వేరు. బౌలింగ్‌లో పైచేయి సాధించిన ఆతిథ్య జట్టు.. బ్యాటింగ్‌లో మరింత విజృంభించింది. గురువారం డకెట్, క్రాలీ బాజ్‌బాల్ ఆటతో ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేస్తే.. శుక్రవారం పోప్, స్టోక్స్‌ల సహకారంతో రూట్ జట్టును తిరుగులేని స్థితిలో నిలిపాడు. 225/2తో మూడో రోజు బ్యాటింగ్ కొనసాగించిన ఇంగ్లిష్ జట్టు.. తొలి సెషన్లో ఒక్క వికెట్టూ కోల్పోలేదు. డకెట్, క్రాలీ అంత దూకుడుగా కాకపోయినా.. రూట్ (ఓవర్ నైట్ 11), పోప్ (ఓవర్ నైట్ 20) వేగంగానే ఆడారు. ఉదయం వికెట్లు తీసి భారత్‌ను పోటీలోకి తెస్తాడనుకున్న బుమ్రా.. పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. మిగతా బౌలర్లూ నిరాశ పరచడంతో మూడో రోజు తొలి వికెట్ కోసం భారత్ చాలా సేపు ఎదురు చూడాల్సి వచ్చింది. 1, 2 పరుగులతో స్ట్రైక్ రొటేట్ చేస్తూ.. వీలుచిక్కినపుడు బౌండరీలు కొడుతూ సాగిన రూట్, పోప్ జంట తొలి సెషన్లో 28 ఓవర్లలోనే 107 పరుగులు రాబట్టింది. ఈ క్రమంలోనే ఇద్దరూ అర్ధశతకాలు కూడా పూర్తి చేశారు. విరామానికి స్కోరు 332/2.

సుందర్ మాయ చేసినా..

లంచ్ తర్వాత వాషింగ్టన్ సుందర్ స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లు తీసి భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. అతడి బౌలింగ్‌లో పోప్ స్లిప్‌లో క్యాచ్ ఇస్తే.. బ్రూక్ (3) స్టంపౌటయ్యాడు. 8 పరుగుల తేడాలో 2 వికెట్లు పడ్డాయి. అప్పటికి ఇంగ్లాండ్.. భారత్ స్కోరుకు 9 పరుగుల దూరంలో నిలిచింది. భారత్ పుంజుకుని ఇంగ్లాండ్‌కు ఎక్కువ ఆధిక్యం దక్కకుండా చూస్తుందేమో అన్న ఆశ కలిగిన సందర్భమది. కానీ రూట్ ఆ అవకాశం ఇవ్వలేదు. స్టోక్స్‌తో మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పి తన జట్టును భారీ ఆధిక్యం దిశగా నడిపించాడు. అలవోకగా భారత బౌలర్లను ఎదుర్కొన్న అతను.. 178 బంతుల్లో శతకం పూర్తి చేశాడు. మరో ఎండ్‌లో స్టోక్స్ కూడా నిలకడగా ఆడుతూ అర్ధశతకం సాధించాడు. 66 పరుగుల వద్ద స్టోక్స్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాక.. ఇంగ్లాండ్ కొంచెం తడబడింది. రూట్ 150 పూర్తి చేయగానే జడేజా బౌలింగ్‌లో స్టంపౌటై వెనుదిరిగాడు. తర్వాత జేమీ స్మిత్ (9)ను ఔట్ చేసి బుమ్రా మ్యాచ్‌లో తొలి వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. వోక్స్ (4) కూడా ఎంతోసేపు నిలవలేదు. అయితే ఏడో వికెట్ పడ్డాక తిరిగి బ్యాటింగ్‌కు వచ్చిన స్టోక్స్.. డాసన్ (21 బ్యాటింగ్)తో కలిసి అజేయంగా ఆటను ముగించాడు.



పరుగుల్లో 2.. శతకాల్లో 4

లేటు వయసులో భీకర ఫామ్‌లో ఉన్న ఇంగ్లాండ్ సీనియర్ బ్యాటర్ జో రూట్.. టెస్టు క్రికెట్లో పైపైకి ఎదిగిపోతున్నాడు. అతను అత్యధిక పరుగుల వీరుల్లో రెండో స్థానానికి ఎగబాకాడు. భారత్‌తో నాలుగో టెస్టు మూడో రోజు ఆటకు ముందు ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్న రూట్.. ఆట చివరికి ముగ్గురిని దాటేయడం విశేషం. రూట్ టెస్టు పరుగుల సంఖ్య 13,409కి చేరుకుంది. ఈ క్రమంలో ముందుగా టీమ్‌ఇండియా వాల్ రాహుల్ ద్రవిడ్ (164 టెస్టుల్లో 13288)ను అధిగమించాడు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు జాక్వెస్ కలిస్ (166 టెస్టుల్లో 13,289 పరుగులు), ఆస్ట్రేలియా మేటి బ్యాటర్ రికీ పాంటింగ్ (168 టెస్టుల్లో 13,378)లను వెనక్కినెట్టాడు. ఇక భారత దిగ్గజ బ్యాటర్ సచిన్ తెందుల్కర్ (200 టెస్టుల్లో 15,921) మాత్రమే రూట్ కంటే ముందున్నాడు. రూట్‌కిది 158వ టెస్టు. ఇక శతకాల్లో రూట్.. నాలుగో స్థానంలో ఉన్న శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర (134 టెస్టుల్లో 38)ను సమం చేశాడు. సచిన్ (51), కలిస్ (45), పాంటింగ్ (41) టాప్-3లో ఉన్నారు. రూట్ 2021 ఆరంభం నుంచి ఇప్పటిదాకా 20 టెస్టు శతకాలు సాధించడం విశేషం. కెరీర్లో అతడు 12 సెంచరీలు భారత్‌పైనే సాధించాడు.

స్టోక్స్ తొలిసారిగా..

ఇంగ్లాండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్.. అంతర్జాతీయ కెరీర్లో తొలిసారిగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 91వ ఓవర్లో సిరాజ్ వేసిన వేగవంతమైన బంతిని స్టోక్స్ డిఫెన్స్ ఆడబోగా.. అది కాస్త ఎక్కువ బౌన్స్ అయి గార్డ్ వేసుకునే చోట బలంగా తాకింది. కాసేపు నొప్పితో బాధ పడ్డ స్టోక్స్ అలాగే బ్యాటింగ్ కొనసాగించాడు. అప్పటికి అతను చేసింది 13 పరుగులే. తర్వాత అతను అర్ధశతకం కూడా పూర్తి చేశాడు. కానీ మధ్యలో ఫిజియోతో చికిత్స కూడా తీసుకున్న స్టోక్స్.. నొప్పి ఎక్కువవడంతో 116వ ఓవర్లో, 66 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. అయితే ఏడో వికెట్ పడ్డాక అతను తిరిగి బ్యాటింగ్‌కు వచ్చాడు. ఇప్పటిదాకా అంతర్జాతీయ క్రికెట్లో ఏ ఫార్మాట్లోనూ స్టోక్స్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది లేదు.

● గత పదేళ్లలో భారత్ ఆడిన విదేశీ టెస్టుల్లో ఓ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 500కు పైగా స్కోరు చేయడం ఇదే తొలిసారి.

భారత్ తొలి ఇన్నింగ్స్: 358; **ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలీ (సి) రాహుల్ (బి) జడేజా 84; డకెట్ (సి) జురెల్ (బి) కాంబోజ్ 94; పోప్ (సి) రాహుల్ (బి) సుందర్ 71; రూట్ (స్టంప్డ్) జురెల్ (బి) జడేజా 150; బ్రూక్ (స్టంప్డ్) జురెల్ (బి) సుందర్ 3; స్టోక్స్ బ్యాటింగ్ 77; స్మిత్ (సి) జురెల్ (బి) బుమ్రా 9; డాసన్ బ్యాటింగ్ 21; వోక్స్ (బి) సిరాజ్ 4; ఎక్స్‌ట్రాలు 31; **మొత్తం:** (135 ఓవర్లలో 7 వికెట్లకు) **544**; **వికెట్ల పతనం:** 1-166, 2-197, 3-341, 4-349, 5-499, 6-515, 7-528; **బౌలింగ్:** బుమ్రా 28-5-95-1; కాంబోజ్ 18-1-89-1; సిరాజ్ 26-4-113-1; శార్దూల్ 11-0-55-0; జడేజా 33-0-117-2; సుందర్ 19-4-57-2

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● ముగిసిన ఉన్నతి పోరాటం




చాంగ్‌జౌ: చైనా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 టోర్నీలో భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోరు కొనసాగుతోంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో సాత్విక్- చిరాగ్ జోడీ 21-18, 21-14తో ఆంగ్ యూ సిన్- తియో యీ (మలేసియా) జంటపై విజయం సాధించింది. మంచి ఫామ్‌లో ఉన్న భారత ద్వయం వరుస గేమ్‌ల్లో ప్రత్యర్థి జంటను చిత్తుచేసింది. మలేసియా జోడీపై తన గెలుపోటముల రికార్డును 7-3తో మెరుగుపరచుకుంది. సెమీస్‌లో రెండో సీడ్ ఆరోన్ చియా- సో వూ యిక్ (మలేసియా) జంటతో సాత్విక్- చిరాగ్ జోడీ తలపడనుంది. మరోవైపు యువ షట్లర్ ఉన్నతి హుడా పోరాటం ముగిసింది. ప్రీక్వార్టర్స్‌లో స్టార్ క్రీడాకారిణి పి.వి.సింధుకు షాకిచ్చిన ఉన్నతికి క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. ఉన్నతి 16-21, 12-21తో మూడో సీడ్ అకానె యమగూచి (జపాన్) చేతిలో పరాజయం చవిచూసింది.

వెన్నెల, తన్వీలకు పతకాలు ఖాయం

సోలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణులు వెన్నెల కలగొట్ల, తన్వీశర్మ అదరగొట్టారు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లిన వెన్నెల, తన్వీ పతకాలు ఖాయం చేసుకున్నారు. శుక్రవారం మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో వెన్నెల 21-18, 17-21, 21-17తో జన్యపోర్న్ మీపాంతోంగ్ (థాయ్‌లాండ్)పై, తన్వీ 21-19, 21-14తో థలిత రమధని విర్యవన్ (ఇండోనేసియా)పై విజయం సాధించారు. 2012లో పి.వి.సింధు ఆసియా జూనియర్ టోర్నీలో మహిళల సింగిల్స్‌లో తొలిసారిగా భారత్‌కు పతకం (స్వర్ణం) అందించింది. సింధు తర్వాత వెన్నెల, తన్వీ ఈ ఘనత సాధించారు. సెమీస్‌లో ల్యూ యా (చైనీస్ తైపీ)తో వెన్నెల, యిన్ కింగ్ (చైనీస్ తైపీ)తో తన్వీ తలపడనున్నారు.

నగాల్, యుకి పునరాగమనం


సుమిత్ నగాల్

దిల్లీ: భారత అగ్రశ్రేణి టెన్నిస్ ఆటగాళ్లు సుమిత్ నగాల్, యుకి బాంబ్రి డేవిస్ కప్ జట్టులోకి పునరాగమనం చేశారు. స్విట్జర్లాండ్‌తో పోరు కోసం శుక్రవారం ఎనిమిది మంది ఆటగాళ్లతో ఎంపిక చేసిన భారత డేవిస్ కప్ జట్టులో నగాల్, యుకిలకు చోటు దక్కింది. ఈ ఏడాది సెప్టెంబరు 12న బీల్ సిటీలో ప్రారంభమయ్యే ప్రపంచ గ్రూపు-1 తొలి రౌండ్ పోరులో స్విట్జర్లాండ్, భారత్ తలపడనున్నాయి. సింగిల్స్ ఆటగాడు నగాల్ దాదాపుగా రెండేళ్ల తర్వాత భారత్ తరపున బరిలో దిగనున్నాడు. 2023లో లఖ్‌నవూలో మొరాకోతో పోరులో చివరగా నగాల్ పోటీపడ్డాడు. డబుల్స్ ఆటగాడు యుకి నిరుడు ఫిబ్రవరిలో ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్‌తో పోరులో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. సింగిల్స్‌లో నగాల్ (306 ర్యాంకు)తో పాటు కరణ్ సింగ్ (403), ఆర్యన్ షా (442)లకు అవకాశం దక్కింది. శశికుమార్ ముకుంద్ (463), దక్షిణేశ్వర్ సురేశ్ (790) రిజర్వ్ ఆటగాళ్లుగా ఎంపికయ్యారు. డబుల్స్‌లో యుకి (35), శ్రీరామ్ బాలాజీ (75) జోడీ బరిలో దిగనుంది. రిత్విక్ బొల్లిపల్లి (77) రిజర్వ్ ఆటగాడు కాగా నాన్ ప్లేయింగ్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ నేతృత్వంలో భారత్.. స్విట్జర్లాండ్‌తో తలపడనుంది.

సెమీస్‌లో నగాల్

దిల్లీ: టాంపెర్ ఏటీపీ ఛాలెంజర్ టోర్నమెంట్లో భారత స్టార్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో నగాల్ 6-4, 6-3తో నికోలస్ కికెర్ (అర్జెంటీనా)ను ఓడించాడు. మరోవైపు అమెరికాలోని బ్లూమ్స్‌ఫీల్డ్ హిల్స్‌లో జరుగుతున్న క్రాన్‌బ్రూక్ టెన్నిస్ క్లాసిక్ టోర్నీలో అనిరుధ్ చంద్రశేఖర్-రామ్‌కుమార్ రామనాథన్ జంట క్వార్టర్స్‌లో ఓడిపోయింది. భారత ద్వయం 6-4, 4-6, 7-10తో స్టెఫాన్ డోస్టానిక్-బెంజమిన్ (అమెరికా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

పంత్ చేసింది గొప్పే.. కానీ

లండన్: తన కుడి పాదానికి తీవ్ర గాయమైనప్పటికీ, ఆర్థోపెడిక్ బూట్ ధరించి బ్యాటింగ్ చేసిన భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌పై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ మ్యాచ్‌కు వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తున్న రవిశాస్త్రి, దినేశ్ కార్తీక్, చెతేశ్వర్ పుజారా, నాసిర్ హుస్సేన్.. పంత్ పోరాట తత్వాన్ని, నిబద్ధతను కొనియాడారు. పంత్ జట్టు మనిషి అనడానికి ఇంతకంటే నిదర్శనం అక్కర్లేదని రవిశాస్త్రి వ్యాఖ్యానించగా.. జట్టు కష్టాల్లో ఉన్నపుడు నిలబడే ఇలాంటి ఆటగాళ్లు ఆటకు ఎంతో అవసరమని పుజారా పేర్కొన్నాడు. క్రికెట్ చరిత్రలో ఇలాంటి ఘట్టాలు చాలా కాలం నిలిచిపోతాయని కార్తీక్ అభిప్రాయపడ్డాడు. పంత్‌కు గొప్ప ప్రతిభతో పాటు పెద్ద మనసూ ఉందని నాసిర్ హుస్సేన్ ప్రశంసించాడు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్.. పంత్ పోరాటాన్ని కొనియాడుతూనే, క్రికెట్లో సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్ల అవసరాన్ని నొక్కి చెప్పాడు. "పాదానికి అంత పెద్ద దెబ్బ తగిలినా పంత్ బ్యాటింగ్ చేయడం గొప్పగా అనిపించింది. అది నమ్మశక్యం కాని ధైర్యం. కానీ పంత్ ఆడలేని స్థితిలో ఉంటే గాయం తీవ్రత ఇంకా పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితి క్రికెట్లో చీకటి రోజులను గుర్తు చేస్తుంది. ఓ ఆటగాడు గాయపడితే ఆ జట్టు పది మందితోనే నాలుగైదు రోజులు ఆడాల్సి రావడం దురదృష్టకరం. ఓ ఆటగాడికి ఎముక విరిగితే, కండరాలు తీవ్రంగా దెబ్బ తింటే.. ఇలాంటి పెద్ద గాయాలు ఏవి అయినా మిగతా ఆటలో సబ్‌స్టిట్యూట్‌ను ఆడించాలి" అని వాన్ పేర్కొన్నాడు.



అనహత్‌కు కాంస్యమే


అనహత్

కైరో: ప్రపంచ స్క్వాష్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌ను భారత అమ్మాయి అనహత్ సింగ్ కాంస్యంతో ముగించింది. శుక్రవారం మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఆమె 6-11, 12-14, 10-12తో నాడియన్ ఎల్ హమామి (ఈజిప్ట్) చేతిలో పరాజయం చవిచూసింది. తొలి గేమ్‌లో రాణించలేకపోయినా.. రెండు, మూడు గేమ్‌లలో అనహత్ గట్టిగానే పోరాడింది. కీలక సమయాల్లో తడబడి ఓటమి చవిచూసింది. 2010లో దీపిక పల్లికల్ తర్వాత ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్ చేరిన ఘనత అనహత్‌దే. ఈ టోర్నీలో సెమీస్‌లో ఓడిన ప్లేయర్లకు కాంస్యం లభిస్తుంది.

భారత ఆర్చర్లకు 3 పతకాలు

రైన్ రుర్ ఇసెన్: ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లో భారత క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. శుక్రవారం ఆర్చరీలో స్వర్ణం సహా మూడు పతకాలు సొంతమయ్యాయి. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో పర్ణీత్ కౌర్- కుశాల్ దలాల్ జంట 157-154తో యెరిన్ పార్క్- సెంగ్ యూన్ పార్క్ జోడీని ఓడించి పసిడి గెలుచుకుంది. మహిళల కాంపౌండ్ టీమ్ కాంస్య పతక పోరులో భారత్ (పర్ణీత్, అవనీత్, మధుర) 232-224తో బ్రిటన్‌పై నెగ్గింది. పురుషుల కాంపౌండ్ టీమ్ ఫైనల్లో భారత్ (కుశాల్, సాహిల్ జాదవ్, హృతిక్) కొద్దిలో పసిడి కోల్పోయింది. ఫైనల్లో ఒక దశలో 174-174తో తుర్కియేతో సమానంగా నిలిచింది. చివరి రౌండ్లో తడబడి రజతంతో సరిపెట్టుకుంది. పోల్‌వాల్ట్‌లో దేవ్‌కుమార్ మీనా ఫైనల్ చేరాడు. క్వాలిఫికేషన్లో 5.40 మీటర్ల దూరం ఎగిరిన అతడు.. తన పేరిటే ఉన్న జాతీయ రికార్డు (5.35 మీ)ను సవరించాడు.

క్రికెట్‌కు వేద వీడ్కోలు


వేద కృష్ణమూర్తి

దిల్లీ: భారత మహిళా క్రికెటర్ వేద కృష్ణమూర్తి ఆటకు వీడ్కోలు పలికింది. 2011లో అరంగేట్రం చేసిన కర్ణాటకకు చెందిన ఈ బ్యాటర్.. జాతీయ జట్టుకు 48 వన్డేలు, 76 టీ20ల్లో ఆడింది. వన్డేల్లో 829.. టీ20ల్లో 875 పరుగులు సాధించింది. వన్డేల్లో 8.. టీ20ల్లో 2 అర్ధ సెంచరీలు సాధించింది. "చిన్న పట్టణం నుంచి వచ్చి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం. క్రికెట్ ఎన్నో స్మృతులను అందించింది. 2017 ప్రపంచకప్‌లో జట్టు ఫైనల్ చేరడంలో నావంతు పాత్ర పోషించడాన్ని మరిచిపోలేను. భారత మహిళల జట్టును చూసే కోణాన్ని మార్చిన టోర్నీ అది. ఆటకు వీడ్కోలు మాత్రమే చెబుతున్నా. క్రికెట్‌తో అనుబంధానికి కాదు" అని 32 ఏళ్ల వేద తెలిపింది. దూకుడైన ఆటకు పేరైన వేద.. 2020లో చివరిగా అంతర్జాతీయ మ్యాచ్ (ఆస్ట్రేలియాపై, టీ20) ఆడింది. దేశవాళీలో గతేడాది డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్ తరపున రాయల్ ఛాలెంజర్స్‌పై ఆఖరిగా కనబడింది.

ఈనాడు



విజయవాడ 26-7-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 347
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఆత్మహత్యలు ఆపాలి

విద్యార్థుల కోసం మానసిక కౌన్సెలర్లు తప్పనిసరి



విద్యాసంస్థలు, హాస్టళ్లలో నియమించాలి • దేశవ్యాప్తంగా వర్తించేలా 15 మార్గదర్శకాలు

విశాఖలో నీట్ విద్యార్థిని మృతి కేసులో 'సుప్రీం' తీర్పు • ఆ కేసును సీబీఐకి అప్పగించాలని ఆదేశం

> రాజ్యాంగంలోని అధికరణ 21 కల్పించే 'జీవించే హక్కు'లో మానసిక ఆరోగ్యం అన్నది అంతర్భాగం. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగంలోని అధికరణ 32 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి విద్యార్థుల ప్రాథమిక హక్కుల అమలు కోసం ఉత్తర్వులు జారీ చేస్తున్నాం. ఈ తీర్పును కోర్టు ప్రకటించిన చట్టంగా పరిగణించి, అమలు చేయాలి. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక చట్టం కానీ, రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ కానీ జారీ చేసే వరకూ ఇవే అమల్లో ఉంటాయి. - సుప్రీంకోర్టు

ఈనాడు - దిల్లీ

విద్యార్థుల మానసిక ఆరోగ్యం పట్ల సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వారి మానసిక ఆరోగ్యాన్ని కాపాడాలని, ఒత్తిడికి లోనై బలవన్మరణాలకు పాల్పడకుండా నివారించాలని ఆదేశించింది. 100 మంది విద్యార్థులున్న ప్రతి విద్యాసంస్థా తప్పనిసరిగా క్వాలిఫైడ్ కౌన్సెలర్ లేదా సైకాలజిస్ట్, సామాజిక కార్యకర్తను నియమించుకొని విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించాలని నిర్దేశించింది. ఈ విషయమై 15 అంశాలతో మార్గదర్శకాలు జారీ చేసింది. ఇవి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు, కోచింగ్ సెంటర్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, హాస్టళ్లకూ వర్తిస్తాయని స్పష్టం చేసింది. తీర్పు కాపీని రాష్ట్రాలకు పంపి, ఈ మార్గదర్శకాల అమలుకు వెంటనే చర్యలు చేపట్టేలా చూడాలని ఆదేశించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం 90 రోజుల్లోపు చర్యా నివేదికను సమర్పించాలని నిర్దేశించింది. విశాఖపట్నంలోని ఓ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నీట్ శిక్షణ పొందుతున్న పశ్చిమబెంగాల్ యువతి అనుమానాస్పద మృతిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ నమోదైన కేసులో తీర్పు ఇస్తూ సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ మరణానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లలో రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదైన నేపథ్యంలో సీబీఐ దర్యాప్తునకు (మిగతా 3లో)



మాల్దీవుల రాజధాని మాలేకు చేరుకున్న ప్రధాని మోదీని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న ఆ దేశ అధ్యక్షుడు ముయిజ్జు

మాల్దీవులకు రూ. 4,850 కోట్ల రుణం

ప్రకటించిన ప్రధాని మోదీ

ఆ దేశాధ్యక్షుడు ముయిజ్జుతో ద్వైపాక్షిక చర్చలు లోపలి పేజీలో

డ్రోన్ నుంచి క్షిపణి ప్రయోగం

- కచ్చితత్వంతో సాయుధ వాహనాలు, బంకర్లను ధ్వంసం చేయగల సామర్థ్యం
- కర్నూలులో విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో

ఈనాడు, హైదరాబాద్: భారత డ్రోన్ యుద్ధ తంత్రాన్ని మరింత పదును తేల్చే ఆయుధాన్ని కర్నూలు జిల్లాలో పరీక్షించారు. ఓర్వకల్లు మండలం పాలకొలను సమీపంలోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజి(ఎన్‌వోఏఆర్)లో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) ఈ పరీక్షను శుక్రవారం విజయవంతంగా చేపట్టింది. యూఏవీ లాంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మిసైల్(యూఎల్‌పీజీఎం)-వి3 ఫ్లైట్ ట్రయల్స్ నిర్వహించింది. ఈ క్షిపణిని గతంలోనే డీఆర్‌డీవో అభివృద్ధి చేసి సైన్యానికి అందజేసింది. యూఎల్‌పీజీఎం-వి2 క్షిపణిని మరింత ఆధునీకరించి వి3ని అభివృద్ధి చేశారు. వివిధ రకాల లక్ష్యాలను కచ్చితంగా ఛేదించడం దీని ప్రత్యేకత. ఎత్తైన ప్రాంతాల్లో ప్రయోగించవచ్చు. ఏ వాతావరణంలోనైనా పనిచేయగలదు. రాత్రి వేళల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. ఈ క్షిపణి మూడు అధునాతన వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. రోల్డ్ హోమోజీనియస్ ఆర్మర్(ఆర్‌హెచ్‌ఏ), ఎక్స్‌ప్లోజివ్ రియాక్టర్ ఆర్మర్(ఈఆర్‌ఏ)ను కలిగిన ఆధునిక సాయుధ వాహనాలను నాశనం చేయగలదు. బంకర్లను ధ్వంసం చేయడానికి దీన్ని రూపొందించారు. మరిన్ని ప్రత్యేకతలు కలిగిన ఈ క్షిపణిని హైదరాబాద్‌లోని (మిగతా 3లో)




కర్నూలులోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజిలో డ్రోన్ నుంచి పరీక్షించిన క్షిపణి

బంగారు కుటుంబాల్ని నేనూ దత్తత తీసుకుంటా

- కుప్పం నియోజకవర్గంలో 250 కుటుంబాలను చేరదీస్తా
- మా కుటుంబసభ్యులూ మార్గదర్శులుగా మారుతున్నారు
- ఆగస్టు 15 నుంచి పీ4 మొదటి దశ ప్రారంభం
- మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఐ యామ్ మార్గదర్శి లోగో ఆవిష్కరణ.. చొక్కాపై ధరించిన సీఎం

ఈనాడు, అమరావతి: పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన పీ4 కార్యక్రమంలో తానూ మార్గదర్శిగా మారి, బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. తమ కుటుంబసభ్యులూ మార్గదర్శులుగా ఉంటారని తెలిపారు. మరింతమంది సంపన్నులు ముందుకొచ్చి మార్గదర్శులుగా మారేందుకు తాను తీసుకున్న ఈ నిర్ణయం దోహదపడుతుందన్నారు. పీ4పై శుక్రవారం సాయంత్రం మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులతో సీఎం చంద్రబాబు జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పీ4 పోస్టర్‌తో పాటు, ఐయాం మార్గదర్శి #IAmAMaragadarsi క్యాప్షన్‌తో లోగోను ఆవిష్కరించారు. లోగోను చొక్కాపై ధరించారు. పేదరిక నిర్మూలన కోసం ఉద్దేశించిన పీ4 అమల్లో భాగంగా కుప్పం నియోజకవర్గంలో 250 బంగారు కుటుంబాలను తాను దత్తత తీసుకుంటున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి పీ4 మొదటి దశ (మిగతా 3లో)



పీ 4 లోగో ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఫౌండేషన్ వైస్‌ఛైర్మన్ కుటుంబరావు, సీఎస్ విజయానంద్



దేశానికి హైడ్రోజన్ పవర్!

చెన్నైలోని ఐసీఎఫ్‌లో రైలు పరీక్షలు విజయవంతం

యూరోపియన్ రైళ్లకంటే ఎంతో శక్తిమంతమైనదిగా రైల్వే మంత్రి వెల్లడి

లోపలి పేజీలో

రాష్ట్ర పర్యాటకానికి 'మాస్టర్ కార్డ్'

ఈనాడు, అమరావతి: ఎలక్ట్రానిక్ చెల్లింపుల్లో పేరొందిన ప్రపంచ టెక్నాలజీ సంస్థ 'మాస్టర్ కార్డ్' రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలపై దృష్టి సారించింది. చెల్లింపుల్లో బ్యాంకులు, వ్యాపారులు, ఖాతాదారుల మధ్య ఫెసిలిటేటర్‌గా వ్యవహరిస్తున్న ఈ సంస్థ రాష్ట్రంలో పలు సందర్శనీయ ప్రాంతాలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ ఖాతాదారులను (కార్డ్ హోల్డర్లు) తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మాస్టర్ కార్డ్ ప్రతినిధులు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలితో శుక్రవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రసిద్ధ సందర్శనీయ ప్రాంతాలు, వాటిలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, కొత్తగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతాల గురించి ఎండీ వారికి వివరించారు. ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో పర్యాటకులకు అందుబాటులో ఉన్న వసతులపైనా (మిగతా 3లో)

ఐపీఎస్ శ్రీలక్ష్మి.. సీబీఐ కోర్టుకు వెళ్లాల్సిందే

విచారణను ఎదుర్కోవాల్సిందే

పిటిషన్‌ను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

లోపలి పేజీల్లో

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని వ్యక్తిగత కక్షలకు వాడుకోనివ్వద్దు

అలాంటి కేసుల్లో దుర్వినియోగాన్ని మొదట్లోనే అడ్డుకోవాలి: సుప్రీంకోర్టు

రాజస్థాన్‌లో కూలిన పాఠశాల పైకప్పు


పాఠశాల భవన శిథిలాల వద్ద బాధితులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

- ఏడుగురు విద్యార్థుల మృతి

ఝలావాడ్: రాజస్థాన్‌లోని ఝలావాడ్ జిల్లాలో పాఠశాల పైకప్పు కూలి ఏడుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం పిప్లోడీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 7.45 గంటలకు విద్యార్థులు ప్రార్థనకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో 6, 7 తరగతుల గదులపై ఉన్న పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో దాదాపు 35 మంది చిన్నారులు శిథిలాల్లో చిక్కుకుపోయారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు, స్థానికులు శిథిలాల కింద ఉన్న విద్యార్థులను బయటకు తీశారు. .వీరిలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన వారిలో 9 మంది ఐసీయూలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపించారు.

కొవిడ్ బాధితుల మెదళ్లకు ముందుగానే ముసలితనం

జ్ఞాన నేత్రం


దిల్లీ: ఇన్‌ఫెక్షన్ ఏ స్థాయిలో ఉందన్న విషయంతో ప్రమేయం లేకుండా కరోనా బారిన పడిన వ్యక్తుల మెదళ్లు వేగంగా ముసలితనానికి గురయ్యే అవకాశం ఉందని, అవి ఉండాల్సిన దానికన్నా ఎక్కువ వార్ధక్యంతో ఉన్నాయని ఒక అధ్యయనంలో తేలింది. కొవిడ్ బారినపడిన 432 మంది వ్యక్తుల మెదడు స్కాన్‌లు మహమ్మారికి ముందు, తర్వాత ఈ అధ్యయనం కోసం తీసుకున్నారు. 996 మంది ఆరోగ్యవంతుల స్కాన్‌లనూ తీసుకున్నారు. వీరితో పోలిస్తే వ్యాధిబారిన పడినవారి మెదళ్లు ఐదున్నర నెలలు ఎక్కువగా వృద్ధాప్యానికి గురైనట్టు గుర్తించారు. కరోనా పీడితులు ఏకాంతంలో గడపాల్సిరావడం, అనిశ్చిత పరిస్థితి ఎదుర్కోవాల్సిరావడం ఇందుకు కారణాలు కావచ్చని అధ్యయనకర్తలు పేర్కొన్నారు. మహమ్మారికి గురైన వయోవృద్ధులు, పురుషులు, నిరుద్యోగులు, తక్కువ ఆదాయం కలిగినవారు, తగినంతగా చదువుకోనివారు, ఇతర బలహీన నేపథ్యం కలిగినవారి మెదళ్లలో ప్రస్ఫుటమైన మార్పులు సంభవించాయని గుర్తించారు. మెదడు వార్ధక్యానికి గురైనప్పుడు వ్యక్తుల ఆలోచనలు మసకబారడం, సమాచార విశ్లేషణ, సేకరణ, అవగాహనకు కారణమైన ధారణశక్తి కోల్పోవడం, ఏకాగ్రత సన్నగిల్లడం వంటి లక్షణాలు ప్రదర్శిస్తారని పరిశోధకులు చెబుతున్నారు. కరోనా సోకినవారిలో ఈ లక్షణాలు ఎక్కువగా గమనించినట్లు వారు పేర్కొంటున్నారు.

మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు !

దిల్లీ: ఈశాన్య రాష్ట్రం మణిపుర్‌లో ఆగస్టు 13 నుంచి మరో ఆరు నెలల పాటు రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు కేంద్రం సిద్ధమైంది. దీనిపై చట్టబద్ధమైన తీర్మానాన్ని తీసుకురావాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యసభకు నోటీసులు అందించారు.. దీనికి ఛైర్మన్ అంగీకరించినట్టు తెలుస్తోంది. వచ్చే వారం రాజ్యసభలో ఈ నోటీసులపై చర్చ జరిగే అవకాశం ఉందని రాజ్యసభ సెక్రెటరియట్ శుక్రవారం వెల్లడించింది. ముఖ్యమంత్రిగా ఎన్.బీరేన్ సింగ్ రాజీనామా చేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 13న మణిపుర్‌లో రాష్ట్రపతి పాలనను విధించిన విషయం తెలిసిందే.

అనుమతి లేని లైంగిక సంబంధం నేరమే: దిల్లీ హైకోర్టు

దిల్లీ: స్నేహం ఉన్నంతమాత్రాన అనుమతి లేకుండా ఓ అమ్మాయితో లైంగిక సంబంధం పెట్టుకునే హక్కు పురుషుడికి ఉండదని, అది నేరమని దిల్లీ హైకోర్టు తేల్చి చెప్పింది. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఉన్నతన్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.



ఇతరులను నిందిస్తూ కూర్చోకండి

విజయం, సంతోషం, సహాయం.. వీటిని మీకెవరూ రుణపడిలేరు. సహాయం కోరుకుంటూ, ఇతరులను నిందిస్తూ కాలాన్ని వృథా చేయకండి. పరిస్థితులను మీ నియంత్రణలోకి తీసుకోండి. ఆశించడం ఆపేసిన క్షణం నుంచే.. మీరు వృద్ధికి స్వయంగా బాటలు వేసుకోవడం మొదలుపెడతారు. ఇతరులపై కాకుండా స్వీయ శక్తిసామర్థ్యాలపైనే ఆధారపడండి.

– వారా ఫెడైన్, కంటెంట్ క్రియేటర్

మాల్దీవులకు రూ.4,850 కోట్ల రుణం

- ప్రకటించిన ప్రధాని మోదీ


మాల్దీవుల రక్షణ కార్యాలయంపై ఏర్పాటు చేసిన మోదీ భారీ చిత్రం

మాలే: బ్రిటన్ నుంచి శుక్రవారం మాలే చేరుకున్న భారత ప్రధాని మోదీకి మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఘనస్వాగతం పలికారు. పరస్పర విశ్వాసమే ప్రాతిపదికగా భారత్, మాల్దీవుల మైత్రి సాగుతోందని ముయిజ్జుతో ద్వైపాక్షిక సంప్రదింపుల సందర్భంగా మోదీ ప్రకటించారు. ముయిజ్జు, మోదీల నేతృత్వంలో, రక్షణ, మౌలిక సదుపాయాల రంగాల్లో పరస్పర సహకారంపై ద్వైపాక్షిక సంప్రదింపులు జరిపారు. కొంత కాలంగా దెబ్బతిన్న మైత్రిని పునరుద్ధరిస్తూ ప్రధాని మోదీ చేపట్టిన ఈ పర్యటనలో భాగంగా మాల్దీవులకు రూ 4,850 కోట్ల రుణాన్ని ప్రకటించారు. మాల్దీవుల వార్షిక రుణ చెల్లింపుల మొత్తాన్ని 40 శాతం మేర తగ్గించారు. ఈ ప్రకటన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న మాల్దీవులకు ఎంతో ఊరట కల్పించనుంది. ఇరు పక్షాల పెట్టుబడుల ఒప్పందాన్ని ఖరారు చేసే దిశగా పని చేస్తామని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంప్రదింపులు ప్రారంభమయ్యాయని ప్రధాని ప్రకటించారు. పొరుగుదేశాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ భారత్ అనుసరిస్తున్న మహాసాగర్ విధానంలో మాల్దీవులది ప్రముఖ స్థానమని మోదీ పేర్కొన్నారు. "దేశాధ్యక్షుడు ముయిజ్జు నాకు స్వాగతం పలకడానికి విమానాశ్రయానికి రావడం నన్ను కదిలించింది" అని ప్రధాని అన్నారు. రానున్న రోజుల్లో ఇరు దేశాల మైత్రి గణనీయమైన ప్రగతి సాధిస్తుందన్న నమ్మకం తనకుందన్నారు. తమ దేశ ప్రతినిధి బృందాలతో కలిసి చర్చలు ప్రారంభించడానికి ముందు ఇరువురు నేతలు కొంతసేపు ఏకాంతంగా మాట్లాడుకున్నారు. 2023లో అధికారానికి వచ్చిన ముయిజ్జు చైనాతో సంబంధాలు పెంపొందించుకొని "ఇండియా ఔట్" విధానాన్ని అనుసరించారు. తాజాగా భారత్, మాల్దీవుల సంబంధాల పునరుద్ధరణను ఒక దౌత్య విజయంగా భావిస్తున్నారు. మాల్దీవుల రక్షణ కార్యాలయంపై మోదీ భారీ చిత్రాన్ని ప్రదర్శించడం ప్రధాని పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అశ్లీల చిత్రాల యాప్‌లపై నిషేధం

- కేంద్ర ప్రభుత్వం చర్యలు

దిల్లీ: ఓటీటీ వేదికల్లో విచ్చలవిడిగా అందుబాటులో ఉంటున్న అభ్యంతరకర వీడియోల కట్టడిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో అశ్లీల చిత్రాలను ప్రసారం చేస్తోన్న కొన్ని మాధ్యమాలపై కొరడా ఝుళిపించింది. ఉల్లు, ఏఎల్‌టీటీ సహా కొన్ని యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ దీనిపై తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 24 యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధం విధించినట్లు కేంద్రం పేర్కొంది. ఆయా వెబ్‌సైట్లు కనపడకుండా చేయాలని దేశంలోని అన్ని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు ఆదేశాలు జారీ చేసింది. వీటిని ఉల్లంఘిస్తే చట్టపరమైన రక్షణను కోల్పోవాల్సి వస్తుందని తెలిపింది. ఓటీటీ ప్రసార యాప్‌లు, వాటి సర్వీస్ ప్రొవైడర్లు తాము ప్రసారం చేసే వీడియోలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా కేంద్రం గుర్తుచేసింది. భారతీయ చట్టాలను ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

తొలగించిన యాప్స్, వెబ్‌సైట్స్ ఇవే..

ఉల్లు, ఏఎల్‌టీటీ, దేశీఫ్లిక్స్, బిగ్ షాట్స్, బూమెక్స్, నవరస లైట్, గులాబ్ యాప్, కంగన్ యాప్, బుల్ యాప్, జాల్వా యాప్, వావ్ ఎంటర్‌టైన్‌మెంట్, లుక్ ఎంటర్‌టైన్‌మెంట్, హిట్‌ప్రైమ్, ఫినియో, షోఎక్స్, సోల్ టాకీస్, అడ్డా టీవీ, హాట్‌ఎక్స్ వీఐపీ, హల్‌చల్ యాప్, మూడ్‌ఎక్స్, నియాన్‌ఎక్స్ వీఐపీ, ఫ్యుగి, మోజ్‌ఫిక్స్, ట్రిఫ్లిక్స్

28 నుంచి ఆపరేషన్ సిందూర్‌పై చర్చ

- అఖిలపక్ష భేటీలో విపక్షాల అంగీకారం


లోక్‌సభలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష ఎంపీలు

దిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'పై సోమవారం (ఈ నెల 28) నుంచి చర్చించేందుకు కేంద్రం అంగీకరించింది. దీంతోపాటు ప్రతిపక్షాలు లేవనెత్తిన కొన్ని డిమాండ్లపైనా సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తోంది. అధికార, విపక్ష నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో సోమవారం నుంచి లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా జరగనున్నట్లు తెలుస్తోంది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాలు ఆందోళన చేస్తుండడంతో పార్లమెంటు ఉభయ సభలు వరుసగా వాయిదా పడుతున్నాయి. శుక్రవారం కూడా సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తన ఛాంబర్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అర్థవంతమైన చర్చలు జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్'పై సోమవారం నుంచి లోక్‌సభలో చర్చకు అనుమతిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలు రాజకీయ పార్టీల సీనియర్ నాయకులు సమావేశానికి హాజరయ్యారు. అంతకుముందు...పార్లమెంటు ఉభయసభలు శుక్రవారం ప్రారంభమైన వెంటనే బిహార్‌లో ఎన్నికల సంఘం కొనసాగిస్తున్న ఎస్ఐఆర్‌పై విపక్ష సభ్యులు నిరసనకు దిగారు. దీంతో లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలకు వరుసగా ఐదో రోజూ తీవ్రఅంతరాయం కలిగింది. రెండు సభలూ సోమవారానికి వాయిదాపడ్డాయి.

నివాసంలో నోట్ల కట్టల వివాదంలో చిక్కుకున్న జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించేందుకు ఉద్దేశించిన అభిశంసన తీర్మానం తొలుత లోక్‌సభ ముందుకే రానుంది.

ఉపరాష్ట్రపతి ఎన్నిక నిర్వహణకు రిటర్నింగ్ అధికారి నియామకం

దిల్లీ: నూతన ఉపరాష్ట్రపతి ఎన్నిక నిర్వహణకుగాను రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ శుక్రవారం నియమితులయ్యారు. న్యాయ మంత్రిత్వశాఖను సంప్రదించడంతో పాటు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ సమ్మతి మేరకు ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. రాజ్యసభ సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ గరిమా జైన్, సెక్రటేరియట్ డైరెక్టర్ విజయ్ కుమార్ సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు.

విపక్షాల విందుకు ధన్‌ఖడ్ హాజరవుతారా?

ఇంటర్నెట్‌డెస్క్: ఉప రాష్ట్రపతిగా ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా దేశ రాజకీయాల్లో సంచలనం రేపింది. ఆయనకు అధికారికంగా వీడ్కోలు పలుకుదామని ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తోంది. దాంతో విపక్షాలే ఆయనకు వీడ్కోలు విందు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. విపక్షాల ఆహ్వానాన్ని ధన్‌ఖడ్ అంగీకరించకపోవచ్చని తెలుస్తోంది. తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేసే యత్నంలో ధన్‌ఖడ్ ఉన్నారు.

ఇలాగైతే ఇక యుద్ధమే

- కంబోడియాకు థాయ్‌లాండ్ హెచ్చరిక
- రెండోరోజూ ఘర్షణలు.. 15కు చేరుకున్న మృతుల సంఖ్య


కంబోడియాలోని ఓ తాత్కాలిక శిబిరంలో శుక్రవారం తలదాచుకుంటున్న పౌరులు

బ్యాంకాక్: సరిహద్దు వివాదం కారణంగా కంబోడియా, థాయ్‌లాండ్ దేశాల మధ్య రాజుకున్న ఘర్షణ రెండోరోజు కూడా కొనసాగింది. పరిస్థితులు ఇలాగే ఉంటే పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయవచ్చని థాయ్‌లాండ్ ప్రధాని ఫుంథామ్ వెచయాచాయ్ హెచ్చరించారు. ఈ అంతర్జాతీయ ఘర్షణలో ఇప్పటి వరకు థాయ్‌లాండ్‌లో 14 మంది, కంబోడియాలో ఒకరు మృతి చెందారు. మృతుల్లో అత్యధికంగా సామాన్య ప్రజలు ఉన్నారు. ఇరుదేశాల సైన్యాలు పరస్పరం తేలికపాటి ఆయుధాలు, శతఘ్నులు, రాకెట్లతో దాడి చేసుకున్నాయి. సరిహద్దు వెంబడి మందుపాతర పేలిన కారణంగా ఐదుగురు థాయ్ సైనికులు గాయపడటంతో ఘర్షణ మొదలైంది. దీంతో థాయ్‌లాండ్ కంబోడియాలో ఉన్న తన రాయబారిని ఉపసంహరించుకుందని థాయ్ రక్షణ శాఖ ప్రతినిధి వెల్లడించారు. తదనంతరం సాగిన దాడులు ప్రతిదాడుల్లో థాయ్‌లాండ్‌లో ఒక సైనికుడు, 13 మంది సామాన్యులు మరణించారు. తమ దేశంలో ఒకరు మృతి చెందినట్లు కంబోడియా శుక్రవారం ధ్రువీకరించింది. సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాల్లో వేలాది మంది ప్రజలు సహాయ శిబిరాలకు పరుగులు తీశారు. అమెరికా, చైనా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ సహా ఈయూ దేశాలు, ఐక్యరాజ్య సమితి (ఐరాస), పలు ఆసియా దేశాలు ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలపై ఆందోళనను వ్యక్తం చేశాయి. శాంతి చర్చలకు పిలుపునిచ్చాయి. మరోవైపు.. థాయ్-కంబోడియా సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాల సరిహద్దు వెంబడి ఉన్న రాష్ట్రాల్లో ప్రయాణించొద్దని భారతీయ పౌరులకు థాయ్‌లాండ్‌లోని భారత రాయబార కార్యాలయం సూచనలు జారీ చేసింది.

1 నుంచి పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన

దిల్లీ: ఉత్పాదక రంగంలో ఉద్యోగాల కల్పనకు ప్రోత్సాహమందించే పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన పథకం వచ్చే నెల 1 నుంచి అమలులోకి రానుందని కేంద్ర కార్మిక శాఖ శుక్రవారం ప్రకటించింది. ఉపాధి కల్పనకు ప్రోత్సాహం అందించే ఈ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కోసం రూ 99,446 కోట్లు కేటాయించనున్నారు. రెండేళ్ల కాలంలో 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించాలన్నది లక్ష్యం. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జులై 31 వరకూ సృష్టించే ఉద్యోగాలకు ఈ పథకం కింద లబ్ధి చేకూరుతుంది. ఉద్యోగాలు సృష్టించే సంస్థలకు ప్రయోజనం కల్పించేందుకు ఉద్దేశించిన ఈ పథకం కింద తొలిసారి ఉద్యోగం పొందిన ఈపీఎఫ్ఓ ఖాతాదారులకు రూ 15 వేల వరకూ రెండు విడతల్లో చెల్లిస్తారు. రూ 1 లక్ష వరకూ వేతనం పొందుతున్న ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాలోకి ఈ మొత్తాన్ని జమచేస్తారు. కొత్తగా సృష్టించిన ప్రతి ఉద్యోగానికీ రూ 3 వేల చొప్పున ఉపాధి సృష్టికర్తలకు ప్రోత్సాహకం అందిస్తారు.

రాహుల్ గాంధీపై కేసు విచారణ.. స్టే పొడిగింపు



దిల్లీ: స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సావర్కర్‌పై 2022లో చేసిన వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఉత్తర్‌ప్రదేశ్‌లో నమోదైన క్రిమినల్ కేసు విచారణపై స్టేను సుప్రీంకోర్టు శుక్రవారం పొడిగించింది. నాలుగు వారాల తర్వాత దీనిపై విచారణ చేపడతామని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం పేర్కొంది. అంతకు ముందు వాదనల సందర్భంగా స్టే ఉత్తర్వులను ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. రాహుల్ వ్యాఖ్యలు ద్వేషం, శత్రుత్వాన్ని వ్యాప్తిచేసేలా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ తరపున సీనియర్ న్యాయవాది గరిమా ప్రసాద్ వాదించారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా 2022 నవంబర్ 17న మహారాష్ట్రలో జరిగిన ఓ విలేకరుల సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ. . వీర్ సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇవి సావర్కర్‌ను కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ నృపేంద పాండే అనే వ్యక్తి సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు హాజరు కావాలని రాహుల్‌కు ట్రయల్ కోర్టు సమన్లు జారీచేసింది. వీటిని అలహాబాద్ హైకోర్టులో సవాలు చేశారు. సమన్లను రద్దు చేయడానికి హైకోర్టు నిరాకరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఉన్నత చదువులకు బంగ్లా, ఉజ్బెకిస్థాన్ బాట

దిల్లీ: ఉన్నత విద్య కోసం బ్రిటన్, అమెరికాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అభివృద్ధి చెందిన దేశాలకు వెళ్లడానికి వీసా తదితర ఇబ్బందులు ఎదురవుతున్నందున బంగ్లాదేశ్, ఉజ్బెకిస్థాన్, సింగపూర్, రష్యా వైపు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారన్న పలు గణాంకాలను పార్లమెంటులో విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. దీని ప్రకారం.. 2023లో 8.92 లక్షల మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లగా.. 2024లో ఆ సంఖ్య 7.59 లక్షలకు పడిపోయింది. అమెరికా, కెనడా, బ్రిటన్‌లకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. భారత్- కెనడా దౌత్య సంబంధాలు దెబ్బతిన్న తర్వాత అక్కడ చదువుకునే వారి సంఖ్య దాదాపు 41 శాతం తగ్గిపోయింది. 2023లో 2,33,532 మంది చదువుకోగా.. 2024లో ఆ సంఖ్య 1,37,608గా ఉంది. అగ్రరాజ్యానికి వెళ్లే విద్యార్థుల సంఖ్య 2.34 లక్షల నుంచి 2.04 లక్షలకు, బ్రిటన్‌కు వెళ్లేవారి సంఖ్య 1.36 లక్షల నుంచి 98 వేలకు పడిపోయింది. ఒకప్పుడు పెద్దగా ఆసక్తి చూపించని దేశాలకు ప్రస్తుతం ఆదరణ పెరిగింది. బంగ్లాదేశ్ ఉజ్బెకిస్థాన్, రష్యా, సింగపూర్ వంటి దేశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. బంగ్లాలో 2023లో 20,368 మంది చదువుకోగా.. 2024లో 29,232కి పెరిగింది. ఉన్నత విద్యకోసం 2024లో ఉజ్బెకిస్థాన్‌కు 9,915 మంది వెళ్లారు. గతంలో అది 6,601గా ఉండేది. రష్యాలో 2023లో 25,503గా ఉన్న విద్యార్థుల సంఖ్య ఆ తర్వాత ఏడాదికి 31,444కి పెరిగింది. వైద్య విద్య అభ్యసించాలనుకునే వారు ఎక్కువగా ఈ దేశాన్నే ఎంచుకుంటున్నారు. సింగపూర్‌లో 12 వేలుగా ఉండే విద్యార్థుల సంఖ్య 14 వేలకు పెరిగింది.

కేరళ పిటిషన్ ఉపసంహరణకు సుప్రీం అనుమతి

దిల్లీ: శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్ దీర్ఘ కాలంగా తన వద్దే పెండింగ్‌లో ఉంచుకోవడాన్ని సవాలుచేస్తూ కేరళ ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్ల ఉపసంహరణకు సుప్రీంకోర్టు శుక్రవారం అనుమతించింది. కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించినప్పటికీ, కేసును వెనక్కి తీసుకుంటామన్న కేరళ ప్రభుత్వ అభ్యర్థనను జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్‌ల ధర్మాసనం సమ్మతించింది. బిల్లుల ఆమోదానికి గవర్నర్ జాప్యం చేయడంపై కేరళ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రాష్ట్రాల బిల్లుల ఆమోదానికి గవర్నర్, రాష్ట్రపతిలకు గడువు నిర్దేశిస్తూ తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో కేరళ తన పిటిషన్ ఉపసంహరణకు అనుమతించాలని కోరింది. దీనిని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలు వ్యతిరేకించారు. వీరి అభ్యంతరాలను సుప్రీంకోర్టు తోసిపుచ్చినట్లయింది.

కన్నీళ్లూ ఇంకిపోయాయ్...

- గాజాలో తీవ్ర క్షామ పరిస్థితులు
- పిట్టల్లా రాలిపోతున్న పిల్లలు, మహిళలు


గాజాలోని ఓ శరణార్థుల శిబిరంలో పౌష్టికాహార లోపానికి గురైన తన చిన్నారితో నైమా అబు ఫుల్

ఇంటర్నెట్ డెస్క్: గాజాలో పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. ఎక్కడ చూసినా ఆకలి కేకలే. ఏడిస్తే కన్నీరు కూడా రాని పరిస్థితి. తిండి లేక అల్లాడుతున్న చిన్నారులు.. పిట్టల్లా రాలిపోతున్నారు. పోషకాహార లోపంతో నిత్యం వందలాది మంది పసిపిల్లలు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఆహారం, ఔషధాలు లేక వైద్యులు చేతులెత్తేస్తున్నారు. ఇలా గడిచిన నాలుగు రోజులుగా గాజాలో ఎందరో చిన్నారులు ఆకలికి బలయ్యారు. "ఉత్తర గాజాలో ఉన్న పేషెంట్స్ ఫ్రెండ్స్ ఆసుపత్రిలో ఎన్నడూ లేనంత సంఖ్యలో చిన్నారులు చేరారు. నిత్యం 200 నుంచి 300 మంది చేరుతున్నారు. ఈ విపత్తును చూస్తుంటే మాటలు రావడం లేదు. శరీరం బక్కచిక్కి ఎముకలు మాత్రమే కనిపిస్తున్నాయి. నడవడానికీ, కనీసం ఏడవడానికీ పిల్లలకు ఓపిక లేదు. వారి పొత్తికడుపులు ముడుచుకుపోయాయి. వారికి ఇవ్వడానికి ఆసుపత్రిలో సరైన పోషకాహారం కూడా లేదు. కొందరికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నా.. ప్రాణాలను కాపాడలేకపోతున్నాం. ఇంతకంటే దారుణ, భయంకరమైన పరిస్థితి మరొకటి లేదు. మేం కూడా అలసిపోయాం" అని అమెరికా స్వచ్ఛంద సంస్థ తరపున పనిచేస్తున్న డాక్టర్ రానా సోహాబ్ పేర్కొన్నారు. చిన్నారులకు పొటాషియం ఎంతో కీలకం, కానీ, అది అందుబాటులో లేకపోవడంతో రానున్న రోజుల్లో మరిన్ని మరణాలు చూడక తప్పని దుస్థితి నెలకొందని వాపోయారు. లక్ష మంది మహిళలు, చిన్నారులకు అత్యవసర చికిత్స అవసరమని ఐరాసకు చెందిన ప్రపంచ ఆహార కార్యక్రమ విభాగం పేర్కొంది

ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తున్నాం: నెతన్యాహు

గాజాలో కాల్పుల విరమణకు సంబంధించి హమాస్‌తో చర్చలు జరపడానికి బదులు ఇతర ప్రత్యామ్నాయాలను తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం పేర్కొన్నారు. దీంతో చర్చల కొనసాగింపు విషయంలో మరింత అనిశ్చితి నెలకొంది. మరోవైపు కాల్పుల విరమణ చర్చలు వచ్చేవారం తిరిగి ప్రారంభం కావచ్చని హమాస్‌కు చెందిన బస్సెం నయీం తెలిపారు.

పాలస్తీనాను దేశంగా గుర్తిస్తాం: మెక్రాన్



పారిస్: గాజాలో ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులపై ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహం వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ గురువారం ప్రకటించారు. సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో తన నిర్ణయాన్ని వెల్లడిస్తానని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పడానికి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాం. పాలస్తీనాను దేశంగా గుర్తిస్తాం" అని తెలిపారు. మెక్రాన్ నిర్ణయాన్ని పాలస్తీనా అథారిటీ స్వాగతించింది. "మీ నిర్ణయానికి కృతజ్ఞతలు. మీ వైఖరి అంతర్జాతీయ చట్టాలపై ఫ్రాన్స్ నిబద్ధతను తెలియజేస్తుంది" అని కొనియాడింది. ఫ్రాన్స్ నిర్ణయాన్ని ఇజ్రాయెల్, అమెరికా తీవ్రంగా ఖండించాయి. "ప్రస్తుత పరిస్థితుల్లో పాలస్తీనా దేశం ఏర్పరచడమంటే.. మా దేశాన్ని నిర్మూలించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లే" అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. "మీ అర్థరహిత నిర్ణయం హమాస్ ప్రచారానికే ఉపయోగపడుతుంది. శాంతికి ఆటంకం కలిగిస్తుంది" అని అమెరికా పేర్కొంది.

పాక్‌లో 14మంది మృతి

పెషావర్: వర్షాల కారణంగా పాకిస్థాన్ అల్లాడుతోంది. వరదల కారణంగా శుక్రవారం 14 మంది మృత్యువాత పడగా.. 17 మంది గాయపడ్డారు. వర్షాకాలం మొదలైన జూన్ నుంచి ఇప్పటి వరకూ 266 మంది మృతి చెందగా.. 628 మంది గాయపడ్డారు. మరణించిన వారిలో 126 మంది చిన్నారులు ఉన్నారని అధికారులు తెలిపారు.

787 డ్రీమ్‌లైనర్ ఇంధన వ్యవస్థలో లోపం లేదు

- అమెరికా ఎఫ్ఏఏ

న్యూయార్క్: అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిరిండియా బోయింగ్ 787 విమానం ఇంధన వ్యవస్థలో ఎలాంటి లోపం లేదని అమెరికాలోని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) ప్రకటించింది. ఎఫ్ఏఏ అడ్మినిస్ట్రేటర్ బ్రెయాన్ బెడ్‌ఫోర్డ్ మాట్లాడుతూ ఈ విమాన ప్రమాదం యాంత్రిక వైఫల్యం లేదా హఠాత్తుగా ఇంధన నియంత్రణ స్విచ్‌ల్లో మార్పుల కారణంగా జరగలేదన్నారు. ఎఫ్ఏఏ అధికారులు స్విచ్ యూనిట్లను విమానంపై అమర్చి పరీక్షించారని, ఇంధన సరఫరా వ్యవస్థలో సమస్యలు కనిపించలేదని బ్రెయాన్ వెల్లడించారు. ఈ వ్యాఖ్యలపై బోయింగ్, ఎయిరిండియా సంస్థలు స్పందించలేదు.

ఇద్దరు ప్రధానులకు చాయ్ రుచి చూపిన

యువ వ్యాపారవేత్త అఖిల్ పటేల్



ఇంటర్నెట్ డెస్క్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్రిటన్ పర్యటనలో భారతీయ యువ వ్యాపారవేత్త స్వయంగా తయారుచేసిన టీని ఆస్వాదించారు. బ్రిటన్ ప్రధాని కీవ్ స్టార్మర్ నివాసం ఉన్న చెకర్స్ ఆవరణలో ఈ ఆసక్తకర ఘటన చోటుచేసుకొంది. ఇద్దరు ప్రధానులు కలిసి చాయ్‌ను ఆస్వాదిస్తున్న ఫొటోలను మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'చెకర్స్‌లో మోదీ, కీవ్ స్టార్మర్‌తో చాయ్ పే చర్చా.. భారత్ - యూకే సంబంధాలు బలపడుతున్నాయి' అని వ్యాఖ్య జోడించారు. భారతీయ మూలాలున్న అఖిల్ పటేల్ ఈ స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీకి కప్పులో టీ ఒంపుతూ.. 'ఒక చాయ్‌వాలా మరో చాయ్‌వాలాకు' అని అఖిల్ వ్యాఖ్యానించారు. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల నుంచి డిగ్రీలు అందుకొన్నాక ఆయన టీ వ్యాపారం మొదలుపెట్టారు. 2018లో జరిపిన లద్దాఖ్ పర్యటన అఖిల్ జీవితాన్ని మార్చేసింది. అతడికి ఎప్పటినుంచో టీ తాగే అలవాటున్నా.. లద్దాఖ్‌లో చాయ్‌ను ఓ సంప్రదాయంలా, ఆచారంలా తాగడాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత 2019 నుంచి 'అమలా' అనే బ్రాండ్ పేరుతో రకరకాల చాయ్‌లను తయారుచేయడం ప్రారంభించారు. దీనికి తన మామ్మ నుంచి స్ఫూర్తి పొందినట్లు అఖిల్ చెబుతారు. ఈయన తాను వినియోగించే టీ, ఇతర సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేయడానికి భారత్‌లోని అస్సాం, కేరళలో స్వయంగా పర్యటించి రైతులను కలిశారు. సన్నకారు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి మధ్యవర్తులను దూరం పెట్టారు. దీంతో రైతులకు మంచి లాభాలు అందాయి.

యూట్యూబ్ వీడియోల ఆధారంగా శిక్షలు పడవు: సుప్రీం కోర్టు

దిల్లీ: యూట్యూబ్ వీడియోల ఆధారంగా దోషి ఎవరో.. నిర్దోషి ఎవరో నిర్ధారణ జరగదని.. ఆ పని న్యాయస్థానాలు చేస్తాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఓ మహిళా రాజకీయ నాయకురాలి పరువుకు నష్టం కలిగించే ఓ వీడియోను యూట్యూబ్ ఛానల్‌లో పోస్టు చేసిన కేరళకు చెందిన పాత్రికేయుడు నందకుమార్‌ను మందలిస్తూ జస్టిస్ బి.వి నాగరత్న, జస్టిస్ కె.వి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "యూట్యూబ్ వీడియోల ద్వారా ప్రజలను దోషులుగా నిర్ధారించాలనుకుంటున్నారా? వాటి ఆధారంగా శిక్షలు పడటం, విముక్తి లభించడం జరగదు. ఆ పని న్యాయస్థానాలు చేస్తాయి. యూట్యూబ్‌లో మంచి విషయాలు చెప్పండి. నేరాలను ఎందుకు చూపిస్తారు" అని ధర్మాసనం పేర్కొంది.

తేజస్వీ హత్యకు జేడీయూ, భాజపా కుట్ర: రబ్రీదేవి

పట్నా: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆర్జేడీ నేత, ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్‌ను హత్యచేయడానికి జేడీయూ, భాజపా కలిసి కుట్రపన్నాయని బిహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి ఆరోపించారు. గతంలో తన కుమారుడు తేజస్వీపై మూడు, నాలుగు సార్లు హత్యాయత్నాలు జరిగాయన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. "తేజస్వీని హత్య చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. రానున్న ఎన్నికల్లో తమను సవాల్ చేయకుండా ఉండేందుకు నా కుమారుణ్ని అంతం చేయాలనుకుంటున్నారు. గతంలో ఒకసారి ఓ ట్రక్కు తేజస్వీ కారుపైకి దూసుకెళ్లడానికి ప్రయత్నించింది" అని రబ్రీదేవి పేర్కొన్నారు.

18 నిమిషాలకే వెనక్కి

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం

జైపుర్: ఎయిరిండియా విమానాల్లో వరుస సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. శుక్రవారం జైపుర్ నుంచి ముంబయికి 160 మంది ప్రయాణికులతో బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన 18 నిమిషాలకే సాంకేతిక సమస్య కారణంగా వెనక్కి వచ్చింది.

ఫిలిప్పీన్స్‌లో తుపాను బీభత్సం.. 25 మంది మృతి

మనీలా: ఫిలిప్పీన్స్‌లో తుపాను కో-మే బీభత్సం సృష్టిస్తోంది. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా 25 మంది మృతి చెందారని అధికారులు శుక్రవారం తెలిపారు. 2,78,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొన్నారు. రాజధాని మనీలా సహా వరద ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది.



ఈనాడు

విజయవాడ 26-7-2025 శనివారం సిటీ సంపుటి 51 . సంచిక 347

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



బెజవాడ రైల్వేస్టేషన్‌కు సౌర శక్తి!


విజయవాడ రైల్వేస్టేషన్‌లో 4, 5 ప్లాట్‌ఫాంల పైకప్పులపై అమర్చిన సౌర ప్యానళ్లు

రైల్వేశాఖ విజయవాడ డివిజన్ వ్యాప్తంగా సౌర శక్తిని విస్తరిస్తోంది. ఇప్పటికే రైల్వేకాలనీ, రన్నింగ్ రూమ్‌లు, ఎల్‌సీ గేట్లు, సత్యనారాయణపురం ఈటీసీసీ, రైల్వే ఆసుపత్రులు, డీఆర్‌ఎం కార్యాలయంలో సౌర ప్యానళ్లు అమర్చి ఏటా రూ.లక్షలు ఆదా చేస్తోంది. తాజాగా విజయవాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంల పైకప్పులనూ ఇందుకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే 4, 5 ప్లాట్‌ఫాంలపై సౌరశక్తి ప్యానళ్లు ఏర్పాటు చేయించింది. తాజాగా తొమ్మిదో నంబరు ప్లాట్‌ఫాంపై చేపట్టిన పనులు తుది దశకు చేరాయి. స్టేషన్‌లో లైట్లు, ఫ్యాన్లు, గీజర్లు, డిస్‌ప్లే బోర్డులు పూర్తి స్థాయిలో సౌరశక్తితో పని చేసేలా అధికారులు చూస్తున్నారు. విజయవాడ సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్(నిర్వహణ) టి.సురేష్‌బాబు పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



– ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, విజయవాడ(రైల్వే స్టేషన్)

గోదావరికి పెరుగుతున్న వరద


గోదావరి వరద ముంపులో పోశమ్మగండి ఆలయం

ఆత్రేయపురం, దేవీపట్నం, న్యూస్‌టుడే: గోదావరి వరద క్రమంగా పెరుగుతుండటంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పరీవాహక గ్రామాల్లో మళ్లీ అలజడి మొదలయింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి 10.9 అడుగులు ఉంది. 2,46,347 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచిపెట్టారు. వరద ప్రభావిత ప్రాంతాలైన బొబ్బర్లంక, పిచ్చుకల్లంక, వాడపల్లి లంకల్లోని నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఉన్నతాధికారులు సూచించారు.

■ అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పోశమ్మ గండి వద్ద శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రానికి గోదావరిలో రెండు అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. దర్శనాలను నిలిపివేశారు.

సముద్రంలోకి 430 టీఎంసీలు

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరిలో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద శుక్రవారం సాయంత్రానికి నీటి మట్టం 28.80 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల ద్వారా 3 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్తోంది. గత 46 రోజులుగా గోదావరి నుంచి సముద్రంలోకి 430 టీఎంసీలు వెళ్లినట్లు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మరో రెండు రోజుల పాటు వరద పెరగడంతో పాటు 4.50 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు.

కృష్ణానది పరవళ్లు

ఆత్మకూరు, సున్నిపెంట, న్యూస్‌టుడే: కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,18,025 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. జలాశయం రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి స్పిల్ వే ద్వారా 53,856 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 66,331 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటలకు 882.50 అడుగులు, నీటినిల్వ 202.0439 టీఎంసీలుగా నమోదైంది.


ఏపీ.. గ్లోబల్ డిజిటల్ హబ్!

స్వర్ణాంధ్ర టాస్క్‌ఫోర్స్ కమిటీ స్పష్టీకరణ

రెండు నమూనాలు సూచించిన కమిటీ • స్వల్ప, దీర్ఘకాలిక లక్ష్యాల నిర్దేశం

ఈనాడు – అమరావతి

రాష్ట్రాన్ని 'గ్లోబల్ డిజిటల్ హబ్'గా తీర్చిదిద్దే అవకాశం ఉందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) అభిప్రాయపడింది. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా ఇప్పటి నుంచే అడుగులు వేయాలని.. ఐటీ ఎగుమతులకు రాష్ట్రంలో మంచి అవకాశాలు ఉన్నాయని 'స్వర్ణాంధ్ర దార్శనిక పత్రం 2047' లక్ష్యంపై టాటా గ్రూప్ సంస్థల ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ తదితరుల సారథ్యంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. భాగస్వామ్య పక్షాలతో చర్చించి వారి నుంచి వచ్చిన సూచనల మేరకు రెండు నమూనాలను సీఐఐ రాష్ట్రానికి నిర్దేశించింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక సేవలకు కేంద్రంగా మారుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఐటీ, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటుకు వీలుగా మౌలిక సదుపాయాలు, సంస్థలను ఆకర్షించేందుకు ప్రోత్సాహకాలను అందించాలని ప్రభుత్వానికి సూచించింది.



2023-24లో వివిధ రాష్ట్రాల ఐటీ ఎగుమతులు (రూ.కోట్లలో)

రాష్ట్రం	ఎగుమతులు
కర్ణాటక	4,95,094.04
మహారాష్ట్ర	1,83,847.52
తెలంగాణ	1,21,116.62
తమిళనాడు	80,677.43
హరియాణా	53,172.07
ఆంధ్రప్రదేశ్	2,850.23

ఎగుమతులకు విస్తృత అవకాశాలు

బీపీవో, కేపీవో, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, జీసీసీలు, ఇంజినీరింగ్ సేవలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, అభివృద్ధికి రాష్ట్రంలో అవకాశాలు ఉన్నాయి. భవిష్యత్తులో ప్రపంచానికి సాంకేతిక రాజధానిగా మారే అవకాశం ఉంది.

నమూనా 1

అనలాగ్ సమాచారాన్ని డిజిటల్ ఫార్మాట్‌లోకి మార్చాలి. ఆ తర్వాత డిజిటల్ టెక్నాలజీలను వినియోగించి, పాలన ప్రక్రియలో మార్పులు తీసుకొచ్చి.. ప్రజలకు అందించే సేవలు మెరుగుపరచాలి.

యూజ్ కేసుల కోసం ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య, పట్టణ ప్రణాళిక వంటి కీలక రంగాల డేటా అనుసంధానించి.. ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలకు వర్తింపచేయాలి.

కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత అప్లికేషన్‌ల ఆధారంగా సేకరించిన డేటా వినియోగించి.. వివిధ అంశాలకు పరిష్కారం చూపడం.

నమూనా 2

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఐటీ సేవలు విస్తరించేలా హబ్ అండ్ స్పోక్ విధానాన్ని అనుసరించవచ్చు.

బిజినెస్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్ (బీపీవో) సెంటర్ల అభివృద్ధి. నైపుణ్య ఆధారిత టెక్నాలజీ హబ్, స్పోక్ సెంటర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం.

కార్యాచరణ ఇదీ

■ ఐటీ సేవలు, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ఏఐ హబ్‌లుగా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అమరావతి నగరాలను పరిగణించాలి.

■ హబ్‌లకు అనుసంధానంగా ఉన్న పట్టణాలను బీపీవో కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి.

స్వల్పకాలిక లక్ష్యాలు

■ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) సహకారంతో ఇంక్యుబేషన్ సెంటర్లు/ఇంక్యుబేటర్స్ ఏర్పాటు.

■ పరికరాల కొనుగోలు, పేటెంట్, పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు ప్రోత్సాహకాలు.

దీర్ఘకాలిక లక్ష్యాలు

■ సమీకృత టెక్నాలజీ పార్కులు, కాన్సెప్ట్ సిటీలు, విశ్వవిద్యాలయాలు, ఇంక్యుబేషన్ సెంటర్లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు, ల్యాబ్‌లు, కో-వర్కింగ్ స్పేస్‌ల ఏర్పాటు.

■ పీపీపీ విధానంలో ఐటీ, జీసీసీ పాలసీల ద్వారా మౌలిక మౌలిక సదుపాయాలు.

అమరావతిలో డేటా మోడల్ అథారిటీ ఉండాలి

2022లో ప్రపంచవ్యాప్తంగా ఏఐ రంగంలో 136.55 బిలియన్ డాలర్ల వాణిజ్యం నమోదైంది. రాబోయే సంవత్సరాల్లో ఏఐ భారీగా విస్తరించే అవకాశం ఉంది. ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అమరావతిలో డేటా మోడల్ అథారిటీ ఏర్పాటు చేయాలి. జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ పాలసీ.. కేంద్ర ఏఐ మిషన్‌లో భాగస్వామ్యం కావాలి.

రాష్ట్రానికి తప్పిన వాయు'గండం'

ఈనాడు, విశాఖపట్నం, అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండంగా బలపడింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ వైపు కదులుతున్న నేపథ్యంలో రాష్ట్రంపై దీని ప్రభావం లేనట్లేనని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు. వాయుగుండం శనివారం నాటికి పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ.. గంగా పరీవాహక పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్ వైపు కదలనుంది. శనివారం మధ్యాహ్నం వరకు వాయుగుండం తీవ్రత కొనసాగి, తర్వాత బలహీనపడే అవకాశముంది. రాష్ట్రంలో ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉన్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. మంగళవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

■ భారీవర్షాలు, వరదలు వచ్చే ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని హోం, విపత్తు నిర్వహణశాఖల మంత్రి వంగలపూడి అనిత.. అధికారులకు సూచించారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ యాజమాన్య కోటా సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఈ విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వైద్య, దంత వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల్లో అందుబాటులో ఉన్న సెల్ఫ్ ఫైనాన్సింగ్, యాజమాన్య బి1, బి2, ఎన్నారై కోటా సీటల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం రాత్రి నోటిఫికేషన్ విడుదల చేశారు. నీట్ యూజీ ప్రవేశపరీక్ష రాసి కనీస అర్హతతో ర్యాంకులు సాధించిన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ ఉదయం 9 నుంచి ఆగస్టు రెండో తేదీ రాత్రి 9 గంటల్లోగా దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత పత్రాలతో పూరించి పంపాల్సి ఉంటుంది.

గోరకల్లు మరమ్మతులకు పచ్చజెండా

ఈనాడు, అమరావతి: రాయలసీమలో లక్షల ఎకరాలకు ఆధారమైన గోరకల్లు జలాశయాన్ని బాగు చేసేలా నిధులు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. తక్షణం మరమ్మతులు చేయకపోతే జలాశయం భద్రతకే ముప్పు అని నివేదికలు అందాయి. రూ.617 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఈ డ్యాంను ముప్పు నుంచి బయటపడేసేందుకు తాజాగా రూ.53 కోట్లు మంజూరు చేయడం కొంత ఊరట. జలవనరులశాఖ అధికారుల నుంచి మొత్తం రూ.122 కోట్లతో అవసరమైన పనులు చేసేందుకు ప్రతిపాదించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇందుకు నిధులు కేటాయించలేదు. డ్రిప్ కింద ప్రతిపాదనలు పెట్టినా ఆ పథకం చేపట్టేందుకు అనుమతి లభించలేదు. దీంతో అత్యవసర పరిస్థితులను దృష్ట్యా మంత్రిమండలి ముందు ప్రత్యేకంగా ప్రతిపాదన ఉంచి జలవనరులశాఖ నిధులు తెచ్చుకుంది.

రూ.772 కోట్లతో 9,098 ఆలయాల అభివృద్ధి చర్యలు

గార(శ్రీకూర్మం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో రూ.772 కోట్లతో 9,098 ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా గార మండలం శ్రీకూర్మంలో శుక్రవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తితిదేలో తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఇద్దరు అధికారులను బాధ్యులను చేసి వారిపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

అవుతారా... ఫ్యామిలీ స్టార్!



రోజూ 15 నిమిషాలు కుటుంబంతో గడిపితే | 25% ఒత్తిడి తగ్గుతుంది | 35% ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ అధ్యయనం

భార్యాబిడ్డలంటే అమితమైన ప్రేముంటుంది..
వారికోసం ఎలాంటి త్యాగాలైనా చేసే ధైర్యముంటుంది..
కానీ.. వారితో గడిపేందుకు సమయం ఉందా? అంటే..
చాలామందికి ఉండటం లేదిప్పుడు!
కనీసం వారాంతాల్లోనైనా కుటుంబంతో గడిపితే..
బంధాలు బలపడడమే గాక...
సగం ఒత్తిడి పరారవుతుందంటున్నాయి అధ్యయనాలు!

కుటుంబానికి తగిన సమయం కేటాయించకపోవడమే.. భార్యాభర్తల మధ్య దూరం పెరగడానికి.. పిల్లల్లో 60 శాతం ఒత్తిడి, భావోద్వేగాలకు కారణం.

– ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

అనుబంధాలు బలంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుంది. జీవితం సాఫీగా సాగుతుంది. డబ్బు, పేరు, గౌరవం కంటే అయినవారి అనుబంధాలు మనసుకు హాయిని ఇస్తాయి.

– హార్వర్డ్ విశ్వవిద్యాలయం అధ్యయనం

వారానికి కనీసం ఒక రోజు పూర్తిగా కుటుంబంతో గడిపే వ్యక్తుల్లో మానసిక ఒత్తిడి 45 శాతం తగ్గుతుంది. ఉత్సాహం పెరుగుతుంది.

– ఆస్ట్రేలియా ఫ్యామిలీ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక

ఇలా చేద్దామా?

- వారమంతా ఉద్యోగం, చదువు, ఇతర వ్యాపకాలతో క్షణం తీరిక లేకుండా సాగిపోతుంది. కుటుంబానికి మిగిలింది ఆదివారంలాంటి సెలవు రోజులే.
- ఆ రోజు మొబైల్ జోలికి సాధ్యమైనంత తక్కువగా వెళ్లండి..
- ఇంటి పనుల్లో మీరూ చేయి కలపండి. కుటుంబ సభ్యులతో కబుర్లు చెప్పుకొంటూ సరదాగా కలిసి భోజనం చేయండి.
- కాసేపు పెద్దలతో ఆప్యాయంగా మాట్లాడండి. వారు చెబుతున్నది ఓపిగ్గా వినండి. వారి కష్టసుఖాలు, ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోండి.
- పిల్లలతో సరదాగా కూర్చుని ఆట పాటలు-కబుర్లతో కాలక్షేపం చెయ్యండి. పాఠశాలలో, బయట వారి అనుభవాలను తెలుసుకోండి.
- వారికి నచ్చిన రంగంలో సృజనను వెలికి తీసే ప్రయత్నం చేయండి. ప్రోత్సహించండి. ఉత్సాహం పెరిగి భయం తగ్గుతుంది.
- ఇంట్లో పరిస్థితి అవసరాలు తెలుసుకుంటూనే శ్రీమతికి ఆప్యాయత పంచండి. నేనున్నాననే భరోసా ఇవ్వండి.
- ఇంటిల్లిపాదీ పార్కుకో.. షికారుకో.. సినిమాకో వెళ్లండి.. సరదాగా గడపండి.

తరగని కబుర్ల తాతయ్య.. నేస్తమై నిలిచే నానమ్మ.. కనురెప్పలా కాచుకునే అమ్మ.. సర్వం తానై నడిపించే నాన్న.. అనురాగం పంచే అక్క.. ఆప్యాయతలు పెంచే అన్న.

ఇలా అనుబంధాలు, ఆప్యాయతలతో ఒకప్పుడు కుటుంబాలు కళకళలాడేవి. కాలంతోపాటే పరిస్థితులూ మారాయి. ఇప్పుడున్న చిన్న కుటుంబాల్లోనూ ఆప్యాయతలు కరవవుతున్నాయి. పని ఒత్తిళ్లు.. క్షణం తీరిక లేని వ్యాపకాలు.. ఇంటికొచ్చాక చిరాకులు.. కాస్తంత తీరిక దొరికిందంటే ఎవరికివారు చరవాణిలతోనే ముచ్చట్లు. ఇక ఆదివారం వచ్చిందంటే వారం అంతా అలసిపోయాం ఈ రోజైనా విశ్రాంతి తీసుకోవాల్సిందే అనే పరిస్థితి. సెలవురోజైనా కాస్త ఆప్యాయంగా గడిపే పరిస్థితులు చాలా కుటుంబాల్లో లేవు. వారం అంతా ఎదురుచూస్తే ఇంట్లో వారికీ నిరాశే. కుటుంబ బంధాలు బీటలువారడానికి, పర్యవేక్షణ లేక పిల్లలు పెడతోవ పట్టడానికి ఇలాంటి పరిస్థితులే కారణమని నిపుణులు చెబుతున్నారు. మీతో గడపాలని.. సెలవురోజు ఎప్పుడొస్తుందా అని ఆత్రంగా ఎదురుచూసే మీ కుటుంబానికి ఈ ఒక్కరోజైనా హీరోలా/షీరోలా మెరవండి. ఎంత బిజీగా ఉన్నా.. ఆదివారం లాంటి సెలవు రోజుల్లో కాసేపు కేటాయించండి.. అయినవారితో హాయిగా గడిపేయండి.. మీరు చూపిన ప్రేమ, సరదాగా గడిపిన క్షణాలతో వారిలో మరచిపోలేని జ్ఞాపకాలు నింపే ప్రయత్నం చేయండి.. ఈ ప్రయత్నానికి సరిపోదా ఆదివారం..?

కుటుంబాన్ని పట్టించుకోకపోతే అనర్థాలే..



– డాక్టర్ కర్రి రామారెడ్డి, మానసిక వైద్య నిపుణులు, రాజమహేంద్రవరం

రోజూ ఇంటికి వచ్చాక ఆ కొద్ది సమయం కూడా భార్యాపిల్లలతో మనస్ఫూర్తిగా గడపలేని పరిస్థితులతోనే సమస్యలు వస్తున్నాయి. పిల్లలు సెల్‌ఫోన్లకు, వ్యసనాలకు బానిసలవ్వడం, చదువు పక్కదారి పట్టడం, పెద్దల ఆప్యాయతలు లేక తెలియని వయసులో ప్రేమ పేరుతో మోసపోవడం, అనుబంధాలు బలంగా లేక భార్యాభర్తలు విడిపోవడం లాంటివి ఎదురవుతున్నాయి. మనం రోజూ ఉద్యోగానికి, తిండికి, ఫోన్‌కు, నిద్రకు కొంత సమయం కేటాయిస్తున్నట్లే.. మనల్ని నమ్ముకున్న కుటుంబానికీ కొంత సమయం కేటాయించాలి. అప్పుడే అనుబంధాలు పెరుగుతాయి. మంచి ఫలితాలు ఉంటాయి.

ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టాన్ని వ్యక్తిగత కక్షలకు వాడుకోనివ్వద్దు

- ఏపీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు



ఈనాడు, దిల్లీ: 'ఫిర్యాదుదారులు ఎస్సీ, ఎస్టీలు కావడం ఒక్కటే ఎట్రాసిటీ కేసుల్లో ప్రాసిక్యూషన్‌కు ప్రాతిపదిక కాకూడదు. నేరారోపణలు పూర్తిగా బాధితుడి కులం గురించే జరిగినట్లు ఉండాలి. వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడం, వ్యక్తులను వేధించడం కోసం చట్టాన్ని దుర్వినియోగం చేయడానికి అవకాశం కల్పించకూడదు. అభియోగాల్లో చట్టపరమైన లోపం ఉంటే బాధితులు పూర్తిగా వ్యక్తులపై అనవసరమైన వేధింపులను నిరోధించడానికి ప్రాథమిక దశలోనే ప్రొసీడింగ్స్‌ను కొట్టివేయాలి. లేదంటే నిందితులు అనవసర వేధింపులకు గురవుతారు. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద తప్పుడు కేసులు ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్నట్లు సుప్రీంకోర్టు ఇదివరకే అభిప్రాయపడింది. ముఖ్యంగా ప్రభుత్వోద్యోగులు, న్యాయాధికారులపై వ్యక్తిగత కక్ష తీర్చుకోవడానికి, వేధించడానికి ఇలాంటి కేసులు ఎక్కువగా పెడుతున్నారు. ఇలాంటి వాటిని ప్రారంభ దశలోనే అడ్డుకోవాలి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఏలూరు 2వ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ముందున్న కేసును కొట్టేస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టు 2014 అక్టోబర్ 10న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన కేసులో సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా దువ్వ గ్రామంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ చేసిన స్థలాలను అక్కడి తహసీల్దార్ కుట్రపూరితంగా అగ్రవర్ణాలకు కేటాయించారని కొండే నాగేశ్వరరావు అనే వ్యక్తి ఆరోపించారు. తర్వాత ఆయనపై ఒక క్రిమినల్ కేసు నమోదైంది. ఆ నేరం జరిగినప్పుడు నాగేశ్వరరావు అక్కడ లేరని నిరూపితమవడంతో ఆయనపై అభియోగాలను ఉపసంహరించారు. ప్లాట్ల కేటాయింపుల్లో అవకతవకల గురించి తాను అధికారులపై ఆరోపణలు చేసినందుకు ప్రతీకారంగానే తనను కేసులో ఇరికించారని, తాను ఎస్సీ కావడం వల్లే తనపై కేసు నమోదు చేశారంటూ నాగేశ్వరరావు తహసీల్దార్, పోలీసు అధికారి సహా పలువురు ప్రభుత్వ అధికారులపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు పెట్టారు. పోలీసులు దర్యాప్తు చేసి, సదరు అధికారులపై ఛార్జిషీట్ కూడా దాఖలు చేశారు. నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు విచారించి, వారిపై నమోదు చేసిన ప్రొసీడింగ్స్ మొత్తాన్ని 2014 అక్టోబరులో కొట్టేసింది. దాన్ని సవాల్ చేస్తూ నాగేశ్వరరావు సుప్రీంకోర్టుకు వెళ్లారు. అన్ని కోణాల్లో పరిశీలించిన సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును సమర్థించింది. ఫిర్యాదుదారు కులం ఆధారంగా ప్రభుత్వ అధికారులు దురుద్దేశంతో వ్యవహరించినట్లు ఎలాంటి ఆధారాలూ లేవని పేర్కొంది. ప్లాట్ల కేటాయింపులో జరిగిన తప్పులను అప్పటికే సరిదిద్దినట్లు తెలిపింది.

ఆయుష్‌లో 358 పోస్టుల భర్తీకి నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఆయుష్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం విస్తరించనుంది. ఆ విభాగం బలోపేతానికి వైద్యులతోపాటు వివిధ కేటగిరీల్లో 358 మందిని నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు 71 మంది వైద్యులు, ముగ్గురు మానసిక వైద్యులు, 26 మంది జిల్లా ప్రోగ్రాం మేనేజర్లు, 90 మంది పంచకర్మ టెక్నీషియన్లతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు, సహాయకుల పోస్టుల భర్తీకి వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆమోదం తెలిపారు. రాష్ట్ర వైద్య సేవల- నియామకాల మండలి ద్వారా ఒప్పంద, పొరుగు సేవల పద్ధతిలో వీరిని నియమిస్తారు. గత వైకాపా ప్రభుత్వం బడ్జెట్‌లో ఆయుష్ సేవలకు రూ.37 కోట్లు మాత్రమే ఖర్చుచేసి ఆ రంగాన్ని నిర్వీర్యం చేసింది. 2024-25లో రాష్ట్రానికి కేంద్రం రూ.83 కోట్లు మంజూరుచేస్తే.. కూటమి ప్రభుత్వం పూర్తిగా రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలుకు పలు కార్యక్రమాలు చేపట్టింది.

పెద్దిరెడ్డి గన్‌మన్ సస్పెన్షన్

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గన్‌మన్ కాలేషాను సస్పెండ్ చేస్తూ చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం కుంభకోణంలో రాజమహేంద్రవరం జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న తన కుమారుడు మిథున్‌రెడ్డిని పరామర్శించేందుకు పెద్దిరెడ్డి ఈ నెల 23న అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో ఏఆర్ కానిస్టేబులైన కాలేషా గన్‌మన్‌గా భద్రతా విధులు విస్మరించి.. దుప్పటి, దిండు, క్యారియర్లు మోస్తూ వ్యక్తిగత సహాయకుడిగా కనిపించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల ద్వారా బయటకు వచ్చాయి. విచారించిన ఎస్పీ.. అతనిపై చర్యలు తీసుకున్నారు.

మూడేళ్లలో కక్ష్యలోకి 3 రెట్ల ఉపగ్రహాలు

- 40 అంతస్తుల ఎత్తయిన రాకెట్ల రూపకల్పన
- 2040 నాటికి అంతరిక్ష సాంకేతికతలో అగ్రరాజ్యాల సరసన..
- విమాన ప్రయాణ దూరాన్ని తగ్గించే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిపై దృష్టి
- జి.పి.బిర్లా స్మారక అవార్డు స్వీకరణ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్



ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్‌కు అవార్డు అందజేస్తున్న నిర్మల బిర్లా. చిత్రంలో వై.వి.ఎన్.కృష్ణమూర్తి, మృత్యుంజయరెడ్డి, ప్రకాశ్‌చౌహాన్

ఈనాడు, హైదరాబాద్: భారతదేశం 2040 నాటికి అంతరిక్ష సాంకేతికతలో అగ్రరాజ్యాలతో సమానంగా నిలవాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తెలిపారు. ప్రస్తుతం 55 ఉపగ్రహాలు కక్ష్యలో తిరుగుతూ దేశ ప్రజలకు సేవలందిస్తున్నాయని.. మూడేళ్లలో ఈ సంఖ్యను మూడు రెట్లు పెంచాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో 25 ఉపగ్రహాలు సైన్యానికి సేవలందించాయన్నారు. హైదరాబాద్‌లోని బి.ఎం.బిర్లా సైన్స్‌సెంటర్‌లో శుక్రవారం ఆయన ప్రతిష్ఠాత్మక జి.పి.బిర్లా స్మారక అవార్డును జి.పి.బిర్లా ఆర్కియాలజికల్ ఆస్ట్రోనామికల్ అండ్ సైంటిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్‌పర్సన్ నిర్మల బిర్లా చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం 'భారతీయ అంతరిక్ష ప్రయోగాలు, సాఫల్యాలు, సవాళ్లు, భవిష్యత్తు దృక్పథాలు' అనే అంశంపై ప్రసంగించారు. "భారత్ సొంతంగా అంతరిక్షంలో కేంద్రాన్ని నిర్మించుకునే పనిలోఉంది. ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన విధంగా 2035 నాటికి ఇది సాధ్యమవుతుంది. 2040 నాటికి చంద్రుడిపైకి మానవుడిని పంపుతాం. జపాన్‌తో కలిసి చంద్రయాన్-5ను 2028లో ప్రయోగించనున్నాం. జులై 30న నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్ (నైసర్) మిషన్‌ను చేపడుతున్నాం. పరిశ్రమలతో కలిసి క్వాంటమ్ టెక్నాలజీని ప్రదర్శించే మొదటి ఉపగ్రహాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రయోగించనున్నాం. ప్రారంభంలో 17 మీటర్ల ఎత్తయిన రాకెట్ కేవలం 35 కిలోల బరువును మోసుకెళ్లగలిగితే.. ఇప్పుడు ఇస్రో 74 వేల కిలోల బరువును మోసుకెళ్లే, 40 అంతస్తుల ఎత్తయిన రాకెట్లను నిర్మిస్తోంది. విమాన ప్రయాణ సమయాన్ని తగ్గించే సినర్జిటిక్ ఎయిర్ బ్రీతింగ్ రాకెట్ ఇంజిన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఇది అందుబాటులోకి వస్తే అమెరికాకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. మానవ సహిత ప్రయోగాల కోసం మూడో లాంచ్‌ప్యాడ్‌ను సిద్ధం చేస్తున్నాం" అని నారాయణన్ వివరించారు. ఇస్రో బృందం తరఫున అవార్డు స్వీకరించడం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. జి.పి.బిర్లా మానవాళికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇస్రో-ఎన్ఆర్ఎస్‌సీ మాజీ డైరెక్టర్ డాక్టర్ వై.వి.ఎన్.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జమ్మూకశ్మీర్‌లో మాదిరి తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన సాధ్యం కాదు

- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వేర్వేరు
- రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి రిట్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: జమ్మూకశ్మీర్‌లో చేపట్టినట్లుగా తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన సాధ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత ఏర్పడిన జమ్మూకశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలకూ దాన్ని విస్తరించాలి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించండి' అని విజ్ఞప్తి చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.పురుషోత్తమ్‌రెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. దీనిపై ఏప్రిల్ 30న వాదనలు ముగియగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎ.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం 26 పేజీల తీర్పు వెలువరించింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వేర్వేరు వ్యవస్థలు కాబట్టి ఒక దానికి వర్తింపజేసే సూత్రాన్ని రెండోదానికి విస్తరించడం కుదరదని స్పష్టం చేసింది. "2026 తర్వాత జనగణన చేసేంత వరకూ దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పునర్విభజన చేపట్టరాదని రాజ్యాంగంలోని ఆర్టికల్ 170(3) చెబుతోంది. కానీ ఆర్టికల్ 170 కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌కు వర్తించదు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 26లో పేర్కొన్న సీట్ల పెంపు పదాన్ని మాత్రమే ప్రత్యేకంగా చూడకూడదు. ఆ సీట్ల పెంపు అన్నది రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 కింద పొందుపరిచిన నిబంధనలకు లోబడి ఉంటుందని ఆ సెక్షన్ తొలి వాక్యంలోనే ఉన్నందున ఆ రెండు అంశాలను కలిపి చదువుకోవాలి. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల మధ్య రాజ్యాంగపరంగా స్పష్టమైన తేడాలు ఉన్న నేపథ్యంలో డీలిమిటేషన్ నోటిఫికేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను మినహాయించడం అన్నది వివక్ష చూపడం కిందికి కానీ, ఆర్టికల్ 14 ఉల్లంఘన కిందికి కానీ రాదు. ఈ రిట్ పిటిషన్‌లో కోరినట్లుగా పిటిషనర్‌కు ఉపశమనం కల్పిస్తే అది వరద గేట్లు ఎత్తినట్లుగా మారుతుంది. మిగతా రాష్ట్రాల నుంచీ ఇలాంటి పిటిషన్లు వచ్చిపడతాయి. రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా ఏం ఆశించినా అమలు సాధ్యంకాదు. అందువల్ల రిట్ పిటిషన్‌ని డిస్మిస్ చేస్తున్నాం" అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

'ఆడుదాం ఆంధ్ర'పై 20 రోజుల్లో విజిలెన్స్ నివేదిక

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



బాపట్ల, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో చేసిన అవినీతిపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా సమగ్ర విచారణ చేయిస్తున్నామని.. 15 నుంచి 20 రోజుల్లో నివేదిక అందుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారులు, కార్మిక సంఘాల నేతలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీలోకి కొత్తగా మూడు వేల విద్యుత్తు బస్సులు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆర్టీసీ కార్మికులకు రాత్రి భత్యాన్ని త్వరలో రూ.130కు పెంచుతామని వెల్లడించారు.

స్టీరింగ్‌పైనే ప్రాణాలొదిలిన బస్సు డ్రైవర్

- బస్సును నిలపడంతో ప్రయాణికులు క్షేమం



డ్రైవర్ రసూల్ (పాత చిత్రం)



గుండె పోటుతో ఆర్టీసీ బస్సులోనే మృతి చెందిన డ్రైవర్ రసూల్ (52) ◆రోడ్డు పక్కకు వెళ్లి ఆగిన బస్సు

రాయచోటి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన అన్నమయ్య జిల్లా రాయచోటిలోని మదనపల్లె రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కావలి పట్టణం తుఫాన్‌నగర్‌కు చెందిన రసూల్ (52) డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సును నడుపుతూ కావలి నుంచి రాయచోటి మీదుగా బెంగళూరు వెళ్తున్నారు. మార్గమధ్యలో గుండె నొప్పి రావడంతో వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కకు తిప్పారు. దీంతో ఓ దుకాణం ఎదుట నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని బస్సు ఆగిపోయింది. డ్రైవర్ స్టీరింగ్‌పై అపస్మారక స్థితిలో పడిపోయారు. ప్రయాణికులు గుర్తించి ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్‌ను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆ సమయంలో బస్సులోని నలుగురు ప్రయాణికులు క్షేమంగానే ఉన్నారని రాయచోటి ఆర్టీసీ డిపో మేనేజరు మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

ఆత్మగౌరవానికి అసలైన సంకేతమది



శరీరాన్ని మంచి ఆకృతిలో ఉంచుకోవడం ఒక కళ! దాన్ని ఇతరుల నుంచి కొనుగోలు చేయలేం. బహుమానంగా కూడా పొందలేం. క్రమశిక్షణను కలిగి ఉండి, పూర్తి చిత్తశుద్ధితో, ఓపికగా రోజూ శ్రమించడం ద్వారా మాత్రమే దాన్ని సొంతం చేసుకోగలం. ఆత్మగౌరవానికి అసలైన సంకేతమది.

– ప్రిన్స్ అబోగ్యే-బొవాడీ, ఫిట్‌నెస్ కోచ్

గ్రహం అనుగ్రహం

26-7-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
విదియ: రా. 11-29 తదుపరి తదియ
ఆశ్లేష: సా. 5-30 తదుపరి మఖ
వర్జ్యం: ఉ. 6-16 నుంచి 7-52 వరకు
అమృత ఘడియలు: మ. 3-53 నుంచి 5-30 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-40 నుంచి 7-22 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5.40; **సూర్యాస్తమయం:** సా.6.32
చంద్ర దర్శనం

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	33.3	27.4
తిరుపతి	33.2	24.1
తాడేపల్లిగూడెం	32.6	25.7
కడప	32.0	26.0
ఒంగోలు	31.6	25.5
కర్నూలు	31.4	24.2
విశాఖపట్నం	30.4	25.8
అనంతపురం	30.4	24.0
విజయవాడ	29.4	25.8
శ్రీకాకుళం	28.0	26.0
గుంటూరు	28.0	25.0
నరసాపురం	28.0	25.0
విజయనగరం	28.0	24.0
రాజమహేంద్రవరం	28.0	24.0
హైదరాబాద్	26.7	22.2

ఐఏఎస్ శ్రీలక్ష్మి.. సీబీఐ కోర్టుకు వెళ్లాల్సిందే

- పిటిషన్‌ను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు

ఈనాడు, హైదరాబాద్: ఓఎంసీ కేసులో నిందితురాలైన ఐఏఎస్ అధికారి వై.శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసు నుంచి తప్పించాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సీబీఐ అభియోగాలపై సీబీఐ కోర్టులోనే విచారణ ఎదుర్కొని నిరూపించుకోవాలని పేర్కొంది. ఓబుళాపురం మైనింగ్ అక్రమాల కేసులో డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టివేయడంతో శ్రీలక్ష్మి హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. సీబీఐ ఆరోపణల్లో ప్రాథమిక ఆధారాలున్నందున కేసును కొట్టివేయలేమన్నారు. 68.5 హెక్టార్లు, 39.5 హెక్టార్లకు సంబంధించిన లీజుల మంజూరులో ఓఎంసీకి లబ్ధి చేకూర్చేలా తీసుకున్నారనే నిర్ణయాలు చట్ట పరిధిలో జరిగాయా లేదా అనేది ఆ కోర్టులో తేల్చుకోవాలన్నారు. శాతవాహన ఇస్పాత్, జింపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల దరఖాస్తులను తిరస్కరించడం, క్యాప్టివ్ మైనింగ్ పదాన్ని జీవోలో విస్మరించడం వంటివి చట్ట పరిధిలోనే ఉన్నాయని నిరూపించుకోవాల్సిన బాధ్యత పిటిషనర్‌పైనే ఉందన్నారు. రివిజన్ పిటిషన్‌లో పిటిషనర్ లేవనెత్తిన అంశాలను పరిశీలించలేమన్నారు. మాజీ కార్యదర్శి కృపానందం, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలపై కేసును సీబీఐ కోర్టు కొట్టివేసిందనే కారణంతో ఇక్కడ పిటిషన్‌ను అనుమతించలేమన్నారు. ఈ కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపించారు.



మళ్లీ సీబీఐ కోర్టుకు

ఓఎంసీ కేసులో నిందితులైన గాలి జనార్దన్‌రెడ్డి, బి.వి.శ్రీనివాసరెడ్డి, గనుల శాఖ మాజీ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్, గాలి వ్యక్తిగత సహాయకుడు అలీఖాన్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సీబీఐ కోర్టు తీర్పు వెలువరించగా, హైకోర్టు ఆ శిక్ష అమలును నిలిపివేసిన విషయం విదితమే. మిగిలిన నిందితుల విచారణ పూర్తయినందున శ్రీలక్ష్మి పాత్రపై మరోసారి విచారణ చేపట్టాల్సి ఉంది. ఆమెపై కేసును నిరూపించడానికి అవసరమైన సాక్షులను పిలిపించి వాంగ్మూలాలు నమోదు చేయడంతోపాటు క్రాస్ ఎగ్జామినేషన్ చేయాల్సి ఉంటుంది. అయితే హైకోర్టు తీర్పుపై శ్రీలక్ష్మి సుప్రీం కోర్టును ఆశ్రయించే అవకాశమూ ఉంది.

విఫల యత్నాలు

- ఓబుళాపురం మైనింగ్ కేసు నుంచి బయట పడటానికి శ్రీలక్ష్మి చేయని ప్రయత్నాలు లేవు. సీబీఐ కేసును కొట్టివేయాలని కోరుతూ మొదట హైకోర్టులో పిటిషన్ వేశారు. ప్రాథమిక ఆధారాలున్నందున కేసును కొట్టివేయలేమని హైకోర్టు తిరస్కరించింది.
- అక్రమ మైనింగ్ వరకే దర్యాప్తు చేపట్టాలంటూ సీబీఐకి హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఓబుళాపురం గనుల సరిహద్దు వివాదం సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున అది తేలేదాకా విచారణ నిలిపి వేయాలంటూ మరో పిటిషన్ దాఖలు చేయగా హైకోర్టు దానిని కూడా కొట్టివేసింది.
- దీంతో మళ్లీ సీబీఐ కోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టు దానిని కొట్టివేయడంతో హైకోర్టులో రివిజన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు శ్రీలక్ష్మిపై కేసును కొట్టివేయడంతో.. సీబీఐ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.
- తిరిగి ఇరుపక్షాల వాదనలను విని తేల్చాలంటూ సుప్రీం కోర్టు ఈ కేసును మళ్లీ హైకోర్టుకే పంపింది.
- దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టగా ఆమె తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి కొట్టివేసినందున అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్ విచారణలో ఉండగా శ్రీలక్ష్మి ఇద్దరు న్యాయవాదులను మార్చి చివరికి సీనియర్ న్యాయవాది కె.వివేక్‌రెడ్డికి అప్పగించారు.

నేను దత్తత తీసుకుంటా

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమవుతుంది. ... కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా సీఎం నుంచి ఎమ్మెల్యే వరకూ అందరూ పనిచేయాలని నిర్దేశించారు.



2 లక్షల మంది మార్గదర్శులు అవసరం

'పీ4 లక్ష్యం నెరవేరాలంటే 2లక్షల మంది మార్గదర్శులు అవసరం. ఇప్పటి వరకు 57,503 మంది నమోదు చేసుకున్నారు. 5,74,811 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. బంగారు కుటుంబాల అవసరాలపై సర్వే చేపట్టి, ఆగస్టు 10 లోగా పూర్తిచేయాలి. ప్రవాసాంధ్రులనూ పీ4లో భాగస్వాములుగా చేయాలి. 'గ్రామాన్ని యూనిట్‌'గా తీసుకొని.. ఒక ప్రాంతంలోని బంగారు కుటుంబాలను అదే ప్రాంతానికి చెందిన ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు దత్తత తీసుకునేలా చూడాలి. కార్పొరేట్ సంస్థలను సమన్వయం చేసుకోవాలి. నిధులిచ్చేందుకు ముందుకొచ్చే దాతల కోసం కామన్‌ఫండ్ ఏర్పాటుచేయాలి. భాగస్వామ్య సంస్థలైన కేపీఎంజీ, మిలాప్, తమ్మిద, భవ్య, భార్గో, ప్రాజెక్టు డీప్ సంస్థలు మరింత కీలకంగా వ్యవహరించాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'పల్నాడు జిల్లాలో అత్యధికంగా బంగారు కుటుంబాల దత్తత జరిగింది. విశాఖపట్నం జిల్లా వెనకబడి ఉంది. దత్తత తీసుకున్న కుటుంబాలకు ఆటోమేటెడ్ సందేశం ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నాం. పీ4ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డిజిటల్ ప్రమోషన్ చేస్తున్నాం' అని అధికారులు సీఎంకు వివరించారు.

మూడు విధానాల్లో.. పీ4

పీ4ను మూడు విధానాల్లో అమలుచేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. '1.బంగారు కుటుంబాన్ని మార్గదర్శి దత్తత తీసుకుని, ఆర్థికంగా సాయం అందించడం. దీనికి కాలపరిమితి ఉండదు. 2.ఫండ్ ఏ నీడ్.. బంగారు కుటుంబాల ఆర్థిక అవసరాలు గుర్తించి, వారికి నగదు సాయం అందించడం. దీనికి కాలపరిమితి ఉంటుంది. 3. గ్రామాలు, మండలాలను దత్తత తీసుకోవడం. ఒక ప్రాంతంలో, ఊళ్లో సమాజ అవసరాలు తీర్చడం. అభ్యుదయ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నిధుల అమలుచేస్తాం' అని వివరించారు.

చంద్రబాబు స్ఫూర్తితో..

సీఎం స్ఫూర్తితో తాను ఐదు పేద కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ ఈ సందర్భంగా ప్రకటించారు. సీఎం ఆయన్ను అభినందించారు. కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసేందుకు తమ సహకారమూ ఉంటుందని ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు సీఎంకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్‌ఛైర్మన్ కుటుంబరావు, ప్రణాళికశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేశానికి హైడ్రోజన్ పవర్!

చెన్నై(వడపళని), న్యూస్‌టుడే: భారతీయ రైల్వే చరిత్ర సృష్టించింది. దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ రైలు కోచ్‌ను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో విజయవంతంగా పరీక్షించింది. ఈ ప్రాజెక్టుపై రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందిస్తూ.. హైడ్రోజన్ ఇంధన ఆధారిత రైల్వే సాంకేతికత కలిగిన ఉన్న దేశాల్లో భారత్ అగ్రగామిగా నిలిచిందని శుక్రవారం తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. కోచ్ పరుగులు తీస్తున్న వీడియోనూ పోస్టు చేశారు. "ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా ప్రచారంలో ఉన్న హైడ్రోజన్ ఇంధన రైలు కోచ్ పరీక్షలు విజయవంతంగా జరిగాయి. మన రైల్వే రంగంలో ఇదో కీలక మైలురాయి. చెన్నైలోని ఐసీఎఫ్‌లో తయారైన ఈ హైడ్రోజన్ పవర్డ్ కోచ్ శక్తి 1,200 హార్స్ పవర్ (హెచ్‌పీ). యూరోపియన్ హైడ్రోజన్ రైళ్ల కంటే దీని శక్తి ఎంతో ఎక్కువ. రూ.2,800 కోట్లతో ప్రవేశపెట్టిన 'హైడ్రోజన్ ఫర్ హెరిటేజ్' పథకం కింద దీన్ని అభివృద్ధి చేశాం" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కాలుష్యం తగ్గించడంలో భాగంగా దేశం ఈ సాంకేతికత వైపు వడివడిగా అడుగులు వేస్తోంది.

సర్పంచులకు అరుదైన అవకాశం

దిల్లీలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి 10 మంది ఎంపిక

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి చెందిన పది మంది సర్పంచులకు అరుదైన అవకాశం లభించింది. ఆగస్టు 15న దిల్లీలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రత్యేక అతిథులుగా పాల్గొనేందుకు వీరిని ఎంపిక చేశారు. సర్పంచులు జీవిత భాగస్వామితో కలిసి ఈ వేడుకల్లో పాల్గొనేందుకు రవాణా ఖర్చులతో పాటు దిల్లీలో వసతి సౌకర్యం కూడా ప్రభుత్వమే కల్పించనుంది. ఎంపికైన సర్పంచుల వివరాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ శుక్రవారం కలెక్టర్లకు పంపారు.

ఎంపికైన సర్పంచులు వీరే

కింజరాపు సురేశ్‌కుమార్(శ్రీకాకుళం జిల్లా, నిమ్మాడ), మయిలబోయిన రమణి(అల్లూరి సీతారామరాజు, రాజవొమ్మంగి), అల్లు వెంకట ప్రశాంతి(అనకాపల్లి, పిట్టు గొల్లపల్లి), కీర్తి హరినాథ్‌బాబు(కాకినాడ, గోకివాడ), పులపర్తి సూర్యనారాయణ(పశ్చిమ గోదావరి, కోమటితిప్ప), పాలడుగు జయనాగలక్ష్మి(గుంటూరు, సంగం జాగర్లమూడి), దాసరి శిల్పా సౌందర్య(ప్రకాశం, ఏడుగుండ్లపాడు), కె.రాజశేఖర్(చిత్తూరు, కొత్తపల్లి), చదువుల సుజాతమ్మ(కర్నూలు, పాలకొలను), కొంక సీతారాములు(అనంతపురం, వ్యాసపురం).

డ్రోన్ నుంచి క్షిపణి ప్రయోగం

(మొదటి పేజీ తరువాయి)

రీసెర్చ్ సెంటర్ ఇమారత్, డిఫెన్స్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరి, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ ల్యాబొరేటరితో పాటు ఇతర నగరాల్లోని టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ ల్యాబొరేటరీలు, హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ ల్యాబొరేటరి, ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. బెంగళూరులోని అంకుర సంస్థ న్యూస్పేస్ రీసెర్చ్ టెక్నాలజీ దేశీయంగా అభివృద్ధి చేసిన డ్రోన్(యూఏవీ) నుంచి క్షిపణిని ప్రయోగించారు. ప్రయోగం విజయవంతం కావడంపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి ఆయుధాల అవసరం ఉందని డీఆర్‌డీవో ఛైర్మన్ సమీర్ వి కామత్ అన్నారు.

రాష్ట్ర పర్యాటకానికి 'మాస్టర్ కార్డ్'



రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ఆమ్రపాలితో మాస్టర్ కార్డు ప్రతినిధులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న స్టార్ హోటళ్లు, నిర్మాణంలో ఉన్నవి, కొత్త వాటి ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం తదితర విషయాలను ఎండీ వివరించారు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రిసార్ట్‌లు, హోటళ్లు, సందర్శనీయ ప్రాంతాల గురించి తెలిపారు. వీటిపట్ల మాస్టర్ కార్డ్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. ఖాతాదారులను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేస్తామని వారు వివరించారు. సీఎం చంద్రబాబు గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా మాస్టర్ కార్డ్ ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలోనూ కార్యకలాపాల నిర్వహణపై దృష్టి పెట్టాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు గత నెల 27న మాస్టర్ కార్డ్ సంస్థ డైరెక్టర్ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఇప్పుడు ఆ సంస్థ ప్రతినిధులను రాష్ట్రానికి పంపారని రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు.

ఆ తప్పు నాదే.. పార్టీది కాదు..

- ఓబీసీల ప్రయోజనాల్ని రక్షించలేకపోయా
- కులగణనను ఇంతకు ముందే నిర్వహించాల్సింది
- భాగీదారీ న్యాయ సమ్మేళనంలో రాహుల్ గాంధీ వ్యాఖ్య

దిల్లీ: తన రాజకీయ జీవితంలో జరిగిన తప్పిదాన్ని సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తున్నానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెల్లడించారు. దేశంలో కులగణనను ఇదివరకే నిర్వహించాల్సిందని, ఆ పొరపాటు తనదేనని, కాంగ్రెస్‌పార్టీది కాదని పేర్కొన్నారు. ఓబీసీల ప్రయోజనాలను పరిరక్షించలేకపోయాననీ తెలిపారు. దిల్లీలోని తాల్కతోరా స్టేడియంలో నిర్వహించిన భాగీదారీ న్యాయ సమ్మేళనంలో ప్రసంగిస్తూ రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన 'రాజకీయ భూకంపం' వంటిదని, దాని ప్రకంపనలు దేశమంతటా ప్రభావం చూపుతాయని అభిప్రాయపడ్డారు.

'2004 నుంచి రాజకీయాల్లో ఉన్నాను. ఈ రెండు దశాబ్దాల కాలం వెనుదిరిగి చూసుకుంటే.. ఓబీసీల ప్రయోజనాలను కాపాడటం కోసం నేను చేయగలిగినంత చేయలేకపోయానని అనిపిస్తోంది. ఆ పొరపాటును ఇప్పుడు సరిదిద్దుకోవాలని అనుకుంటున్నా. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలం. అందుకోసం చరిత్ర తెలుసుకోవాలి. దేశంలో దళితుల చరిత్రను అంబేడ్కర్ అర్థం చేసుకున్నారు. ఓబీసీల చరిత్ర ఎక్కడుంది. భాజపా, ఆరెస్సెస్ ఉద్దేశపూర్వకంగా ఆ చరిత్రను చెరిపేశాయి' అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. ప్రధాని మోదీ సామర్థ్యాల గురించి మీడియానే గోరింతలను కొండంతగా ప్రచారం చేస్తోందని, ఆయన అంత గొప్పవారేమీ కాదంటూ విమర్శలు గుప్పించారు.



దిల్లీలో శుక్రవారం నిర్వహించిన 'భాగిదారీ న్యాయ సమ్మేళన్'లో రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య, భూపేశ్ భఘేల్, అశోక్ గహ్లోత్ తదితర నేతల సంఘీభావం

> దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళల హక్కుల పరిరక్షణలో నాకు మంచి మార్కులే వచ్చాయి. భూసేకరణ చట్టం, ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత చట్టం వంటి అంశాల్లో సక్రమంగానే వ్యవహరించాను. ఓబీసీల ప్రయోజనాల పరిరక్షణలోనే తప్పు జరిగింది. దానిని ఇప్పుడు సరిచేసుకుంటా.
>
> \- రాహుల్ గాంధీ

మోదీ తన సామాజిక వర్గాన్ని ఓబీసీలో చేర్చారు: ఖర్గే

ప్రధాని మోదీ వాస్తవానికి ఉన్నత సామాజిక వర్గానికి చెందిన వారని, ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దానిని ఓబీసీ జాబితాలో చేర్చారని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అప్పటి నుంచే వ్యూహాత్మకంగా తాను ఓబీసీనని ఆయన చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రతి విషయంలోనూ మోదీ అసత్యాలే చెబుతారంటూ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళల కోసం మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రాహుల్ గాంధీ ఒత్తిడితోనే దేశంలో కులగణనకు మోదీ ఆదేశించారని తెలిపారు. ఆరెస్సెస్ సూచించినట్లుగా 75 ఏళ్ల వయసు వచ్చాక మోదీ పదవీ విరమణ చేస్తారా అని ఖర్గే ప్రశ్నించారు. దేశంలోని బడుగు, బలహీన వర్గాలన్నీ ఏకం కావాలని ఖర్గే పిలుపునిచ్చారు. సైద్ధాంతిక, మానసిక, ఆర్థిక బలంతోనే ముందడుగు వేయగలమని స్పష్టంచేశారు.

భాగీదారీ న్యాయ సమ్మేళనంలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను భాజపా ఖండించింది. విభజిత, అమర్యాదకరమైన రాజకీయాలకు రాహుల్ గాంధీ పాల్పడుతున్నారని భాజపా ఐటీ విభాగాధినేత అమిత్ మాలవ్యా విమర్శించారు.

బిహార్ ఓటరు జాబితా సవరణపై విపక్ష ఎంపీల నిరసన ఉద్ధృతం

బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తును వ్యతిరేకిస్తున్న విపక్ష ఇండియా కూటమి ఎంపీలు తమ నిరసనను శుక్రవారం మరింత ఉద్ధృతం చేశారు. దిల్లీలోని పార్లమెంటు ప్రాంగణం వద్ద ధర్నాతో పాటు నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీనిలో భాగంగా ఎస్ఐఆర్ అని రాసిన పోస్టర్లను చింపి చెత్తబుట్టలో వేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ, డీఎంకే, ఎస్పీ, టీఎంసీ, జేఎంఎం, ఆర్జేడీ, వామపక్ష నేతలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించండి అంటూ నినాదాలు చేశారు.

ఆత్మహత్యలు ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించడం తమ పరిధిలోకి రాదంటూ ఏపీ హైకోర్టు గతేడాది ఫిబ్రవరి 14న ఇచ్చిన తీర్పును కొట్టేసింది. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

ఇవీ మార్గదర్శకాలు

1. అన్ని విద్యాసంస్థలూ ఏకరూప మానసిక వైద్య విధానాన్ని అనుసరించాలి. ఉమ్మీద్ ముసాయిదా మార్గదర్శకాలు, మనోదర్పణ్ కార్యక్రమం, జాతీయ ఆత్మహత్యల నివారణ వ్యూహం నుంచి సూచనలు తీసుకొని విద్యార్థుల మానసిక ఆరోగ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలి.
2. 100 మంది, అంతకుమించి విద్యార్థులున్న అన్ని విద్యాసంస్థలూ కనీసం ఒక క్వాలిఫైడ్ కౌన్సెలర్, సైకాలజిస్ట్, సామాజిక కార్యకర్తను నియమించుకొని విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడాలి. తక్కువ మంది విద్యార్థులున్న సంస్థలు బయట ఉన్న మానసిక ఆరోగ్య నిపుణులతో పిల్లలకు కౌన్సెలింగ్ ఇప్పించాలి.
3. పిల్లలు పరీక్షల ఒత్తిడికి లోనవకుండా చూడటానికి మానసిక కౌన్సెలర్‌కు బాధ్యతలు అప్పగించాలి.
4. అన్ని విద్యాసంస్థలూ, ముఖ్యంగా కోచింగ్ సెంటర్లు విద్యార్థులను ప్రతిభ ఆధారంగా బ్యాచ్‌ల వారీగా విభజించడం, అందరి ముందు కించపరచడం, వారి సామర్థ్యంతో సంబంధం లేకుండా చదువులో లక్ష్యాలు విధించడం లాంటివి సాధ్యమైనంత వరకూ మానుకోవాలి.
5. మానసిక ఆరోగ్య సేవలు, స్థానిక ఆసుపత్రులు, ఆత్మహత్యల నిరోధ హెల్ప్‌లైన్ నంబర్లను హాస్టళ్లు, తరగతి గదులు, కామన్ ఏరియాల్లో ప్రదర్శించాలి.
6. అన్ని విద్యాసంస్థల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి ఏడాదికి కనీసం రెండుసార్లు మానసిక ప్రథమ చికిత్స (సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్), హెచ్చరిక సంకేతాల గుర్తింపు, స్వీయహాని సమయంలో స్పందించడంపై శిక్షణ ఇప్పించాలి.
7. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడినవారు, దివ్యాంగులు, అనాథలు, ఆత్మన్యూనతతో ఉన్నవారు ఇలా అన్ని వర్గాల పిల్లలను కలుపుకొనిపోయేలా విద్యాసంస్థలు తమ సిబ్బందికి శిక్షణ ఇప్పించాలి.
8. ర్యాగింగ్, లైంగిక దాడులు, వేధింపులపై వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించి, బాధితులకు అండగా నిలబడేందుకు అన్ని విద్యాసంస్థలూ పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడితే యాజమాన్యానిదే బాధ్యతని స్పష్టం చేయాలి.
9. విద్యార్థులపై అవాంఛనీయ ఒత్తిడి తేకుండా తల్లిదండ్రులు, సంరక్షకులను అప్రమత్తం చేసే కార్యక్రమాలను విద్యాసంస్థలు నిర్వహించాలి.
10. ఎంతమంది విద్యార్థులకు మానసిక వైద్యసేవలందించారో ఒక రహస్య నివేదిక రూపొందించి.. కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖలు, యూజీసీ, ఏఐసీటీఈ, సీబీఎస్ఈ బోర్డులకు అందించాలి.
11. విద్యాసంస్థలు క్రీడలు, కళలు, వ్యక్తిత్వవికాస కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి.
12. విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు కెరీర్ కౌన్సెలింగ్ ఇవ్వాలి. పిల్లలకు నచ్చిన కెరీర్‌ను ఎంచుకొనేందుకు మద్దతివ్వాలి.
13. గురుకుల విద్యాసంస్థలు, హాస్టల్ యజమానులు, వార్డెన్లు, కేర్‌టేకర్లు విద్యాప్రాంగణాలను వేధింపులు, దాడులు, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దాలి.
14. అన్ని గురుకుల విద్యాలయాలు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడానికి వీల్లేని విధంగా సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. క్షణికావేశంలో స్వీయహాని తలపెట్టుకోకుండా చూసేందుకు భవనాల పైకప్పులు, బాల్కనీల్లోకి వెళ్లకుండా నిరోధించాలి.
15. జైపుర్, కోటా, సికర్, చెన్నై, హైదరాబాద్, దిల్లీ, ముంబయి నగరాలతోపాటు పోటీపరీక్షలకు సమాయత్తం కావడానికి విద్యార్థులు పెద్దఎత్తున తరలివెళ్లే ప్రాంతాల్లో వారి ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. అలాంటిచోట్ల ప్రత్యేక దృష్టి సారించాలి.

ఇదీ నేపథ్యం

నీట్ శిక్షణ కోసం పశ్చిమబెంగాల్ నుంచి వచ్చి విశాఖపట్నంలో హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థిని 2023 జులై 14న రాత్రి 3వ అంతస్తు నుంచి పడిపోయి తీవ్ర గాయాలపాలైంది. వెంటనే ఆమెను సమీపంలోని ఆసుపత్రికి, అక్కడి నుంచి మరో కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. దీనిపై విశాఖపట్నం 4వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యార్థిని తండ్రి విజ్ఞప్తి మేరకు.. ఆ హాస్టల్, ఆసుపత్రుల నుంచి సీసీ టీవీ ఫుటేజ్, ఇతర సాక్ష్యాధారాలను సేకరించాలని హైకోర్టు ఆదేశించింది. అయితే అంతకు ముందే మృతురాలి తండ్రి కోల్‌కతాలోని నేతాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కోచింగ్ ఇన్‌స్టిట్యూట్, హాస్టల్, ఆసుపత్రులపైన కేసు పెట్టారు. విశాఖపట్నంలో నమోదయిన కేసులో పోలీసులు దర్యాప్తు చేపట్టి, నలుగురిని నిందితులుగా గుర్తించారు. ఫోరెన్సిక్ నమూనాల విశ్లేషణలో అధికారులు విఫలమయ్యారని, అనుమానాస్పద మృతిని ఆత్మహత్యగా ప్రకటించడం చట్టవిరుద్ధమంటూ విద్యార్థిని తండ్రి 2023 సెప్టెంబర్ 25న ఏపీ హైకోర్టులో రిట్ వేశారు. కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు. విచారించిన హైకోర్టు మృతురాలి ఫోరెన్సిక్ నమూనాలను దిల్లీలోని ఎయిమ్స్‌కు పంపి, మరణానికి కారణాలను నిర్ధారించాలని ఆదేశించింది. అయితే ఈ మరణంపై ఏపీ, పశ్చిమబెంగాల్‌లలో వేర్వేరుగా ఎఫ్ఐఆర్‌లు నమోదయిన నేపథ్యంలో ఈ కేసును సీబీఐ విచారణకు ఆదేశించడం తమ పరిధిలోకి రాదంటూ విచారణ ముగించింది. మృతురాలి తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. 'విద్యార్థిని అసహజ మరణంపై దర్యాప్తును వెంటనే సీబీఐకి అప్పగించాలి. సీబీఐ డైరెక్టర్ దీనిపై వెంటనే కేసు నమోదు చేసి, ఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలి' అని ఆదేశించింది.

రాష్ట్రానికి అప్పు పుట్టకుండా కుట్రలు

- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల మండిపాటు

మార్టూరు, పర్చూరు, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన ఘనత నాటి సీఎం జగన్‌కే దక్కుతుందని, వైకాపా ఐదేళ్ల పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆరోపించారు. నవ్యాంధ్రను గాడిలో పెట్టేందుకు చంద్రబాబు దృష్టి సారిస్తే ఓర్వలేని వైకాపా మూకలు రాష్ట్రానికి అప్పు ఇవ్వవద్దంటూ బ్యాంకర్లకు 200 ఈ మెయిల్స్ పెట్టించారని, బుద్ధిజ్ఞానం ఉన్న వాళ్లు ఎవరూ ఇలా వ్యవహరించరని మండిపడ్డారు. ఈ మెయిల్స్ పెట్టినవారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. బాపట్ల జిల్లా పర్చూరులో శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి పయ్యావుల మాట్లాడారు. జగన్ చేసిన నిర్వాకంతో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పింఛన్లు, తల్లికి వందనం వంటి పథకాల అమలుకు నిధులు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం శ్రమించాల్సి వస్తోందన్నారు. నాసిరకం మద్యం అమ్మి రూ.3,500 కోట్ల ప్రజాధనాన్ని జగన్ దోచుకున్నారని వెల్లడించారు. రూ.80 పలికే మద్యాన్ని రూ.180 విక్రయించారని దుయ్యబట్టారు. వైకాపా పాలనతో ఈ దుస్థితి నెలకొందన్నారు. ప్రజల కోసం బాబు నేతృత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కూలీలుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

మిథున్‌రెడ్డికి వసతులపై విచారణ 29కి వాయిదా

ఈనాడు, అమరావతి: వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి అనుమతించిన వసతులపై రాజమహేంద్రవరం జైలు అధికారి దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. జైలులో సహాయకుడి ఏర్పాటు, ఇంటి భోజనాన్ని అనుమతించడం, ఆరు ములాఖత్‌లు జైలు నిబంధనల ప్రకారం కుదరదని జైలు అధికారులు పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై అభ్యంతరాలుంటే చెప్పాలని మిథున్‌రెడ్డి తరఫు న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.



అతిథుల నుంచి పురస్కారం అందుకుంటున్న ముళ్లపూడి నరేంద్రనాథ్

ముళ్లపూడి నరేంద్రనాథ్‌కు శతాబ్ద కాల గౌరవ పురస్కారం

తణుకు, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్‌కు శతాబ్ద కాల గౌరవ పురస్కారం వచ్చినట్లు ఆ సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. దిల్లీలోని భారత్ మండపంలో గురువారం నిర్వహించిన 83వ షుగర్ టెక్నాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెంటినియల్ వార్షిక కన్వెన్షన్, అంతర్జాతీయ షుగర్ ఎక్స్‌పో-2025లో ఈ పురస్కారం అందుకున్నారు. భారతీయ చక్కెర, అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి ఆయన చేసిన కృషికి ఫలితంగా ఈ గుర్తింపు లభించింది.

ఈనాడు

నష్టాల సాగులో కష్టాల బతుకులు

సగటు భారతీయ రైతు జీవితం 'ఆదాయం ఒకటి, వ్యయం రెండు' అన్న చందంగా ఎప్పుడో తయారైంది. వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్(సీఏసీపీ) నివేదికల ఆధారంగా జరిగిన ఒక అధ్యయనం అదే విషయాన్ని మరోసారి తేటతెల్లం చేసింది. 2013-24 మధ్య దేశీయంగా పది ప్రధాన పంటల్లో మొక్కజొన్న, వేరుశెనగ, ఆవాలు మినహా మిగిలిన వేటిలోనూ ద్రవ్యోల్బణానికి తగినట్లు రైతుల ఆదాయాలు పెరగలేదని పరిశోధకులు నిగ్గుతేల్చారు. ఉదాహరణకు దశాబ్ద కాలంలో వరి సాగుదారుల రాబడి 54శాతం వృద్ధి చెందినా; గ్రామీణ ప్రాంతాల్లో నిత్యావసరాల ఖర్చులు 65శాతం మేర అధికమయ్యాయని అధ్యయనవేత్తలు గుర్తించారు. నష్టాల సేద్యంలో సామాన్య రైతుకు చివరికి మిగులుతున్నదేమీ లేదని ఈ లెక్కలే వెల్లడిస్తున్నాయి. నాబార్డ్ సర్వే ప్రకారం, 2016-17లో గ్రామీణ వ్యవసాయ కుటుంబాల సగటు నెలవారీ ఆదాయం రూ.8,931 మాత్రమే. 2021-22 నాటికి అది రూ.13,661కి పెరిగింది. అందులోనూ సాగు ద్వారా సమకూరుతున్నది సుమారు నాలుగున్నర వేల రూపాయలే. కుటుంబాల పోషణ, పిల్లల చదువులకు అదెలా సరిపోతుంది? ఈ దుర్భర పరిస్థితుల కారణంగానే కాడి పట్టడానికి నవతరం అంతగా ముందుకు రావట్లేదు. ఇలాగైతే రాబోయే రోజుల్లో దేశానికి తిండిపెట్టేదెవరు?

ఏరువాక సాగింది మొదలు రైతులకు అడుగడుగునా గండాలే ఎదురవుతున్నాయి. చచ్చుపుచ్చు విత్తనాలు, చీడపీడలు, ప్రకృతి విపత్తులు పెట్టుబడి వ్యయాలను గంగపాల్జేస్తున్నాయి. అంతా అనుకూలించి సమృద్ధిగా దిగుబడులు వచ్చినప్పుడు ధరలు పాతాళానికి జారిపోతున్నాయి. పంటసాయాలు అరకొరగా ఉన్నప్పుడేమో దళారులూ వ్యాపారులే లాభాలు దండుకుంటున్నారు. ఇలాంటి దుస్థితిలో రేయింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకుంటున్న రైతన్నలకు అంతిమంగా అప్పులే మిగులుతున్నాయి. ఎన్ఎస్ఎస్ఓ లోగడ నివేదికల ప్రకారం- దేశవ్యాప్తంగా యాభైశాతం రైతుల నెత్తిన సగటున రూ.74 వేల రుణభారముంది. ఏపీలో అంతకంటే చాలా ఎక్కువగా 93శాతం రైతు కుటుంబాలు సగటున రూ.2.45 లక్షల మేర రుణగ్రస్తమయ్యాయి. తెలంగాణలో దాదాపు 92శాతం సాగుదారులు రూ.1.52 లక్షల వంతున అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఆరుగాలం శ్రమిస్తున్నా ఆదాయాలు పెరగక, అప్పులు తీర్చే దారిలేక ఎంతోమంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గడచిన పదేళ్లలో ఇండియా సాగురంగంలో అలా లక్ష మందికి పైగా కడతేరిపోయారు. మహారాష్ట్రలో ఈ ఏడాది తొలి మూణ్నెల్లలోనే 767 మంది రైతులు బలవన్మరణాలకు ఒడిగట్టారు. ఈ గణాంకాలన్నీ సాగుదారుల బతుకుల్లో గూడుకట్టుకుపోతున్న దైన్యాన్ని కళ్లకు కడతాయి!

అన్నదాతల ముంగిళ్లలో వెలుగులు నింపడానికి ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తున్నామని ప్రభుత్వాలు సెలవిస్తుంటాయి. కానీ, ఆ పథకాలేవీ సాగుదారుల తలరాతలను మార్చడం లేదన్నది చేదునిజం. భూమి విలువ, కౌలు ధర సహా అన్ని రకాల వాస్తవిక వ్యయాలను లెక్కించి, దానికి అదనంగా 50శాతం కలిపి మద్దతు ధర ఇవ్వాలన్నది ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు. దాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు ఏటా అసంబద్ధ 'మద్దతు'ను ప్రకటిస్తూ అన్నదాతలకు అన్యాయం చేస్తున్నాయి. ఆ అరకొర విదిలింపులకూ చాలామంది నోచుకోలేకపోవడం మరో విషాదం! రైతన్నల కష్టానికి తగిన ప్రతిఫలాలు రావాలంటే- పంట ఉత్పత్తులకు శాస్త్రీయంగా విలువకట్టాలి. నిల్వ వసతులను పెంచి, మార్కెట్ మాయాజాలాన్ని అరికట్టి సాగుదారులను ఆదుకోవాలి. నేలల స్వభావాలకు అనుగుణమైన సమర్థ పంట ప్రణాళికలను రూపొందించి నిష్ఠగా అమలు చేయాలి!




ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన ఉత్పత్తులను తయారుచేసేవారు.. దాన్ని నూటికి నూరుశాతం వ్యాపారంలా చేయకూడదు. ప్రాణాలను నిలబెట్టే పని కాబట్టి దానికి మానవీయ కోణం కూడా ఉంది. మన వ్యాపారం ప్రజల ప్రాణాలతో వ్యవహారమని గుర్తుంచుకోవాలి. ఈ లోకాన్ని వదిలి వెళ్లేటప్పుడు 'ఆయన డబ్బు మనిషి కాదు' అనిపించుకుంటే అంతే చాలు.

– డాక్టర్ వై.కె.హమీద్, నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సిప్లా

విశాల దృక్పథం

వ్యక్తులు విభిన్న దృక్పథాలతో ఉంటారు. అందరి గురించి అన్ని విషయాలూ తెలుసుకోవాలనుకుంటారు. కానీ, అందరికోసం తాము ఏం చేయగలుగుతున్నామనేది మాత్రం ఆలోచించరు. అసలు తన దృక్పథమేంటో తనకు తెలిసిన వ్యక్తులెందరు ఉంటారు? 'నేను' ఎలా ఉంటే, 'అందరూ' అలాగే ఉన్నారనిపిస్తుంది. ఈ దృక్పథం వల్ల ప్రతి చిన్న సమస్య, ప్రతి చిన్న నిర్లక్ష్యం ఎంతో బాధిస్తుంది. 'నేను' అనే భావన మనిషిలో ఎంత బలంగా ఉంటే, బాధలు కూడా అంతే భరించలేనివిగా అనిపిస్తాయి.

తథాగతుడి దగ్గరికి ఒక వ్యక్తి వచ్చాడు. 'జీవితంలో బాధలు నన్ను హింసిస్తున్నాయి. తట్టుకోలేకపోతున్నాను. కోపం పనికి రాదని అనుకుంటాను. కానీ, ఆ సమయానికి హద్దులు లేని కోపం వచ్చేస్తుంది. పెద్ద విషయాలైతే ఫర్వాలేదు. చిన్న చిన్నవే చిరాకు పెడుతున్నాయి' అని తన వ్యథను ఆయన ముందు వినయంతో విన్నవించుకున్నాడు. చల్లని చిరునవ్వుతో, మృదువైన మాటలతో అతడికి సాంత్వన వచనాలు పలికి 'ఓ లోటాలో నీళ్లు తీసుకో.. చిటికెడు ఉప్పు కలుపు' అన్నాడు తథాగతుడు. ఆ వ్యక్తి అలానే చేశాడు. 'తాగు' అన్నాడు బుద్ధుడు. ఆ వ్యక్తి బుద్ధిగా తాగాడు. 'ఎలా ఉన్నాయి' ప్రశ్నించాడు గౌతముడు. అతడు వికారంగా ముఖం పెట్టి ఉప్పగా ఉన్నాయి, వాంతి వస్తోంది.. అన్నాడు. 'మరో గ్లాసులో మళ్లీ నీళ్లు తీసుకో. అందులో పంచదార కలుపు' అన్నాడు స్వామి. అతను అలాగే కలపగానే తాగమన్నాడు. ఆ తరవాత ఎలా ఉన్నాయని అడిగాడు బుద్ధుడు. 'తీయగా ఉన్నాయి' అని నవ్వు ముఖంతో చెప్పాడతడు. తథాగతుడు తనదైన శైలిలో నవ్వుతూ 'జీవితంలో బాధలు కూడా అంతే. నువ్వు వాటిని ఉప్పగా స్వీకరిస్తావో.. తీపిగా స్వీకరిస్తావో.. దాన్ని బట్టే అవి నీ మీద ప్రభావం చూపుతాయి' అని బోధించాడు.



అంతర్యామి

అవడానికి ఇది జెన్ కథే అయినా, అందరికీ వర్తిస్తుంది. 'కష్టాలన్నీ నాకేనా.. దేవుడికి నేనే దొరికానా' అని ఏదో ఒక సందర్భంలో అనుకోని మనిషి ఉండడు. కానీ భగవంతుడు దయామయుడు. మనిషిని మనిషిలానే తల్లిగర్భంలో ప్రవేశ పెట్టాడు. కానీ అతను భూమ్మీద పడిన నాటి నుంచి 'నేను' అనే కలవరిస్తూ, ఆలోచిస్తూ 'నాకేనా సమస్యలు.. నాకేనా బాధలు' అనుకుంటూ ఉంటాడు. కానీ, ఒక్కసారి చుట్టూ ఉన్న సమాజంలోకి వెళ్లి జనాన్ని తరచిచూడాలి. జీవితమన్నాక తప్పని బాధలను ధైర్యంగా ఎదుర్కొంటూనే, నలుగురితో కలిసి నడుస్తూ, అందులోనే ఆనందాన్ని వెతుక్కుంటున్న వారెందరో కనిపిస్తారు. ప్రేమ, శ్రద్ధ, విశ్వాసం, కరుణ, మైత్రి ఇవన్నీ పరస్పర పోషకాలు. వాటిని హృదయ పూర్వకంగా ఎదుటి వారికి ఇవ్వగలిగితే తిరిగి తాను పొందవచ్చునని గ్రహించాలి. ఆ గ్రహింపు మనిషికి మాత్రమే భగవంతుడిచ్చిన వరం.

– భమిడిపాటి గౌరీశంకర్

తలుపులు మూసేస్తే... అమెరికాకే నష్టం!

అమెరికా ఒక కథా పుస్తకమైతే, దాని రచయితలు ఇమిగ్రెంట్లుగా పిలిచే వలసదారులే! అమెరికాలోని ఫార్చ్యూన్-500 కంపెనీల్లో దాదాపు 45శాతం ఇమిగ్రెంట్లు, వాళ్ల సంతానం ద్వారా ఏర్పాటైనవే. వలసదారులు అమెరికన్లకన్నా అధికంగా వ్యాపారాలు చేసి విజయవంతమయ్యారు. ఉద్యోగాలను, సంపదను సృష్టిస్తున్నారు. సామాజికాభివృద్ధికి తోడ్పడుతున్నారు. అపార సేవలు అందిస్తున్న వలసదారులకు అమెరికా ఎంతో రుణపడింది. అయినా, ప్రస్తుత ప్రభుత్వం వారిపైనే యుద్ధం చేస్తోంది. అది దేశ భవిత, శ్రేయస్సుపై యుద్ధం చేస్తున్నట్లే!

అమెరికా ప్రస్తుత పరిపాలన యంత్రాంగం అక్రమ వలసలను అరికట్టాలనే నెపంతో, చట్టబద్ధమైన మార్గాలకు పద్ధతి ప్రకారం అడ్డంకులు నిర్మించింది. ఇది కేవలం సరిహద్దు భద్రతకు సంబంధించింది మాత్రమే కాదు. ఈ కుతంత్రం విశ్వవిద్యాలయాల ప్రాంగణాల వరకూ విస్తరించింది. ఇది రెండంచుల యుద్ధం. ఒకవైపు ట్రంప్ యంత్రాంగం వీసాలను ఒక ఆయుధంగా మార్చింది. భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు కాబోయే విద్యార్థులు అమెరికాకు ఎంతో అవసరం. వాళ్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఉద్దేశపూర్వకంగానో అమాయకత్వంతోనో చేసిన ప్రతి చిన్న అసమ్మతి వ్యాఖ్య మీదా అనవసరమైన, దురుద్దేశపూర్వక తనిఖీలను ఎదుర్కొంటున్నారు.




ప్రతిష్ఠకు తూట్లు

వేల సంఖ్యలో వీసాలను ఆకస్మికంగా రద్దు చేయడం, కొత్త విద్యార్థి వీసాల ప్రాసెసింగ్‌ను నిలిపి వేయడం వంటివి ఈ ప్రభుత్వం అనాలోచితంగా, అర్ధంతరంగా తీసుకున్న అనాగరిక నిర్ణయాలు. వాటివల్ల ముఖ్యమైన దేశాల నుంచి విద్యార్థుల దరఖాస్తుల్లో భారీ క్షీణత కనిపిస్తోంది. 2025 మార్చితో ముగిసిన ఆరు నెలల కాలానికి, ఎఫ్-1 విద్యార్థి వీసాలు 15శాతం తగ్గాయి. వచ్చే విద్యా సంవత్సరానికి పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చు. 80శాతానికి పైగా విదేశీ విద్యార్థుల రాక తగ్గినా ఆశ్చర్యం లేదు. మరోవైపు, ట్రంప్ యంత్రాంగం ఉన్నత విద్యపై సైద్ధాంతిక దాడిని ప్రారంభించింది. యూదు వ్యతిరేకత తదితర అంశాలపై హార్వర్డ్ నుంచి యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా వరకు పరిశోధన నిధులు రద్దు చేయడం, నిలిపేస్తామని బెదిరించడం, దర్యాప్తులు నిర్వహించడం నిత్యకృత్యంగా మారింది. డైవర్సిటీ, ఈక్విటీ అండ్ ఇంక్లూజన్(డీఈఐ) కార్యక్రమాలను లక్ష్యంగా చేసుకుంటోంది. యూనివర్సిటీలు శ్వేత జాతీయులపై వివక్ష చూపుతున్నాయని ఆరోపిస్తోంది. దీనిపై హార్వర్డ్ వంటి దిగ్గజ విశ్వవిద్యాలయాలు పోరాడగలవు, కానీ చాలా యూనివర్సిటీలు ఫెడరల్ ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలబడలేవు. విద్యా స్వేచ్ఛను అణచివేయడమే ట్రంప్ యంత్రాంగం కోరుకుంటున్న అంతిమ విజయం. అయితే, ఈ విషయంలో ఇతర దేశాలకన్నా, అన్ని విధాలుగా అమెరికాయే నష్టపోతోందన్న సంగతిని గుర్తించాలి.

అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాకు విలువైన ఆస్తులే తప్ప, భారం కాదు. 2023-24 విద్యా సంవత్సరంలో అంతర్జాతీయ విద్యార్థులు ట్యూషన్ ఫీజు వంటివాటి ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థకు సుమారు 43.8 బిలియన్ డాలర్లు అందించారు. ప్రతి ముగ్గురు అంతర్జాతీయ విద్యార్థులకు ఒక ఉద్యోగ కల్పన జరుగుతోంది. అమెరికాకు భారీ వాణిజ్య మిగులు ఉన్న అతి కొద్ది రంగాల్లో ఉన్నత విద్య ఒకటి. సరకుల వాణిజ్యంలో అమెరికా ఎదుర్కొంటున్న భారీ లోటును పూడ్చేందుకు ఇది చాలా కీలకం. యూనివర్సిటీలపై దాడి చేయడం, విదేశీ విద్యార్థులను నిరుత్సాహ పరచడం వల్ల అమెరికా విద్యారంగం ప్రతిష్ఠ దెబ్బతింటుంది. శక్తిమంతమైన ఆర్థిక యంత్రాంగాన్ని చేతులారా నాశనం చేసుకున్నట్లవుతుంది. అంత తేలికగా లెక్కించలేని నష్టం మరొకటుంది. అదింకా పెద్దది. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, ఎలాన్ మస్క్ ఆధునిక పారిశ్రామిక దిగ్గజాలు. ట్రిలియన్ డాలర్ల విలువైన సంపద సృష్టితో ప్రపంచాన్ని మార్చిన వారు. వీళ్లు ముగ్గురూ మొదట అమెరికాకు విద్యార్థి వీసాలపైనే వచ్చారు. వెంచర్ క్యాపిటల్ మద్దతు కలిగిన వలస పారిశ్రామికవేత్తల్లో 75శాతం అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించారన్న సంగతి తెలిసిందే. ప్రతిభావంతులు ఇక్కడ పుట్టకున్నా, ప్రపంచ ప్రతిభకు అమెరికా పుట్టినిల్లు. అగ్రరాజ్యం ప్రగతికి సోపానం. విద్యుత్తు, రేడియో, టీవీ, కారు, విమానం, ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్, ఆఖరికి అణ్వాయుధం కూడా ఇక్కడే పుట్టి, పురోగతి సాధించి, ప్రపంచ దేశాల్లోకి అడుగుపెట్టాయి. వీటన్నింటి వెనక చాలామంది ఇమిగ్రెంట్ల మేధోశ్రమ ఉంది. ప్రస్తుత వలసదారుల ప్రతికూల వాతావరణానికి భయపడి, ఎంతమంది భవిష్యత్ మస్క్‌లు పిచాయ్‌లు తమ ప్రతిభను వేరే దేశాలకు తీసుకువెళ్లాలని నిర్ణయించుకుంటున్నారో! ఇది ఇప్పుడు అమెరికా వేసుకోవాల్సిన ప్రశ్న.

శాశ్వత ప్రభావం

నేను ఇండియాలో పుట్టి, పెరిగాను. చదువుకున్నాను. 1989లో ఎఫ్-1 వీసాపై అమెరికాకు వచ్చాను. మద్రాస్‌లోని అమెరికన్ కాన్సులేట్‌లో నా వీసా ఇంటర్వ్యూ చాలా క్లుప్తంగా, గౌరవప్రదంగా జరిగింది. ఆనాడు నన్ను స్వాగతించిన అమెరికా ఆత్మవిశ్వాసంతో, నిష్కపటంగా ఉంది. నేను రెండు గొప్ప సంస్కృతుల నుంచి ఉత్తమ పద్ధతులను స్వీకరించి, అగ్రరాజ్యంలో జీవితాన్ని నిర్మించుకున్నాను. కానీ, ఇప్పటి పరిస్థితుల్లో నేను అమెరికా రావాలన్న నిర్ణయం తీసుకుంటానా? నా వ్యక్తిగత అభిప్రాయాలను పరిశీలించే ప్రభుత్వాన్ని, నా విశ్వవిద్యాలయాన్ని ఒక సైద్ధాంతిక శత్రువుగా చూసే ప్రభుత్వాన్ని, ఆశావహులైన విద్యార్థులను, భుక్తి కోసం వలస వస్తున్న కష్టజీవులను స్వాగతించడానికి బదులు అనుమానంతో చూసే ప్రభుత్వాన్ని ఎదుర్కొంటూ... ఇప్పుడు కూడా అదే నిర్ణయం తీసుకుంటానా అని ప్రశ్నించుకున్నాను. నిజాయతీగా చెప్పాలంటే, తీసుకోను! ఎందుకంటే, రాజకీయ వాతావరణం మారింది. అమెరికా పౌరులైనా కాకున్నా విమర్శించడం ప్రతి ఒక్కరి హక్కు. ఆ హక్కును వినియోగించుకుని కాలేజీ దినపత్రికకు వ్యాసం రాసిందని ఒక పీహెచ్‌డీ విద్యార్థిని జైల్లో పెట్టింది ప్రభుత్వం. ప్రజలు భావప్రకటనా స్వేచ్ఛను, వాక్‌స్వాతంత్ర్యాన్ని కోల్పోతే అమెరికాకూ ఉత్తర కొరియాకూ తేడాలేదు. తిరస్కరణకు గురైన ప్రతి విద్యార్థి వీసాతో; కెనడా, యూకే, ఆస్ట్రేలియాల్లో చదువుకోవాలని నిర్ణయించుకున్న ప్రతి ప్రతిభావంతుడితో అమెరికాకే శాశ్వత నష్టం. ఇటువంటి చర్యలతో అమెరికా తన సొంత భవితకు తలుపులు మూసేస్తోంది.



ప్రొఫెసర్ వి.మోహన మురళీధర్
జార్జ్ మేసన్ యూనివర్సిటీ,
వర్జీనియా, అమెరికా



బందీలం కావద్దు!

'మనసా తుళ్లిపడకే... అతిగా ఆశ పడకే' అన్నారో సినిమా కవి. నిజంగానే మనిషి మనసుకు ఆశకన్నా అత్యాశ ఎక్కువ. క్షణం కుదురుగా ఉండదు. రకరకాల ఆలోచనలు చేస్తూ ఉంటుంది. ఒక చిన్న సానుకూలాంశం కనపడగానే ఊహల్లో మేడలు కట్టేస్తుంది. పరిస్థితి కాస్త అటూ ఇటూ అయిందంటే అమాంతం అధఃపాతాళంలోకి తొక్కేస్తుంది.


మనసు కోతిలాంటిదని ఊరికే అనలేదు. అది ఎప్పుడెలా ప్రవర్తిస్తుందో ఎవరికీ తెలియదు. ఎంతో కాలంగా ఇష్టపడుతున్న మనిషికి ఎలాగైనా మనసులోని మాట చెప్పేయాలని నిర్ణయించుకునేలా ప్రోత్సహిస్తుంది కాసేపు. తీరా అక్కడికి వెళ్లేసరికి 'నీ వల్ల కాదులే?' అని వెనక్కి లాగేసేదీ అదే. నవ్విస్తుంది, కవ్విస్తుంది, ఏడిపిస్తుంది. ఎప్పుడూ ఏ విషయంలోనూ స్థిరంగా ఉండదు, మనల్ని ఉండనివ్వదు. మన భావోద్వేగాలన్నీ మనసు తాలూకు చేష్టలే. 'మనుషులు ఎప్పుడూ అయితే గతం గురించి, లేకపోతే భవిష్యత్తు గురించి ఆలోచిస్తుంటారు. వర్తమానం గురించి అసలు పట్టించుకోరు' అంటాడు డేల్ కార్నెగి. నిజమేగా మరి... ఈ కోర్సులో చేరకుండా ఉండాల్సింది, కాస్త కష్టమైనా ఆ ఉద్యోగం కోసం ప్రయత్నించి ఉండాల్సింది, ఫలానా సంబంధం చేసుకోవాల్సింది... చేతులు కాలాక ఇలా ఆలోచనల్లో ఆకులు పట్టుకుంటూ ఉంటారు చాలామంది. ఇక కలల రాణులూ రాకుమారుల సంగతి చెప్పనే అక్కర్లేదు. వీళ్లెప్పుడూ రేపటి రోజున కట్టే కోటల గురించి మాటలు చెబుతారు తప్ప ఇవాళ చేస్తున్న పనిలో మాత్రం మనసు పెట్టరు.

సగటున రోజుకు ఏడు వేల నుంచి డెబ్భైవేల ఆలోచనలు చేయగల సత్తా ఉందట మనిషి మనసుకు. అందుకేనేమో సృష్టిలో అన్నిటికన్నా వేగవంతమైంది మనసేనన్నారు యక్షప్రశ్నల్లో. జీవితం అన్నాక మంచీచెడూ, కష్టం సుఖం, ఆనందం విచారం... అన్నీ ఉంటాయి కాబట్టి వచ్చే ఆ వేలాది ఆలోచనల్లో సానుకూలమైనవీ ఉంటాయి, వ్యతిరేకమైనవీ ఉంటాయి. కూరగాయల్లో చచ్చుపుచ్చులన్నీ ఏరి అవతలపడేసినట్లు పనికిరాని పిచ్చి ఆలోచనలను అవతలికి తరిమేయాలి. దేన్నయినా తట్టుకోవాల్సింది ఒకటే మనసు. దాన్ని చీటికీ మాటికీ చిన్నబుచ్చుకోనీయకుండా దృఢంగా ఉండేలా మలచుకోవాల్సింది మనమే. మనోనిబ్బరం ఉన్నవాళ్లు కొండలనైనా పిండి చేయగలరని గుర్తుంచుకోవాలి. ఓడిపోతే మరచిపోదు, గాయమైతే మాసిపోదు... అని పాడుకోడానికి బాగుంటుంది కానీ జాలిపడి దాన్ని అలాగే ఉండనిస్తే జీవితాన్ని నరకప్రాయం చేసి వదిలిపెడుతుంది. అందుకని మనసు గతి ఇంతేననుకోకుండా దాన్ని మన అదుపులో పెట్టే ప్రయత్నం బలంగా చేయాలి. చేస్తున్న పనిలో లగ్నం చేయాలి. నూటికి నూరుపాళ్లు మనసు పెట్టి వర్తమానానికి న్యాయం చేయగలిగితే- గతం మన జోలికి రాదు, భవిష్యత్తు భయపెట్టదు. కంటికి కనిపించని, చెవులకు వినిపించని మనసు చేసే గందరగోళానికి మనం బందీలం కాకూడదు!

– కె.పి.దాస్

సుపరిపాలనలో మనమెక్కడ?

మంచి ప్రభుత్వాలు ఉన్నచోట దేశాల అభివృద్ధి వేగవంతమవుతుంది. పాలనలో సమర్థత, పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి. అవినీతి తగ్గి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. ప్రజల్లో విశ్వాసం ఇనుమడిస్తుంది. మంచి పాలన సూచీలో 120 దేశాలకు గాను ఇండియాకు మొత్తంగా 71వ స్థానం దక్కింది. సింగపూర్, డెన్మార్క్, నార్వే, ఫిన్‌లాండ్, స్వీడన్‌లు తొలి అయిదు స్థానాల్లో నిలిచాయి. ఆర్థిక వనరులను బాధ్యతాయుతంగా, నైతికంగా నిర్వహించడంలో భారత్‌కు 84వ ర్యాంకు దక్కింది. ప్రజా జీవితాలు మెరుగయ్యేలా తోడ్పడటంలో 80వ ర్యాంకులో నిలిచింది. దృఢమైన చట్టాలూ విధానాలు, బలమైన వ్యవస్థల విషయంలో ఇండియాకు వరసగా 64, 61వ ర్యాంకులు లభించాయి. ఆ సూచీలో పలు ఆసియా దేశాల ర్యాంకులు...



చైనా	41		
మలేసియా	44		
ఇండోనేసియా	47		
వియత్నామ్	48		
థాయ్‌లాండ్	54		
ఫిలిప్పీన్స్	57	శ్రీలంక	99
మంగోలియా	76	నేపాల్	101
బంగ్లాదేశ్	95	పాకిస్థాన్	109

(ఆధారం: చాండ్లర్ గుడ్ గవర్నెన్స్ ఇండెక్స్ 2025)

చిత్రకళా తపస్వి కొండపల్లి

అపురూప ఊహల్లోని వర్ణచిత్రాలకు కాన్వాసుపై అద్భుతంగా ప్రాణంపోసి చిత్రకళా జగత్తుపై తనదైన ముద్ర వేశారు కొండపల్లి శేషగిరిరావు. పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలే కాకుండా ఇతర అంశాలకు సంబంధించి ఆయన గీసిన చిత్రాలు అందరినీ అబ్బురపరుస్తాయి. ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి వర్ధంతి నేడు.



కళ ఒక గొప్ప యోగం. యోగానికి ఏకాగ్రత ఎంత అవసరమో కళాసాధనకూ అదంతే ప్రధానం అని చెప్పేవారు ప్రఖ్యాత చిత్రకారులు కొండపల్లి శేషగిరిరావు. ఆయన ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా పెనుగొండ గ్రామంలో 1924 జనవరి 27న జన్మించారు. మానుకోటలో విద్యను అభ్యసించారు. వేయి స్తంభాల గుడి, రామప్ప వంటి చారిత్రక ప్రదేశాలు శేషగిరిరావును ప్రభావితం చేశాయేమోగానీ, చిత్రకళపై మక్కువతో హైదరాబాద్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్‌లో అయిదేళ్ల డిప్లొమా కోర్సు చేశారు. అనంతరం ప్రసిద్ధ చిత్రకారుడు నందలాల్ బోస్ దగ్గర శిష్యరికం చేసే అవకాశం దక్కింది. ముఖ్యంగా నిజాం ప్రభుత్వ మంత్రి నవాజ్ జంగ్ సహకారం ఆయనకు ఎంతగానో అక్కరకొచ్చింది.

అద్భుత చిత్రాలు... విశిష్ట రచనలు

అజంతా ఎల్లోరా గుహల్లోని చిత్రాలు, భారతీయ సంస్కృతిని వివరించే బొత్తి బొమ్మలు, మొఘల్ పాలకుల మినియేచర్ పెయింటింగ్, సమ్మోహనపరచే వర్ణాల రాజ్‌పుత్ పెయింటింగ్ వంటి ప్రాచీన చిత్రకళా నైపుణ్యాలతో పాటు రాజా రవివర్మ, అబనీంద్రనాథ్ ఠాగూర్ లాంటి ఆధునిక చిత్రకారుల నైపుణ్యాలనూ శేషగిరిరావు ఆకళించుకున్నారు. తద్వారా తనదైన శైలిలో అద్భుత చిత్రాలను సృష్టించారు. కొండపల్లి తైలవర్ణ చిత్రాలు ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధం చేస్తాయి. గుహుడు పడవ నడుపుతుండగా అందులో రాముడు, సీత, లక్ష్మణులు ఉన్న చిత్రం మనసును కట్టిపడేస్తుంది. మేనకా విశ్వామిత్రులు, శకుంతలా దుష్యంతుల కథను వివరించే చిత్రాలు సహజ కళాశోభతో అలరారుతాయి. మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కొండపల్లి శేషగిరిరావు కుంచె నుంచి 'తెలుగు తల్లి' చిత్రం జాలువారింది. ఆయన జీవం పోసిన బతుకమ్మ చిత్రం శ్రామిక మహిళల జీవన మాధుర్యాన్ని కళ్లకు కడుతుంది. శేషగిరిరావు చిత్రాలు దేశ విదేశాల్లో ఎంతోమంది ప్రముఖుల ప్రశంసలు పొందాయి.

బొమ్మలు గీయడమే కాకుండా చిత్రకళపై శేషగిరిరావు ఎన్నో వ్యాసాలు రాశారు. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం సంపాదకత్వంలో వెలువడిన సంగ్రహాంధ్ర విజ్ఞాన సర్వస్వంలో చిత్రకళా విభాగానికి నేతృత్వం వహించారు. ప్రముఖ చిత్రకారులపై వ్యాసాలు రాయడమే కాకుండా వారి జీవిత కళా విశేషాలను వివరిస్తూ రేడియో ప్రసంగాలు చేశారు. తెలంగాణ ప్రత్యేకమైన నకాసి కళపై విస్తృత పరిశోధనలు చేశారు. ఆయన వ్యాసాలు 'చిత్రకళా రమణీయకం' పేరుతో పుస్తకంగా వెలువడ్డాయి. 1950లో హైదరాబాద్‌లో తాను చదివిన కళాశాలలోనే అధ్యాపకుడిగా చేరారు. 1953లో అవంత్ గార్డే శైలిలో వేసిన పెయింటింగ్‌కు కలకత్తా ఫైనార్ట్స్ అకాడమీ అవార్డు అందుకున్నారు. 1963లో నిర్వహించిన ప్రదర్శనలో శేషగిరిరావు వేసిన గంగ, చిత్రాంగి, శకుంతల, దమయంతి, పార్వతి, రామానుజ తదితర చిత్రాలు విశిష్టంగా నిలిచాయి. ప్రతిష్ఠాత్మక హంస పురస్కారాన్నీ ఆయన అందుకున్నారు. ఒకసారి ఆయన యాదగిరిగుట్ట దర్శనానికి వెళ్లినప్పుడు తనను భయపెట్టిన కోతిని గుర్తుచేసుకుని వేసిన బొమ్మలో సహజత్వం ఉట్టిపడుతుంది.

భావితరానికి మార్గదర్శకులు

కొండపల్లి శేషగిరిరావు నిలువెత్తు మానవతావాది. 'చిత్రకారుల్లో ప్రకృతి రూపాలను చూసి ప్రభావితమైన వారే అధికం. ఆ చేతన ఉపచేతన బ్రహ్మజ్ఞానానికి దారితీస్తుంది. ఆ లయను వస్తువుగా చేసుకుని రంగుల రూపాలను సృష్టిస్తా'రంటూ చిత్రకళా తత్వంపై తన భావాలను తెలియజెప్పారు. కొండపల్లి శేషగిరిరావు వేసిన వందల చిత్రాలను క్రోడీకరించి ఆయన కుమారుడు తెలంగాణ ప్రభుత్వ సహకారంతో 'యాన్ ఒడిస్సీ ఆఫ్ లైఫ్ అండ్ ఆర్ట్: డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు' పేరిట ప్రత్యేక పుస్తకం తెచ్చారు. కొండపల్లి కళాతృష్ణకు ఆ పుస్తకం అద్దంపడుతుంది. భావి చిత్రకారులకు మార్గదర్శకంగానూ నిలుస్తుంది. కొండపల్లి శేషగిరిరావు కోడలు ఆయన జీవిత చరిత్రను వెలువరించారు. శేషగిరిరావు 2012 జులై 26న కీర్తిశేషులయ్యారు. ఆయన గీసిన చిత్రాలు కళాభిమానులకు ఎప్పటికీ అలౌకిక ఆనందాన్ని పంచుతూనే ఉంటాయి.

– డాక్టర్ బండారు సుజాతా శేఖర్

లక్ష్యం..!

ఆరో తరగతిలో పిల్లలంతా కూర్చుని ఉన్నారు. అప్పుడే లోపలికి వచ్చారు తెలుగు మాస్టారు. పాఠం చెప్పడం పూర్తయ్యాక.. 'పిల్లలూ! మీరు పెద్దయ్యాక ఏం అవ్వాలనుకుంటున్నారు?' అని అడిగారు. దానికి.. డాక్టర్, టీచర్, కలెక్టర్.. అంటూ రకరకాల సమాధానాలు ఇచ్చారు విద్యార్థులు. 'ఎందుకు వాటినే ఎంచుకున్నారు?' అని అడిగారు టీచర్. 'ఎందుకంటే.. ఏదో ఒకటి చెప్పాలి కదా సార్!' అన్నారంతా. 'అలా కాదు పిల్లలు.. మనం ఏం చేసినా దానికి ఏదో ఒక కారణం ఉండాలి. మీకో వ్యక్తి గురించి చెబుతాను వింటారా?' అన్నారు టీచర్. 'చెప్పండి సార్..' బదులిచ్చారు విద్యార్థులు. 'మనోజ్ కుమార్ పాండే అనే ఒక ఆర్మీ ఆఫీసర్ ఉండేవారు. ఆయన సొంతూరు ఉత్తర్ ప్రదేశ్‌లోని ఒక చిన్న గ్రామం. చిన్నప్పటి



నుంచే ఆటల మీద ఎక్కువ ఆసక్తి చూపేవారు. చాలా బాగా చదివేవారు కూడా. అలా 22 ఏళ్ల వయసులోనే ఆర్మీ ఉద్యోగంలో చేరారు. అందులో చేరేముందు జరిగే ఇంటర్వ్యూలో 'ఎందుకు ఈ ఉద్యోగంలో చేరాలని అనుకుంటున్నారు?' అని అడిగారట. అప్పుడు ఆయన.. 'పరమ వీర చక్ర అవార్డు కోసం' అని బదులిచ్చారట. అది ఆర్మీ ఆఫీసరుగా అత్యుత్తమ సేవలు అందించిన వారికి మాత్రమే ఇస్తారు. అంటే ఆయన ఉద్యోగంలో చేరడానికి ముందే అలా పని చేయాలని నిర్ణయించుకున్నారన్నమాట. అన్నట్లుగానే ఆయన 1999లో జరిగిన కార్గిల్ వార్‌లో పాల్గొన్నారు. అందులో వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోయారు. దేశం కోసం అంత త్యాగం చేసిన ఆయనకు మరణానంతరం 'పరమ వీర చక్ర' అవార్డును బహూకరించారు. దీన్ని బట్టి మీకేం అర్థమైంది?' అన్నారు టీచర్. 'ఒక లక్ష్యంతో పనిచేయాలి. అందులో వంద శాతం కృషి చేయాలి. అప్పుడే అందరి ప్రశంసలు అందుకుంటామని అర్థమైంది' అని బదులిచ్చారు విద్యార్థులు. ★

హాయ్! బుజ్జీ!!

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని కలిపి అర్థవంతంగా చేయండి చూద్దాం.

అష్ట	తరగతి	సీతా	నష్టం
గాలి	మతి	పిల్ల	విశాఖ
పువ్వు	లక్ష్మి	గుడ్డు	మధ్య
పరువు	కుక్క	చల్ల	పట్నం
అను	కోడి	ఫలం	తామర

ఈనాడు అమరావతి
ఎన్టీఆర్
శనివారం జులై 26, 2025

శ్రావణ శోభ




శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా తొలిరోజు శుక్రవారం ఇంద్రకీలాద్రి కళకళలాడింది. కొండపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. వారితో పాటు కుటుంబసభ్యులు కూడా తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ఇటు దేవస్థానం సిబ్బంది కూడా ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. దీంతో అమ్మ సన్నిధి శోభాయమానమైంది. – న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

రానున్న మూడు రోజులు భారీ వర్షాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. విజయవాడ కలెక్టరేట్‌లో 24 గంటలూ పని చేసేలా 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షాల ప్రభావంపై శుక్రవారం ఆయన సమీక్షించారు.
● సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫోన్ నంబరు 0866-2574454తో 24 గంటలూ పని చేసేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య శుక్రవారం తెలిపారు.

జిల్లాలో వాన జోరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా అంతటా వర్షాలు కురిశాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా.. వత్సవాయి 16.4, పెనుగంచిప్రోలు 13.6, తిరువూరు 12.8, ఇబ్రహీంపట్నం 9.2, చందర్లపాడు 8.4, ఎ.కొండూరు 8, విస్సన్నపేట 7.6, వీరులపాడు 7, జగ్గయ్యపేట 6.6, మైలవరం, గంపలగూడెం, కంచికచర్ల 5.4, రెడ్డిగూడెం 4.8, నందిగామ, జి.కొండూరు 2.8, విజయవాడ గ్రామీణ 10.6, నగరంలోని అజిత్‌సింగ్‌నగర్ 10.2, పటమట 10, గాంధీనగర్, భవానీపురంలో 9.8 మిల్లీమీటర్ల మేర వర్షం పడింది. జిల్లాలో మొత్తం 166.6 మి.మీ. మేర వర్షం పడగా, సగటు వర్షపాతం 8.33 మి.మీ.

ఏపీకే ఫైల్‌పై క్లిక్.. బ్యాంక్ ఖాతా ఖాళీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: వీరులపాడు మండలం తాటిగుమ్మి గ్రామానికి చెందిన రైతు 2025, ఏప్రిల్ 30న బ్యాంకుకు వెళ్లి రూ.300 విత్‌డ్రా చేసేందుకు ఫారం నింపి ఇచ్చారు. బ్యాంకు సిబ్బంది ఖాతాలో డబ్బులు లేవని చెప్పారు. తన ఖాతాలో రూ.2.5 లక్షల వరకు ఉండాలని రైతు తెలిపారు. బ్యాంకు సిబ్బంది అతని ఖాతా వివరాలు పరిశీలించి.. 2024 ఏప్రిల్ 12 నుంచి ఏప్రిల్ 27 వరకు విడతల వారీగా రూ.2,48,500 గుర్తు తెలియని వ్యక్తులు డ్రా చేశారని చెప్పడంతో అవాక్కైన ఆయన కన్నీరుమున్నీరయ్యారు. గురువారం విజయవాడ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతు చరవాణికి 'పీఎం కిసాన్ యోజన' పేరుతో వైరస్ ఏపీకే ఫైల్ వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫైల్ చరవాణికి రాగానే అవగాహన లేక రైతు దాన్ని క్లిక్ చేశారు. బ్యాంకు ఖాతా వివరాలన్నీ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోయాయి. వారు డబ్బులు మాయం చేశారు. డబ్బులు విత్‌డ్రా ఎస్ఎంఎస్ రాకుండా చరవాణినే బ్లాక్ చేశారు. సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరపడితే మీరు.. తల్లడిల్లనీరు!

ఈనాడు, అమరావతి

★ జూన్‌లోగా కృష్ణా ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యం
★ జులై నుంచి నీళ్లు ఇవ్వాల్సి ఉన్నా పనుల్లో జాప్యం

'ఎ.కొండూరు కిడ్నీ బాధిత తండాలకు కృష్ణా జలాలు అందించే ప్రాజెక్టు పనుల పూర్తికి మరి కొంత సమయం పట్టేలా ఉంది. 2025, జూన్‌లోగా పనులు పూర్తిచేసి జులై నుంచి నీరివ్వాలనేది లక్ష్యం. కానీ.. ఆ మేరకు పనులు పూర్తవ్వలేదు. ప్రస్తుతం 90 శాతంపైగా పూర్తయినా.. చివరి దశలో కొంత జాప్యం జరుగుతోంది. ప్రధానంగా.. ట్యాంకుల నిర్మాణంలో ఆలస్యం, ప్రస్తుతం వర్షాలతో పనులు నెమ్మదించాయి. పనుల పూర్తికి మరో నెలన్నరకు పైనే సమయం పట్టే వీలుంది. ఆగస్టు నెలాఖరుకైనా కృష్ణా జలాలు ఇంటింటికీ వస్తాయా? లేదా? అనేది అనుమానమే.'

ఎ.కొండూరు పరిధిలోని 15 తండాల్లో కిడ్నీ వ్యాధి కేసులకు అడ్డుకట్ట పడడం లేదు. పరిస్థితి విషమించి ఇప్పటికీ ఒక్కొక్కరుగా చనిపోతూనే ఉన్నారు. గత ఐదేళ్లలో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. గిరిజనులకు శాశ్వతంగా స్వచ్ఛ జలాలు అందించే ప్రాజెక్టును వేగవంతం చేసింది. కృష్ణా జలాలను ఇంటింటికీ చేర్చే ఈ ప్రాజెక్టును జూన్ నాటికి పూర్తిచేయాలని సంకల్పించింది. అలాగే పనులు వేగంగానే జరిగాయి. కానీ.. ప్రధాన పైప్‌లైన్ మార్గంలో కొన్నిచోట్ల కాలువలు వచ్చాయి. అక్కడ చిన్నవంతెనలు కట్టి.. మీదుగా పైప్‌లైన్ వేయడంతో పనులు నెమ్మదించాయి. మరికొన్నిచోట్ల జాతీయ రహదారి, అటవీ, కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల మీదుగా వెళ్లాల్సి రావడంతో అనుమతులు ఆలస్యమైంది.


నిర్మించిన ప్రధాన ట్యాంక్

ట్యాంకుల నిర్మాణం జరగాలి...


తండాల్లో ఇళ్ల మధ్య వేసిన నల్లా

కుదప సంపు నుంచి ఎ.కొండూరు వరకు వేస్తున్న ప్రధాన పైప్‌లైన్ పనులు మిగిలాయి. దీని నుంచే ట్యాంకులకు నీటిని ఎక్కిస్తారు. ఇప్పటికే.. ట్యాంకులకు నీరు ఎక్కించే కనెక్షన్లు కూడా ఇచ్చేశారు. మొత్తం 36 ట్యాంకులతో 38 తండాలకు సుజలాలు ఇస్తారు. 22 పాత ట్యాంకులనే బాగుచేసి సిద్ధం చేశారు. ఇవికాక కొత్తగా 14 ట్యాంకులు కడుతున్నారు. వీటిలో కుదప వద్ద కొండపై 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ప్రధాన ట్యాంకు ఒకటి. ఈ ట్యాంకు మూడు నెలల కిందటే సిద్ధమైంది. మిగతా ట్యాంకుల్లో కొన్ని పూర్తవగా, మరికొన్ని తుది దశలో ఉన్నాయి. ఇవన్నీ పూర్తయితేనే.. 38 తండాలకు నీరివ్వగలరు.

గ్రామాల్లో పైప్‌లైన్లు పూర్తి

ఇంటింటికీ మంచినీరిచ్చేలా గ్రామాల్లో వేయాల్సిన భూగర్భ అంతర్గత పైప్‌లైన్ పనులు ఇప్పటికే పూర్తవగా నల్లాలు బిగించి.. కొన్ని తండాల్లో ట్రయల్‌రన్ కూడా వేశారు. కానీ.. కొన్ని ప్రాంతాల్లో పాత పైప్‌లైన్‌కే కనెక్షన్ ఇవ్వగా లీకులు ఎక్కువయ్యాయి. దీంతో వీటిని పునరుద్ధరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిధులు రూ.49.94 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు కోసం తాము దశాబ్దంగా తపిస్తున్నామనీ.. తమ బిడ్డలైనా కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా... త్వరగా పూర్తి చేసి.. స్వచ్ఛ జలాలు ఇవ్వాలని గిరిజనులు విన్నవిస్తున్నారు.

తియ్యని మత్తు.. తెలియక చిత్తు

☛ వన్‌టౌన్ కేంద్రంగా గంజాయి చాక్లెట్లు
☛ ఏకంగా నిషేధిత పదార్థాలతో తయారీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే


చక్కని ప్యాకింగ్‌తో విక్రయిస్తూ..


గోళీ రూపంలో తయారుచేసి..

నగరంలో మత్తు పదార్థాల రాకెట్ రోజుకో రీతిన వెలుగు చూస్తోంది. నిన్నటి వరకు మత్తు కోసం సొల్యూషన్ వాడితే తర్వాత గంజాయికి అలవాటు పడ్డారు. గంజాయి విక్రయాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతుంటే గంజాయి ముఠా పంథా మార్చింది. తాజాగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో చాక్లెట్లు తయారు చేస్తున్నారు. పిల్లలు, యువత లక్ష్యంగా గంజాయి చాక్లెట్లతో మార్కెట్‌ను ముంచెత్తుతున్నారు. తాజాగా వన్‌టౌన్ మార్కెట్‌లో ఏకంగా మత్తును కలిగించే 4,000 గంజాయి చాక్లెట్లు పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్, టూ టౌన్ మార్కెట్లలో విచ్చలవిడిగా విక్రయిస్తున్న ఈ చాక్లెట్లు.. పోలీసులకు సవాలు విసురుతున్నాయి.

తొలిసారిగా దాడుల్లో బట్టబయలు.: ఈ నెల 11న విజయవాడ రైల్వేస్టేషన్‌లో మాదకద్రవ్యాల కట్టడికి నిర్దేశించిన ఈగల్ టీం, రైల్వే పోలీసులు తనిఖీలు చేశారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేయగా ఝార్ఖండ్ యువకుడి వద్ద గంజాయి చాక్లెట్లు పట్టుకున్నారు. విచారణలో తన స్వగ్రామంలో కొని తీసుకు వెళుతున్నానని చెప్పటంతో కంగుతిన్నారు. తొలిసారిగా భంగు (నల్లమందు), గంజాయితోపాటు శొంఠి, జీలకర్ర, కిస్మిస్ తదితర వస్తువులతో కలసి ఈ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వీటి తయారీకి ఆహార భద్రత అధికారుల అనుమతులు లేకపోవటంతో వీటిని రాష్ట్రంలో నిషేధిత వస్తువులుగా పరిగణిస్తున్నారు.

ఉత్తరాది రాష్ట్రాల నుంచి..: మత్తు కలిగించే ఈ చాక్లెట్లు ఉత్తరాది రాష్ట్రాల నుంచి తెస్తున్నారు. వన్‌టౌన్‌లో పట్టుబడిన ఇవి కాన్పూర్ నుంచి తెచ్చారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి తెచ్చి వన్‌టౌన్ కేంద్రంగా విక్రయిస్తున్నారు. వీటిని స్థానిక యువకులు ఎక్కువ ఉపయోగిస్తున్నట్లు తేలింది.

ఎవరికీ అనుమానం రాకుండా: ఈ చాక్లెట్లను గోళీలుగా చేసి చక్కని ప్యాకింగ్‌లో ఉంచుతున్నారు. ఇలా వన్‌టౌన్‌లో ఓ కిరాణా షాపులో 100 పెట్టెల్లో ఉన్న దాదాపు 4,000 గంజాయి చాక్లెట్లు పట్టుకున్నారు. నగరంలో చాలా దుకాణాల్లో విక్రయిస్తున్నట్లు తెలిసింది. చిన్న పొట్లాలుగా విక్రయిస్తుండటంతో ఇప్పటిదాకా అనుమానాలు రాలేదు. రైల్వేస్టేషన్‌లో తొలిసారిగా పట్టుబడ్డాక దందా వెలుగులోకి వచ్చింది.

ఫోరెన్సిక్ నివేదికే కీలకం...: పోలీసులు స్వాధీనం చేసుకున్న చాక్లెట్లను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపుతారు. దానిలో ఏ మత్తు పదార్థాలు.. ఎంత శాతం ఉన్నాయి? తదితరాల నివేదిక కీలకంగా మారనుంది. దీనిలో భంగు, గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వాటిపై నిషేధం ఉండటంతో పోలీసులు కేసు పెట్టారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి సరకు తెచ్చే వారిపై గట్టి నిఘా ఉంచితే మరింతగా గుట్టు రట్టు చేయవచ్చు.

28న విజయవాడ మెట్రోకు టెండర్లు

● మొత్తం వ్యయంలో తొలుత రూ.4,047 కోట్లు వెచ్చింపు
● రుణం మంజూరయ్యాక మిగిలిన పనులకు బిడ్ల ఆహ్వానం



ఈనాడు - అమరావతి: విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుకు సోమవారం టెండర్లు పిలవనున్నారు. టెండర్ పత్రాలు సిద్ధం కాకపోవడంతో శుక్రవారం విశాఖ మెట్రోకు మాత్రమే పిలిచారు. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రెండు మెట్రోలకు ఆమోదం లభించింది. విజయవాడకు సంబంధించిన ప్రక్రియ కొద్దిగా ఆలస్యం కావడంతో వాయిదా పడింది. తొలి దశలో చేపట్టనున్న ప్రాజెక్టులో రెండు కారిడర్లలో 33 స్టేషన్లు రానున్నాయి. రూ.10,118 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. ఇందులో ప్రస్తుతం 40 శాతం నిధులు వెచ్చించనున్నారు. రూ.4,047 కోట్ల విలువైన పనులకు 28న టెండర్లు పిలుస్తారు. ఈ మొత్తంతో సివిల్ పనులు పూర్తి చేయనున్నారు. ఎన్‌హెచ్ఏఐ, మెట్రో రైలు కార్పొరేషన్ ఉమ్మడిగా 4.7 కి.మీ. పొడవున రామవరప్పాడు నుంచి డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. కింద వాహనాలు వెళ్తాయి. పైన మెట్రో రైళ్ల రాకపోకలు సాగుతుంటాయి. ఈ దూరానికి అయ్యే వ్యయాన్ని రెండు సంస్థలు భరించనున్నాయి. ఈ పనులు పూర్తయ్యాక మిగిలిన మొత్తానికి టెండర్లు పిలవనున్నారు. ★ పనుల పర్యవేక్షణ, నిర్మాణం మెట్రో రైలు కార్పొరేషన్ ఇదే వరకే జనరల్ కన్సల్టెంట్ ఎంపిక కోసం బిడ్లను ఆహ్వానించగా... టీపీఎస్ ఎన్నికైంది. ఈ సంస్థతో శుక్రవారం మంత్రి నారాయణ సమక్షంలో మెట్రో రైలు కార్పొరేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రాజెక్టుకు అయ్యే వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 20 శాతాన్ని సీఆర్డీఏ భరించనుంది. రాజధాని నగరంలో పలు కీలక ప్రాంతాల్లో సీఆర్డీఏకు భూములు ఉన్నాయి. వీటిని విక్రయించడం ద్వారా నిధులు సమకూర్చాలని యోచిస్తోంది.

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్: కృష్ణా నదిలో వరద శుక్రవారం తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజీకి ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 18,621 క్యూసెక్కులు రాగా, 20 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 14,300 క్యూసెక్కులు విడుదల చేశారు. కాలువలకు 4,321 క్యూసెక్కులు ఇచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు వరద 25,331 క్యూసెక్కులకు పెరిగింది. దాంతో 30 గేట్లను ఎత్తి సముద్రంలోకి 21,510 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు ప్రవాహం తగ్గింది. దాంతో 25 గేట్లను ఎత్తి సముద్రంలోకి 17,800 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు కాలువకు 3,305, పశ్చిమ కాలువకు 516 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 2,005, కేఈబీ కాలువకు 1,300 క్యూసెక్కులు ఇస్తున్నారు.

అమ్మ పేరుతో మొక్క..

★ జిల్లాలో 2 లక్షల మొక్కలు నాటిన విద్యార్థులు
★ ఫలిస్తున్న కూటమి ప్రభుత్వ ప్రయత్నం


మొక్కలు, గ్రీన్ పాస్‌పోర్టుతో విద్యార్థులు

పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన మొక్కలు నాటే కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోంది. ఇందులో భాగంగా ఎక్కువ మొక్కలు నాటేందుకు విద్యా శాఖ సిద్ధమవుతోంది. జిల్లాను హరితవనంగా మార్చాలంటే.. ప్రతి ఒక్కరూ కచ్చితంగా మొక్కలు నాటాల్సిందేనని అధికారులు పేర్కొంటున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 937 ప్రభుత్వ బడుల్లో 90,509 మంది, 516 ప్రైవేట్ పాఠశాలల్లో 2,12,574 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులతో ఇప్పటి వరకు అన్ని ప్రాంతాల్లో కలిపి 90 వేల మొక్కలను నాటించారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో 1.10 లక్షల మొక్కలు నాటించారు. ఈ నెల 10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించిన అనంతరం ఈ కార్యక్రమాన్ని ఆరంభించారు. విద్యార్థులకు మొక్కలు ఇచ్చి.. వారి తల్లి పేరుతో పాఠశాల ఆవరణ, ఇళ్ల వద్ద నాటాలని సూచించగా.. విద్యార్థులు ఉత్సాహంగా ఈ క్రతువులో భాగస్వాములవుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పెరిగేలా చూడాలి..

మొక్క నాటడంతో పాటు దాని పర్యవేక్షణ బాధ్యతను కూడా ఆ విద్యార్థి వారికే అప్పగించారు. మొక్క నాటిన తర్వాత లీడ్ యాప్‌తో పాటు గ్రీన్ పాస్‌పోర్ట్ పుస్తకంలో విద్యార్థి పేరు, తరగతి, శాస్త్రీయ నామం తదితర వివరాలు నమోదు చేస్తారు.


తల్లితో కలిసి ఇంటి ఆవరణలో మొక్క నాటుతున్న విద్యార్థిని

మొక్క ఎక్కడ నాటారు? పెరుగుతున్న దశలను చిత్రాలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఉపాధ్యాయులు వీటిని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లి పరిశీలిస్తూ ఉంటారు. విద్యార్థి మొక్కను నాటి, దానిని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నట్టు గుర్తించాకే.. ఉపాధ్యాయులు సంతకం చేస్తారు. అప్పుడే గ్రీన్ పాస్‌పోర్టు అందిస్తారు. ఇలా జిల్లాలో ఇప్పటి వరకు రెండు లక్షల మందికి గ్రీన్ పాస్‌పోర్టులను అందజేసినట్లు సమగ్రశిక్షా జిల్లా అదనపు సమన్వయకర్త జి.మహేశ్వరరావు తెలిపారు.


చిన్నారులు పోటీపడి..

ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో నాలుగో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకే మొక్కలు నాటే అవకాశం ఇచ్చారు. అది కూడా ఒక్కో విద్యార్థి అత్యధికంగా మూడు మొక్కల వరకు తీసుకెళ్లి పెంచుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. దీంతో చిన్నారులు పోటీపడి మరీ వాటిని తీసుకెళ్లి నాటుతున్నారు. – విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

బాబోయ్.. ఖాతార్నాక్‌లు!

ఈనాడు, అమరావతి

☛ అమాయకులకు కమీషన్ల ఎర..
☛ వారి ఖాతాలతో చట్టవిరుద్ధ లావాదేవీలు



"అదనపు ఆదాయం ఆర్జించాలనే ఆశను పలువురు మోసగాళ్లు తమకు అనువుగా మార్చుకుంటున్నారు. మీ బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తే చాలు... అందులోపడే మొత్తంలో కమీషన్ ఇస్తామని ఆశచూపుతున్నారు. వీరి మాటలు నమ్మి కేసుల్లో చిక్కుకుంటున్నారు. మోసగాళ్ల ఉచ్చులో ఎక్కువ మంది యువత, గృహిణులే ఇరుక్కుంటున్నారు."

"మల్టీలెవల్ మార్కెటింగ్, రుణయాప్‌లు, పలు చట్టవిరుద్ధ వ్యవహారాల్లో అమాయకుల బ్యాంకు ఖాతాలు వీరివే అని దర్యాప్తులో తేలుతున్నాయి. ఫలితంగా వీరు పోలీసుల విచారణ ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇలా నగరానికి చెందిన పలువురు ఇటీవల సమస్యల్లో చిక్కుకున్న ఘటనలు కోకొల్లలు."

తేలికగా డబ్బు సంపాదనకు అలవడిన కేటుగాళ్లు ఆర్థిక లావాదేవీలకు తెలివిగా ఇతరుల ఖాతాలను వాడేస్తున్నారు. డబ్బు, కమీషన్ ఆశ చూపి పలువురి బ్యాంకు ఖాతాలు, యూపీఐ ఐడీలను తీసుకుని వ్యవహారాలను చక్కబెడుతున్నారు. చివరకు అమాయకులే పోలీసులకు దొరుకుతున్నారు. అసలు ఖాతాలే లేని వారినీ ఒప్పించి నిందితులే అకౌంట్లు తెరిపిస్తున్నారు. ఇందుకు పాస్‌బుక్, అంతర్జాలం, మొబైల్ బ్యాంకింగ్ ఐడీ, పాస్‌వర్డ్‌లను తమ ఆధీనంలో ఉంచుకుని నడిపిస్తున్నారు. వీరెవరికి తమ ఖాతాలతో పెద్దమొత్తాల్లో లావాదేవీలు జరుగుతున్నట్లు తెలియదు. ఇందుకు వారికి ప్రతి నెలా కొంత నగదు చెల్లిస్తుంటారు.

తెలుసుకునేలోపే నోటీసులు...

✦ విజయవాడలో ఓ దుస్తుల దుకాణదారుడు.. ఇటీవల దిల్లీ వెళ్లారు. అక్కడ ఓ వ్యాపారి పరిచయమయ్యాడు. తన బ్యాంకు ఖాతాకు సమస్యలు ఉన్నాయనీ, లావాదేవీలకు ఒక కొత్త ఖాతా కావాలని అతనిని కోరాడు. ఇందుకు విజయవాడ వ్యాపారిని ఒప్పించి రూ.7 వేలు ఇచ్చాడు. దీంతో కొత్తగా బ్యాంకు ఖాతా తెరిచి, ఆ వివరాలను దిల్లీ వెళ్లినప్పుడు అందజేశారు. తర్వాత వివిధ రాష్ట్రాల పోలీసుల నుంచి నోటీసులు వచ్చాయి. ఆ ఖాతా ఫ్రీజ్ అయింది. దాదాపు రూ.3 కోట్ల లావాదేవీలు జరిగాయి.

✦ నున్న ప్రాంత వాసికి అనుకోకుండా ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. కొత్తగా బ్యాంకు ఖాతా తెరిచి.. తనకు ఇస్తే, కమీషన్ ఇస్తానని మభ్యపెట్టాడు. దీంతో భార్య పేరుతో అకౌంట్ తెరిచి మరీ వివరాలు ఇచ్చాడు. కొద్ది నెలలకే దశలవారీగా రూ.4 కోట్లు జమైంది. ఉత్తరప్రదేశ్ పోలీసులు విజయవాడ వచ్చి నోటీసులు ఇచ్చే వరకు అతనికి విషయం తెలియదు.

దొరకని మూలాలు...

అమాయకుల బ్యాంకు ఖాతాల వివరాల సేకరణకు దేశీయంగా పెద్దసంఖ్యలో మధ్యవర్తులు పుట్టుకొచ్చారు. సామాజిక మాధ్యమాలు, పరిచయస్థులతో కమీషన్ల ఎర వేసి ఖాతాలను సేకరిస్తారు. ఇందుకు దళారులకు ఠంచనుగా కమీషన్ వస్తుంది. ఖాతాదారుల మొబైళ్లకు ఫిషింగ్ లింక్స్ పంపి, వాటి ద్వారా ఖాతాల రిజిస్టర్డ్ ఫోన్ నెంబరుకు ఎస్ఎంఎస్‌లు వెళ్లకుండా తమకు ఫార్వర్డ్ అయ్యేలా చూస్తారు. లావాదేవీలు జరిగినప్పుడు మెసేజ్‌లు ఖాతాదారుల ఫోన్లకు రావు. ఇలా ఖాతాల్లో జమ అవుతున్న నగదు బినామీ ఖాతాలకు మళ్లిస్తున్నారు. క్రిప్టో కరెన్సీ రూపంలో ఇతర దేశాలకు చేరుతోంది. ఈ లావాదేవీలను ఈడీ, సీబీఐ వంటి కేంద్ర ఏజెన్సీలే పట్టుకోగలరు. స్థానిక పోలీసుల దర్యాప్తు తుదివరకు వెళ్లకపోవడమే నిందితులకు కలసివస్తోంది.

అక్షరాంధ్రతో వికసిత్ భారత్ సాకారం

అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం: కలెక్టర్ పిలుపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అక్షరాంధ్రతో స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారం అవుతుందని, సమష్టి కృషితో అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి గాను అక్షరాస్యత లక్ష్యాలను చేరుకునేలా సరైన ప్రణాళికతో పని చేయాలని ఆదేశించారు. ఉల్లాస్- అక్షరాంధ్ర, అక్షరాస్యత కార్యక్రమంపై నగరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆగస్టు 7 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు 100 గంటల పాటు తరగతులు నిర్వహించాలని తెలిపారు. తరగతుల్లో ఫంక్షనల్ లిటరసీతో పాటు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతలో శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. గత విద్యా సంవత్సరంలో ఉల్లాస్ కింద 16 మండలాలను ఎంపిక చేసి స్వయం సహాయ సంఘాల మహిళలకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించినట్టు గుర్తు చేశారు. ఈ నెలాఖరుకు వాలంటీర్ టీచర్ల గుర్తించి, ప్రతి పది మందికి ఒక వాలంటీర్‌ని మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని వివరించారు. జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి జి.ప్రసాదరావు, డీఈవో యు.వి.సుబ్బారావు, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఎనికేపాడులో టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్

త్వరలో ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు ✦ కలెక్టరేట్‌లో స్టార్టప్ కంపెనీల ట్రయల్‌రన్ స్టాళ్లు


స్టాళ్ల వద్ద వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు


డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్.టి.ఐ.హెచ్.) ఏర్పాటు చేయనున్నారని, దానికి అనుసంధానంగా రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో స్పోక్‌లు అందుబాటులోకి వస్తాయని, వాటిలో ఒకటి ఎన్టీఆర్‌కు జిల్లాకు కేటాయించారని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దానిని విజయవాడ గ్రామీణ మండలం ఎనికేపాడులో ఏర్పాటు చేయనున్నామని, త్వరలో సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. స్పోక్ ట్రయల్‌రన్‌లో భాగంగా కలెక్టరేట్‌లో శుక్రవారం స్టార్టప్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఏఐ, లిక్విడ్-సాలిడ్ వేస్ట్ రీసైక్లింగ్, అగ్రీ టెక్, ఎన్విరాన్ డిజిటల్ వంటి సొల్యూషన్లను ప్రదర్శించారు.

జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా.. స్టాళ్లను జేసీ ఎస్.ఇలక్కియాతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. టాటా హబ్ ద్వారా స్టార్టప్‌లకు సరికొత్త ఊపు వస్తుందని చెప్పారు. స్పోక్‌ని సద్వినియోగం చేసుకుంటూ ఆవిష్కరణల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికత, నూతన ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. నూతన ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్న వారికి అన్ని విధాలా సహకారం అందిస్తామని వివరించారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి బి.సాంబయ్య, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారబాబు, వివిధ స్టార్టప్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

★ ట్రిపుల్‌ఐటీ ఆర్.జి.యు.కె.టి. శ్రీకాకుళం విద్యార్థులు క్వాంటమ్ అగ్రికల్చర్ స్టార్టప్ ఆలోచనను ఆవిష్కరించి కలెక్టర్ ప్రశంసలు పొందారు. ఈ ప్రాజెక్టు ద్వారా రైతులకు కచ్చితమైన వాతావరణ అంచనాలు, వ్యయ నియంత్రణ, అధిక దిగుబడి సాధన వంటి ప్రయోజనాలు లభిస్తాయని విద్యార్థులు కాటం నిఖిల్ తేజ, డి.ఖాసింవలీ, చెరుకూరి ప్రవీణ్‌కుమార్ వివరించారు.

లంచం తీసుకున్న కేసులో వీఆర్వోకు జైలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పాస్ పుస్తకంలో భూమి వివరాలు చేర్చేందుకు రైతు నుంచి లంచం తీసుకున్న వీఆర్వోకు ఏడాది కఠిన కారాగార వాసం, రూ.10 వేల జరిమానా విధిస్తూ విజయవాడ అనిశా ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పు చెప్పింది. వత్సవాయి మండలం గోపినేనిపాలెంకు చెందిన రైతు.. పాస్ పుస్తకంలో భూమి వివరాలు చేర్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ వివరాలు రాయడానికి వీఆర్వో వైకుంఠరావు లంచం డిమాండ్ చేయగా.. రైతు అనిశా అధికారులకు ఫిర్యాదు చేశారు. 2011, డిసెంబరు 3న లంచం తీసుకుంటుండగా వీఆర్వోను అనిశా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేశారు. విజయవాడ అనిశా ప్రత్యేక న్యాయస్థానంలో ఛార్జిషీటు దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పట్టణ ప్రాంత పేదలకు ఇళ్లు.. కోట ఘనతే

సంతాప సభలో మంత్రి సత్యకుమార్



కోట చిత్రపటానికి నివాళులర్పించిన మంత్రి సత్యకుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఉదయభాను తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: విజయవాడలో ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలో పట్టణ ప్రాంతాల్లో గూడు లేని పేదలకు ఇళ్లు మంజూరు చేయించిన ఘనత నటుడు దివంగత కోట శ్రీనివాసరావుకే దక్కుతుందని మంత్రి సత్యకుమార్ అన్నారు. శుక్రవారం గాంధీ నగర్‌లోని ఓ హోటల్‌లో కోట సంతాప సభ నిర్వహించారు. శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ.. కోట తెలుగు, ఇతర భాషల్లో సుమారు 750 సినిమాల్లో నటించి పద్మశ్రీతో పాటు ఎన్నో అవార్డులు అందుకున్నారని కొనియాడారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ.. శ్రీనివాసరావు మరణం తీరని లోటని, ఆయన భాజపా ఎమ్మెల్యేగా, హిందుత్వవాదిగా, సామాజికవేత్తగా సేవలు అందించారని గుర్తు చేశారు. నటుడు, మాజీ మంత్రి బాబూమోహన్ ఫోన్‌లో మాట్లాడుతూ.. మామగారు సినిమా నుంచి ఇద్దరి కాంబినేషన్‌లో అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించినట్లు గుర్తు చేశారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సినీ, రాజకీయ రంగాల్లో కోట శ్రీనివాసరావుకు ఎవరూ సాటి లేరని, అటువంటి విలక్షణ నటుడిని కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ శ్రీనివాసరావు కృష్ణా జిల్లాలో జన్మించడం మన అదృష్టంగా పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, భాజపా నాయకులు నూతల మధుకర్, బిట్రా శివనారాయణ, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, బొడ్డు నాగలక్ష్మి, నాగలింగం శివాజీ, వేముల హజరత్తయ్య గుప్తా, షేక్ బాజీ, కోలపల్లి గణేష్ పాల్గొన్నారు.

ఇబ్బందులున్నా.. సంక్షేమం.. అభివృద్ధి పరుగులు

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



మహిళలకు కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తదితరులు

పాయకాపురం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. విజయవాడలోని కండ్రికలో శుక్రవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి, ఎమ్మెల్యేకి తెదేపా నేతలు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఇద్దరూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు ఇచ్చి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ... 'వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. ఎన్ని ఇబ్బందులున్నా ప్రజలకు సంక్షేమ పథకాలు ఆపలేదు. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రజలు మమ్మల్ని నమ్మారు కనుకే బ్రహ్మాండమైన విజయాన్ని ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నారు. హామీలు నెరవేర్చగలమా? అనే భయం మాలో ఉండేది. కానీ కేంద్రం సహకారంతో హామీలన్నింటినీ అమలు చేస్తున్నాం. పింఛను సొమ్ము పెంచాం. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించాం. తల్లికి వందనం కింద ఒక్కరోజే రూ.8700 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేశాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. బుడమేరు వరదలను సమర్థంగా ఎదుర్కొన్నాం. డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించాం. ఏడాదిలో ఎన్నో సమస్యలు పరిష్కరించాం' అని తెలిపారు. తెదేపా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్-2025 విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, పక్కనే పట్టాభిరామ్

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రుల సమయంలో 9 రోజులు నిర్వహించే విజయవాడ ఉత్సవ్-2025ను విజయవంతం చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో ముందుగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో ఎగ్జిబిషన్ పునః ప్రారంభిస్తామని, క్రీడా పోటీలు, ఇందిరాగాంధీ మైదానంలో నగరాన్ని వీక్షించేందుకు హెలికాప్టర్స్, పున్నమిఘాట్ వద్ద వాటర్ స్పోర్ట్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కొన్ని సూచనలు చేశారని వాటి ప్రకారం ముందుకెళుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నగరానికి గుర్తింపు రావడానికి విజయవాడ ఉత్సవ్ ఒక బ్రాండ్ కావాలని ఆకాంక్షించారు. దీనిని విజయవంతం చేసేందుకు సలహాలు, సూచనలు అందించాలని కోరారు. పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్, నగర సీపీ రాజశేఖర్‌బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంక దినకర్, కృష్ణా మిల్క్స్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికెట్ అథారిటీ ఛైర్మన్ దేవదత్, ఏపీ స్టేట్ బిల్డింగ్ వర్కర్స్ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, నగర పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు హాజర్యారు.

ఎన్ఆర్వీ వెబ్‌సైట్ ప్రారంభం: విజయవాడ ప్రజలకు చేయూతగా నిలిచేందుకు ఎన్ఆర్ఐలు ఏర్పాటు చేసిన నాన్ రెసిడెంట్ విజయవాడ(ఎన్ఆర్వీ) వెబ్‌సైట్‌ను ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఎన్ఆర్ఐలు మణిధర్ యలమంచిలి, వాణి బొల్లూరి, సురేష్ పుట్టగుంట, చిన్న ప్రసాద్, హర్షసాయిలు మాట్లాడుతూ విజయవాడ నుంచి ఎంతో మంది సాఫ్ట్‌వేర్ రంగంలో విదేశాల్లో పనిచేస్తున్నారని, వారందర్నీ ఒక చోటకు తీసుకొచ్చి అమరావతి రాజధానిలో భాగమైన విజయవాడను అభివృద్ధి చేసేందుకు వెబ్‌సైట్ ప్రారంభించామన్నారు.

కార్ల తాకట్టు.. అంతా కనికట్టు!

● ట్రావెల్స్ నుంచి తెచ్చి.. పలుచోట్ల తనఖా పెట్టి
● రూ.కోట్లలో దందా.. లబోదిబోమంటున్న బాధితులు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: ఓ వైపు క్రికెట్ బుకీ, మరోవైపు క్యాసినోలకు గోవా తదితర ప్రాంతాలకు జూదరులను తరలించడం.. ఏం చేసినా అడ్డదారిలో వచ్చే సొమ్ము కోసమే.. ఈ క్రమంలో అమాయకులను కార్లతో ఎరవేసి రూ.కోట్లలో దండుకున్నాడు. అనక తానే కార్ల యజమానులకు సమాచారం ఇచ్చి పోలీసుల సాయంతో వాటిని స్వాధీనం చేసుకునేలా చేసి, డబ్బు అప్పుగా ఇచ్చిన వారందరికీ టోకరా వేశాడు.

☛ తెలంగాణలోని లంగర్‌హౌస్, మాదాపూర్, జూబ్లీహిల్స్ తదితర పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి కథ మొత్తం గత పది రోజులుగా కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ చుట్టూ తిరుగుతోంది. సేకరించిన సమాచారం మేరకు.. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన అజయ్ రెండేళ్ల నుంచి వివిధ రకాల కార్లను తీసుకొచ్చి హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంతాల్లోని పలువురు చిన్నపాటి వడ్డీ వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టాడు. వాటి ధర అధికంగా ఉండటం, అడిగే మొత్తం తక్కువగా ఉండటంతో ఎవరికివారే అప్పులు ఇచ్చారు. వాటిని తిరిగి వడ్డీతో సహా చెల్లిస్తూ నమ్మకం పెంచుకున్న అతడు, ఆ తరువాత ఎక్కువ సంఖ్యలో కార్లు తీసుకొచ్చి అప్పు తీసుకునే స్థాయికి విస్తరించాడు. ఈ రకంగా దాదాపు 20 మంది వద్ద భారీ మొత్తంలో నగదు తీసుకున్నాడు. ఈసారి అప్పు చెల్లించడంలో జాప్యం జరిగినా, కారు విలువలో సగానికంటే తక్కువే ఇచ్చామన్న ధీమా, వడ్డీ పెరుగుతుందన్న ఆశతో ఎవరూ పెద్దగా ఒత్తిడి చేయలేదు.

రాత్రికి రాత్రే.. కొద్ది రోజుల కిందట అజయ్ అనే వ్యక్తి సెల్ఫ్ డ్రైవింగ్ కార్లను అద్దెకు తీసుకొని తమను మోసగించాడంటూ కొందరు వ్యక్తులు జంక్షన్‌లో తాకట్టు పెట్టుకున్న వారి వద్దకు వచ్చారు. సివిల్ డ్రెస్‌లో ఉన్నవారిని తెలంగాణ పోలీసులుగా చెప్పి చాలా మంది వద్ద రాత్రికి రాత్రే కార్లు తీసుకెళ్లిపోయారు. ఒకరిద్దరు మాత్రం వారిని ప్రతిఘటించారు. అధికారికంగా హనుమాన్‌జంక్షన్ సర్కిల్ పరిధిలో మూడు కార్లు మాత్రమే తీసుకెళ్లినట్లుగా ఉన్నా, అనధికారికంగా 20కు పైగా కార్లు ఉన్నట్లు సమాచారం.

భారీ దందా.. అజయ్ హైదరాబాద్‌లోని పలు ట్రావెల్స్ ఏజెన్సీల వద్ద సెల్ఫ్ డ్రైవింగ్ ప్రాతిపదికన అద్దెకు తీసుకుని ఈ దందా ప్రారంభించాడు. అమరావతిలో కార్లకు మంచి గిరాకీ ఉందని నమ్మబలికి దాదాపు 123 కార్లు తీసుకుని చిత్తూరు, కడప మొదలుకొని విశాఖ పట్నం వరకు పలువురి వద్ద వాటిని తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నట్లుగా జంక్షన్‌లోని బాధితులు చెబుతున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత డ్రైవర్ కూడా ఈ జాబితాలో ఉన్నట్లు సమాచారం.

పరస్పర అవగాహనతోనేనా..?

అజయ్ మోసాలకు విజయవాడకు చెందిన ఒకరు, హనుమాన్ జంక్షన్‌కు చెందిన మరొకరు పూర్తి అండగా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మరోవైపు కార్లు తాకట్టు పెట్టడం, ఆ తర్వాత జీపీఎస్ ట్రాకర్ ద్వారా అవి ఎక్కడున్నాయో గుర్తించి ట్రావెల్స్ యజమానుల చేత కేసులు పెట్టించి స్వాధీనం చేసుకోవడం పరస్పర అవగాహనతోనే కొనసాగిన దందాగానే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై హనుమాన్‌జంక్షన్ ఎస్సై వి.సురేష్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఈ కేసుతో తమకు ఎలాంటి సంబంధం లేదని, తెలంగాణ పోలీసులు ఎఫ్ఐఆర్‌లు చూపించి, స్థానికంగా ఉన్న కొందరి వద్ద ఉన్న కార్లు తీసుకెళుతున్నట్లు మాత్రమే సమాచారం ఇచ్చారన్నారు.

ఇంద్రకీలాద్రిపై శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక కుంకుమార్చనలో భక్తులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై శ్రావణ మాస ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంతోపాటు ఉపాలయాలను పూలతో అలంకరించారు. వేకువజామునుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండడంతో అత్యధికులు మల్లికార్జున మహామండపం మెట్ల మార్గం ద్వారా దర్శనం చేసుకున్నారు. కొండరాళ్లు జారిపడే ప్రమాదం ఉన్నందున భక్తులు అప్రమత్తంగా ఉండాలని దేవస్థానం సిబ్బంది మైకులో ప్రచారం చేశారు.

ప్రత్యేక కుంకుమార్చనలు.. దుర్గగుడి రాజగోపుర ప్రాంగణంలో ప్రత్యేక కుంకుమార్చనలను ప్రారంభించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గంటకు ఒక బ్యాచ్ చొప్పున కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రత్యేక కుంకుమార్చన రుసుము ఉభయదాతలకు రూ.1000 నిర్ణయించినట్లు ఈవో శీనానాయక్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ₹ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -114 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

రూ.5 లక్షలకు ముంచేసిన 'ఏంజెల్ వన్'

పెట్టుబడుల పేరుతో యువకుడికి టోకరా

విజయవాడ నేరవార్తలు: వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పడంతో నమ్మిన ఓ యువకుడు 'ఏంజెల్ వన్' అనే పెట్టుబడుల యాప్‌లో రూ. 5 లక్షలు కట్టి నిలువునా మోసపోయారు. డబ్బులు కట్టిన మూడు రోజుల్లోనే యాప్ మూత పడడంతో ఏడాది తరువాత నిందితులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... వెటర్నరీ కాలనీకి చెందిన ఓ యువకుడు (38) 2024 జనవరిలో 'ఏంజెల్ వన్' అనే ట్రేడింగ్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నారు. దాదాపు 6 నెలలు దాని గురించి పట్టించుకోలేదు. 2024, జులై 23న గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి యాప్‌లో పెట్టుబడులు పెడితే అధిక ఆదాయం వస్తుందనడంతో వారి మాటలు నమ్మారు. ఆ యాప్‌లో రూ. 5 లక్షలు పెట్టుబడి పెట్టారు. మూడు రోజుల తరువాత ఆ యాప్‌లో తాను పెట్టిన పెట్టుబడులు కనిపించకపోవడంతో కంగారు పడ్డారు. దీనిపై సైబర్ క్రైం పోర్టల్‌కు ఫిర్యాదు చేశారు. కేసు విజయవాడ సైబర్ క్రైం పీఎస్‌కు రాగా పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు.

పెళ్లి కోసం డిమాండ్లు.. నిరాకరిస్తే బెదిరింపులు

విజయవాడ నేరవార్తలు: ఓ యువతిని వివాహం చేసుకుంటామని చెప్పి అదనపు కట్నం కోసం బెదిరింపులకు పాల్పడిన కుటుంబంపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఉన్నాయి... అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన మహిళ తన కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. విశాఖపట్నానికి చెందిన కొప్పాకి నానాజీతో వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. కట్నం పేరుతో మహిళ ఇంటిని రూ.15 లక్షలకు అమ్మించారు. ఆమెకు చెప్పకుండానే పెళ్లి కుమారుడి కుటుంబ సభ్యులు లగ్నపత్రిక కూడా రాయించేశారు. మరిన్ని డిమాండ్లు పెట్టడంతో ఆ మహిళ పెళ్లి రద్దు చేసుకున్నారు. ఆగ్రహించిన నానాజీ కుటుంబ సభ్యులు ఆమెను అవమానించడమే కాకుండా పెళ్లి కూతురు ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరించారు. తీవ్రమైన మనోవేదనకు గురైన ఆమె న్యాయస్థానంలో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు గురువారం రాత్రి నానాజీ, అతని తల్లిదండ్రులు, బంధువులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ముఖ ఆధారిత హాజరు విడుదలపై ఒత్తిడి తేవద్దు




డీఈవో సుబ్బారావుకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో ఛైర్మన్ సుందరయ్య, కార్యదర్శి రాజు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఉపాధ్యాయుల సంఘం(ఫ్యాప్టో) ఛైర్మన్ ఎ.సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఐ.రాజు విజయవాడ ఎంజీ రోడ్డులోని కార్యాలయంలో ఉన్న జిల్లా విద్యా శాఖాధికారి యు.వి.సుబ్బారావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ ఆధారిత హాజరు జాబితాను 9 గంటలకే విడుదల చేయాలని ఒత్తిడి చేయడంపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, నెట్‌లో అంతరాయాల వల్ల హాజరు జాప్యం జరుగుతోందన్నారు. పదో తరగతి జవాబు పత్రాలు మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు పారితోషకం చెల్లించాలని, జిల్లాలో కొందరు ఎంఈవోలు, ఆదాయ పన్ను టీడీఎస్ సకాలంలో ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సంఘ నాయకులు వి.బీక్షమయ్య, రాంబాబు నాయక్, సయ్యద్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

వేతనాల సమస్యలపై ఆందోళన నేడు...

ఉపాధ్యాయుల వేతనాల సమస్యను పరిష్కరించాలని, బోధనేతర పనులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం 4 గంటలకు విజయవాడలోని డీఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

యూజీ పునఃమూల్యాంకన ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఉపకులపతి రాంజీ, విశ్వవిద్యాలయ అధికారులు

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలోని యూజీ రెండు, నాలుగు సెమిస్టర్ల పునఃమూల్యాంకన ఫలితాలను ప్రకటించారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉపకులపతి ఆచార్య రాంజీ, పరీక్షల నియంత్రణాధికారి పి.వీరబ్రహ్మచారి, రెక్టార్ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఉష ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ రెండు, నాలుగు సెమిస్టర్లకు చెందిన 3,952 మంది విద్యార్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో 817 మంది ఉత్తీర్ణులైనట్టు వెల్లడించారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం మూడు గంటల పాటు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ కోల్డ్ స్టోరేజ్ ప్రాంతం, పెయింట్స్ గోదాము, నల్లకుంట, స్వర్ణ గార్డెన్స్ ప్రాంతంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కాలువ మరమ్మతులు పరిశీలించిన ఎమ్మెల్యే

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని 4వ వార్డు ఎన్నెస్పీ మేజర్ కాలువలో చేస్తున్న మరమ్మతులు, పిచ్చి చెట్ల తొలగింపు పనులను ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. కాలువకు ఇరువైపుల కొందరు స్థలాలు ఆక్రమించి చెత్త, చెదారం అందులో వేయడం ఆయన గుర్తించారు. ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. ఆయకట్టు రైతులకు సాగునీరు సజావుగా చేరేలా చూడాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం


పిచ్చి మొక్కలు తొలగిస్తున్న కార్మికులు

◆ పట్టణంలోని 8వ సచివాలయం పరిధి లోని 15వ వార్డులో ఇందిరా గాంధీ కాలనీలో డ్రెయినేజీలో పూడిక, రోడ్డు పక్కన పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ కె.మనోజ దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె స్పందించి పురపాలిక సిబ్బందితో పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రం చేయించారు.

◆ పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో 7వ వార్డులో కనకదుర్గమ్మ గుడి వీధిలో రహదారి పక్కన పిచ్చి మొక్కలు దట్టంగా ఉన్నాయని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో పరిసరాల్లో పిచ్చి మొక్కలు తీయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు


జి.కొండూరులో..

◆ స్థానిక బీసీ బాలికల వసతి గృహం పక్కనే మురుగు పేరుకు పోయి దుర్వాసన, దోమలతో వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకు రాగా.. ఈ నెల 21న 'మేమున్నాం.. మీకు తోడుగా'లో సమస్య ప్రచురితమైంది. దీంతో స్పందించిన కార్యదర్శి బసవ లింగేశ్వరరావు పారిశుద్ధ్య సిబ్బందితో శుక్రవారం మురుగు, పిచ్చి మొక్కలు తొలగించి బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

పిడుగులు పడతాయ్.. జాగ్రత్త

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

వర్షాకాలంతో పాటు తుపాన్ సందర్భాల్లో ఉరుములు, మెరుపులతో ఏదో ఒక చోట పిడుగులు పడతాయి. తద్వారా ఆస్తి ప్రాణ నష్టం వాటిల్లుతోంది. ఎక్కువగా పశువుల కాపర్లు పొలాల్లో పనిచేసే వ్యవసాయ కార్మికులు పిడుగు పాటుతో ప్రాణాలు కోల్పోతున్నారు. మూగజీవాలు సైతం మృత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

◆ ఇటీవల మండల పరిధిలో దొనబండ, పరిటాల గ్రామాల మధ్య ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్న సమయంలో చెట్ల కింద ఉన్న పొలాల్లో పిడుగు పడటంతో ఎనిమిది జీవాలు మృతి చెందాయి.

◆ ఈలప్రోలు గ్రామంలో కూడా తాటి చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు పూర్తిగా కాలిపోయింది. ఆ సమయం పరిసరాల్లో ఎవరూ లేక పోవడంతో ఎలాంటి దుర్ఘటన జరగలేదు. ఇలా వర్షాకాలంలో జిల్లాలో ఎత్తైన కొండ ప్రాంతాలు పొలాలు చెట్లు ఫోను టవర్లు బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడో ఒక చోట పిడుగులు పడటం సాధారణం. అవి పడే సమాచారాన్ని దామిని, వజ్రపాత్ యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని లొకేషన్ ఆన్ చేసి వాటి సూచనలను అనుసరించి ఏ ప్రాంతంలో పిడుగు పడుతుంది మనం ఎంత వరకు సురక్షితం అనే వివరాలు తెలుసుకోవచ్చు. చాలా మందికి అవగాహన లేక వాటిని ఉపయోగించుకోలేకపోతున్నారని అధికారులు చెబుతున్నారు.

ఇవి అవసరం

ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్న సమయంలో చెట్లకింద ఎత్తైన ప్రదేశాల్లో ఉండకూడదు. వ్యవసాయ పంపు సెట్లకు దూరంగా ఉండాలి. తప్పని పరిస్థితుల్లో ఉండాల్సి వస్తే మోకాళ్ల మధ్య తల వంచి రెండు చేతులతో చెవులు మూసుకుని భూమికి తగలకుండా కూర్చోవాలి. పశు సంపదను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలి. ఆరుబయట ప్రదేశాలు రేకుల షెడ్లు వరండాలో ఉండకూడదు. ఇళ్లలో ఉన్న వారు తలుపులు, కిటికీలు మూసివేసి విద్యుత్తు సరఫరాను నిలిపి వేయాలి.


కాలిపోతున్న తాటి చెట్టు

పరిహారం పొందవచ్చు

పిడుగుపాటుతో మృతి చెందిన గాయపడిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారాలు అందిస్తున్నాయి. మృతుని వివరాలు, పోస్టుమార్టం నివేదిక, ఎఫ్ఐఆర్ తదితర వివరాలతో తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించిన అనంతరం కలెక్టరు కార్యాలయానికి పంపిస్తారు. వాటిని విచారించి అన్ని సమగ్రంగా ఉంటే ఆమోదించి మృతుడి వయస్సు ఆధారంగా నిబంధనల మేరకు నష్ట పరిహారం చెల్లిస్తారని రెవెన్యూ అధికారులు వివరించారు.

హామీలు అమలు చేస్తున్నాం


పెనుగొలనులో సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన తెదేపా నాయకులు

పెనుగొలను, తునికిపాడు, అనుములంక(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెనుగొలను, తునికిపాడు, జింకలపాలెంలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది కాలంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. పెనుగొలను ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. తెదేపా మండల శాఖ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్ రాజేశ్వరరావు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు. ◆ మండలంలోని అనుములంకలో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేశారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు మండల తెదేపా నాయకులు శుక్రవారం హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి కూటమి పాలనలో అమలవుతున్నా సంక్షేమ పథకాలను, త్వరలో అమలు చేయబోయే కార్యక్రమాలు వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు పజ్జూరు రవికుమార్, లంకా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి 27వ డివిజన్ 174వ బూత్ పరిధిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు ధారూనాయక్, పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, ఉమా తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అభివృద్ధితో కూడిన సంక్షేమ పాలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టినట్లు తెదేపా నాయకులు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పంచాయతీలోని పలు వార్డుల్లో తెలుగు యువత నాయకుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. పలువురికి కరపత్రాలను అందజేసి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.


ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు


నివేదికలు పరిశీలిస్తున్న డ్వామా పీడీ


గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక రెండో రోజైన శుక్రవారం కొనసాగింది. పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పూర్వ అధికారులు, సిబ్బంది భారీ అక్రమాలకు పాల్పడినట్లు తనిఖీల ద్వారా వెలుగు చూసినట్లు తెలిసింది. జిల్లా నీటి నిర్వహణ సంస్థ పథక సంచాలకులు ఎ.రాము పాల్గొని ఆయా గ్రామాల నుంచి సామాజిక తనిఖీ సిబ్బంది అందజేసిన నివేదికలను పరిశీలించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై ప్రజావేదిక నిర్వహించారు. వినగడప, సత్యాలపాడు పంచాయతీల్లో జాబ్ కార్డు దారులకు పనులకు రాకుండానే మస్టర్లు వేసి వేతనాలు జమ చేసినట్లు గుర్తించారు. సత్యాలపాడులో ఎఫ్ఏగా నియమించిన వ్యక్తి విదేశాలకు వెళ్లగా ఉపాధి హామీ పథకం అధికారులు అతని భార్యకు అనధికారికంగా ఎఫ్ఏ విధులు అప్పగించినట్లు గుర్తించారు. ఇప్పటికే సదరు సిబ్బందికి డ్వామా పీడీ రాము రూ.లక్షల్లో జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏపీడీ పార్థసారధి, ఏపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫల శోభితుడు.. నెమలి కృష్ణుడు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో మూల విరాట్‌ను పండ్లతో శోభాయమానంగా అలంకరించారు. రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. దాతల ఆర్థిక సౌజన్యంతో దేవతా మూర్తులతో పాటు ఆలయ ప్రాంగణాన్ని అలంకరించినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య తెలిపారు. ఆలయ అర్చకులు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అలంకరించిన దేవతామూర్తులను ఉభయ కృష్ణా, ఖమ్మం జిల్లాలకు చెందిన భక్తులు నేత్ర పర్వంగా దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు కాపూరి శశిరేఖ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

వైభవంగా దీపాలంకరణ సేవ



అష్టోత్తర శత దీపాలంకరణలో అర్చకులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అర్చకులు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో పూజలు

తిరువూరు, ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని రాజుపేట అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు కె.పద్మనాభశాస్త్రి ఆధ్వర్యంలో.. ◆ మండలంలోని ఊటుకూరు కోదండ రామాలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి అర్చకులు రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కొత్తరెడ్డిగూడెంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారి వేంకటేశ్వరశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం రూరల్ మండలం వైఎస్సార్ కాలనీకి చెందిన యలమంచలి నాగశ్రీను రూ.1,01,116 విరాళం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


దాత నాగశ్రీనుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

మురుగు నీరు నిలిచి.. అవస్థలు మిగిలి..


ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

మూలపాడు ప్రధాన రహదారి పక్కన ఆర్‌సీఎం పాఠశాల ప్రాంగణంలో పరిసరాల మురుగు నీరు నిలిచి దుర్వాసనతో పాటు దోమల బెడద అధికంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఈ పాఠశాలను మూసివేశారు. దీంతో పాఠశాల భవనంతోపాటు స్థలంలో వ్యర్థాలతో నిండి వర్షం నీరుతోపాటు పరిసరాల మురుగు నీరు చేరుతుంది. స్థలాలు మెరకగా ఉండడంతో మురుగునీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ సౌకర్యం లేదు. దీంతో ఆవరణ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పాఠశాల స్థలాన్ని మెరక చేసి మురుగు నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

◆ ఈ విషయమై గ్రామ కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రధాన రహదారిని సీసీ రహదారిగా అభివృద్ధి చేస్తుండడంతో మురుగు నీరు బయటకు పోయే మార్గం లేక నిలిచాయని వివరించారు. రహదారి అభివృద్ధి పనులు పూర్తైన తర్వాత మురుగు కాలువలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు.


వ్యర్థాలతో పాఠశాల స్థలం

జి.కొండూరు, న్యూస్‌టుడే: చెవుటూరు బొడ్డురాయి వీధి చివర సీసీ రోడ్డు పైకి మురుగు చేరడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కాలువలు పూడిక తీయక సీసీ రోడ్డు పల్లంగా ఉండడంతో మురుగు నీరంతా రోడ్డు పైకి చేరుతోంది. ఆ నీటి కారణంగా తరచూ వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ కష్టాలు తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


చెవుటూరులో బొడ్డురాయి వీధిలో..

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ4



మాట్లాడుతున్న కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు

కొండపల్లి, న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం చేపడుతున్న పీ4 కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు పేర్కొన్నారు. వార్డు సభ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ4 జాబితా తమ వద్ద ఉందన్నారు. ప్రతి వార్డులో దీనిపై సమగ్ర సమావేశాలు నిర్వహించి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అరుణకుమారి, అమ్మాజీ, నాయకులు కోటేశ్వరరావు, రమేష్, సుభానీ, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు కట్ట ప్రాంతాల పరిశీలన

కొండపల్లి: శాంతినగర్ గండ్లు ప్రాంతాన్ని తహసీల్దారు వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. గత సంవత్సరం బుడమేరు ద్వారా పెద్ద ఎత్తున తరలివచ్చిన నీటికి శాంతినగర్ బుడమేరు వద్ద గండ్లు పడిన సంగతి విదితమే. ఆ ప్రాంతాన్ని ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం బుడమేరు కట్ట ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకొన్న వారికి పలు సూచనలు చేశారు.

మధ్యంతర భృతి చెల్లించాలి



మాట్లాడుతున్న రాజశేఖర్

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి చెల్లించాలని, పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలని పీఆర్‌టీయూ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కోసూరి రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక శాఖ కార్యాలయంలో శుక్రవారం మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు ప్రకటించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన మండల శాఖ అధ్యక్షుడు పి.గోపాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సీహెచ్ సతీష్, రాష్ట్ర కార్యదర్శి ఎ.పుల్లారెడ్డి, జడ్.నరసింహారెడ్డి, వెంకటేష్, నాగేశ్వరరావు, రవీంద్ర, సుప్రియ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ రీసెర్చ్ ఫెలోకు దరఖాస్తులు

మైలవరం: స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయ పరిశోధన సంస్థ (నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్) మంజూరు చేసిన ప్రాజెక్టులో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీసెర్చ్ ప్రాజెక్టు డైరెక్టర్, కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి జె.రాముడు తెలిపారు. రీసెర్చ్ ప్రాజెక్టులో భాగంగా 'ఆంధ్రప్రదేశ్‌లో ఆర్కిడ్ కుటుంబ మొక్కల పరిశోధన'పై మూడేళ్ల పాటు పని చేయాల్సి ఉంటుందని వివరించారు. 28 ఏళ్లలోపు వయస్సున్న, ఎమ్మెస్సీలో బోటనీ, ప్లాంట్ సైన్సెస్, బయో టెక్నాలజీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్, మహిళలకు ప్రభుత్వ నిబంధనల మేరకు సడలింపులు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు ఆగస్టు 10వ తేదీ లోగా rusabotany2024@gmail.com కు దరఖాస్తులు పంపాలని, వివరాలకు కళాశాలలో తమను సంప్రదించవచ్చని సూచించారు.

పరిశుభ్రతా చర్యలతో దోమల నివారణ


సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

మైలవరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో శుభ్రంగా పెట్టుకుంటే దోమలను నియంత్రించవచ్చని జిల్లా వైద్యాధికారిణి సుహాసిని సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వెల్వడం ఎస్సీ ఏరియాలో పర్యటించిన ఆమె పలు ప్రాంతాలను పరిశీలించి స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మోతీలాల్, మండల వైద్యాధికారి సునీల్, పంచాయతీ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రెడ్డిగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మణిబాబు తెలిపారు. శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా రంగాపురం పంచాయతీలోని బూరుగగూడెంలో ఎంపీడీవో టి.కె.వి.రమణ, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకరరావుతో కలిసి పర్యటించి మాట్లాడారు. కార్యక్రమంలో, పీహెచ్‌సీ సిబ్బంది ప్రతాప్, శిరోతేజస్విని, జీనత్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టాలు అవసరం

మైలవరం, న్యూస్‌టుడే: న్యాయవాదులపై జరుగుతున్న భౌతిక దాడులు, బెదిరింపుల నిరోధానికి, న్యాయవాదుల పరిరక్షణకు చట్టాలు చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కార్యదర్శి బుద్ధారపు వెంకట్రావు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక కోర్టు ప్రాంగణంలోని బార్ కార్యాలయం ఎదుట డిమాండ్లతో ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని చర్యలు తీసుకోవాలని కోరారు. మైలవరంలో నూతన కోర్టుల ప్రాంగణ నిర్మాణ అనుమతులు, నిధులు మంజూరు చేయాలన్నారు. న్యాయవాదుల సంక్షేమ నిధి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలు చేయాలని, కోర్టు కాంప్లెక్స్‌ల వద్ద కాలనీలు నిర్మించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ నాయకులు పీవీ శేషగిరిరావు, ఆంజనేయులు, రవికుమార్ రమేష్‌బాబు, జి.శ్రీనివాసరావు, వీటీ కిషోర్, శరత్ బాబు, రాము, తనూజ్, శివ, దివ్యతేజ తదితరులు పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోండి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం పండ్ల తోటలు పెంచేందుకు ఇస్తున్న రాయితీలను సన్న, చిన్న కారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని రెడ్డిగూడెం ఎంపీడీవో టి.కె.వి.రమణ సూచించారు. శుక్రవారం నాగులూరు, పాతనాగులూరు గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల, పూల తోటల పెంపకంపై గ్రామ సభ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకరరావు, ఆర్‌ఐ.జి.పుల్లయ్య, ఉపాధి హామీ పథకం టీఏ శ్రీనివాసరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు అనుమతి


ధ్వంసమైన మళ్లింపు రహదారి

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద మళ్లింపు రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం నుంచి ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఎగువన కురిసిన వర్షాలకు కట్లేరుకు చేరిన వరద నీరు మళ్లింపు రోడ్డుపై ప్రవహించడంతో బుధవారం ఉదయం నుంచి రాకపోకలను పోలీసులు ఆపేశారు. రెండు రోజులుగా వరద నీరు ప్రవహించడంతో మళ్లింపు రోడ్డు ధ్వంసమైంది. మరమ్మతులు చేయిస్తే ప్రమాదం లేకుండా పెద్ద వాహనాలు తిరిగే అవకాశం ఉంది.

కళాశాలకు ప్రింటర్, ఇన్వర్టర్ వితరణ

తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థి, తెలంగాణ రాష్ట్రంలో సీజీఎస్టీ పర్యవేక్షణాధికారి డీవీకే కిశోర్, క్షితిజ దంపతులు శుక్రవారం రూ.46 వేల విలువైన ప్రింటర్, ఇన్వర్టర్ బహూకరించారు. దాత తరపున ఆయన మిత్రులు ఈఎల్‌సీ కేశవరావు, కె.నాగేంద్రరావు, ఎంవీఆర్ నరసింహారావు యంత్రాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.లక్ష్మికి అందజేశారు. కళాశాల అధ్యాపకులు ఆర్.మురళి, జి.నరసింహారావు, అజయ్, విద్యార్థులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల వద్దకు ప్రేమ పంచాయితీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: విస్సన్నపేటకు చెందిన ప్రేమ జంటలోని యువతి ఫొటోతో అసభ్యకరమైన మెసేజ్‌లు పెడుతున్న వెంకీ అనే యువకుడిని విజయవాడ పోలీసులు పట్టుకున్నారు. విస్సన్నపేటకు చెందిన జంట రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వారి వివాహానికి కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. ప్రేమికుడిని అతని కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి పంపేశారు. ప్రేమికుడు తన చరవాణిని ఇంట్లో వదిలేయగా.. దాన్ని వెంకీ అనే యువకుడికి ఇచ్చి అతనికి ఇమ్మన్నారు. వెంకీ ఆ చరవాణిలోని యువతి ఫొటోతో అసభ్యకర సందేశాలు పంపుతున్నాడు. యువతి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ప్రేమ జంటతో పాటు వెంకీని, అతని కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేసి పంపించారు.

జూదరులపై కేసు: జి.కొండూరు, న్యూస్‌టుడే: మునగపాడు శివారులో రేకుల షెడ్డులో 10 మంది జూదమాడుతున్నారని సమాచారం అందుకున్న జి.కొండూరు పోలీసులు శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం పరారైన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు.

ప్రొఫెషనల్ చెఫ్‌లు.. మీ ఇంటికే!

ఆత్మీయులు ఇంటికి వచ్చే వేళ..
ప్రేమను పంచేందుకు వంటిల్లే వేదిక!
ఇలాంటి సమయంలో వంట
కుదరదేమోనని.. అందరికీ నచ్చేలా
చేయలేమనే భయం
వెంటాడడం సహజం!
దీనికి పరిష్కారంగా..
ప్రొఫెషనల్ చెఫ్‌లు ఇంటికే వస్తే?
అందుబాటు ధరల్లోనే కమ్మటి
రుచులు పంచితే?

ఇంట్లో చిన్న పార్టీ.. పండుగ.. నోము.. బంధువుల ఆగమనం.. ఇలా సందర్భం ఏదైనా విందు మాత్రం సాధారణం. అయితే అక్కడే వస్తుంది అసలు దిగులంతా..! వారి కోసం ఏం వండాలి? ఎలా వండాలి? ఒక వేళ వండితే కుదురుతుందా? అంతమందికి చేయగలమా? అనే ఆలోచనలు. స్టార్ హోటల్ నుంచి తెప్పించాలనుకున్నా.. బిల్లు తడిసి మోపెడవుతుందని వెనుకడుగు వేస్తాం. వీటన్నింటికీ చెక్ పెడుతున్నాయి కొన్ని సంస్థలు. ఇంటికే స్టార్, ప్రొఫెషనల్, ట్రెయిన్డ్ చెఫ్‌లను పంపుతున్నారు. వీరంతా పాకశాస్త్రంలో 5-20 ఏళ్ల లోపు అనుభవం ఉన్నవాళ్లే. ఒకరిద్దరు మొదలు 50 మందికి పైగా అతిథులొచ్చే కార్యక్రమాల వరకు వీళ్లు వంటావార్పు చేస్తారు. హైదరాబాద్, దిల్లీ, ముంబయి, బెంగళూరు నగరాల్లో ఉన్న సేవలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విస్తరిస్తున్నాయి.



హైదరాబాద్ బిర్యానీ మొదలు... అమెరికన్ బర్గర్ల దాకా...

ఆయా కార్యక్రమాలు, మన ఎంపికకు తగ్గట్టు పదార్థాల్ని తయారు చేస్తారు. మనకు నచ్చేలా...అతిథులు మెచ్చేలా దేశీయ వంటకాలు మొదలు...ఆధునిక ఆహార పదార్థాల వరకు వండి పెడతారు. ఉత్తర, దక్షిణ భారత రుచులు, చైనా, ఇటాలియన్, అమెరికన్, ఫ్రెంచ్, కాంటినెంటల్, థాయ్, మెక్సికన్, కొరియన్ సహ వివిధ దేశాలకు సంబంధించిన వైవిధ్య వంటకాలు, స్వీట్లు, హాట్లు, సూపులూ..ఎక్కడా తగ్గేదే లే అన్నట్లు రుచిచూపిస్తారు. వివిధ రకాల బిర్యానీలు, తలాయ్‌లు, 'లైవ్ బార్బిక్యూ', ప్రత్ కా ఖానా(పూజలు, నోముల్లో ఉపవాసం అనంతరం తినే ఆహారం) కూడా చేస్తారు. మన అవసరాన్ని బట్టి టిఫిన్లు మొదలు రాత్రి భోజనాల వరకు వీరిని పిలిపించుకోవచ్చు. coox, bookmychief లాంటి యాప్‌లలో వీరిని సంప్రదించొచ్చు!

ఛార్జి ప్రత్యేకం..

వీరు ఛార్జి చేసే ధరలు దిగువ మధ్యతరగతి నుంచి అన్ని వర్గాల వారికీ అందుబాటులో ఉండడంతో చాలా మంది వీటిపైపు మొగ్గుతున్నారు. ఎంత మందికి, ఏయే వంటకాలు వండాలనే దాన్ని బట్టి ధరలు మారుతుంటాయి. వీరి సేవల ప్రారంభ ధర రూ.999 ఉంటే...సాధారణ వంటవాళ్ల ధర రూ.299 ఉంది. కార్యక్రమాన్ని బట్టి ఆయా సంస్థల యాప్, వెబ్‌సైట్ లేదా ఫోన్ ద్వారా కనీసం ఒక రోజు ముందు తెలియజేసినా సరిపోతుంది.

- ఈనాడు, అమరావతి

పూజారికి కారం నీళ్లతో అభిషేకం



తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో ఉన్న పెరియకరుప్పు ఆలయంలో కొన్నేళ్లుగా ఓ వింత ఆచారం కొనసాగుతోంది. ఏటా ఆడి అమావాస్యను పురస్కరించుకుని ఇక్కడి పూజారికి కారం, పచ్చి మిరపకాయలు కలిపిన నీళ్లతో అభిషేకం చేసి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. గురువారం ఆడి అమావాస్య రావడంతో 108 కిలోల కారం, ఆరు కిలోల పచ్చి మిరపకాయలు కలిపిన నీళ్లతో పూజారి గోవిందన్‌కు అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ఆలయ ప్రాంగణంలో మాంసాహార విందు ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, చెన్నై(విల్లివాక్కం)

మత్తు తలకెక్కె.. కారు గోడెక్కె



ఇంటి ప్రహరీపై కనిపిస్తున్నది బొమ్మ కారు కాదు.. ఇది సినిమా స్టంట్ అంతకంటే కాదు.. అచ్చంగా నిజమైన కారే అది. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో నడపడంతో అదుపు తప్పి గాల్లో గిరగిరా తిరిగి పక్కనే ఇలా ఓ ఇంటి ప్రహరీపైకి ఎక్కింది. హైదరాబాద్‌లోని మల్లంపేట కేవీఆర్ వ్యాలీ కాలనీకి చెందిన సురేందర్ మద్యం మత్తులో గురువారం అర్ధరాత్రి బౌరంపేట నుంచి మల్లంపేట వైపు కారులో అతివేగంగా వెళ్తున్నారు. 12.20 గంటల ప్రాంతంలో మహేశ్వరం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రాయిని బలంగా ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా గాల్లోకి లేచిన కారు బొంగరంలా తిరుగుతూ పక్కనే ఉన్న జీతయ్య ఇంటి గోడ పైకి వెళ్లి ఆగింది. భారీ శబ్దం రావడంతో ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారు ఆందోళనకుగురై బయటకు వచ్చారు. గోడ పైన కారు ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. కారులో ఉన్న సురేందర్‌ను వారే కిందకు దించారు. ఎలాంటి గాయాలు కాకపోవడంతో సమీపంలోని అతడి ఇంటికి తీసుకువెళ్లి దిగబెట్టారు. శుక్రవారం ఉదయం క్రేన్ సాయంతో గోడపై ఉన్న కారును కిందకు దించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు దుండిగల్ ఎస్సై రామ్మోహన్‌రెడ్డి వెల్లడించారు.

– న్యూస్‌టుడే, దుండిగల్

దేశానికీ ఉంది.. '0' మైలురాయి



గ్రామాలకు, పట్టణాలకు, నగరాలకు సున్నా '0' (జీరో) మైలురాయి ఉంటుందని అందరికీ తెలిసిందే. మన దేశానికి కూడా మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో జీరో మైలురాయి ఉంది. ఆంగ్లేయుల పాలన సమయంలో 1907లో దేశవ్యాప్తంగా భూభౌతిక సర్వే చేశారు. అప్పటికే పెద్దనగరాలుగా ఉన్న దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, హైదరాబాద్, కోచి, పుణెలకు నాగ్‌పుర్ మధ్య స్థానంలో ఉంటుందని లెక్కగట్టారు. అక్కడే జీరో మైలురాయిని ఏర్పాటు చేసి, పైతొమ్మిది నగరాలకున్న దూరాన్ని రాశారు. పక్కన ఆరున్నర మీటర్ల ఎత్తుతో ఎరుపు రాయితో స్తూపాన్ని నిర్మించారు. దానికి సమీపంలోనే రాతితో చెక్కిన నాలుగు గుర్రాలు ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానికి ముందు దేశంలో ఎక్కడి దూరాన్ని కొలవాలన్నా దీన్నే ఆధారంగా చేసుకునేవారు. తర్వాత మధ్యప్రదేశ్‌లోని కరుండి, బర్సాలీ అనే గ్రామాలను తీసుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, సారంగాపూర్

ఇక్కడ తినొచ్చు.. చదవొచ్చు!



ఇది ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దులోని వెల్లూరు ప్రధాన జాతీయ రహదారి పక్కన ఉన్న ఉడిపి హోటల్. వినియోగదారులకు రుచికరమైన ఆహారాన్ని మాత్రమే కాకుండా, విజ్ఞానాన్ని సైతం అందిస్తోంది. ఆహారం ఆర్డర్ చేసినప్పటి నుంచి అది టేబుల్‌పైకి వచ్చే వరకు ఉన్న ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అందులో తమిళం, తెలుగు, ఆంగ్ల భాషలకు చెందిన ఆధ్యాత్మిక, విజ్ఞాన, ఆరోగ్య, చిన్నారుల పుస్తకాలు ఉన్నాయి. తమ ప్రయత్నానికి వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తోందని నిర్వాహకులు తెలిపారు. – ఈనాడు, హైదరాబాద్

టెక్నాలజీ 'నాటు'కుంది!



వరి నాట్లు వేస్తున్న ఈ కూలీలు ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం సమీప చల్లపల్లికి చెందిన వారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం సాలర్‌పూర్‌లో నాట్లు వేయడానికి వచ్చారు. 30 మంది బృందంగా ఉన్న వీరు రోజూ 6 నుంచి 7 ఎకరాల్లో నాట్లు వేస్తామని, ఒక్కొక్కరికి రూ.1200 వరకు కూలీ దక్కుతుందన్నారు. తాము ఎంత విస్తీర్ణంలో నాట్లు వేస్తున్నామనే విషయాన్ని సెల్‌ఫోన్‌లోని 'జీపీఎస్ ఏరియల్ కాలిక్యులేటర్' యాప్ ఉపయోగించి ఇలా కొలుచుకుంటున్నారు. – ఈనాడు, హైదరాబాద్

పర్యావరణ ప్రమాదాలను పసిగట్టే టైగర్ బీటిల్స్




పర్యావరణ ప్రమాదాలను పసిగట్టే టైగర్ బీటిల్స్‌పై తిరుపతి ఐసర్ ఆచార్యులు పరిశోధనలు చేశారు. ఇవి అరుదుగా కనిపించే కీటకాలు. టైగర్ బీటిల్ క్వెస్ట్ ఇండియా-2025లో భాగంగా తిరుపతి ఐసర్ పరిశోధకులు సహా తమిళనాడు, ఒడిశా పరిశోధకులు క్షేత్రస్థాయి శోధనల్లో ఎనిమిది రకాల టైగర్ బీటిల్స్ జాతులను గుర్తించారు. ఈ కీటకాలపై 12 రాష్ట్రాల నుంచి 80 మంది పరిశోధకులు మొత్తం 4,170 డాక్యుమెంట్లను టైగర్ బీటిల్ క్వెస్ట్ ఇండియాలో నేచరల్ లిస్ట్‌లో సమర్పించారు. ఒక్క తిరుపతి ఐసర్ నుంచే 600కు పైగా డాక్యుమెంట్లు పొందుపరిచారు. ఈ కీటకాలు విలక్షణమైన రెక్కలు కలిగి జనాభా కదలికలకు అనుగుణంగా ఆవాసాలను మార్చుకుంటాయి. – న్యూస్‌టుడే, ఏర్పేడు

దేవుడికి కానుకగా వెండి రివాల్వర్!



ఈటీవీ భారత్: రాజస్థాన్‌లోని చిత్తౌడ్‌గఢ్ జిల్లాలో గల ప్రసిద్ధ సావరియా సేఠ్ ఆలయంలో మూలవిరాట్టుగా వెలసిన శ్రీకృష్ణుడికి ఓ అజ్ఞాత భక్తుడు వెండి రివాల్వరు, తుపాకీ గుండు కానుకగా సమర్పించాడు. ఈ రెండూ కలిపి దాదాపు అర కిలో ఉన్నాయి. వీటితోపాటు రెండు వెండి వెల్లుల్లిపాయలను కూడా హుండీలో వేశాడు. దేవుడికి ఓ ఆయుధాన్ని కానుకగా సమర్పించడం ఇదే మొదటిసారని ఆలయ ఛైర్మన్ జానకీదాస్ తెలిపారు. గతేడాది రాజస్థాన్‌లో వెల్లుల్లి ధర భారీగా పెరిగింది. బహుశా ఎవరైనా రైతు వెల్లుల్లి పంటతో భారీ లాభాలు ఆర్జించి స్వామివారికి ఇలా సమర్పించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇక్కడి శ్రీకృష్ణుడిని సంపదకు అధిపతిగా 'సేఠ్' అని పూజిస్తారు.



పసుపు కొమ్ముల అలంకరణలో కనకమహాలక్ష్మి

పసుపు కొమ్ములే అమ్మకు పగడపు దండలై!

శ్రావణ తొలి శుక్రవారం సందర్భంగా విజయనగరం జిల్లా చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. అర్చకులు వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఎండిన పసుపు కొమ్ముల మధ్యలోంచి అమ్మవారు ప్రశాంత వదనంతో భక్తులకు దర్శనం ఇచ్చారు.

– న్యూస్‌టుడే, చీపురుపల్లి

వాక్యూమ్ క్లీనర్‌కు అన్న.. చెత్త ట్రక్కులకు తమ్ముడు!



బ్యాటరీతో నడిచే వాక్యూమ్ క్లీనర్



చెత్త ఇలా డబ్బాలో పోగవుతుంది

వాక్యూమ్ క్లీనర్ కంటే పెద్దగా.. చెత్త ట్రక్కులకంటే చిన్నగా ఉన్న విద్యుత్తు స్కూటర్ నగర శుభ్రతలో కీలక భూమిక పోషిస్తోంది. లారీలతో రోడ్లు, ఇతర రద్దీ ప్రదేశాలను శుభ్రం చేయాలంటే ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని విజయవాడలో ఈ స్కూటర్లను రంగంలోకి దించారు. ఒకరు దానిపై నిల్చొని నడుపుకొంటూ.. గొట్టంతో చెత్తను వెనుక ఏర్పాటు చేసిన బుట్టలో పడేలా చేయొచ్చు. వాక్యూమ్ క్లీనర్ సాంకేతికతే ఇందులో ఉంది. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఇలాంటివి 2 వాహనాలు ఉన్నాయి. పోలీస్ కంట్రోల్ రూం నుంచి బెంజ్ సర్కిల్, బెంజ్ సర్కిల్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు ఇవే శుభ్రం చేస్తున్నాయి. చిన్నగా ఉండటంతో గల్లీల్లోకీ వీటిని తీసుకెళ్లొచ్చు. – ఈనాడు, అమరావతి

బ్యాగూ చూపుతుంది... మీ 'స్టేటస్'



తమ ఆలోచనలను, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే కొటేషన్లు, ఎమోజీలు, ఫొటోలను చాలామంది వాట్సప్, ఇన్‌స్టాల స్టేటస్‌లలో పోస్టు చేస్తుంటారు. ఇలాంటి వారి కోసం ముఖ్యంగా యువతను ఆకట్టుకునేందుకు కొన్ని సంస్థలు డిజిటల్ డిస్‌ప్లేలతో కూడిన బ్యాగులను తయారు చేస్తున్నాయి. అలాంటి ల్యాప్‌టాప్ బ్యాగ్‌తోనే ఓ యువకుడు హైదరాబాద్ అబిడ్స్‌లో 'ఈనాడు' కెమెరాకు చిక్కారు. అతన్ని పలకరించగా... "మా బంధువు ఒకరు బ్యాంకాక్ నుంచి బహుమతిగా తెచ్చారు. రూ.6 వేల ధరతో ఆన్‌లైన్‌లోనూ దొరుకుతోంది. బ్యాగ్‌పై రెండు డిజిటల్ డిస్‌ప్లే తెరలున్నాయి. వీటిని పవర్ బ్యాంక్‌తో అనుసంధానించారు. ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే మూడు రోజులు పనిచేస్తుంది. బ్యాగ్ తయారు చేసిన కంపెనీ యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. మనకి నచ్చిన బొమ్మలు, నినాదాలు, ఫొటోలు డిస్‌ప్లేలో వచ్చేలా చేసుకోవచ్చు" అని అన్నారు. – ఈనాడు, హైదరాబాద్



సాగర గర్భం నుంచి స్పష్టంగా సంభాషణ!



జలాంతర టెలిఫోన్ యంత్రం

ఈనాడు, చెన్నై: కొన్ని కిలోమీటర్ల లోతున్న సముద్రగర్భం నుంచి అత్యంత స్పష్టంగా మాట్లాడడం, రియల్‌టైమ్‌లో సందేశాలు పంపడాన్ని పరిశోధకులు సాధ్యం చేస్తున్నారు. ఈ వ్యవస్థను సులువైన భాషలో 'అండర్‌వాటర్ టెలిఫోన్ (జలాంతర టెలిఫోన్)' అని చెబుతున్నారు. సముద్రగర్భంలో పరిశోధన చేసేందుకు, అక్కడి వాస్తవాల్ని, జీవవైవిధ్యాన్ని తెలుసుకునేందుకు భారత ప్రభుత్వం 'మత్స్య 6000' ప్రాజెక్టు చేపట్టింది. ఈ బాధ్యతను చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీకి అప్పగించింది. సంస్థ పరిశోధకులు సముద్రగర్భంలో 6,000 మీటర్ల లోతుకు వెళ్లేలా సబ్‌మెర్సిబుల్‌ను రూపొందించారు. అంత లోతుకు వెళ్లినప్పుడు.. వారి క్షేమ సమాచారం, పరిశోధన అంశాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి కదా? అందుకోసమే ఈ టెలిఫోన్ వ్యవస్థ తెచ్చారు. సముద్రగర్భం నుంచి వారితో నేరుగా మాట్లాడేలా ఎన్ఐఓటీ ఏర్పాట్లు చేస్తోంది. దీని ప్రాథమిక ప్రయోగం ఇటీవల సఫలమైంది.

ఆవిష్కరణకు 'రెక్కలు' తొడిగి..



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఈరబోయిన శ్రీచైత్ర, ఈరబోయిన మధుప్రియ, మాలోతు సుప్రియలు గైడ్ టీచర్ సంపత్‌కుమార్ మార్గదర్శకంలో 'స్మార్ట్ వాష్ బేసిన్'ను తయారు చేశారు. స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2025 ఆన్‌లైన్ వైజ్ఞానిక ప్రదర్శనల్లో 27 అత్యుత్తమ ఆవిష్కరణల జాబితాను ప్రకటించగా అందులో ఇదీ ఉంది. దిల్లీలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో వీరి ఆవిష్కరణను ప్రదర్శించనున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలవటంతో అభినందించి, వారి ప్రయాణానికి వీలుగా విమాన టికెట్లను బుక్ చేశారు. ఈ నెల 27న హైదరాబాద్ - దిల్లీ విమానంలో వీరు ప్రయాణం చేయబోతున్నారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం, విమానంలో ప్రయాణం చేయనుండటంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. –న్యూస్‌టుడే, గంభీరావుపేట

బయటికొచ్చి చూస్తే కనిపిస్తాయి అందాలెన్నో!



ఉద్యోగాలు, ఉపాధి కోసం గ్రామాల్ని విడిచి.. హైదరాబాద్ నగరవాసులైన వారి మనసులో అప్పుడప్పుడు ఆ గ్రామీణ వాతావరణం.. ఆ పచ్చని కొండలు తీపిజ్ఞాపకాలుగా దొర్లుతుంటాయి. నగరానికి చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ అలాంటి అందాలకు కొదవలేదనేలా కనువిందు చేస్తున్నాయి రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని బోడకొండ గ్రామం, పరిసర తండాలు. నగరానికి 25 కి.మీ. దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిస్తే కొండల నుంచి నీరు జాలువారుతూ ఆహ్లాదాన్ని పంచుతాయి. వీటిని చూడడానికి, ప్రకృతి ఒడిలో సేదతీరడానికి నగరం నుంచి యువత పెద్ద సంఖ్యలో వస్తుంటారు. – ఈనాడు, హైదరాబాద్

మొక్కలకూ స్కానింగ్



వైద్యుడు... రోగి చెప్పిన నొప్పుల వివరాలు, తాను గమనించిన లక్షణాల ఆధారంగా వ్యాధిని అంచనా వేస్తారు. వ్యాధి తీవ్రతను కచ్చితంగా నిర్ధారించడానికి స్కానింగ్ చేయిస్తారు. మొక్కల అంతర లక్షణాలను తెలుసుకునేందుకు ఇలాగే స్కానింగ్ చేయగలిగితే ఎంత బాగుంటుందో అన్న ఇక్రిశాట్ ఆలోచన... వ్యవసాయ పరిశోధనల్లో గేమ్ ఛేంజర్‌లా భావిస్తున్న 'లీసీ స్కానర్'ను ఆవిష్కరించింది. భారత్‌తో సహా దక్షిణాసియా దేశాల్లోని పరిశోధన, విత్తన సంస్థల్లో తప్పనిసరి యంత్రంగా మారింది.

పంటలు, మొక్కలు, చెట్లను శాస్త్రవేత్తలు సాధారణంగా తమ కళ్లతో పరిశీలించి చీడపీడలు, తెగుళ్ల లక్షణాలను గుర్తిస్తారు. తర్వాత ప్రయోగశాల్లో పరిశోధనలు చేసి మందులను తయారు చేస్తున్నారు. ఈ సంప్రదాయ విధానంతో అధిక సమయంతోపాటు ఖర్చులూ గణనీయంగా పెరుగుతున్నాయి. దీనికి పరిష్కారంగా ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు.. నెదర్లాండ్స్‌కు చెందిన బయోటెక్ సంస్థ ఫినోస్పెక్స్‌తో కలిసి లీసీ స్కానర్‌ను కనిపెట్టారు. నెలలు, సంవత్సరాల సమయం తీసుకునే వివిధ పంట రకాల (బ్రీడింగ్ లైన్స్) పరిశోధన ఫలితాలను ఏఐతో పనిచేసే ఈ స్కానర్ కొన్ని వారాల్లోనే అందిస్తోంది. వ్యవసాయ పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విత్తన సంస్థలు, జన్యుబ్యాంకులు దీన్ని వాడేందుకు ముందుకొస్తున్నాయి.

◆ స్కానింగ్ చేయాల్సిన ప్రాంతానికి వాహనంలో స్కానర్‌ను తీసుకెళ్లి వైరు మీదుగా వచ్చేలా క్రేన్‌కు అమరుస్తారు. ఈ చతురస్రాకార స్కానర్‌కు ఎనిమిది ప్లాంట్ ఐఆర్ కెమెరా(స్కానర్)లు అమర్చారు.

◆ మొక్కల ఎత్తు, ఆకుల విస్తీర్ణం, కోణం వంటి ముఖ్యమైన లక్షణాలను ఇది నిమిషాల్లోనే నిర్ధారిస్తుంది. మొక్కలను నష్టపరచకుండా వాటిని స్కాన్ చేయడం ఇందులో ప్రత్యేకత.

◆ కరవు, వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటూ, ఆహార భద్రతను సాధించడానికి అవసరమైన వంగడాల అభివృద్ధికి 'లీసీ స్కానర్' మార్గం సుగమం చేస్తుంది.

–హిమాన్షుపాఠక్, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్

–ఈనాడు, హైదరాబాద్

'బంగారు'తల్లికి కృత్రిమ చేయి



ఏపీలోని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చొరవతో దివ్యాంగురాలైన విద్యార్థినికి కృత్రిమ చేయి ఏర్పాటు చేశారు. మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో 12వ తరగతి చదువుతున్న విద్యార్థిని హెచ్‌యూ శివానికి పుట్టుకతో కుడిచేయి సగం లేదు. అయినా ఒక్క చేతితోనే ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పారా క్రీడా పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. ఇటీవల శివానిని అభినందించిన కలెక్టర్ శ్రీధర్ కృత్రిమ చేయి ఏర్పాటుకు సహకరించాలని కడప రిమ్స్ ఉపసంచాలకుడు కృష్ణకిశోర్‌కు సూచించారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థినికి ఆర్థో విభాగం వైద్యుడు జగదీష్ కృత్రిమ చేతిని అమర్చారు. – న్యూస్‌టుడే, మదనపల్లె విద్య

వసుంధర

vasundhara@eenadu.in

టెక్ నెక్ బాధిస్తోందా?



మెడ పట్టేసిందా... పక్కకి తిప్పలేకపోతున్నారా.. భుజాల్లోనూ వీపు పై భాగంలోనూ నొప్పిగా ఉందా? అయితే మీరు 'టెక్ నెక్' బారినపడ్డారన్నమాటే. అదేపనిగా తల కిందకి వంచి ఫోన్‌లోకి చూడటం, టెక్స్ట్ చేయడం లేదా ల్యాప్‌ట్యాప్‌లో పనిచేయడంతో వస్తుందీ సమస్య. దీన్నే 'టెక్స్ట్ నెక్' అనీ అంటారు. ఆయా భాగాల్లోని కండరాలు సంకోచించడం, నరాలమీద పడే ఒత్తిడి వల్ల మెడని ఎటూ కదపలేం సరికదా నొప్పి వస్తుంది. దీర్ఘకాలం పాటు పట్టించుకోకుండా వదిలేస్తే తలని పక్కకి తిప్పలేకపోవడమే కాదు, వయసు పెరిగేకొద్దీ వెన్ను సమస్యలూ, చేతుల వరకూ తిమ్మిర్లూ వస్తాయి. ఆడామగా ఇద్దరికీ ఈ సమస్య ఉన్నప్పటికీ ఆడవాళ్లలోనే ఇది ఎక్కువట. మగవాళ్లతో పోలిస్తే ఆడవాళ్లలో మెడ కండరాలు చిన్నగా ఉండటంతోపాటు బెడ్ మీద కూర్చొని పనిచేయడం వల్ల ఇవి ఒత్తిడికి గురవుతాయి. నెలసరి లేదా మెనోపాజ్‌ల్లో హార్మోన్ల హెచ్చుతగ్గులూ ఈ సమస్యకు మరో కారణం.

ఎలా తగ్గించుకోవాలి?

తలను కిందకీ పైకీ కాకుండా భుజాలకు సమతుల్యంగా ఉంచి నిటారుగా కూర్చోవాలి. స్క్రీన్‌కీ మీ కళ్లకీ మధ్య 20-30 అంగుళాల దూరం ఉండాలి. మధ్యమధ్యలో స్క్రీన్ నుంచి విరామం తీసుకుని మెడనీ భుజాలనీ కదిలించాలి. కంప్యూటర్ మానిటర్ లేదా ఫోన్ స్క్రీన్‌ని కంటికి ఎదురుగా ఉండేలా చూసుకోవాలి. సీటులో కూర్చున్నప్పుడు మోకాళ్లను తుంటికి సమాంతరంగా ఉంచి, పాదాలను నేలకు ఆనించాలి. మధ్యమధ్యలో లేచి మెడనీ, భుజాలనీ కదిలిస్తూ చిన్న చిన్న వ్యాయామాలు చేయడం ద్వారా కండరాల్లో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. అప్పటికీ తగ్గకపోతే వైద్యుల్ని సంప్రదించాల్సిందే.

శ్రామిక శక్తిలో మహిళలు ఎందుకు పెరగాలంటే...

1. మహిళలు అన్ని ఉద్యోగాలకూ పురుషులతో సమానమైన అర్హులు. వృత్తిలో వాళ్లు తెచ్చే వైవిధ్యం, సృజనాత్మక కోణం సంస్థల ఎదుగుదలకు అవసరం.
2. మహిళలు మంచి ఆర్థిక నిపుణులు. పొదుపు, మదుపుల్ని పాటిస్తూనే పిల్లల చదువులు, ఆరోగ్యం, నైపుణ్యాల మెరుగుకు ఖర్చు చేస్తారు.
3. ఎక్కువమంది మహిళలు శ్రామికవర్గంలో ఉంటేనే మనం అభివృద్ధి చెందిన దేశంగా మారగలం.



\- సౌందర్యా రాజేష్, వ్యవస్థాపకురాలు, అవ్‌తార్ గ్రూప్

మా ఇంట్లో... బ్రహ్మకమలం పూసింది!



బ్రహ్మకమలం

'రమా... ఈరోజు మా ఇంట్లో రాత్రి పదీ పన్నెండు గంటల మధ్య బ్రహ్మకమలం విరుస్తుంది. చూడ్డానికి రండి...' ఆశ్చర్యపోకండి. అసలే శ్రావణమాసం... నోములూ వ్రతాలూ వాయినాల పిలుపుల సమయం... అలా వినిపిస్తోన్న మరో కొత్త పిలుపే ఇది. కొందరైతే ఆ దేవతాపుష్పానికి పసుపు, కుంకుమలతో పూజలు చేసి, తాంబూలం ఇస్తున్నారు. ఈ సంగతెలా ఉన్నా... ఓ పువ్వు అర్ధరాత్రి మాత్రమే విచ్చుకుని ఉదయానికల్లా ముడుచుకుపోవడం నిజంగా అపురూపమే. అందుకే ఆ పువ్వుకంత ప్రాధాన్యం. అయితే అది నిజంగా బ్రహ్మకమలమేనా... కాకపోతే అసలైనది ఏది... దాని ప్రత్యేకత ఏమిటీ..!

ఏది నిజం?



ఆర్కిడ్ కాక్టస్

ఈమధ్య చాలామంది ఇంటి బాల్కనీల్లోనూ బ్రహ్మకమలాన్ని పెంచుతున్నారు. కానీ ఇది నిజమైనది కాదు. కాక్టస్ కుటుంబానికి చెందిన ఈ మొక్కని ఆర్కిడ్, లీఫ్, క్లైంబింగ్ కాక్టస్, క్వీన్ ఆఫ్ నైట్ అని పిలుస్తారు. శాస్త్రీయ నామం 'ఎపిఫిల్లమ్ ఆక్సీపెటాలమ్'. దక్షిణ, మధ్య అమెరికాల్లో ఎక్కువగా పెరిగే ఈ కాక్టస్ పువ్వు రాత్రివేళల్లో గుబాళిస్తూ విచ్చుకుంటుంది. ఒక్క ఆకు తెచ్చి పెట్టినా బతికే ఈ కాక్టస్‌ను కుండీల్లో సులభంగా పెంచుకోవచ్చు. అయితే పరోక్ష సూర్యకాంతి తగిలేలా చూసుకోవాలి. తామర, కలువ పువ్వుల్ని తలపించే రూపం, రాత్రివేళల్లోనే విచ్చుకోవడం వల్ల దీన్నే బ్రహ్మకమలంలా భావిస్తున్నారంతా.

ఇక, అసలు సంగతికొస్తే... పవిత్రమైనదిగా భావించే బ్రహ్మకమలం హిమాలయ శ్రేణుల్లో 3,000- 4,500 మీటర్ల ఎత్తులో పెరుగుతుంది. కేదార్‌నాథ్, హేమకుండ్ సాహిబ్, తుంగనాథ్, వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ ప్రాంతాల్లో కనిపిస్తుంది. ఇది ఉత్తరాఖండ్ జాతీయ పుష్పం కూడా. తెల్లని తామరపువ్వును పోలి ఉండే ఈ దివ్య కుసుమం జులై- సెప్టెంబరు మధ్యలో విరుస్తుంది. శాస్త్రీయనామం సొసూరియా అబ్వల్లాట. ఏ తెల్లవారుజామునో వికసించి, తెల్లవారేసరికి వాడిపోయి, రేకలూ ఊడిపోతాయట. విచ్చుకున్న స్థితిలో ఈ పువ్వును చూడటం అరుదు. అందుకే విరిసేటప్పుడు ఈ పువ్వును చూడటం అదృష్టంగా భావిస్తారు స్థానికులు. ఆ సమయంలో దాన్ని చూస్తూ మనసులో ఏదైనా కోరుకుంటే నెరవేరతుందనీ విశ్వసిస్తారు. స్థానిక తెగలు ఈ పూలు విచ్చుకునే సీజన్‌లో పాటలు పాడుతూ నృత్యం చేస్తూ వేడుకలూ చేసుకుంటారట. మొగ్గగానే కోసి ఆలయ పూజల్లోనూ సమర్పిస్తారు. ఈ బ్రహ్మకమలం మొక్కను సంప్రదాయ వైద్యంలోనూ వాడతారు. దాంతో ఇది వృక్ష శాస్త్రజ్ఞుల్నీ ఆకర్షిస్తోంది. అయితే ఇది పెరిగే ప్రదేశాల్లో మానవ సంచారం ఎక్కువవడంతో ఈ మొక్క అంతరించిపోయే జాబితాలో చేరింది. సో, హిందూ పురాణాల ప్రకారం చెప్పే బ్రహ్మకమలం ఏదో అర్థమైంది కదూ!

చీరకట్టి... ప్రపంచ వేదికపై సగర్వంగా నిలిచి!



అందం, ప్రతిభ, సాంస్కృతిక విభిన్నతలే ప్రధానంగా జరుగుతాయి మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్ పోటీలు. తాజాగా దుబాయ్ వేదికగా జరిగిన ఈ అంతర్జాతీయ పోటీల్లో మన దేశ సంస్కృతీ పతాకను ప్రపంచ వేదికపై సగర్వంగా నిలిపారు.. సాహితీ శీలం, పల్నాటి దిశ.

దేశసేవే లక్ష్యం...



దిశది విశాఖపట్నం. నాన్న కెప్టెన్ పీఎస్ రవి కుమార్, నౌకాదళాధికారి. అమ్మ వాలెంటీనా. 'ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధించొచ్చ'నే అమ్మ మాటలే తనకు స్ఫూర్తి. అందుకు తగ్గట్టే భరతనాట్యం, తైక్వాండో... ఇలా అన్నింటిలో శిక్షణ ఇప్పించారు ఆమె తల్లిదండ్రులు. ఆ ప్రోత్సాహమే ఇప్పుడు పలు దేశాల నుంచి వచ్చిన వారితో పోటీపడి నిలబడేలా చేసింది. దిశకు ఎనిమిదేళ్లప్పుడు మొదటిసారి విశాఖలోని డాల్ఫిన్ హోటల్‌లో జరిగిన అందాలపోటీ ఆడిషన్స్‌లో పాల్గొంది. 2014లో దక్షిణాఫ్రికాలో నిర్వహించిన లిటిల్ మోడల్ ఎర్త్, 2017 టర్కీలో జరిగిన లిటిల్ మిస్ యూనివర్స్ పోటీల్లో పాల్గొనటం... తనలో ఆత్మవిశ్వాసం నింపాయి. ఈ ఏడాది దుబాయ్‌లో మిస్ అండ్ మిస్టర్ సీ వరల్డ్ పోటీలకు ఎంపికైన దిశ, అయిదు దశల్లో, నాలుగింటిలో ప్రతిభ చూపడంతో అన్ని కేటగిరీల విజేతగా సూపర్‌గ్రాండ్ ప్రిగా ఎంపికైంది. ఉత్తమ కాస్ట్యూమ్ విభాగంలో చీరకట్టుతో ప్రదర్శన ఇచ్చింది. జాతీయ పక్షి నెమలిని తలకి పెట్టుకుని దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా చేసిన ప్రదర్శన ఉత్తమంగా నిలిచింది. ఈ పోటీల్లో గెలిస్తే ఏంచేస్తావు, పర్యటకం అభివృద్ధికి ఏంచేస్తారు వంటి ప్రశ్నలకు సమాధానం ఇచ్చి అందరి మెప్పునీ పొందింది. అలాగే ఉత్తమ టాలెంట్ విభాగంలోనూ మూడు నిమిషాల నిడివి నృత్యంతో అలరించింది. సముద్ర జంతువులకు సంబంధించిన విభాగంలోనూ ప్రతిభ చూపింది. ఇలా... మిస్ గ్రాండ్ సీ వరల్డ్ 2025, మిస్ టీన్ గ్రాండ్ సీ 2025, బెస్ట్ నేషనల్ కాస్ట్యూమ్ అవార్డు, బెస్ట్ టాలెంట్ పర్ఫార్మెన్స్ వంటి టైటిళ్లు అందుకుంది. 'అన్ని విభాగాల్లో విజయం సాధించాక అక్కడ అందరూ ఇండియా.. ఇండియా అంటుంటే నాకు చాలా గర్వంగా అనిపించిందనే దిశ... చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. పది, ఇంటర్‌లోనూ 90 శాతానికి పైగానే మార్కులు సాధించింది. 'అందాల పోటీల్లో పాల్గొనడం నాకొక హాబీ మాత్రమే. నౌకాదళంలో చేరి దేశ సేవ చేయడమనేది నా లక్ష్యం' అంటోన్న ఈమె ప్రస్తుతం ఇంజినీరింగ్ చదువుతోంది. తల్లిదండ్రులు పిల్లల్ని అన్నింటిలో పాల్గొనేలా చేసి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తే గొప్పగా రాణిస్తారనడానికి దిశ ఓ ఉదాహరణ కదా!

\- సురేశ్ రావిపలస, విశాఖపట్నం

మిస్ కృష్ణా నుంచి మిసెస్ క్లాసిక్ దాకా...





విజయవాడలో పుట్టిపెరిగిన సాహితికి మన సంప్రదాయాలు, కట్టుబాట్లు అంటే ప్రాణం. ఆ అభిరుచే 49 ఏళ్ల వయసులో చీరకట్టులో 20 దేశాల ప్రత్యర్థులతో తలపడి నిలిచేలా చేసింది. నాన్న ఇరిగేషన్ శాఖలో ఉద్యోగి. అమ్మ గృహిణి. చిన్నతనం నుంచి మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలన్న ఆలోచనలు ఉండేవి. 1995లో ఆయుర్వేద వైద్య విద్య(బీఏఎంఎస్) చదివే రోజుల్లో మిస్ కృష్ణా పోటీల్లో విజేతగా నిలిచారు. ఆయుర్వేద వైద్య విద్యలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. కేవలం వైద్యురాలిగా కాకుండా సేవా కార్యక్రమాల్లోనూ మేటిగా నిలిచారు. 'వేదకర్మ నైపుణ్య శిక్షణ' అనే సంస్థ ద్వారా ఇప్పటి వరకు 28వేల మందికి పైగా నిరుద్యోగ యువతకు పంచకర్మలో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే జనశిక్షణ సంస్థకు ప్రస్తుతం వైస్ ఛైర్మన్‌గా సేవలందిస్తున్నారు. ఇందులో 8వరకు చదివి మానేసిన మహిళలకు వృత్తి విద్యల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఈ సంస్థ ద్వారా ఏటా దాదాపు 5వేల మంది యువతులు, మహిళలకు ఉపాధి చూపిస్తున్నారు. 'విమెన్ ఆంత్రప్రెన్యూర్ ఇండస్ట్రియల్ పార్క్' సంస్థకు ఉపాధ్యక్షురాలిగానూ పని చేస్తున్నారు. ఇందులోనూ వ్యాపారాలు చేయాలనుకునే మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, బ్యాంకు రుణాలు ఇప్పిస్తారు. ఫార్మా రంగంలో సామాజిక బాధ్యత, ప్రకృతి హిత విధానాలను అనుసరించినందుకు 2021లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్త అవార్డుతో సత్కరించింది. తాను ప్రపంచ వేదికలపై ప్రశంసలు పొందడానికి భర్త బాల సుబ్రహ్మణ్యం ప్రోత్సాహం ఎంతో ఉందని చెబుతున్నారు సాహితీ. ఈమె ఇంటర్వ్యూయర్, ఫ్యాషన్ ఐకాన్ రౌండ్లలో గెలిచి, మిసెస్ క్లాసిక్‌గా నిలిచారు. ఫ్యాషన్ ఐకాన్ రౌండ్‌లో తెలుగుదనానికి గీటురాయిగా నిలిచే చీర కట్టుకుని.. చీర గొప్పతనం, చేనేత కార్మికుల కష్టం గురించి వివరించి ఆకట్టుకున్నారు. భారతీయ కట్టుబాట్లు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, పిల్లల్ని పెంచే విధానం వంటి అంశాల గురించి ఆమె వివరించిన తీరు అందర్నీ ఆకర్షించింది.

\- ఉప్పాల రాజాపృథ్వీ, అమరావతి

కర్టెన్లే కదా... అనుకోవద్దు!



ఇంటిని అందంగా కనిపించేలా చేయడంలోనూ, ఎండ, చలి... వంటివాటి నుంచి రక్షణ కల్పించడంలోనూ కర్టెన్ల అవసరం ఎంతో! చాలామంది వీటిని వాడతారు కానీ... ఓ పట్టాన శుభ్రం చేయరు. అలా అశ్రద్ధ చేస్తే అలర్జీలు, శ్వాసకోశ సమస్యలూ తప్పకపోవచ్చు అంటారు వైద్యులు. ఇందుకోసం జాగ్రత్తలివి...

- కర్టెన్లపై దుమ్ము ఎక్కువగా చేరుతుంది కాబట్టి ఏ రోజుకారోజు దులపాలి. వాటిని వారానికోసారైనా తడిపిన మైక్రోఫైబర్ వస్త్రంతో తుడిస్తే సరి. అలానే, వాక్యూమింగ్ చేసేటప్పుడు క్లీనర్‌పై బ్రష్ అటాచ్ చేస్తే దుమ్ము పేరుకుపోకుండా ఉంటుంది.
- పరదాల్ని శుభ్రం చేయాలనుకున్నప్పుడు ఫ్యాబ్రిక్ తీరుని బట్టి... చేత్తో ఉతకాలా? మెషీన్ వాష్ చేయాలా అన్నది నిర్ణయించుకోండి. మరీ దుమ్ము పేరుకుపోయింది అనుకుంటే బ్లీచ్‌ని ఉపయోగించొచ్చు. అయితే, అది మరింత పెళుసుబారకుండా ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్ తప్పక వాడాలి.
- మరకలు పడితే... గోరువెచ్చని నీళ్లు, వైట్‌వినెగర్ మిశ్రమాన్ని సమానంగా కలిపి బ్రష్ చేయాలి. దీంతో మురికి వదలడమే కాదు... సూక్ష్మక్రిములూ నశిస్తాయి
- కర్టెన్లను మెషీన్‌లో ఉతికితే... టంబుల్ డ్రైయింగ్ చేయొద్దు. అవి ముడతలు పడిపోతాయి. వీలైనంతవరకూ పాక్షికంగా నీడ, గాలి బాగా తగిలే చోట ఆరబెడితే మేలు.

మానసిక స్థిరత్వానికి... మేరుదండాసనం



మ్యాట్‌పైన కాళ్లు చాచి నిదానంగా కూర్చోండి. తర్వాత నెమ్మదిగా రెండు కాళ్లను అరికాళ్లు తాకేలా(బద్ధకోణాసన ఆకృతిలో) దగ్గరగా మడవండి. ఇప్పుడు రెండు చేతులతో బొటనవేళ్లను పట్టుకోండి. ఆపై శరీరాన్ని తోక ఎముక(కోకిక్స్)పైన బ్యాలెన్స్ చేస్తూ కొంచెం వెనక్కి వంచుతూ రెండు కాళ్లను వెడల్పుగా విస్తరిస్తూ పైకి చాచండి. చేతులు, కాళ్లు ఎక్కడా వంపు లేకుండా చూడాలి. నడుమును వీలైనంత పైకి సాగదీస్తూ వెన్నెముకను నిటారుగా ఉంచండి. శరీరాన్ని బ్యాలెన్స్ చేయడానికి దూరంగా ఉండే ఏదో ఒక స్థిర బిందువుపైన దృష్టిని కేంద్రీకరించండి. దీర్ఘమైన శ్వాసలు తీసుకోవాలి. ఇలా 10-15 సెకన్లు ఉండే ప్రయత్నం చేయండి. తర్వాత నిదానంగా మోకాళ్లను వంచి, రెండు పాదాల్నీ నేలపైన ఆన్చి, రెండు చేతుల్ని వదిలి చక్కగా కాళ్లను చాచి విశ్రాంతి పొందండి.

జాగ్రత్తలు: వెన్ను, మోకాళ్ల సర్జరీలు అయినవారు వైద్యుల సలహాతో చేయాలి.

ఉపయోగాలు: కాళ్లు, చేతుల కండరాలను బలోపేతం చేస్తుంది. మానసిక, శారీరక దృఢత్వం, స్థిరత్వం పెంచుతుంది. ఉదర కండరాలను బలోపేతం చేస్తుంది. శ్వాసకోశ వ్యవస్థకు, జీర్ణవ్యవస్థకు, రక్త ప్రసరణకు ఈ ఆసనం తోడ్పడుతుంది.

ఆహారం: మంచి శ్వాసవ్యవస్థకు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆకుకూరలు, పసుపు, అల్లం, గింజలు, ఫైబర్ విటమిన్-సి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. బాదం, చియా సీడ్స్, అవిసె గింజలు, విటమిన్-ఇ తీసుకోవాలి.

శ్వాసకోశ సమస్యలకు లింగముద్ర



మ్యాట్‌పైన పద్మాసనం, వజ్రాసనం లేదా సుఖాసనంలో కూర్చోండి. రెండు చేతులను ఛాతీకి దగ్గరగా తీసుకొచ్చి వేళ్లు ఒకదానితో ఒకటి పెనవేసేలా ఇంటర్‌లాక్ చేయండి. కుడి చేతి బొటనవేలిని పైకి లేపి చాచి ఉంచండి. ఎడమ చేతి బొటనవేలు, చూపుడు వేలుని కుడి చేతి బొటనవేలు చుట్టూ ఉంచే విధంగా లాకింగ్‌లో ఉండాలి. నెమ్మదిగా కళ్లు మూసి ఉంచి శ్వాసమీద ధ్యాస పెట్టాలి. ఇలా 10-15 సెకన్లు ఉండే ప్రయత్నం చేయండి. తర్వాత నిదానంగా చేతులు కిందకు దించి కళ్లు మూసుకుని విశ్రాంతి తీసుకోండి.

ఉపయోగాలు: శ్వాసకోశ సమస్యలకు మంచి ఆసనం. బొటనవేలు అగ్నికి సంకేతం ఇది శరీరానికి వేడినిస్తుంది. వర్షాకాలం, శీతకాలంలో వచ్చే ఇన్‌ఫెక్షన్లని, శ్వాసకోశ సమస్యలను అడ్డుకుంటుంది. ఒత్తిడి, నిరాశలను దూరం చేస్తుంది. బరువు తగ్గడంలో సహకరిస్తుంది.

జాగ్రత్తలు: అధిక శరీర ఉష్ణోగ్రత ఉన్నవాళ్లు చేయరాదు. వేసవిలో చేయకపోవడం మంచిది.

\- శిరీష, యోగ గురు

బంగారం - వెండి



25న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,01,290	92,500	1,17,233
విజయవాడ	98,840	92,100	1,18,700
ప్రొద్దుటూరు	98,700	90,800	1,17,750
రాజమహేంద్రవరం	1,00,480	92,100	1,28,000
విశాఖపట్నం	1,00,100	92,100	1,20,000
తమిళనాడు	-----	92,100	1,28,000

మీకు తెలుసా?


పరక్ రాష్ట్రీయ సర్వేక్షన్ (గతంలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)సంస్థ అధ్యయనం ప్రకారం.. మనదేశంలో 6, 9 తరగతులు చదువుతోన్న పిల్లల్లో ఎక్కువమంది ప్రాథమిక గణితం, భాషా అవగాహన, సైన్స్ కాన్సెప్ట్‌లను అర్థం చేసుకోవటంలో ఇబ్బంది పడుతున్నారట.



ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

ఆన్‌లైన్ డిజైనర్!



సోనా

చిన్న ఆలోచనతో వ్యాపారస్థులుగా మారుతున్నవారు ఎందరో! కానీ తొలి రోజుల్లో ఉండే కష్టాలే వేరు. యాడ్‌లు, బ్యానర్లు, సోషల్‌మీడియా ప్రమోషన్... అంటూ బోలెడు సిద్ధం చేసుకోవాలి. అందరికీ ఆ పరిజ్ఞానం ఉండాలని లేదు కదా! వాళ్లకి సాయపడితే అన్న ఆలోచన వచ్చింది సోనా జే ఒడియప్పన్‌కి. దానికి ఏఐని జోడించి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

ఇంజినీరింగ్‌లో గోల్డ్ మెడలిస్ట్ సోనా. ఈమెది బెంగళూరు. కానీ యూఐ, యూఎక్స్ డిజైనింగ్‌పై మనసు పారేసుకుంది. నేర్చుకుని ఎన్నో ఎంఎన్‌సీలు, స్టార్టప్‌లతో కలిసి పనిచేసింది. ఈ క్రమంలో ఎన్నో అవార్డులూ అందుకుంది. పెద్ద సంస్థలకు ప్రత్యేకంగా డిజైనర్, డిజైనింగ్ టీమ్‌లూ ఉంటాయి. చిన్న వాళ్ల పరిస్థితేంటన్న ఆలోచన వచ్చింది సోనాకి. దానికి తక్కువ వ్యవధిలో పరిష్కారం చూపాలంటే ఏఐతోనే సాధ్యమని నమ్మింది. స్నేహితుడు రామ్ గణేశన్‌తో కలిసి 'సివి.ఏఐ' ప్రారంభించింది. యాడ్స్, బ్యానర్స్, సోషల్ మీడియా పోస్టులు, యూట్యూబ్ థంబ్‌నెయిల్స్ వంటివన్నీ రూపొందించుకోవచ్చు. ఏమేం కావాలి, ఎలా కావాలన్న సూచనలు ఇస్తే చాలు. ఫొటోలు, నచ్చిన రంగులు, ఇన్ఫోగ్రాఫ్‌లతో సహా కావాల్సినవి తయారు చేసుకోవచ్చు. కొన్ని నిమిషాల్లో పూర్తవడమే కాదు, నచ్చిన భాషలోనూ చేసుకునే వీలుంది. 72కుపైగా భాషల్లో చేసుకునే వీలు కల్పిస్తున్నారు. పైగా రెండు నిమిషాల్లోనే పూర్తి చేసి ఇస్తుంది.

'డిజైనర్‌గా 14ఏళ్ల అనుభవం. పెద్ద సంస్థలతో పనిచేసేటప్పుడు చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఆన్‌లైన్ సాయం తీసుకున్నా కొన్ని టెంప్లేట్స్‌కే పరిమితం అవ్వాల్సి వచ్చేది. పైగా ఒక్కోదాన్నీ డిజైన్ చేయడానికి చాలా సమయం వెచ్చించాల్సి వచ్చేది. కానీ చిన్న సంస్థలకు వీటిపై ఇంత అవగాహన ఉండదు. డిజైనింగ్ పని సులువవుతూ, చిన్న ఆంత్రప్రెన్యూర్లకూ సాయపడొచ్చనే 'సివి'ని తీసుకొచ్చాం. అందుకే దీన్ని మీ వర్చువల్ డిజైనర్ అనీ చెబుతుంటాం' అంటుంది సోనా. 'సివి'కి సోనా చీఫ్ డిజైన్ ఆఫీసర్ (సీడీఓ) కూడా. తన వినూత్న ప్రయత్నంతో పెట్టుబడులు అందుకోవడమే కాదు, అవార్డులనూ అందుకుంది సోనా. వీళ్ల సంస్థ ఫోర్బ్స్... '200 గ్లోబల్ పొటెన్షియల్ బిజినెసెస్' జాబితాలో చోటునీ దక్కించుకుంది.

ఫ్యాషన్ ప్యాషన్

పట్టు... వేసుకోండి నచ్చినట్టు!









ముచ్చటపడి వేసుకునే సంప్రదాయ దుస్తులేవని ఏ అమ్మాయినైనా అడగండి. చీర, పరికిణీ- ఓణీల పేర్లే చెప్పేస్తారు. పట్టువైతే మరీ మరీ ఇష్టంగా వేసుకుంటారు. అమ్మ, బామ్మల అలనాటి చీరలను ముచ్చటపడి లంగా ఓణీగా కుట్టించుకుని మురిసిపోయేవారూ ఎక్కువే. ఎంత ఇష్టమైతేనేం... వేసుకునేది మాత్రం అరుదుగానేగా! ఒకసారి వేశామంటే 'అరెరే మొన్నేగా ఫలానా ఫంక్షన్‌కి వేశా'మని పక్కన పెడతాం. కొన్నిసార్లు ఈ సందర్భానికి తగదంటూ లోపలే ఉంచేస్తాం. అందుకే ఎన్నేళ్లయినా అలా ఎదురుచూస్తూ బీరువాల్లో దాగి ఉంటాయవి. అలాంటి వాటికీ మోడరన్ టచ్ ఇచ్చేస్తున్నారు డిజైనర్లు. పట్టుని లాంగ్ ఫ్రాక్‌లుగా తీసుకురావడం మనకు తెలిసిందే. సంప్రదాయ వస్త్రంగా అది కబోర్డులోనే దాగొద్దని కొత్త హంగులు అద్దేస్తున్నారు. లాంగ్‌ఫ్రాక్‌నే రెండు మూడు రకాలుగా వేసుకునేలా తీసుకొస్తున్నారు. కోట్, లెహంగా, ఓణీలా మార్చుకునేలా రూపొందిస్తున్నారిలా. సందర్భాన్నిబట్టి డ్రెస్‌ని డిసైడ్ చేసుకోవచ్చన్నమాట. నిన్న, మొన్ననే వేసుకున్నామన్న సాకులూ అడ్డుకావు. చిన్న మాయతో డ్రెస్ రూపం మార్చేస్తూ వేసుకునే ఈ వీలు భలేగుంది కదూ! ఇంకేం మెచ్చిన పట్టును నచ్చిన రీతిలో డిజైన్ చేసుకోండి మరి!

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు ప్రమాణం నేడు



కుటుంబ సమేతంగా పణజీకి బయలుదేరుతున్న అశోక్ గజపతిరాజు

ఈనాడు, విజయనగరం: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా శనివారం ప్రమాణం చేయనున్నారు. అక్కడి రాజ్‌భవన్ నుంచి ఏడీసీ అభిషేక్ ఈ నెల 23న విజయనగరం చేరుకున్నారు. కుటుంబ సమేతంగా అశోక్ శుక్రవారం ఉదయం గోవా రాజధాని పణజీకి బయలుదేరారు. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే శనివారం ఉదయం 11.30 గంటలకు అశోక్ గజపతిరాజుతో ప్రమాణం చేయిస్తారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మంత్రివర్గ సభ్యులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు.

రాజ్యసభ సభ్యుడిగా కమల్‌హాసన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమల్‌హాసన్

చెన్నై, న్యూస్‌టుడే: మక్కల్ నీది మయ్యం(ఎంఎన్ఎం) పార్టీ అధినేత, నటుడు కమల్‌హాసన్ శుక్రవారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ప్రమాణం చేయించారు. తమిళనాడు నుంచి రాజ్యసభకు ఎన్నికైన డీఎంకేకు చెందిన న్యాయవాది విల్సన్, కవయిత్రి సల్మా ఎలియాస్ రాజాత్తి, ఎస్.ఆర్.శివలింగం కూడా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో విల్సన్ రాజ్యసభకు మళ్లీ ఎన్నికయ్యారు. రాజ్యసభలో తమిళనాడుకు చెందిన ఆరుగురు సభ్యుల పదవీకాలం ఇటీవల ముగిసింది. దీంతో జూన్ 19న వారి స్థానంలో కమల్‌హాసన్ సహా ఆరుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అన్నాడీఎంకే ఎంపీలు ఇన్బదొరై, ధనపాల్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం.

పాదపూజ చేసినా.. కనికరించని పతిదేవుడు

బెంగళూరు(గ్రామీణం), న్యూస్‌టుడే: భీమన అమావాస్య.. గురువారం మధ్యాహ్నం ఆమె ఇంట్లో ఎంతో భక్తితో పూజలు చేసి, కుటుంబ సంప్రదాయం ప్రకారం కంకణం కట్టుకుని భర్తకు పాదపూజ చేసి ఆశీర్వచనాలు అందుకుంది. 'వీటికేం తక్కువ లేదు.. తేవాల్సిన కట్నం జాడ మాత్రం కానరాదు..' అంటూ ఆయన దెప్పిపొడుస్తుంటే పంటిబిగువనే తన బాధను అణుచుకుంది. మధ్యాహ్నం చెల్లితో తన బాధనంతా పంచుకుంది. 'ఈ ఇంట్లో నా చావంటూ సంభవిస్తే.. దానికి అభిషేక్‌తో పాటు ఈ ఇంటి వారందరికీ పాపం ఉన్నట్లే' అంటూ సెల్‌ఫోన్ చాటింగ్‌లో వాపోయింది. 'అలాంటిదేమీ ఉండదులే అక్కా..' అని చెల్లి సర్దిచెప్పినా, పరిస్థితి చేయిదాటిపోయింది. రాత్రి 8.30 గంటలకంతా ఆ ఇంట మృత్యు గంట మోగింది! పెళ్లయిన ఏడాదిలోపే ఆమె ఊపిరి వదిలింది. ప్రేమించి వివాహం చేసుకున్న భార్య స్పందన(22)ను గురువారం రాత్రి హత్య చేసి.. దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించిన ఆరోపణలపై అభిషేక్ అనే వ్యక్తిని బెంగళూరు శివారు మాదనాయకనహళ్లి ఠాణా పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. భార్యతో పాదపూజ చేయించుకుని.. చివరికి కట్నం కోసం హత్య చేశాడని స్పందన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెను ఉరి బిగించి హత్య చేసి, ఆత్మహత్యగా చెబుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడి నుంచి వివరాలు రాబట్టేందుకు పోలీసులు విచారణ చేపట్టారు.

యూట్యూబ్ చూసి బరువు తగ్గేందుకు ప్రయత్నం

అస్వస్థతకు గురై 17 ఏళ్ల విద్యార్థి మృతి

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: అధిక బరువు తగ్గించుకునేందుకు కఠినమైన ఆహార నియమాలు పాటించి ఓ విద్యార్థి మృతిచెందిన ఘటన తమిళనాడు రాష్ట్రంలోని కన్నియాకుమరిలో చోటుచేసుకుంది. కుళచ్చల్ సమీపంలోని పర్లట్టివిళై గ్రామానికి చెందిన నాగరాజన్ కుమారుడు శక్తీశ్వరన్(17) ఇటీవల ప్లస్‌టూలో ఉత్తీర్ణత సాధించి ఇంజినీరింగ్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. శక్తీశ్వరన్ గురువారం ఇంట్లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా శ్వాస సమస్య ఏర్పడి స్పృహ కోల్పోయారు. వెంటనే తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని తల్లిదండ్రులను విచారించారు. తమ కుమారుడు అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నట్లు వారు తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లనున్న నేపథ్యంలో తోటి విద్యార్థులు ఎగతాళి చేస్తారేమోనని భావించాడని, దీంతో ఎలాగైనా బరువు తగ్గాలని నిర్ణయించుకొని యూట్యూబ్ వీడియోల ఆధారంగా కఠిన ఆహార నియమాలు పాటించినట్లు చెప్పారు. మూడు నెలలుగా కేవలం నీళ్లు, పండ్ల రసాలు మాత్రమే తాగుతూ వ్యాయామం చేస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో జలుబు ఎక్కువై, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడి మరణించినట్లు వాపోయారు.



పోరాటయోధుడిలా ఆలోచిస్తేనే గెలుపు!

మీరు జీవితంలో గెలవాలంటే- ఎల్లప్పుడూ పోరాటయోధుడిలా ఆలోచించండి. ఒత్తిడిలో కూడా ప్రశాంతంగా ఉండండి. ఎవరూ చూడని సమయంలోనూ మీ పని మీరు చేస్తూ వెళ్లండి. ప్రశంసలను కాంక్షించకండి. మీ మనస్థితి ఎలా ఉన్నా.. పని విషయంలో వెనక్కి తగ్గకండి. జీవితం పెట్టే పరీక్షలకు బెదరకండి.

– ఫ్రెడో, మైండ్‌సెట్ కోచ్

16 డిస్టిలరీల ముడుపులే రూ.1,677 కోట్లు

- ఐదేళ్లలో ఆ సంస్థలకు ఏపీఎస్‌బీసీఎల్ నుంచి రూ.10,835.37 కోట్ల మద్యం ఆర్డర్లు
- సిట్ దర్యాప్తులో గుర్తింపు



ఈనాడు, అమరావతి: మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి రూ.3,500 కోట్లకు పైగా ముడుపులు కొల్లగొట్టిన వైకాపా మద్యం ముఠా పెద్దలు.. ప్రధానంగా 16 కంపెనీల నుంచి రూ.1,677.68 కోట్ల మేర వసూలు చేసినట్లు సిట్ గుర్తించింది. 2019-24 మధ్య ఆ కంపెనీలకు రూ.10,835.37 కోట్ల విలువైన మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టి వారి నుంచి భారీగా లబ్ధి పొందినట్లు తేల్చింది. జగన్ జమానాలో ఐదేళ్లలో ఏపీఎస్‌బీసీఎల్ రూ.23,838.35 కోట్ల విలువైన సరఫరా ఆర్డర్లు ఇచ్చింది. ఏపీఎస్‌బీసీఎల్ వద్ద 111 సంస్థలు రిజిస్టర్ అవ్వగా.. వాటిలో 40 కంపెనీలకే 90 శాతం ఆర్డర్లు కట్టబెట్టింది. ఫలితంగా వాటినుంచి రూ.3,500 కోట్ల మేర ముడుపులు మద్యం ముఠాకు చేరాయి. కీలకమైన 16 సంస్థల నుంచి రూ.1,677 కోట్ల ముడుపులు ఎలా తీసుకున్నారో సిట్ తేల్చింది. వాటిలో కొన్ని రాజ్ కెసిరెడ్డి బినామీలేనని నిగ్గుతేల్చింది. రాజ్ కెసిరెడ్డి ఈ బినామీ కంపెనీలకు భారీ మొత్తంలో తానే ఆర్డర్లు ఇచ్చుకుని, మిగతా కంపెనీల మాదిరిగానే బిగ్ బాస్‌కు ముడుపులు చెల్లించారని సిట్ నిర్ధారించింది. ఆ వివరాల్ని ప్రాథమిక అభియోగపత్రంలో ప్రస్తావించింది.

ముడుపులు ఇలా తీసుకున్నారు..

'ఏపీఎస్‌బీసీఎల్ నుంచి సొమ్ము జమ అయిన వెంటనే ముడుపుల మొత్తాల్ని డిస్టిలరీలు ముడి సరకు కొనుగోలు, బ్రాండ్ ప్రమోషన్ పేరిట పలు సంస్థల ఖాతాల్లోకి మళ్లించేవి. వారి నుంచి నగదు విత్‌డ్రా చేయించి ఆ మొత్తాన్ని ముడుపులుగా చెల్లించేవి. తర్వాత వైకాపా ముఠా ఈ డబ్బును స్థిరాస్తి రంగంలోనూ, డొల్ల కంపెనీల్లోనూ పెట్టేది. హవాలా ద్వారా అంతిమ లబ్ధిదారుకు చేర్చేది..' అని సిట్ తేల్చింది.

ఏ కంపెనీ ఎవరిది?

1. **అదాన్ డిస్టిలరీస్:** రాజ్ కెసిరెడ్డి, విజయసాయిరెడ్డిలు వారి బినామీలను డైరెక్టర్లుగా పెట్టి ఏర్పాటు చేసిన సంస్థ. తర్వాత పూర్తిగా రాజ్ కెసిరెడ్డి గుప్పిట్లోకి చేరింది. ఎస్పీవై డిస్టిలరీస్‌ను సబ్‌లీజుకు తీసుకుని అదాన్ సుప్రీం బ్లెండ్ విస్కీ తయారు చేసింది.
2. **లీలా డిస్టిలరీస్:** ఎస్ఎన్‌జే షుగర్స్ అనుబంధ సంస్థ. ఆ డైరెక్టర్లను బెదిరించి రాజ్ కెసిరెడ్డి తన ఆధీనంలో పెట్టుకున్నారు. పురుషోత్తం వరుణ్‌కుమార్‌ను (ఏ-40) ఏపీ హెడ్‌గా నియమించి భారీగా దోచుకున్నారు. లీలాస్ బ్రిలియెంట్ బ్లెండ్ సుపీరియర్ గ్రెయిన్ విస్కీ, బ్రిటిష్ ఎంపైర్ ప్రీమియం మెచ్యూర్డ్ బ్రాండ్లు తయారు చేయించారు.
3. **యూవీ డిస్టిలరీస్:** రాజ్ కెసిరెడ్డి బినామీ సంస్థ. హైదరాబాద్‌లోని అరేట్ ఆసుపత్రిలో డైరెక్టర్లుగా ఉన్న తీగల ఉపేందర్‌రెడ్డి, తీగల విజేందర్‌రెడ్డిల పేరిట దీన్ని ఏర్పాటు చేశారు.
4. **పీవీ స్పిరిట్స్ డిస్టిలరీస్ ఎల్ఎల్‌పీ:** రాజ్ కెసిరెడ్డి బినామీ సంస్థ. తన తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి బంధువైన సోమ రామ్మోహన్‌రెడ్డి పేరుతో దీన్ని నెలకొల్పారు. అవినాష్‌రెడ్డి తల్లి ముప్పిడి రూపిణీరెడ్డితో పెట్టుబడి పెట్టించినట్లు చూపించారు.
5. **ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్:** మద్యం కుంభకోణం కేసు నిందితుడు (ఏ-6) సజ్జల శ్రీధర్‌రెడ్డి డైరెక్టర్‌గా కొనసాగిన కంపెనీ. ఈ డిస్టిలరీ కార్యకలాపాల పునరుద్ధరణ కోసం మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డిలు అరబిందో గ్రూపు ద్వారా రుణం ఇప్పించారు. దారుహౌస్ ఎక్స్‌వో బ్రాందీని ఎస్పీవై ఉత్పత్తి చేసింది. వైకాపా ముఠా దీన్ని సబ్‌లీజుకు తీసుకుని అనేక బ్రాండ్లను తయారు చేయించి.. ఏపీఎస్‌బీసీఎల్‌కు అమ్మింది.
6. **శర్వాణీ ఆల్కో బ్రూ:** వైకాపా ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితులైన ఎనుకొండ చంద్రారెడ్డి, టీకే మహేశ్వర్‌సింగ్‌లు దీని డైరెక్టర్లు. వైకాపా హయాంలో అత్యంత వివాదాస్పదమైన ఆంధ్రగోల్డ్ విస్కీని వీరే సరఫరా చేశారు.
7. **ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్:** తమిళనాడు వాసులకు చెందిన ఈకంపెనీకి అత్యధిక ఆర్డర్లు దక్కాయి.
8. **తిలక్‌నగర్ ఇండస్ట్రీస్:** బంగారం రూపంలో ముడుపులు చెల్లించి ఆర్డర్లు దక్కించుకున్న కంపెనీ.
9. **అంబర్ స్పిరిట్స్:** అత్యధికంగా ఆర్డర్లు దక్కించుకున్న కంపెనీల్లో ఒకటైన ఈ సంస్థలో భూపతిరాజు వెంకటేశ్వరరాజు, కౌశిక్ అమరవాది, రవితేజ అమరవాది, అల్లూరి శ్రీనివాసరాజు డైరెక్టర్లు. వర్చుసో బెవరేజెస్‌లో నీలగిరి శంకర్‌రావు, అమరవాది కౌశిక్ డైరెక్టర్లు. వాహిని డిస్టిలరీస్‌లో నీలగిరి శంకర్‌రావు, టీకే మహేశ్వర్ సింగ్ డైరెక్టర్లు. ఈ 3 కంపెనీలకు సంబంధాలున్నాయి. ముడుపులిచ్చి ఆర్డర్లు దక్కించుకున్నాయి.
10. **బృందావన్ మార్కెటింగ్ ఏజెన్సీస్:** జువ్వాది సుజిత్‌రావు అనే వ్యక్తి చూసేవారు. ఆయన మద్యం ముఠాలో లైజనింగ్ నిర్వహించుకుని ఆర్డర్లు పొందారు.

ఏ కంపెనీకి ఎంత సొమ్ము జమచేశారు? వారి నుంచి ఎంత ముడుపులుగా తీసుకున్నారు?.. వివరాలు https://epaper.eenadu.net లో

వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ

- సుబ్రహ్మణ్యం హత్య కేసులో తదుపరి దర్యాప్తుపై 'స్టే'కు నిరాకరణ
- ఎస్సీ, ఎస్టీ కోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని వెల్లడి



ఈనాడు, అమరావతి: కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడు, వైకాపా ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కర్ (అనంతబాబు)కు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేసేందుకు దర్యాప్తు అధికారికి(ఐఓ) అనుమతి ఇస్తూ రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను 'స్టే' చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఆ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది. తదుపరి దర్యాప్తు చేయడానికి మాత్రమే కింది కోర్టు అనుమతి ఇచ్చిందని గుర్తుచేసింది. ఇప్పటికే ఈ కేసులో అనంతబాబు నిందితుడిగా ఉన్నారని తదుపరి దర్యాప్తు చేస్తే ఆయనపై ప్రతికూల ప్రభావం ఏమీ ఉండదని పేర్కొంది. తదుపరి దర్యాప్తు పేరు చెప్పి.. పునర్ దర్యాప్తు(రీ ఇన్వెస్టిగేషన్) చేస్తారేమోనని అనంతబాబు తరఫు సీనియర్ న్యాయవాది సి.రఘు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో.. ఈ విషయమై స్పష్టత ఇస్తూ ఉత్తర్వులిస్తామని మౌఖికంగా తెలిపింది. హైకోర్టు సింగిల్ జడ్జి శుక్రవారం ఈ మేరకు స్పష్టంచేశారు.

★ వైకాపా ప్రభుత్వ హయాంలో 2022 మే 19న డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని అనంతబాబు హత్యచేసి మృతదేహాన్ని డోర్‌డెలివరీ చేశారనే ఆరోపణలతో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఎమ్మెల్సీ ఒక్కరినే పోలీసులు నిందితుడిగా చేర్చారు.

కొత్త అంశాలు వెలుగులోకి రాలేదు: పిటిషనర్ తరఫు న్యాయవాది

ఎస్సీ, ఎస్టీ కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలని అనంతబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు. "ఈ కేసులో కొత్త అంశాలు, ఆధారాలు వెలుగులోకి రాకుండా 'తదుపరి దర్యాప్తు' జరపాల్సిన అవసరం లేదు. మృతుడి తల్లి సందేహం వ్యక్తం చేసినంత మాత్రాన దర్యాప్తు జరపడానికి వీల్లేదు" అని అన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. తదుపరి దర్యాప్తు చేస్తే పిటిషనర్‌పై ప్రతికూల ప్రభావం ఏమీ ఉండదన్నారు. సుబ్రహ్మణ్యం తల్లి వ్యక్తంచేసిన సందేహంలో లాజిక్ లేకపోలేదన్నారు.

సవాలు చేసే అర్హత అనంతబాబుకు లేదు: ఏజీ

పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. "కేసు డైరీని పరిశీలించిన అనంతరం ఈ కేసులో మరికొంత మంది సాక్షులను విచారించాల్సిన అవసరం ఉందని ఐఓ అభిప్రాయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరుతూ పిటిషన్ వేశారు. వాస్తవానికి తదుపరి దర్యాప్తు జరపాలంటే దర్యాప్తు అధికారి కోర్టు అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. 2023లో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రస్తుత కేసులో ఐఓ వృత్తిధర్మాన్ని పాటిస్తూ తదుపరి దర్యాప్తు అనుమతి కోసం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేశారు. అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకున్నాకే న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ఈ దశలో నిందితుడు అనంతబాబు వాదన వినాల్సిన అవసరం లేదు. ఎస్సీ, ఎస్టీ కోర్టు ఉత్తర్వులను సవాలు చేసే అర్హత అనంతబాబుకు లేదు" అని అన్నారు.

సీనియర్ డీఎస్పీ ఐఓగా ఉంటే మంచిది: న్యాయమూర్తి

ఈ కేసు దర్యాప్తు అధికారిగా యువ ఐపీఎస్ అధికారి (ఏఎస్పీ) ఉన్నారని, పదోన్నతులు, బదిలీలు జరిగితే దర్యాప్తు కుంటుపడుతుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. అనుభవం ఉన్న సీనియర్ డీఎస్పీ ఐఓగా ఉంటే మంచిదని అభిప్రాయపడ్డారు. దీనికి ఏజీ బదులిస్తూ.. ఈ విషయంలో తాము తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏపీలో రక్షణరంగ పరిశ్రమలు ఏర్పాటు చేయండి

- రక్షణ మంత్రికి తెదేపా ఎంపీల బృందం వినతి

ఈనాడు, దిల్లీ: ఏపీలో విస్తృతంగా అందుబాటులో ఉన్న భూముల్లో రక్షణరంగ పరిశ్రమలు ఏర్పాటుచేయాలని తెదేపా ఎంపీల బృందం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరింది. తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, దగ్గుమళ్ల ప్రసాద్‌లు శుక్రవారం ఇక్కడ రాజ్‌నాథ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు మే 19వ తేదీన కేంద్రానికి దీనిపై లేఖరాసినట్లు ఆయనకు గుర్తుచేశారు. జగ్గయ్యపేట-దొనకొండల మధ్య అందుబాటులో ఉన్న 6వేల ఎకరాల్లో మిసైల్, ఆయుధ ఉత్పత్తులు, లేపాక్షి-మడకశిర మధ్య 10 వేల ఎకరాల్లో విమానాలు, రక్షణ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, విశాఖపట్నం-అనకాపల్లి మధ్య 3 వేల ఎకరాల్లో నౌకాపరికరాలు, ఆయుధాల పరీక్ష కేంద్రాలు, కర్నూలు-ఓర్వకల్లు మధ్య 4 వేల ఎకరాల్లో డ్రోన్లు, రోబోటిక్స్, అధునాతన పరికరాల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరారు. తిరుపతి ఐఐటీలో డీఆర్‌డీఓ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నెలకొల్పాలని విజ్ఞప్తిచేశారు. అలాగే పాలసముద్రంలో రూ.2,400 కోట్లతో తలపెట్టిన బెల్ వ్యూహాత్మక సముదాయం, నెల్లూరులో 60 వేల టన్నుల వార్షిక సామర్థ్యంతో అల్యూమినియం ఎల్లాయ్ ప్లాంట్ ఏర్పాటును ముందుకు తీసుకెళ్లాలని కోరారు. లేపాక్షి-మడకశిర మధ్య అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ఎంఆర్‌ఓ, అసెంబ్లీ ప్లాంట్, విశాఖపట్నంలో నేవల్ సెజ్ ఏర్పాటుచేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ ఆత్మనిర్భర్ భారత్ విజన్‌కు అనుసంధానంగా ఉన్నందున వాటిని కార్యరూపంలో పెట్టేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. దీని వల్ల ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధితోపాటు ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని రాజ్‌నాథ్‌సింగ్‌కు విజ్ఞప్తిచేశారు.



కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు వినతిపత్రం అందిస్తున్న తెదేపా ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాదరావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి

నన్ను విమర్శించినందుకే తిరిగి విమర్శించా

పోలీసుల విచారణలో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



విచారణకు హాజరై వస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి.. తనపై ఆరోపణలు చేసినందుకే తిరిగి విమర్శించానని మాజీ మంత్రి, వైకాపా నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నమోదైన కేసులో భాగంగా శుక్రవారం నెల్లూరు గ్రామీణ డీఎస్పీ కార్యాలయంలో పోలీసులు ఆయన్ను విచారించారు. 'బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నేను అవినీతిపరుడినని, పర్సంటేజీలు తీసుకుంటున్నానని, అవినీతిలో పీజీ చేశానని ప్రశాంతిరెడ్డి విమర్శించారు. దానికి ప్రతిగా ఆమె చీరల వ్యాపారంలో పీజీ చేశారని చెప్పానే తప్ప.. అందులో వేరే ఉద్దేశం లేదు' అని ఆయన విచారణలో చెప్పినట్లు తెలిసింది.

నర్సింగ్ విద్యార్థినిపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

- గుంటూరు ఐదో అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: తాడేపల్లిలోని సీతానగరం పుష్కరఘాట్‌లో విజయవాడకు చెందిన నర్సింగ్ విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.నీలిమ శుక్రవారం తీర్పు చెప్పారు. విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన విద్యార్థిని 2021 జూన్ 19న రాత్రి 8 గంటల సమయంలో తన స్నేహితుడితో కలిసి వస్తున్నారు. ప్రకాశం జిల్లా చినగంజాంకు చెందిన రామలింగం ప్రసన్నరెడ్డి, తాడేపల్లికి చెందిన శేరు కృష్ణకిషోర్ వీరిని అటకాయించి దాడిచేశారు. విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డారు. వారివద్ద ఉన్న ఫోన్, నగదు దొంగలించారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదుచేశారు. ప్రసన్నరెడ్డి ఆచూకీ ఇంతవరకు లభించలేదు. కృష్ణకిషోర్‌ను అరెస్టుచేయగా అతడు నేరాన్ని అంగీకరించాడు. అతను చోరీ చేసిన వస్తువులను షేక్ హబీబ్ వద్ద నుంచి పోలీసులు స్వాధీనం చేసుకుని అతనిపైనా కేసు పెట్టారు. కేసు విచారణలో ఉండగా హబీబ్ మరణించాడు. కృష్ణకిషోర్‌పై నేరం రుజువు కావడంతో 20ఏళ్ల జైలుశిక్ష, రూ.57వేల జరిమానా విధిస్తూ, జరిమానా సొమ్మును బాధితురాలికి అందించాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి కె.నీలిమ తీర్పు వెలువరించారు. అప్పటి డీఎస్పీ జె.రాంబాబు కేసు దర్యాప్తు చేశారు.

హత్య కేసు కొట్టివేత: అత్యాచారానికి పాల్పడిన రోజే నిందితులు ప్రసన్నరెడ్డి, కృష్ణకిషోర్ అదే ప్రాంతంలో మరో వ్యక్తిని హతమార్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో కృష్ణకిషోర్‌పై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టేస్తూ జడ్జి నీలిమ తీర్పుచెప్పారు. పోలీసుల కథనం ప్రకారం.. 2021 జూన్ 19న రాత్రి 7గంటల సమయంలో నిందితులిద్దరూ సీతానగరం రైల్వేవంతెనపై రాగితీగ దొంగతనం చేస్తుండగా సింగ్‌నగర్‌కు చెందిన యడ్లపల్లి ఆనందరావు చూశారు. పోలీసులకు చెబుతారని.. నిందితులు అతడిని హతమార్చి, శవాన్ని కృష్ణానదిలో పడేశారు. కృష్ణకిషోర్‌ను అత్యాచారం కేసులో విచారించగా ఈ హత్యకేసు వెలుగులోకి వచ్చింది. ఈ కేసులోనూ పోలీసులు ఇద్దరిపై కేసు నమోదుచేసి చార్జిషీట్ దాఖలుచేశారు. ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయకపోవడంతో కృష్ణకిషోర్‌పై కేసు కొట్టేశారు.

విజయవాడ, బెంగళూరు టికెట్ ధరలపై టీఎస్ ఆర్టీసీ రాయితీ

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి బెంగళూరు, విజయవాడ మార్గాల్లో నడుస్తున్న టీఎస్‌ఆర్టీసీ బస్సుల టికెట్ ధరలపై సంస్థ రాయితీ ప్రకటించింది. విజయవాడ నుంచి గరుడ ప్లస్ బస్సు టికెట్ ధర రూ.635 నుంచి రూ.444కు, గరుడ క్లాస్ రూ.592 నుంచి రూ.438, రాజధాని ఏసీ రూ.533 నుంచి రూ.448, లగ్జరీ సూపర్ క్లాస్ ధరలను రూ.815 నుంచి రూ.685కి తగ్గించింది. బెంగళూరు మార్గంలో సూపర్‌లగ్జరీ బస్సు టికెట్ ధర రూ.946 నుంచి రూ.757కి, లహరి ఏసీ స్లీపర్ బస్సులో బెర్త్ ధర రూ.1569 నుంచి రూ.1177కి, లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్ ధర రూ.1203 నుంచి రూ.903కి, బెర్త్ ధర రూ.1569 నుంచి రూ.1177కి తగ్గించింది.

అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ బదిలీ

రోడ్డు సేఫ్టీ అథారిటీ ఛైర్మన్‌గా నియామకం

ఈనాడు, అమరావతి: అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసి రోడ్డు సేఫ్టీ అథారిటీ ఛైర్మన్‌గా నియమించింది. ఆయన స్థానంలో అగ్నిమాపక శాఖ టెక్నికల్ విభాగం డైరెక్టర్ పి.వెంకటరమణకు డైరెక్టర్ జనరల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం నిరీక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారి ఎస్.వి.శ్రీధర్‌రావును సీఐడీలో ఎస్పీగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంటర్మీడియట్ విద్యలోకి 74 హైస్కూల్ ప్లస్‌లు

ఈనాడు, అమరావతి: హైస్కూల్ ప్లస్‌ల్లోని ఇంటర్మీడియట్‌లో 30 మంది కంటే ఎక్కువమంది విద్యార్థులున్న వాటిని ఇంటర్మీడియట్ విద్యా శాఖకు అప్పగించేందుకు కసరత్తు సాగుతోంది. ప్రతి మండలంలోనూ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జూనియర్ కళాశాలలు లేనిచోట్ల హైస్కూల్ ప్లస్‌ల్లోని ఇంటర్మీడియట్‌ను తీసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ భావిస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 74 హైస్కూల్ ప్లస్‌లను ఆ శాఖ తీసుకుంటుంది.

శ్రీధర్ సార్.. మీకు హ్యాట్సాఫ్

- ఉపాధ్యాయుడికి మంత్రి లోకేశ్ కితాబు
- విద్యార్థి ప్రాణం నిలబెట్టినందుకు మెచ్చుకోలు

ఈనాడు, అమరావతి, విస్సన్నపేట, న్యూస్‌టుడే



బి.శ్రీధర్

'ఒక ఉపాధ్యాయుడు తలచుకుంటే.. సమాజంలో ఎంతమందిని కదిలించొచ్చు అనడానికి విస్సన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీధర్ ప్రత్యక్ష నిదర్శనం. తన విద్యార్థి ప్రమాదం బారినపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిసి.. వెంటనే వచ్చి తన వంతుగా ఆర్థిక సాయం చేయడమే కాకుండా.. శస్త్రచికిత్సకు అవసరమైన మొత్తం డబ్బులు సమకూర్చేలా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రయత్నించి సఫలమయ్యారు. ప్రస్తుతం ఈ ఉపాధ్యాయుడు చేసిన గొప్ప పని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వరకు చేరింది. దీంతో శ్రీధర్ చేసిన కృషిని మెచ్చుకుంటూ.. లోకేశ్ సామాజిక మాధ్యమం ద్వారా శుక్రవారం అభినందనలు తెలిపారు. అంకితభావంతో బోధిస్తూ.. మరోవైపు నిస్వార్థంగా సేవా కార్యక్రమాలలో ముందుంటూ.. విద్యార్థులకు మార్గదర్శిగా నిలుస్తున్నారంటూ కితాబిచ్చారు.' వివరాల్లోకి వెళ్తే...

విస్సన్నపేట మండలానికి చెందిన కొల్లు ధనుష్ అనే 17 ఏళ్ల కుర్రాడు ఈ ఏడాది మార్చిలో ఇంటర్ తొలి ఏడాది పరీక్షలు రాయడానికి వెళ్లి తిరిగొస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్రమైన దెబ్బ తగలడంతో ప్రాణాపాయ స్థితికి చేరాడు. పేద కుటుంబం కావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పదో తరగతి విస్సన్నపేట జడ్పీ పాఠశాలలోనే చదివిన ధనుష్ పరిస్థితి తెలిసి వెంటనే హాస్పిటల్‌కు చేరుకున్న శ్రీధర్‌బాబు అండగా నిలిచారు. తనవంతుగా కొంత సాయం చేశారు. మిగతా డబ్బుల కోసం సామాజిక మాధ్యమాల్లో.. విద్యార్థి పరిస్థితిని వివరిస్తూ పోస్టు పెట్టారు. దీంతో భైరవి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సహా పలువురు ముందుకొచ్చారు. వైద్యానికి అవసరమైన రూ.ఆరు లక్షల వరకూ అందించారు. మెరుగైన వైద్యం కోసం మరికొందరు సాయం చేశారు. దీంతో ప్రాణాపాయం నుంచి ధనుష్ కోలుకున్నాడు. శ్రీధర్ చేసిన ప్రయత్నమే.. విద్యార్థికి ప్రాణదానం చేసింది. ★ ధనుష్ లాంటి విద్యార్థులకు అన్ని విధాలుగా శ్రీధర్ అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు చెబుతూ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారు. 'శ్రీధర్ సార్ మీకు హ్యాట్సాఫ్' అంటూ మెచ్చుకున్నారు. 'ఒక విద్యార్థి ప్రాణం నిలిపారు. ఐదుగురు బాలికల ఉన్నత చదువుకు సాయం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో వసతులు, గ్రంథాలయానికి పుస్తకాలు, మైక్ సెట్, క్రీడా సామగ్రిని దాతల సహకారంతో సమకూర్చారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు తన ఇంటిలో భోజనం పెట్టి మరీ పాఠశాల ముగిసిన తర్వాత ప్రత్యేక ఆంగ్ల తరగతులు నిర్వహిస్తున్నారు.' అంటూ మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు.

27 నుంచి రాష్ట్రవ్యాప్త పర్యటన

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: 'సారథ్యం' పేరుతో ఈ నెల 27 నుంచి రాష్ట్రవ్యాప్త పర్యటనకు శ్రీకారం చుడుతున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. వికసిత్ భారత్ కోసం కార్యకర్తలను సారథులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ఈ పర్యటన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన 'సారథ్యం' లోగోను విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలిదశ పర్యటన ఈ నెల 27 నుంచి వైఎస్సార్ కడప, 28న నంద్యాల, 29న కర్నూలు, 30న అనంతపురం, 31న శ్రీసత్యసాయి జిల్లాల్లో సాగుతుందన్నారు. రెండో విడత పర్యటన ఆగస్టు 4న పల్నాడు, 5న గుంటూరు, 6న బాపట్ల, 7న ప్రకాశం జిల్లాల్లో.. మూడో విడతలో ఆగస్టు 10న అన్నమయ్య, 11న చిత్తూరు, 12న తిరుపతి, 13న పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో సాగుతుందని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడంతో పాటు వివిధ రంగాల పెద్దలతో భేటీ కానున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో రాష్ట్రానికి రూ.9.70 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు మాధవ్ తెలిపారు. ఓఆర్ఆర్‌కు స్థల సేకరణపై స్పందిస్తూ.. రూ.30 వేల కోట్ల సహకారం అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, భాజపా అధికార ప్రతినిధి సాధినేని యామినీశర్మ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి తీరంలో నేహారెడ్డి అక్రమ నిర్మాణాలను పరిశీలించిన కేంద్ర కమిటీ

విశాఖపట్నం(భీమునిపట్నం), న్యూస్‌టుడే: విశాఖలోని భీమిలి తీరంలో సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి చేపట్టిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం కేంద్ర పర్యావరణ పరిరక్షణ కమిటీ పరిశీలించింది. విజయవాడకు చెందిన సైంటిస్ట్ డా. మురళీకృష్ణ చిమాటా నేతృత్వంలోని కమిటీలో ఓషనోగ్రఫీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ విశాఖ రీజినల్ ఆఫీసు ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ మోటూరి శ్రీరామకృష్ణ, రాష్ట్ర కోస్టల్ మేనేజ్‌మెంట్ అథారిటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ శర్మ, విశాఖ పర్యావరణ మండలి ఇంజినీర్ పీవీ ముకుందరావు, సైంటిస్ట్ సౌమ్య (చెన్నై)లు ఉన్నారు. ఇప్పటికే రాష్ట్ర కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ గుర్తించిన 10 అడుగుల మేర లోతులో పునాదులు వేసి చేపట్టిన కాంక్రీటు అక్రమ నిర్మాణాలను జీవీఎంసీ కొంతమేర కూల్చివేసింది. ఈ నిర్మాణాలపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఈ నెల 30న విచారణ జరగనుంది. ఆ సమయానికి నిర్మాణాలను పూర్తిగా తొలగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ 588 మీటర్ల మేర చేపట్టిన కాంక్రీటు నిర్మాణాలకు సంబంధించి ఇప్పటి వరకు 321 మీటర్లు మాత్రమే తొలగించినట్లు గుర్తించి, మిగిలిన వాటిని గడువు లోగా తీసివేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నిర్మాణాల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏసీపీ రామకృష్ణ, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటవాసు, సహాయ ఇంజినీర్ సురేష్, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా మన్యంలో పోలియో కేసులు?

- సదరం శిబిరానికి ఆ లక్షణాలతో వచ్చిన బాధితులు
- డీసీహెచ్ఎస్ దృష్టికి తీసుకెళ్తామన్న వైద్యులు



11 ఏళ్ల వయసున్న తమ కుమారుడు విశాఖ్‌కు కాళ్లు, చేతులు చచ్చుపడిపోయాయని చెబుతున్న మేడేపల్లికి చెందిన రాజేశ్వరి



తాము పోలియో బారినపడ్డామని చెబుతున్న మేడేపల్లికి చెందిన తండ్రీ కొడుకులు గొర్రె వీరయ్య, మంగరాజు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో పలువురు పోలియో లక్షణాలతో బాధపడుతున్నారు. పింఛను లబ్ధిదారుల్లో దివ్యాంగుల వైకల్య శాతాన్ని సదరం ద్వారా పునఃపరిశీలన చేస్తున్నారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం నిర్వహించిన ఈ శిబిరానికి వచ్చిన వేలేరుపాడు మండలానికి చెందిన 110 మందిని వైద్యులు పరిశీలించగా, సుమారు 70 మంది ఈ తరహా లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇందులో వేలేరుపాడుతో పాటు తోటకూరగొమ్ము, మేడేపల్లి, నార్లవరం, దాచారం తదితర గ్రామాలకు చెందిన 30-50 ఏళ్ల వయసున్న వ్యక్తులు, యువకులు, పది నుంచి పదిహేనేళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉన్నారు. వీరిలో అత్యధికులు గిరిజనులే. వాస్తవానికి 2014లో మన దేశాన్ని పోలియో రహితంగా ప్రకటించారు. అప్పటి నుంచి పోలియో కేసులు వెలుగు చూడలేదు. వేలేరుపాడు, పరిసర గ్రామాల్లో కేసులు కనపడుతున్నాయంటే వ్యాక్సిన్ ప్రక్రియ చేపట్టడంలో లోపమా, లేక ఇక్కడి ప్రజలు తాగుతున్న నీటివల్ల తలెత్తిన అంగ వైకల్య సంబంధిత సమస్యలా అన్నది అధికారులు తేల్చాల్సి ఉంది. బాధితుల్లో చాలామంది చేతులు, కాళ్లు వంకర్లు తిరిగి, నడవలేని స్థితిలో ఉన్నారు. ఈ విషయాన్ని డీసీహెచ్ఎస్ దృష్టికి తీసుకెళ్తానని వారిని పరిశీలించిన నూజివీడు ప్రాంతీయ ఆసుపత్రి ఎముకల వైద్యుడు గోపీనాథ్ తెలిపారు.


విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
మళ్ళీ స్కూల్‌కి
మొబైల్ | ల్యాప్‌టాప్ | యాక్సెసరీస్
hp
PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Cashback Upto Rs. 15000/-*
• Fossil Watch @ Rs. 999/-*
• 1st Year ADP @ Rs. 999/-*
Lenovo
LENOVO GAMING, YOGA SERIES SLIM 5 & FLEX 5, LOQ
• Cashback / Exchange Bonus Upto Rs. 10000/-*
• 2 Year Warranty + 2 Year Premium Care + 1 Year ADP @ Rs. 1999/-*
• Legion 30 Inch Curved Monitor + Gaming Mouse + Gaming Headset @13999/-* Worth Rs. 34999/-*
DELL Technologies
INSPIRON, INSPIRON GAMING, ALIENWARE, XPS
• Cashback Upto Rs. 10000/-*
• Dell Stereo Headset @ Rs. 999/-*
• Canon Printer @ Rs. 1999/-*
acer
ASPIRE, SWIFT, SPIN, NITRO PREDATOR
• Cashback upto Rs. 5000/-*
• Free Gaming Monitor*
• 2 Year Gaming Warranty @ Rs. 1999/-*
ASUS
ROG, STRIX, ZENBOOK, TUF GAMING, ZEPHYRUS DUO
• Cashback upto Rs. 3000/-*
• Gaming Warranty Starting @ Rs. 999/-*
• Asus Wireless Mouse @ Rs. 99/-*
MacBook Air
Sky high performance with
M4 Starting from ₹82,907*
M2 Starting from ₹69,310*
STUDENT GET UPTO 10% OFF*
Upto ₹10,000* Instant cashback & No Cost EMI on credit cards of SBI card | ICICI Bank | kotak + Exchange bonus Up to ₹10,000* Available at stores only.*
iPhone 16 (128 GB)
10% OFF*
DISCOUNT ₹8,700*
CASHBACK ₹4,000*
PRICE ₹79,900
EMI Starting at ₹2,967
OnePlus Nord 5
Light Speed. Night Legend.
Starting from ₹29,749*
Available Now
₹2,250 Instant Discount
*T&C Apply | Price inclusive of bank offers
SBI card | RBL BANK
Powered by OxygenOS
*T&C Apply.
vivo X200 FE
ZEISS Image. Pro Packed.
Starting From ₹49,499*
Available now
Up to 10% Instant Discount on SBI card | IDFC FIRST Bank | YES BANK | HSBC
SAMSUNG
Galaxy Z Fold7 | Z Flip7
Galaxy AI
Available Now
Get benefits worth ₹ 12000*
Buy 256GB. Get 512GB.
విజయ్ సేల్స్
ఓపెన్ బాక్స్ సేల్
ఓపెన్ బాక్స్ స్టాక్ క్లియరెన్స్ మరియు మరెన్నో
డిస్‌ప్లే • ఆఖరి పీస్
60%* వరకు తగ్గింపు
*నియమ నిబంధనలు వర్తిస్తాయి.
SANSUI 32 [80 cm] QLED SMART TV
PRICE ₹20,990
OFFER PRICE ₹ 10,990
DOWN PAYMENT ₹3,664 | EMI ₹916 x 8 Months
DEAL OF DAY
SONY 55 [139 cm] 4K UHD Google TV
CASHBACK UPTO ₹5,000
EMI STARTS FROM ₹5,500
SAVINGS 25% OFF
SONY 5.1 CH SOUNDBAR HT-S20R
PRICE ₹23,990
OFFER PRICE ₹ 17,990
SAVINGS 26% OFF
IFB FRONT LOAD WASHING MACHINE 8 Kg
PRICE ₹47,080
CASHBACK UPTO ₹2,000
OFFER PRICE ₹ 34,990
SAVINGS 45% OFF
Godrej TOP LOAD WASHING MACHINE 8 Kg
PRICE ₹34,400
CASHBACK UPTO ₹1,500
OFFER PRICE ₹ 18,990
UPTO 59% OFF
AIR CONDITIONER
1.5T 3 STAR INVERTER STARTING AT ₹28,990
1.5T 5 STAR INVERTER STARTING AT ₹33,990
LG Godrej LLOYD VOLTAS HITACHI
SAVINGS 33% OFF
LG FROST FREE REFRIGERATOR 272 Litres
CASHBACK ₹2,500
PRICE ₹41,899
OFFER PRICE ₹ 27,990
SAVINGS 38% OFF
BLUE STAR NORMAL AND COLD WATER DISPENSER
PRICE ₹14,600
OFFER PRICE ₹ 8,990
UPTO 60% OFF
UPGRADE YOUR KITCHEN
UPTO 60% OFF
IT & MOBILE ACCESSORIES
boAt Marshall noise PORTRONICS BOSE JBL
For special discounts on corporate and builder enquiries, please email us at b2b@vijaysales.com
UPTO ₹10,000/- INSTANT DISCOUNT & CASHBACK ON CREDIT CARD / DEBIT CARD & PAPER FINANCE ON
HDFC BANK | AMERICAN EXPRESS | ONECARD | IDFC FIRST BANK
YES BANK | DBS BANK | HDB FINANCE
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
ఆంధ్ర ప్రదేశ్ | హైదరాబాద్ | వరంగల్ | ముంబయి | పూణే | అహ్మదాబాద్ | సూరత్ | వడోదర | ఢిల్లీ | గురుగ్రామ్ | నోయిడా | ఇందిరాపురం | ఫరీదాబాద్ | ఘజియాబాద్
SCAN FOR STORES
విజయవాడ - ఎం జి రోడ్: రజనీ కుమార్ - 96665 03755, ప్రసన్న - 70362 15153
విజయవాడ - ఎన్‌టీఆర్ సర్కిల్: ఈశ్వర్ - 88866 53042, చక్రపాణి - 91333 16947
రాజమండ్రి - జె ఎల్ ఎన్ రోడ్: గౌతం - 91549 03693, కిరణ్ - 87120 32657
రాజమండ్రి - ఇన్నీస్‌పేట్: సతీష్ - 88866 74548, నారాయణ - 73373 76253
తిరుపతి - ఎం ఆర్ పల్లి: కిరణ్ - 99482 28111, విజయ్ కుమార్ - 87126 35822
తిరుపతి - లీలా మహల్: వేణు - 73373 76215, వెంకటేష్ - 91543 85029
కాకినాడ - అపోలో హాస్పిటల్ ప్రక్కన: శివ గంగాధర్ - 91543 16627, నాగశ్రీ - 73373 76220
వైజాగ్ - దొండపర్తి: రమేష్ - 99482 41112, కిరణ్ కుమార్ - 91549 03528
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier Bank. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. Upto 60% off on select brands and models only. *Cashback Applicable Select Banks & Cards

మూడేళ్లలో విజయవాడ, విశాఖ

మెట్రో తొలిదశ పూర్తి

- రెండుచోట్లా రూ.21,616 కోట్లతో త్వరలో పనులు ప్రారంభం
- విశాఖలో పనులకు టెండర్లు పిలిచాం
- విజయవాడలో 3 రోజుల్లో పిలుస్తాం
- కన్సల్టెన్సీలతో ఒప్పందం సందర్భంగా పురపాలకశాఖ మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: విజయవాడ, విశాఖల్లో మెట్రో రైల్ ప్రాజెక్టు మొదటి దశ పనులు మూడేళ్లలో పూర్తిచేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. విశాఖలో తొలిదశ పనులకు శుక్రవారం టెండర్లు పిలిచామని, విజయవాడలో పనులకు మూడు రోజుల్లో పిలుస్తామని ఆయన అన్నారు. మొదటి దశ మెట్రో రైల్ ప్రాజెక్టు పనులకు రెండు నగరాల్లో కలిపి మొత్తం రూ.21,616 కోట్లు ఖర్చు చేయనున్నట్లు మంత్రి వివరించారు. విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో మంత్రి నారాయణ సమక్షంలో సాంకేతిక సహకారం, పర్యవేక్షణ, నాణ్యత పరిశీలన అంశాలపై టిప్సా, శిస్ట్రా కన్సల్టెన్సీలు, ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ విలేకర్లతో మాట్లాడారు. 'మెట్రో రైల్ ప్రాజెక్టు తొలిదశ పనులకు అయ్యే వ్యయంలో కేంద్రం 20%, రాష్ట్రం 20% నిధులు కేటాయించనున్నాయి. రాష్ట్ర వాటా నిధులు విశాఖ నగరపాలక సంస్థ, సీఆర్డీఏ సమకూర్చనున్నాయి. మిగిలిన 60% నిధులు అంతర్జాతీయ బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి కేంద్రం అందిస్తుంది. విశాఖలో తొలిదశలో 46.23 కిలోమీటర్ల పొడవున 3 కారిడార్లతో మెట్రో రైల్ రానుంది. విజయవాడలో 38.40 కి.మీ. పొడవున రెండు కారిడార్లు రానున్నాయి. విశాఖలో 20 కి.మీ., విజయవాడలో 4.7 కి.మీ. మేర డబుల్ డెకర్ నిర్మాణం చేపట్టనున్నాం' అని మంత్రి నారాయణ వివరించారు.

రాజధాని రైతులకు కౌలు నిధుల విడుదల

రాజధాని అమరావతి రైతులకు 11వ ఏడాది కౌలు నిధులు రూ.163.67 కోట్లు విడుదల చేశాం. బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పుగా ఇవ్వడంతో 18,638 మంది రైతుల్లో 594 మందికి నిధులు జమకాలేదు. మరో 88 మందికి సీఎఫ్ఎంఎస్‌లో వివరాలు తప్పుగా నమోదయ్యాయి. రైతుల ఇబ్బందులు పరిష్కరించేందుకు సీఆర్డీఏ ప్రత్యేక విభాగం ఏర్పాటుచేసింది. వెబ్‌సైట్‌లోనూ అన్ని వివరాలూ అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించాం. కౌలు విషయంలో వైకాపా నేతలు దుష్ప్రచారం మానుకోవాలి. సచివాలయ నిర్మాణంలో పనిచేస్తున్న నిరుపేద వ్యవసాయ కూలీలకూ రూ.5వేల చొప్పున పింఛను ఇవ్వాలని సీఎం ఆదేశించారు. అమరావతి రైతులు, కూలీల పట్ల ప్రభుత్వానికి నిబద్ధత ఇది' అని మంత్రి నారాయణ అన్నారు. సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి, టిప్సా, శిస్ట్రా కన్సల్టెన్సీల ఎండీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విజయవాడ, విశాఖల్లో తొలిదశలో చేపట్టనున్న మెట్రో రైల్ కారిడార్ల వివరాలు

విజయవాడ మెట్రో

కారిడార్ 1: పండిట్ నెహ్రూ బస్టాండ్-గన్నవరం 25.95 కి.మీ.
కారిడార్ 2: పండిట్ నెహ్రూ బస్టాండ్-పెనమలూరు 12.45 కి.మీ.
రెండు కారిడార్ల అంచనా వ్యయం: రూ.10,118 కోట్లు

విశాఖపట్నం మెట్రో

కారిడార్ 1: స్టీల్‌ప్లాంట్ గేట్-కొమ్మాది కూడలి 34.90 కి.మీ.
కారిడార్ 2: గురుద్వారా-పాత పోస్టాఫీస్ 5.07 కి.మీ.
కారిడార్ 3: తాటిచెట్లపాలెం-చినవాల్తేరు 6.75 కి.మీ.
మూడు కారిడార్ల అంచనా వ్యయం: రూ.11,498 కోట్లు

రాజధానిలో రెండు వైద్య కళాశాలలు, సీబీఎస్ఈ స్కూళ్లు

వీఐటీ, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయాల్లో ఏర్పాటు: మంత్రి నారాయణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'రాజధానిలో వీఐటీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు త్వరలో 50 పడకల సామర్థ్యంతో రెండు వైద్య కళాశాలలను ఏర్పాటు చేయనున్నాయి. వచ్చే మార్చి నాటికి ఇవి అందుబాటులోకి వస్తాయి. రెండు సీబీఎస్ఈ పాఠశాలలనూ ఆయా విశ్వవిద్యాలయాలు నెలకొల్పుతాయి' అని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సీఆర్డీఏ ఇంజినీర్లతో కలిసి ఐకానిక్ టవర్స్, హ్యాపీనెస్ట్, నేలపాడులో నిర్మిస్తున్న గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, గ్రూప్-డి ఉద్యోగుల భవన సముదాయాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడారు. రాజధాని పనులు సరిగా జరగడం లేదన్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని కోరారు. మూడేళ్లలో పనులు పూర్తిచేసి తీరుతామని స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ప్లాట్ల అభివృద్ధికి టెండర్లు పూర్తి చేశామన్నారు. 360 కి.మీ. ట్రంకురోడ్లు, 1500 కి.మీ. మేర లేఔట్ రోడ్లు నిర్మించాలన్నారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం కొండవీడు, పాలవాగుల పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ చెప్పారు.



భవన సముదాయాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ఉద్యోగులకు మెరుగైన సదుపాయాలు

'రాజధానిలో ఉద్యోగుల కోసం 4వేల ప్లాట్లతో ఒక టౌన్‌షిప్ ఏర్పడనుంది. అక్కడ 16వేల మంది నివసించే అవకాశం ఉంది. గెజిటెడ్ ఆఫీసర్ల కోసం 14 టవర్లలో 1,140 ప్లాట్లు నిర్మిస్తున్నాం. మరో 5 టవర్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల కోసం 21 టవర్లలో 1995 ప్లాట్లు నిర్మిస్తున్నాం. వీటిలో 9 టవర్ల నిర్మాణం పూర్తయింది. మిగతావి డిసెంబరు నెలాఖరుకు పూర్తవుతాయి. రాజధానిలో సిగ్నళ్ల సమస్యలు లేకుండా సెల్‌ఫోన్ టవర్ల నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకుంటాం' అని మంత్రి పేర్కొన్నారు.

15 రోజులుగా యూరియా కొరత

దీనిపై కేంద్రాన్ని నిలదీయాలి: షర్మిల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గత 15 రోజులుగా యూరియా కొరత ఉందని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. ఇప్పటివరకు 40 వేల టన్నులు మాత్రమే వచ్చిందని, ఇంకా 80 వేల టన్నులు రావాల్సి ఉందని తెలిపారు. దీనిపై రాష్ట్ర ఎంపీలు పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీయాలన్నారు. రైతులు 20 లక్షల ఎకరాల్లో పంటలు వేసి యూరియా సకాలంలో అందక గగ్గోలు పెడుతుంటే కేంద్రాన్ని అడిగే సత్తా లేదా అని ప్రశ్నించారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్రమే రాజధాని అమరావతిని నిర్మించాలి. ఇప్పటికీ కడప స్టీల్ ప్లాంటు, దుగరాజపట్నం పోర్ట్ కలగానే ఉంది. సెయిల్ కట్టాల్సిన కడప స్టీల్ ప్లాంటును ఇప్పుడు జిందాల్‌కు అప్పగించారు. రాష్ట్రంలో ఇండస్ట్రియల్ కారిడార్ అమలు కాలేదు. వెనుకబడిన ప్రాంతాలకు రూ.25 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ రావాలి. కానీ కేంద్రం పదో పరకో ఇస్తోంది. విశాఖ స్టీలు ప్రైవేటీకరణపై ఒక్క ఎంపీ కూడా మాట్లాడటం లేదు. ఉచిత బస్సు పథకాన్ని జిల్లా వరకే పరిమితం చేయకుండా రాష్ట్రమంతా అమలు చేయాలి' అని పేర్కొన్నారు.

EENADU Vol: 51, Issue: 347 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

డెలివరీ బాయ్స్‌గా వచ్చి నగలు దోచేశారు



ఇంటర్నెట్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో డెలివరీ బాయ్స్ దుస్తుల్లో ఓ నగల దుకాణంలోకి వచ్చిన ఇద్దరు యువకులు తుపాకీతో సిబ్బందిని బెదిరించి షాపులోని బంగారం, వెండి వస్తువులను దోచుకున్నారు. పట్టణంలోని ప్రీత్ విహార్ ప్రాంతంలో గల నగల దుకాణంలో గురువారం పట్టపగలు ఈ దోపిడీ జరిగింది. ఆ సమయంలో యజమాని భోజనానికి వెళ్లగా.. పనిచేసే వ్యక్తి మాత్రమే ఉన్నాడు. నగలను బ్యాగుల్లోకి సర్దుకున్నాక బైకుపై వారిద్దరూ పరారయ్యారు. దోచుకెళ్లిన నగల విలువ దాదాపు రూ.30 లక్షల వరకు ఉంటుందని అంచనా. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, షాపుతోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నట్లు పోలీసు అధికారి తెలిపారు.

టూత్‌బ్రష్‌ను మింగేసిన మహిళ!

ఈటీవీ భారత్: కోల్‌కతాలో ఓ మహిళ (37) విపరీతమైన కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చింది. శ్వాస తీసుకోవడం కూడా ఇబ్బందిగా ఉందని, ఛాతీలోనూ నొప్పిగా ఉన్నట్లు చెప్పింది. ఇంతకు మించి ఆమె ఏమీ చెప్పలేదు. మొదట ఎక్స్‌రే.. ఆ తర్వాత జీఐ ఎండోస్కోపీ చేసిన వైద్యులు అవాక్కయ్యారు. ఆమె పొట్టలో టూత్‌బ్రష్ ఉన్నట్లు తేలింది. సాధారణంగా పిల్లలు ఇలా చేస్తుంటారు.



పెద్దలు చేయడం అరుదు. ఆ టూత్‌బ్రష్‌ను బయటకు తీసేందుకు వైద్యులు 45 నిమిషాలు కష్టపడ్డారు. ఎండోస్కోపీ సాయంతో నోటి నుంచి ఒక సన్నటి దారాన్ని పంపి, ఆ దారంతో బ్రష్ ముడి వేసి ఎంతో జాగ్రత్తగా బయటకు లాగారు. మహిళకు పూర్తిగా మత్తుమందు ఇచ్చి, డాక్టర్ సంజయ్ బసు నేతృత్వంలో వైద్యులు ఈ చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు.


మానవ వంతెనగా మారిన యువకులు

బఠిండా: పంజాబ్ రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలకు మోగా జిల్లాలో ఓ రహదారి కొట్టుకుపోయింది. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగును అటు వైపు చిక్కుకుపోయిన 35 మంది విద్యార్థులను రోడ్డు దాటించేందుకు ఇద్దరు స్థానిక యువకులు వరదకు అడ్డుగా పడుకొని మానవ వంతెనగా మారారు. వారి వీపుల మీదుగా విద్యార్థులతోపాటు మరో 10 మంది వృద్ధులు సురక్షితంగా అవతలి వైపునకు చేరుకున్నారు. ఈ వీడియో వైరల్‌గా మారింది.



ప్రపంచంలో 9 శాతం భూభాగంపై జూనాటిక్ వ్యాధుల ప్రభావం

దిల్లీ: ప్రపంచ జనాభాలో మూడు శాతం మంది జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనాటిక్ వ్యాధులు ప్రబలే ప్రాంతాల్లో నివసిస్తున్నారని "సైన్స్ అడ్వాన్సెస్" అనే జర్నల్‌లో ప్రచురించిన అధ్యయన సారం తెలియజేస్తోంది. ఐదు శాతం జనాభా ఈ ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్నారు. మొత్తం ప్రపంచ భూభాగంలో 9 శాతంపై జూనాటిక్ వ్యాధులు ప్రబలే అవకాశాలు పరిస్థితులు అధికంగా ఉన్నాయని అధ్యయనంలో తేలింది. ఇటలీలోని యూరోపియన్ కమిషన్‌కు చెందిన వైజ్ఞానిక అభివృద్ధి కార్యక్రమాల విభాగ పరిశోధకులు ప్రపంచ సాంక్రమిక వ్యాధుల నెట్‌వర్క్ డేటాను, ప్రపంచ ఆరోగ్య సంస్థ తయారుచేసిన ప్రాధాన్య వ్యాధుల జాబితాను విశ్లేషించి ఈ అధ్యయన పత్రం సిద్ధం చేశారు. కోవిడ్, ఎబోలా, కరోనా వైరస్ సంబంధిత మెర్స్, సార్స్, నిపా వైరస్ కలిగించే వ్యాధులు ప్రపంచ ఆరోగ్య సంస్థ సిద్ధం చేసిన ప్రాధాన్య వ్యాధుల జాబితాలో ఉన్నాయి. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వర్షపాతం, నీటి కొరత వంటి సమస్యలు జూనాటిక్ వ్యాధుల్ని విస్తృతం చేస్తున్నాయని పరిశోధక బృందం పేర్కొంది. ప్రజారోగ్య ప్రణాళికా రచనలో మారుతున్న వాతావరణ పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ఇది నొక్కి చెబుతోంది అని అధ్యయన పత్ర రచయితలు పేర్కొన్నారు.



థాయ్‌లాండ్ శుక్రవారం జరిపిన దాడితో కంబోడియా సైనిక ఆయుధాగారంలో ఎగసిపడుతున్న మంటలు

మందుపాతర పేలి జవాను మృతి

పూంఛ్: జమ్మూకశ్మీర్‌లో మందుపాతర పేలి అగ్నివీర్ సైనికుడు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం పూంఛ్ జిల్లాలోని నియంత్రణ రేఖ వద్దనున్న కృష్ణా ఘాటి సెక్టార్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ల్యాండ్ మైన్ పేలిందని దీంతో జవాను లలిత్ కుమార్ మృతి చెందాడని అధికారులు తెలిపారు. ఇద్దరు గాయపడ్డారని.. వీరిలో ఒకరు జేసీవో స్థాయి అధికారి. క్షతగాత్రులను ఆర్మీ ఆసుపత్రికి తరలించామని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని ఉన్నతాధికారులు తెలిపారు.

కార్గిల్ దివస్ సందర్భంగా సైన్యం డ్రోన్ల ప్రదర్శన

కార్గిల్: పాకిస్థాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధానికి((1999 జులై 26) శుక్రవారంతో 26 ఏళ్లు పూర్తి కానున్నాయి. ఆ యుద్ధం నాటి నుంచి భారత సైన్యం సరిహద్దు భద్రతలో సాధించిన సాంకేతిక పురోగతిని ప్రతిబింబించేలా శుక్రవారం డ్రోన్ల ప్రదర్శనను నిర్వహించింది. శత్రువును గుర్తించి వారిపై డ్రోన్లు ఎలా దాడులు చేయగలవు, డెలివరీలను ఎలా అందించగలవు, నిఘా ఎలా చేయగలవు వంటి డ్రోన్ల సామర్థ్యాలను లద్దాఖ్‌లోని కార్గిల్‌లో ప్రదర్శించారు.

కొవిడ్ టీకాలతో ముప్పులేదు

- లోక్‌సభకు తెలిపిన నడ్డా



దిల్లీ: భారతదేశంలో 18-45 వయసువారిలో ఆకస్మిక మరణ ప్రమాదం కొవిడ్ టీకాల వల్ల పెరగలేదని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా శుక్రవారం లోక్‌సభకు తెలిపారు. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) అధ్యయనం ఈ సంగతి నిగ్గుదేల్చిందని వివరించారు. కొవిడ్ వల్ల ఆస్పత్రిపాలవడం, కుటుంబంలో ఆకస్మిక మరణాలకు గురైన చరిత్ర ఉండటం, మరణానికి 48 గంటల ముందు అతిగా తాగడం లేదా అతిగా వ్యాయామం చేయడం, మాదకద్రవ్యాలు తీసుకోవడం వంటివి జరిగితే ఆకస్మిక మరణ ముప్పు పెరుగుతుందని తేలింది. 2023 మే-ఆగస్టులో 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 47 ఆస్పత్రులలో ఐసీఎంఆర్-జాతీయ అంటువ్యాధుల పరిశోధన సంస్థ (ఎన్ఐఈ) అధ్యయనం జరిపాయి. రెండు డోసుల కొవిడ్ టీకాలు తీసుకుంటే ఆకస్మిక మరణ ప్రమాదం తగ్గుతుందని తేలినట్లు నడ్డా తెలిపారు. ఐసీఎంఆర్, ఎయిమ్స్ అధ్యయనం కూడా ఇదే సంగతి నిర్ధారించిందని చెప్పారు.

టీకాలతో తగ్గిన 25 లక్షల మరణాలు

కొవిడ్-19 టీకాల వల్ల 2020 నుంచి 2024 మధ్య ప్రపంచవ్యాప్తంగా 25 లక్షలకుపైగా అకాల మరణాలను నిలువరించగలిగినట్లు తాజా అధ్యయనం పేర్కొంది. ప్రతి 5400 టీకా డోసులకు ఒకటి చొప్పున మరణాన్ని ఆపగలిగినట్లు తెలిపింది. కొవిడ్-19 వ్యాక్సిన్ వల్ల ప్రయోజనం కలిగిందనడానికి ఇది విస్పష్ట ఆధారమని వివరించింది. ఇటలీలోని క్యాథలిక్ యూనివర్సిటీ ఆఫ్ మిలాన్, అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన నిర్వహించారు. వీరు కొవిడ్-19కు సంబంధించిన ప్రపంచవ్యాప్త మరణాల డేటాను విశ్లేషించారు. ఈ మరణాలు టీకా వేసుకోవడానికి ముందు సంభవించాయా లేక ఆ తర్వాత చోటుచేసుకున్నాయా అన్నది పరిశీలించారు. దీని ఆధారంగా.. ఒక నమూనాను రూపొందించి, కొవిడ్ టీకా లేకుంటే ఎన్ని మరణాలు సంభవించి ఉండేవన్నది గణించారు. టీకాల వల్ల ప్రాణాలు కాపాడుకున్నవారిలో 82 శాతం మంది.. వైరస్ సోకడానికి ముందే వ్యాక్సిన్లు పొందారని శాస్త్రవేత్తలు తెలిపారు. టీకాల సాయంతో మరణాన్ని తప్పించుకున్నవారిలో 90 శాతం మంది.. 60 ఏళ్లు పైబడ్డవారేనని వివరించారు.

పదవీ విరమణ తరవాత విరామమే

- సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్



అమరావతి(మహారాష్ట్ర): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా పదవీ విరమణ చేసిన తరవాత తాను మరే ఇతర పదవినీ స్వీకరించేది లేదని జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టంచేశారు. శుక్రవారం మహారాష్ట్రలోని తన స్వగ్రామం దారాపుర్‌లో సీజేఐ పర్యటించారు. తన తండ్రి, కేరళ, బిహార్ మాజీ గవర్నర్ ఆర్.ఎస్.గవాయ్ స్మారక చిహ్నం వద్ద ఇతర కుటుంబ సభ్యులతో కలసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ మాట్లాడారు. నవంబరులో పదవీ విరమణ అనంతరం దారాపుర్, అమరావతి, నాగ్‌పుర్‌లలో ఎక్కువ సమయం గడుపుతానని వెల్లడించారు. గ్రామానికి వచ్చే దారిలో తండ్రి పేరిట మహా ద్వార నిర్మాణానికి సీజేఐ శంకుస్థాపన చేశారు. అమరావతి జిల్లాలోని దర్యాపుర్‌లో కొత్తగా నిర్మించిన కోర్టు భవనాన్ని ప్రారంభించారు.

క్రిమినల్ ఫిర్యాదులో సవరణకు అనుమతిచ్చిన సుప్రీం

దిల్లీ: చట్ట ప్రక్రియ(ప్రొసీజర్) న్యాయ అందజేతకు సాధనమే తప్ప న్యాయాన్ని నిర్దేశించే అధిపతి కాదని సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. నిందితునిపై ప్రభావం చూపని రీతిలో క్రిమినల్ ఫిర్యాదులో సవరణ చేయడానికి కోర్టులు అనుమతి మంజూరు చేయవచ్చని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్‌లోని సెక్షన్ 138 కింద నమోదైన ఒక క్రిమినల్ ఫిర్యాదులో సవరణకు కోర్టు అనుమతించింది. ఈ కేసులో తొలుత దేశీ నెయ్యి సరఫరా చేసిన తనకు ప్రతివాదులు రూ.14 లక్షల విలువ చేసే మూడు చెక్కులు జారీ చేశారని, అయితే ఆ చెక్కులు బౌన్స్ అయ్యాయని ఫిర్యాదిదారు పేర్కొన్నారు. తదనంతరం తన ఫిర్యాదులో సవరణ చేస్తూ ప్రతివాదులకు తాను పాలు సరఫరా చేశానని, నెయ్యి కాదని ఫిర్యాది పేర్కొన్నారు. కింది కోర్టు 2023 సెప్టెంబరులో ఫిర్యాదులో సవరణను అనుమతించింది. అయితే పంజాబ్ హరియాణా హైకోర్టు కింది కోర్టు నిర్ణయాన్ని రద్దు చేసింది. ఫిర్యాదులో సవరణ చేస్తే జీఎస్టీకి సంబంధించిన సమస్యలు తలెత్తుతాయని హైకోర్టు అభిప్రాయపడింది. దీనిపై అప్పీలుకు వెళ్లగా సుప్రీంకోర్టు తాజా తీర్పు వెలువరించింది. ఫిర్యాదులో సవరణలు చేయడం సీఆర్‌పీసీకి కొత్త కాదని పేర్కొంది.

రోగులను ఆసుపత్రులు ఏటీయం కేంద్రాల్లా భావిస్తున్నాయి!

- అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం

ప్రయాగ్‌రాజ్: ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు రోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై అలహాబాద్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గర్భిణి మృతితో తనపై నమోదైన క్రిమినల్ కేసును సవాల్ చేసిన వైద్యుడి పిటిషన్‌ను కొట్టివేస్తూ న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. సరైన వసతులు, వైద్యులు లేకపోయినా చికిత్స చేస్తామంటూ రోగులను మభ్యపరిచి డబ్బు దోచుకోవడం ఆసుపత్రులకు సర్వసాధారణమై పోయిందని న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ ఆక్షేపించారు. రోగులను ఏటీయం కేంద్రాలుగా భావిస్తున్నాయని తెలిపారు. గర్భిణికి శస్త్రచికిత్స ద్వారా కాన్పు చేస్తామంటూ ఓ నర్సింగ్‌హోం కుటుంబ సభ్యుల సమ్మతిని తీసుకుంది. మత్తు వైద్యుడు రావడం ఆలస్యం కావడంతో మత్తు ఇవ్వకుండానే కాన్పు చేసే ప్రయత్నం చేయగా తల్లీబిడ్డ ఇద్దరూ మృతి చెందారు. దీంతో నర్సింగ్ హోమ్ నిర్వాహకుడు డాక్టర్ అశోక్ కుమార్ రాయ్‌పై కేసు నమోదైంది. కుటుంబ సభ్యుల సంతకాల తర్వాత శస్త్రచికిత్స నిర్వహించడంలో 5 గంటల జాప్యాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. సకాలంలో ఆపరేషన్ జరగకపోవడమే తల్లీ, బిడ్డ మృతికి కారణమని తేల్చింది. మత్తు వైద్యుడిని సకాలంలో సమకూర్చకపోవడం నర్సింగ్ హోం నిర్వాహకుల లోపమేనని స్పష్టం చేసింది.

ఇరాన్-ఐరోపా అణు చర్చల్లో ప్రతిష్టంభన

ఇస్తాన్‌బుల్: ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమానికి సంబంధించిన చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల ప్రతినిధులకు, ఇరాన్ దౌత్యాధికారులకు మధ్య శుక్రవారం నాడిక్కడ చర్చలు జరిగాయి. ప్రతిష్టంభనను తొలగించేందుకు తిరిగి సమావేశం కావడానికి ఇరు పక్షాలూ అంగీకరించాయి. శుక్రవారం నాలుగు గంటల పాటు చర్చలు సాగాయి. ఇరాన్ తన అణు కార్యక్రమంపై నియంత్రణకు, పర్యవేక్షణకు అంగీకరించని పక్షంలో 2015కు ముందు నాటి ఆంక్షల్ని తిరిగి విధిస్తామని యూరోపియన్ దేశాలు హెచ్చరించాయి. ''చర్చలు అరమరికల్లేకుండా జరిగాయి'' అని ఇరాన్‌కు చెందిన డిప్యూటీ మంత్రి కాజెమ్ గరీబాబాదీ అన్నారు.


రెండు రాష్ట్రాల మధ్య వివాదం రేపిన కంగన వ్యాఖ్యలు

ఇంటర్నెట్‌డెస్క్: ప్రముఖ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ఆమె చేసిన విమర్శలతో రెండు రాష్ట్రాల మధ్య వివాదం చెలరేగింది. వివరాల్లోకి వెళ్తే.. హిమాచల్‌ప్రదేశ్‌లో పెరుగుతున్న డ్రగ్స్ మహమ్మారిని వెంటనే అరికట్టకపోతే ఈ రాష్ట్రం మరో 'ఉడ్తాపంజాబ్' అవుతుందని ప్రభుత్వానికి గవర్నర్ శివ్‌ప్రసాద్ శుక్లా బహిరంగ హెచ్చరిక చేశారు. 2012 నుంచి 2023 వరకు మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసుల్లో 340 శాతం పెరుగుదల కనిపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను మండీ ఎంపీ కంగన సమర్థించారు. శుక్రవారం పార్లమెంటు ప్రాంగణంలో ఆమె మీడియాతో మాట్లాడారు. "పాకిస్థాన్ నుంచి పంజాబ్ మీదుగా డ్రగ్స్ హిమాచల్‌ప్రదేశ్‌కు వస్తున్నాయి. వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోకపోతే.. యువత, కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిపోతుంది. రాష్ట్ర ప్రజలు వ్యసనాలకు బానిసలవుతూ నేరాల బాటపడుతున్నారు. ఇంట్లో బంగారాన్ని అమ్మేస్తున్నారు. కార్లు దొంగతనం చేస్తున్నారు. ఇది తల్లిదండ్రులను ఎంతగానో బాధిస్తోంది" అని అన్నారు. ఈ వ్యాఖ్యలను పంజాబ్ ఆర్థికమంత్రి హర్పాల్ సింగ్ చీమా తీవ్రంగా ఖండించారు. పంజాబ్‌ను నిందించే ముందు కంగన భాజపా పాలిత రాష్ట్రాల్లో సర్వే నిర్వహించాలని సవాలు విసిరారు. గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌లో కూడా పంజాబ్‌లో కంటే డ్రగ్స్ బెడద ఎక్కువగా ఉందని వ్యాఖ్యలు చేశారు. పంజాబ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం కథాంశంగా 2016లో ఉడ్తాపంజాబ్ చిత్రం వచ్చింది. ఈ సినిమా విడుదలపై పంజాబ్‌లో తీవ్ర నిరసన వ్యక్తమైంది కూడా.

కలుషిత ప్రదేశాల గుర్తింపునకు నిబంధనలు జారీ

దిల్లీ: ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు తప్పించడమే లక్ష్యంగా కలుషిత ప్రదేశాలను గుర్తించి వాటిని శుభ్రపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనల్ని ప్రకటించింది. పర్యావరణ పరిరక్షణ (కలుషిత స్థలాల నిర్వహణ) నిబంధనలు-2025 అనే శీర్షికతో ఈ నిబంధనల్ని రూపొందించారు. మట్టిలో, నీటిలో ఉన్న ప్రమాదకర విష పదార్థాల నుంచి ముప్పు తప్పించడానికి ఈ నిబంధనల్ని సిద్ధంచేశారు. ఇవి కలుషిత స్థలాలతో పాటు కాలుష్య కారకుల్ని గుర్తించి వారిని జవాబుదారీగా నిలబెడతాయి. ఈ నిబంధనలు పారిశ్రామిక కార్యకలాపాల ఆధారంగా కలుషిత ప్రదేశాలను గుర్తించి వాటి జాబితాను సిద్ధంచేసే అధికారాన్ని రాష్ట్రాల కాలుష్య నియంత్రణ మండళ్లకు ధారాదత్తం చేస్తున్నాయి. ఇలాంటి ప్రదేశాల వివరాలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారిక పోర్టల్‌లో పొందుపరుస్తారు. ఆయా ప్రదేశాల్లోని కాలుష్య స్థాయినీ మదింపు చేస్తారు. కాలుష్యం నిర్దిష్ట స్థాయిని దాటినప్పుడు ఆ ప్రదేశాలను కలుషిత ప్రాంతాలుగా ప్రకటిస్తారు. కాలుష్యానికి కారణమైన వ్యక్తిని, సంస్థను గుర్తించాలని నిబంధనలు పేర్కొంటున్నాయి. ఒక ప్రాంతాన్ని కలుషిత ప్రదేశంగా ప్రకటించిన 90 రోజుల్లోగా ఆ కాలుష్యానికి బాధ్యుల్ని గుర్తించాలి. బాధ్యుల్ని గుర్తించలేకపోయినప్పుడు ప్రభుత్వమే స్వచ్ఛీకరణ చర్యలకు నిధులు సమకూర్చాల్సి ఉంటుంది.

సైన్యం అత్యంత అప్రమత్తంగా ఉండాలి: సీడీఎస్



దిల్లీ: ఆపరేషన్ సిందూర్ సహా భవిష్యత్తు సైనిక సన్నద్ధతపై చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతూనే ఉందని... మన జవాన్లు ఏడాది పొడవునా అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్పష్టంచేశారు. శుక్రవారం ఇక్కడి సుబ్రోతో పార్కులో జరిగిన ఓ రక్షణ సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...భవిష్యత్తులో యుద్ధ గతి మారుతుందన్నారు. ఇందుకోసం 'సమాచారం, సాంకేతికత, మేధస్సు' వంటి మూడు నైపుణ్యాల కలబోతగా భవిష్యత్తు సైనికులు రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని సీడీఎస్ అన్నారు. యుద్ధాల్లో రన్నరప్‌లు ఉండరని.. అందుకే సైన్యాలు అప్రమత్తంగా ఉంటూ ఏ క్షణమైనా ఆపరేషన్లు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ''దీనికి ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణ. మనం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలి. 365 రోజులు...24 గంటలూ అప్రమత్తంగా ఉండాలి. యుద్ధ విధానాలపై మాత్రమే కాదు సాంకేతికత, సమాచారం వంటి విషయాలపైనా పూర్తి అవగాహన కలిగిఉండాలి" అని చౌహాన్ వ్యాఖ్యానించారు.

ఫోన్ కొట్టేశాడు.. వేగంగా వెళ్తున్న రైలు నుంచి దూకేశాడు

పట్నా: ఓ రైలులో ప్రయాణికుల నుంచి ఫోన్ కొట్టేసిన దొంగ.. సినిమా ఫీట్‌ను తలపించేలా ప్రమాదకర స్థితిలో తప్పించుకున్నాడు. బ్రిడ్జ్ దాటగానే పొదల్లోకి దూకేశాడు. బిహార్‌లోని భాగల్‌పుర్ నుంచి ముజఫర్‌పుర్ వెళ్తున్న జన్‌సేవ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆ వీడియోను పరిశీలిస్తే.. ఓ వ్యక్తి ఫుట్ బోర్డు వద్ద రాడ్డును పట్టుకొని వేలాడుతూ కనిపించాడు. అతడు రైలులోని ఓ వ్యక్తి ఫోన్ కొట్టేసిన విషయం గమనించిన ఓ ప్రయాణికుడు అరుస్తూ బెల్టుతో కొట్టడానికి ప్రయత్నించాడు. తనని వదలక పోతే మిమ్మల్ని కూడా కిందికి లాగేస్తానని దుండగుడు బెదిరించాడు. ఓవైపు ఈ తంతు జరుగుతుండగా.. రైలు బ్రిడ్జ్‌ను దాటేసింది. దొంగ అదును చూసి పొదల్లోకి దూకేసి అక్కడి నుంచి తప్పించుకున్నాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే, అతడికి గాయాలేమైనా అయ్యాయా? లేదా? అన్నదానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు జమల్‌పుర్ రైల్వే ఎస్పీ రామన్ చౌదరి తెలిపారు.



అత్యుష్ణంతో ఆహార ధరలు భగ్గు

దిల్లీ: నిరుడు మే నెలలో అసాధారణ ఉష్ణోగ్రత వల్ల భారతదేశంలో ఆహార ధరలు మండిపోయాయి. ముఖ్యంగా ఉల్లి, ఆలు ధరలు 80 శాతం కన్నా మించి పెరిగాయి. బార్సిలోనా సూపర్ కంప్యూటింగ్ సెంటర్‌కు చెందిన మ్యాక్స్ మిలియన్ కోట్స్ నాయకత్వంలోని అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం 2022-2024 మధ్య కాలంలో18 దేశాలలో భూతాపం వల్ల 16 సార్లు ఆహార ధరలు పెరిగిన వైనంపై పరిశోధన జరిపింది. భారత్‌లో గతేడాది మేలో ఉష్ణోగ్రత సగటుకన్నా 1.5 సెల్సియస్ డిగ్రీలకు మించి పెరగడంతో ఉల్లి, ఆలూ ధరలు పెరిగిపోయాయని తెలిపింది. వేసవిలో అత్యుష్ణం వల్ల పంట దిగుబడులు తగ్గి ఆహార ధరలు పెరిగాయి. అల్పాదాయ కుటుంబాలు అంత ధర పోసి ఆహారం కొనుగోలు చేయలేక పోషకాహార లోపానికి గురయ్యాయని, దీనివల్ల పేదలు మధుమేహం, క్యాన్సర్, హృద్రోగం వంటి వ్యాధులకు గురయ్యే ప్రమాదం హెచ్చిందని కోట్స్ వివరించారు. పెరిగిన ఆహార ధరలు అధిక ద్రవ్యోల్బణానికి కారణమవుతాయి. ద్రవ్యోల్బణ కట్టడిలో కేంద్ర బ్యాంకులు విఫలమైతే అది ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుంది, తీవ్రవాద భావజాలంతో వ్యవస్థను వ్యతిరేకించే పార్టీలకు, జనాకర్షక వరాలిచ్చే పార్టీలకూ ఆదరణ పెరుగుతుందని అధ్యయనం హెచ్చరించింది.

ఆనకట్టల జాతీయ భద్రతా కమిటీ పునర్‌వ్యవస్థీకరణ

దిల్లీ: ఆనకట్టల జాతీయ భద్రతా కమిటీ(ఎన్‌సీడీఎస్)ని పునర్‌వ్యవస్థీకరిస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2021 డ్యామ్ భద్రతా చట్టం కింద ఈ నెల 22న నోటిఫై చేసిన ఈ కమిటీ మూడేళ్ల పాటు విధులు నిర్వహిస్తుంది. దేశంలో అన్ని ఆనకట్టల భద్రతపై విధివిధానాల రూపకల్పనకు మార్గనిర్దేశనం చేస్తుంది. కేంద్ర జల సంఘం ఛైర్మన్ సారథ్యంలో పనిచేసే ఈ కమిటీలో అన్ని ముఖ్యమైన ప్రభుత్వ శాఖల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. కర్ణాటక, పంజాబ్, అస్సాం, మిజోరం, ఒడిశా, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ చీఫ్ ఇంజనీర్లు సభ్యులే. కేంద్ర విద్యుత్ ప్రాధికార సంఘం, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, భూగర్భ సర్వే సంస్థ, భారత వాతావరణ పరిశోధన సంస్థ, కేంద్ర పర్యావరణ శాఖల ప్రతినిధులు కూడా ఎన్‌సీడీఎస్‌లో సభ్యులుగా వ్యవహరిస్తారు.

40 దేశాలకు ఉచిత టూరిస్టు వీసా

- శ్రీలంక ప్రకటన

కొలంబో: పర్యాటకానికి ఊతమందించి ఆర్థికంగా పుంజుకునే ఉద్దేశంతో తమ దేశం 40 దేశాలకు ఉచిత టూరిస్టు వీసా అందించనుందని శ్రీలంక విదేశాంగ మంత్రి విజిత హెరాత్ శుక్రవారం వెల్లడించారు. నిజానికి ఉచిత వీసా సదుపాయం భారత్, చైనా, ఇండొనేషియా, రష్యా, థాయ్‌లాండ్ తదితర ఏడు దేశాలకు 2023 నుంచే అందుబాటులో ఉంది. ఇప్పుడు ఆ సదుపాయం కలిగిన దేశాల సంఖ్యను 40కి పెంచాలని జాతీయ మంత్రిమండలి గత వారం తీర్మానించిందని హెరాత్ అన్నారు. ఈ 40 దేశాల జాబితాలో బ్రిటన్, కెనడా, పాకిస్థాన్, ఇరాన్, యూఏఈ దేశాలు కూడా ఉన్నాయి. ఉచిత టూరిస్టు వీసా పథకం కారణంగా శ్రీలంకకు 6.6 కోట్ల డాలర్ల నష్టం కలుగుతుందని, అయితే పర్యాటకుల సంఖ్య పెరిగితే అందివచ్చే లాభాలు అంతకన్నా ఎంతో ఎక్కువని విశ్లేషకులు తెలుపుతున్నారు.



అర్ధరాత్రి వృద్ధురాలిని రోడ్డు పక్కన వదిలేస్తున్న బంధువులు

అమానుషానికి తెలియదు.. ఓ కన్ను చూస్తోందని!

అయోధ్య: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య పట్టణ రామ్‌నగరి పోలీస్‌స్టేషను పరిధిలో దర్శన్ నగర్ వద్ద గురువారం అర్ధరాత్రి ఓ ఆటో వచ్చి ఆగింది. అందులోంచి దిగిన యువకుడు, యువతి, మరో మహిళ.. ఓ వృద్ధురాలి (80)ని మోసుకొచ్చి రోడ్డు పక్కన పడుకోబెట్టి ఆమెపై దుప్పటి కప్పారు. ఎవరూ చూడటం లేదని నిర్ధారించుకొన్నాక వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదంతా అక్కడున్న ఓ సీసీ కెమెరాలో రికార్డయ్యింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆ వృద్ధురాలిని పోలీసులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, సీసీటీవీ ఫుటేజీలో ఉన్న వ్యక్తుల ఆచూకీ కనుగొనేందుకు ప్రత్యేకబృందాన్ని ఏర్పాటు చేశామని అయోధ్య ఏఎస్పీ సి.పి.త్రిపాఠి తెలిపారు.

నకిలీ రాయబారికి అంతర్జాతీయ ఆర్థిక నేరగాళ్లతో సంబంధాలు!



ఈటీవీ భారత్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో నకిలీ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటుచేసి అరెస్టయిన హర్షవర్ధన్ జైన్ (47) కేసు దర్యాప్తులో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. ఇతడి నుంచి స్వాధీనం చేసుకున్న పత్రాలను యూపీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) పరిశీలిస్తోంది. హరియాణాకు చెందిన చంద్రస్వామి అనే వ్యక్తి లండన్‌లో ఉన్న సమయంలో దుబాయ్ ఆయుధాల వ్యాపారి అద్నాన్ ఖషోగ్గీ, ఆర్థిక నేరగాడు ఎహసాన్ అలీతో హర్షవర్ధన్‌కు సమావేశాన్ని ఏర్పాటు చేశాడని దర్యాప్తులో తేలింది. అలాగే హర్షవర్ధన్‌కు దుబాయ్‌లో 6, మారిషస్‌లో ఒకటి, బ్రిటన్‌లో 3, భారత్‌లో ఒక బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు ఎస్టీఎఫ్ గుర్తించింది. హైదరాబాదుకు చెందిన ఎహసాన్ అలీకి టర్కిష్ పౌరసత్వం ఉంది. ఇతడితో కలిసి హర్షవర్ధన్ లండన్‌లో డజనుకు పైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేశాడు. హర్షవర్ధన్ గాజియాబాద్‌లో బీబీఏ, లండన్‌లో ఎంబీఏ చదివాడు. ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన ఇతడి తండ్రికి రాజస్థాన్‌లో పాలరాతి గనులు ఉన్నట్లు ఎస్టీఎఫ్ ఏఎస్పీ రాజ్ కుమార్ మిశ్ర తెలిపారు.

బాలికపై సామూహిక అత్యాచారం.. సజీవంగా పాతిపెట్టే యత్నం

భువనేశ్వర్: ఒడిశాలోని జగత్‌సింగ్‌పుర్ జిల్లాకు చెందిన ఓ బాలిక (15)పై పలుమార్లు సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులు ఆమె గర్భవతి అని తెలియగానే సజీవంగా పాతిపెట్టేందుకు ప్రయత్నించారు. కుజంగ్ పోలీసుల కథనం ప్రకారం.. బాలికపై అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పలుమార్లు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె అయిదు నెలల గర్భవతి అని తెలిశాక.. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి సజీవంగా పూడ్చిపెట్టాలని చూశారు. తవ్విన గొయ్యిని చూసి భయకంపితురాలైన బాలిక వారి నుంచి ఎలాగోలా తప్పించుకువచ్చి విషయం ఇంట్లో చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ఆస్పత్రికి తరలించి.. నిందితులను స్థానికంగా ఉండే సోదరులు భాగ్యధర్ దాస్, పంచనన్ దాస్‌లతోపాటు వారి స్నేహితుడు తుటు బాబుగా గుర్తించారు. అన్నదమ్ములను అరెస్టు చేసి, తుటు బాబు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్న పోలీసులు

థాయ్‌లో.. భార్య విడాకులిచ్చిందని తిండి మానేసి బీర్లతో మృత్యువాత

ఇంటర్నెట్ డెస్క్: థాయ్‌లాండ్‌లోని రయాంగ్ నగరానికి చెందిన థవీసక్ (44) భార్య విడాకులిచ్చిందన్న బాధతో పూర్తిగా తిండి మానేసి తాగి చనిపోయాడు. నెల రోజుల పాటు బీర్లు మాత్రమే తాగాడు. దీంతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని ప్రాణాలు కోల్పోయాడు. 16 ఏళ్ల కొడుకును భర్త వద్దే వదిలేసి భార్య వెళ్లిపోయింది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురైన థవీసక్ రోజంతా బీర్లు తాగేవాడు. పాఠశాల నుంచి వచ్చిన కొడుకు ఏదో ఒకటి వండిపెట్టినా తినేవాడు కాదు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుమారుడు అందించిన సమాచారంతో ఓ స్వచ్ఛంద సంస్థ అతణ్ని ఆస్పత్రిలో చేర్చేందుకు సిద్ధమైంది. సంస్థ సభ్యులు ఇంటికి చేరుకునేలోపే థవీసక్ మరణించాడు. ఇంట్లో పడకగది నిండా బీరు సీసాలే ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



పడకగదిలో ఖాళీ బీరు బాటిళ్లు

ఇగ్నోలో మొదటి మహిళా ఉప కులపతిగా ఉమా కాంజీలాల్



దిల్లీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) స్థాపించిన దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత మొదటి మహిళా ఉపకులపతిగా ఉమా కాంజీలాల్ నియమితులయ్యారు. విద్యాశాఖ అధికారులు శుక్రవారం ఈ మేరకు ప్రకటించారు. సార్వత్రిక, దూరవిద్య విభాగంలో 36 సంవత్సరాలకు పైగా విశిష్ట సేవలు అందించిన కాంజీలాల్ డిజిటల్ ఆవిష్కరణలు, నాయకత్వంతో ఇగ్నోని ప్రపంచంలోనే అతిపెద్ద సార్వత్రిక విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నిలుపుతారని ఓ అధికారి ఆశాభావం వ్యక్తంచేశారు. 2021 మార్చి నెల నుంచి జులై 2024 మధ్య ఆమె యూనివర్సిటీలో ప్రో వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. కాంజీలాల్ ప్రస్తుతం డిజిటల్ విద్యలో భాగంగా విద్యాశాఖ ఆవిష్కరించిన 'స్వయం, స్వయంప్రభ'లకు జాతీయ సమన్వయకర్తగా ఉన్నారు.

ఈనాడు సినిమా

పాటతో పూర్తయిన విశ్వంభర


చిరంజీవి

చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'విశ్వంభర' చిత్రీకరణ పూర్తయింది. శుక్రవారం హైదరాబాద్‌లో చిరంజీవి, బాలీవుడ్ తార మౌని రాయ్‌లపై ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించారు. దీంతో సినిమా పూర్తయినట్టు చిత్రవర్గాలు తెలిపాయి. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. చిరంజీవి సరసన త్రిష, ఆషికా రంగనాథ్ నటించారు. కునాల్ కపూర్ ముఖ్య భూమిక పోషించారు. యు.వి.క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. టాకీభాగం చిత్రీకరణ ఇదివరకే పూర్తయింది. శుక్రవారం ప్రముఖ నృత్య దర్శకుడు గణేశ్ ఆచార్య నేతృత్వంలో చిరంజీవి, మౌనిరాయ్‌తోపాటు వంద మంది డ్యాన్సర్లతో ప్రత్యేకగీతాన్ని తెరకెక్కించారు. ఈ పాటని భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి స్వరకర్త. ఛోటా కె.నాయుడు ఛాయాగ్రాహకుడు.

ఈసారి ఫాంటసీ కథతో?


బాలకృష్ణ

బాలకృష్ణ - క్రిష్ జాగర్లమూడి కలయికలో మరో సినిమా రానుందనే సంగతి ఎప్పట్నుంచో వినిపిస్తోంది. ఆ దిశగా ఇప్పుడు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ సినిమా ఎప్పుడు, ఎలా చేయాలనే విషయంపై బాలకృష్ణ ఓ అంగీకారానికి వచ్చినట్టు సమాచారం. త్వరలోనే గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. అది మొదలైన కొన్ని రోజులకే, క్రిష్ దర్శకత్వంలో సినిమానీ పట్టాలెక్కించాలనే ప్రణాళికలతో బాలకృష్ణ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ కలయికలో ఇదివరకు 'గౌతమిపుత్ర శాతకర్ణి'తోపాటు ఎన్టీఆర్ బయోపిక్ సినిమాలు వచ్చాయి. ఈసారి ఓ ఫాంటసీ కథతో సినిమా రూపొందనున్నట్టు సమాచారం. మరి ఆ కథ ఇన్నాళ్లుగా ప్రచారంలో ఉన్నట్టు 'ఆదిత్య 369'కి కొనసాగింపుగా ఉంటుందా?, లేక మరో కథనా అనేది తెలియాల్సి ఉంది. త్వరలోనే ఆ ప్రాజెక్ట్‌పై స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఇద్దరూ ఇద్దరే


ఎన్టీఆర్, హృతిక్‌రోషన్

"ఇప్పుడు నేను మనిషిని కాను, ఓ ఆయుధాన్ని! యుద్ధంలో ఆయుధాన్ని. చస్తాను లేదంటే చంపుతా'' అంటున్నాడు ఎన్టీఆర్. ఇదంతా 'వార్ 2' చిత్రం కోసమే. ఆయన, బాలీవుడ్ స్టార్ హృతిక్‌రోషన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. కియారా అద్వాణీ కథానాయిక. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ తన స్పై యూనివర్స్‌లో భాగంగా నిర్మించిన చిత్రమిది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. "నేను ప్రమాణం చేస్తున్నా. నేను నా పేరుని, నా గుర్తింపుని... నా ఇంటిని, కుటుంబాన్ని.. అన్నింటినీ వదిలేసి ఓ నీడగా మారిపోతా. ఓ ఊరు పేరు లేని రూపం లేని నీడలా...'' అంటూ హృతిక్‌రోషన్, 'ఎవ్వరూ చేయలేని పనుల్ని నేను చేసి చూపిస్తాను. ఎవ్వరూ పోరాడలేని యుద్ధంలో నేను పోరాడతా' అంటూ ఎన్టీఆర్ చెప్పే సంభాషణలతో ఈ ట్రైలర్ ఆసక్తికరంగా మొదలవుతుంది. మిత్రులైనా సరే, ఆప్తులైనా సరే పట్టించుకోకుండా అడుగేసే ఓ సైనికుడిగా హృతిక్... మంచి చెడు, తప్పు ఒప్పు, పాపం పుణ్యం అనే విషయాల్ని పట్టించుకోకుండా పోరాటం చేసే మరో సైనికుడిగా ఎన్టీఆర్ ఇందులో కనిపించనున్నట్టు ట్రైలర్ చాటుతోంది. నువ్వా నేనా అన్నట్టుగా సాగే ఈ ఇద్దరి మధ్య యుద్ధమే ప్రధానంగా రూపొందిన సినిమా అని అర్థమవుతోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలున్న సినిమా ఇది. తెలుగులో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ విడుదల చేస్తోంది.

గాయకుడు మహమ్మద్ రఫీ జీవితం తెరపైకి



"నా మది నిన్ను పిలిచింది గానమై..'' అంటూ తెలుగు ప్రేక్షకులకు చేరువైన ప్రముఖ బాలీవుడ్ గాయకుడు మహమ్మద్ రఫీ. మళ్లీ మళ్లీ వినాలపించే ఎన్నో అద్భుత గీతాల్ని ఆలపించిన ఈ గాయకుడి పాటల పూదోటలో ప్రతిదీ మనోహరమైనదే. హిందీ సినీ సంగీత ప్రపంచాన్ని దశాబ్దాల పాటు ఏలిన రఫీ జీవితం ఇప్పుడు సినిమా రూపంలో తెరపైకి రాబోతుంది. 'ఓ మై గాడ్', '102 నాటౌట్', 'ఆల్ ఈజ్ వెల్' లాంటి చిత్రాలను తెరకెక్కించిన ఉమేశ్ శుక్లా ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ విషయాన్ని దర్శకుడు అధికారికంగా ప్రకటిస్తూ.. దీని గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకున్నారు. "అవును.. నేను మహమ్మద్ రఫీ బయోపిక్ కోసం పనిచేస్తున్నా. ఇంకా ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికను ప్రారంభించలేదు. ప్రస్తుతం స్క్రిప్టును పూర్తి చేశాను. ఇప్పుడిక రఫీ పాత్రకి న్యాయం చేసే నటుడి కోసం వెతుకుతున్నా. ఈ బయోపిక్‌లో ఆయన ఒరిజినల్ పాటలను వినియోగిస్తామ''ని చెప్పారు.

రిటైర్మెంట్ తర్వాత.. డ్రైవర్‌గా పనిచేస్తా


ఫహద్ ఫాజిల్

ప్రతినాయకుడిగా.. కథానాయకుడిగా భిన్నమైన కథలతో ప్రయాణం చేస్తున్నారు ఫహద్ ఫాజిల్. ప్రస్తుతం 'మారీసన్' చిత్రంతో థియేటర్లలో సందడి చేస్తున్నారు. ఆయనకు క్యాబ్ డ్రైవర్‌గా పని చేయడమంటే ఆసక్తి అని ఓ సందర్భంలో చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మరోసారి ఆ విషయాన్ని గుర్తు చేసుకున్నారు ఫహద్. డ్రైవింగ్ అంటే తనకెంతో ఇష్టమని.. ఆ పని ఎప్పుడూ బోర్ కొట్టదని తెలిపారు. "మేము కొన్ని నెలల క్రితం బార్సిలోనాకి వెళ్లాం. నాకెంతో ఇష్టమైన ప్రదేశమది. ప్రేక్షకులు తెరపై నన్ను చూడలేక పోతున్నాం అనుకున్న రోజు అక్కడికి వెళ్లి స్థిరపడతా. ఇదంతా సరదాగా చెప్పట్లేదు. ప్రజలను వారి గమ్యస్థానాలకు తీసుకెళ్లడం అనేది ఒక మంచి విషయం. ఇది నా దృష్టిలో గొప్ప పని. అందుకే రిటైర్‌మెంట్ ప్రకటించిన తర్వాత బార్సిలోనా వెళ్లి అక్కడ డ్రైవర్‌గా పనిచేస్తా" అని అన్నారు.

ఛాంబర్ ఎన్నికలు నిర్వహించాల్సిందే!

ఎంతో చరిత్ర ఉన్న తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి (ఫిల్మ్ ఛాంబర్)కి నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాల్సిందే అని డిమాండ్ చేశారు పలువురు నిర్మాతలు. కొంత మంది స్వార్థంతో తప్పుడు నిర్ణయాలు తీసుకుని, ఎన్నికల్ని వాయిదా వేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని చలన చిత్ర వాణిజ్య మండలి కార్యాలయంలో పలువురు నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ నెల 30వ తేదీతో ఇప్పుడున్న కమిటీ గడువు పూర్తవుతుందని, వెంటనే షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలంటూ చలన చిత్ర వాణిజ్య మండలి ప్రస్తుత అధ్యక్షుడు భరత్‌భూషణ్‌ని, ఇతర సభ్యుల్ని కోరుతున్నట్టు తెలిపారు. కాదని ముందుకు వెళితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు కేఎస్ రామారావు, అశోక్‌కుమార్, ప్రతాని రామకృష్ణగౌడ్, బసిరెడ్డి, విజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితికి 'సుందరకాండ'


నారా రోహిత్


పండుగ రోజున రావడం శుభం అంటూ 'సుందరకాండ' విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. అది కూడా కథానాయకుడి పుట్టినరోజున విడుదల ముచ్చటని బయట పెట్టడం విశేషం. నారా రోహిత్ కథానాయకుడిగా... వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'సుందరకాండ'. వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్ కథానాయికలు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ పతాకంపై సంతోశ్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మిస్తున్నారు. నారా రోహిత్‌కి ఇది 20వ చిత్రం. ఆయన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఈ సినిమా విడుదల తేదీని ప్రత్యేకమైన వీడియోతో ప్రకటించారు. వినాయక చవితి సందర్భంగా ఆగస్టు 27న విడుదల చేస్తున్నట్టుగా అందులో స్పష్టతనిచ్చారు. ఓ యువకుడి జీవితంలోని రెండు దశల్ని ఆవిష్కరించే కథతో ఈ చిత్రం రూపొందిందని, ఆయా దశల్లో ఇద్దరమ్మాయిలతో సాగించిన ప్రేమాయణం ఆసక్తిని రేకెత్తిస్తుందని సినీ వర్గాలు తెలిపాయి. నరేశ్ విజయకృష్ణ, వాసుకి ఆనంద్, సత్య, అజయ్, వీటీవీ గణేశ్, అభినవ్ గోమటం, విశ్వంత్, రూపలక్ష్మి, సునైనా, రఘుబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కూర్పు: రోహన్ చిల్లాలే, కళ: రాజేశ్ పెంటకోట, సాహిత్యం: శ్రీహర్ష ఈమని, ఛాయాగ్రహణం: ప్రదీప్ ఎం.వర్మ.

మేఘాలు ఏం చెప్పాయి?


నరేశ్, రబియా

జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో ఎన్నో సవాళ్లు ఉంటాయి. అలాంటి సవాళ్లని ఓ యువకుడు ఎలా అధిగమించాడు? అనుకున్నది ఎలా సాధించాడన్నదే మా చిత్రం అన్నారు నరేశ్ అగస్త్య. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'. రబియా ఖాతూన్ కథానాయిక. రాధిక శరత్‌కుమార్ ముఖ్యభూమిక పోషించారు. విపిన్ దర్శకుడు. ఉమాదేవి కోట నిర్మాత. శుక్రవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. కథానాయకుడు నరేశ్ అగస్త్య మాట్లాడుతూ "అందమైన కథతో, అంతే అందంగా తెరకెక్కిన చిత్రమిది. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే ఈ కథలో ప్రేమ, భావోద్వేగాలు మనసుల్ని హత్తుకుంటాయి. హీరోకంటే అందంగా కనిపించే ఓ నటుడు ఈ సినిమాకి చాలా అవసరం. ఆ పాత్రలో రాజా చాలా బాగా నటించారు" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "కుటుంబమంతా కలిసి చూసే ఓ స్వచ్ఛమైన కథ ఇది" అన్నారు. 'అన్నీ పక్కాగా కుదిరిన సినిమా ఇది. ప్రేక్షకుల్ని తప్పకుండా మెప్పిస్తుందనే బలమైన నమ్మకంతో ఉన్నాం" అన్నారు దర్శకుడు. "ఎంతో స్పష్టతతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు. నరేశ్ అగస్త్యతో కలిసి నటించడం ఆనందంగా ఉంది" అన్నారు నటుడు రాజా చేంబోలు. వినోదానికి లోటు చేయని సినిమా ఇదన్నారు కథానాయిక రబియా. ఈ చిత్రం ఆగస్టు 22న రానుంది.

చరిత్ర పుటల్లో కనిపించని యుద్ధాలు!



ఓటీటీ బొమ్మ

'ధూమ్ ధామ్'తో ఈ ఏడాది ప్రారంభంలోనే మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు కథానాయకుడు ప్రతీక్ గాంధీ. ఇటీవలే ఆయన "భారతదేశాన్ని శత్రువు కంటే ఒక అడుగు ముందుంచాలి'' అంటూ తన రాబోయే వెబ్ సిరీస్ 'సారే జహా సే అచ్ఛా'ను అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. సుమిత్ పురోహిత్ దీన్ని రూపొందిస్తున్నారు. ఈ సిరీస్ వచ్చే నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ ఇన్‌స్టా వేదికగా ఓ కొత్త పోస్టర్‌ను పంచుకుంది. "కొన్ని యుద్ధాలు చరిత్ర పుటల్లో కనిపించవు'' అనే వ్యాఖ్యను జోడించింది. ఇందులో విష్ణు శంకర్ అనే గూఢచారిగా కనిపించనున్నారు ప్రతీక్. 1970ల నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ సిరీస్‌లో సన్నీ హిందూజా, సుహైల్ నయ్యర్, రజత్ కపూర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

హీరోల మాదిరి హీరోయిన్లకు అవకాశాలు రావడం లేదు


నుస్రత్ భరుచా

"హిందీ చిత్రపరిశ్రమలో హీరోలతో సమాన హోదాను పొందడానికి నటీమణులు ఇప్పటికీ కష్టపడుతూనే ఉన్నార'ని అంటోంది బాలీవుడ్ నాయిక నుస్రత్ భరుచా. వైవిధ్యమైన కథలతో ప్రయాణం చేస్తున్న కథానాయికీమె. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నుస్రత్.. సెట్‌లో తనను హీరోలతో సమానంగా చూడకపోవడం గురించి మాట్లాడింది. "కథానాయకులకు తరచుగా మంచి వానిటీ వ్యాన్‌లు లభించేవి. "నేను హీరో వానిటీ వ్యాన్‌ను ఒక 5నిమిషాలు వినియోగించవచ్చా? ప్రస్తుతం ఆయన ఇక్కడ లేరు కదా.. నేను వాష్‌రూమ్‌ను వాడుకోవచ్చా?'' అని అడిగిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఎందుకంటే వారి వానిటీ వ్యాన్‌లు మా కన్నా బాగుంటాయి. ఇలాంటి సమయాల్లో నేను ఎవరికీ దీనిపై ఫిర్యాదు చేయలేదు. కానీ పరిస్థితులు ఎలా మారుతున్నాయో పరిశీలిస్తుంటా. ఒక హీరో హిట్ ఇచ్చిన వెంటనే.. అతను కనీసం ఐదు చిత్రాలకి సంతకం చేస్తాడు. కానీ హీరోయిన్లు మాత్రం అవకాశాల కోసం ఎదురుచూడాలి. నటీమణులు రాత్రికి రాత్రే సంచలనంగా మారాలని నేను చెప్పడం లేదు. హీరోలకు వస్తోన్న అవకాశాలు నాయికలకు రావట్లేదనేది నా అభిప్రాయమ''ని చెప్పుకొచ్చింది.

ఓపెన్ ఏఐ సీఈవోను కలిసిన రెహమాన్


రెహమాన్, శామ్ ఆల్ట్‌మన్

ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ కలిశారు. శుక్రవారం ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేస్తూ శామ్‌తో దిగిన ఫొటోని పంచుకున్నారు రెహమాన్. "శామ్‌ను ఆయన కార్యాలయంలో కలవడం ఆనందంగా ఉంది. వర్చువల్ గ్లోబల్ బ్యాండ్ 'సీక్రెట్ మౌంటైన్' గురించి తాము చర్చించుకున్నాం. సంగీతంలోని కొత్త ఆవిష్కరణల కోసం ఏఐని వినియోగించడం గురించి మాట్లాడుకున్నాం''అంటూ పోస్ట్ చేశారు రెహమాన్.

అభినయ కృష్ణ దర్శకత్వంలో 'కామాఖ్య'


అభి

జబర్దస్త్ షోతో అదిరే అభి పేరుతో సుపరిచితమైన నటుడు అభినయ కృష్ణ. ఆయన దర్శకత్వంలో... సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రధారులుగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. మిస్టీరియస్ థ్రిల్లింగ్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రానికి 'కామాఖ్య' అనే శక్తిమంతమైన పేరుని ఖరారు చేసినట్టు సినీ వర్గాలు ప్రకటించాయి. దైవిక అంశాలతో ముడిపడిన ఓ విభిన్నమైన కథని అభినయ కృష్ణ సిద్ధం చేశాడని సినీ వర్గాలు తెలిపాయి. ఆనంద్, శరణ్యప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ తదితరులు నటిస్తున్నారు.

ప్రేమ కోసం జరిగే శాశ్వత పోరాటం


సిద్ధాంత్ చతుర్వేది, త్రిప్తి దిమ్రీ.

కొత్త జోడీలు.. మనసుకు హత్తుకునే ప్రేమకథలు.. మైమరిపించే సంగీతంతో ప్రేక్షకుల్ని అలరిస్తుంది హిందీ చిత్రపరిశ్రమ. ఈ కోవలోనే 'ధడక్ 2' రాబోతున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ నాయిక త్రిప్తి దిమ్రీ, సిద్ధాంత్ చతుర్వేది జంటగా నటించారు. రొమాంటిక్ ప్రేమకథగా షాజియా ఇక్బాల్ తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్, పోస్టర్లకు సినీప్రియుల్ని ఆకర్షించాయి. ఆగస్టు 1న రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మరో వీడియోను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది చిత్రబృందం. "ఇది ప్రేమ కోసం జరిగే శాశ్వత పోరాటం. మరో 7రోజుల్లో మొదలవుతుంద''నే వ్యాఖ్యను జోడించింది. యువతను విశేషంగా ఆకట్టుకున్న 'ధడక్' సినిమాకు సీక్వెల్‌గా దీన్ని కరణ్ జోహార్ నిర్మించారు.

లారస్ ల్యాబ్స్ లాభం రూ.163 కోట్లు


సత్యనారాయణ చావ

ఈనాడు, హైదరాబాద్: లారస్ ల్యాబ్స్ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.1570 కోట్ల ఆదాయం, రూ.163 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈపీఎస్ రూ.3 నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఆదాయం రూ.1,195 కోట్లు, నికరలాభం రూ.13 కోట్లే కావడం గమనార్హం. దీంతో పోల్చితే ఈసారి ఆదాయం 31%, నికరలాభం 1185% పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో సీడీఎంఓ (కాంట్రాక్టు అభివృద్ధి, ఉత్పత్తి) విభాగం నుంచి ఆదాయాలు పెరిగాయని, ఇతర విభాగాల్లోనూ వృద్ధి కనిపిస్తోందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావ తెలిపారు. జనరిక్ ఎఫ్‌డీఎఫ్ (ఫినిష్డ్ డోసేజ్ ఫామ్) విభాగంలో కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. సీడీఎంఓ, జనరిక్ ఔషధాలు, ఎఫ్‌డీఎఫ్ కార్యకలాపాలను విస్తరించేందుకు కొత్త యూనిట్లు సిద్ధం చేస్తున్నామని, స్థిరమైన వృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు.

సీడీఎంఓ ఆదాయం రెట్టింపు: సమీక్షా త్రైమాసికంలో సీడీఎంఓ విభాగం రెట్టింపు వృద్ధితో రూ.522 కోట్ల ఆదాయాన్ని సాధించింది. జనరిక్ ఏపీఐ ఆదాయాలు దాదాపు స్థిరంగా ఉండగా, జనరిక్ ఎఫ్‌డీఎఫ్ ఆదాయం 50% పెరిగింది. హైదరాబాద్‌లో నూతన జీన్/ ఏడీసీ సదుపాయాన్ని నిర్మిస్తున్నామని, విశాఖపట్నంలో మైక్రోబయల్ ఫెర్మెంటేషన్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది.

సంయుక్త సంస్థలో మరో రూ.50 కోట్లు: స్లొవేనియా సంస్థ కేఆర్‌కేఏ డీ.డీ., నోవో మెస్తోతో కలిసి గత ఏడాది ఏర్పాటు చేసిన సంయుక్త సంస్థ (జేవీ), కేఆర్‌కేఏ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో అదనంగా మరో 5 మిలియన్ యూరోల (దాదాపు రూ.50 కోట్లు) పెట్టుబడి పెట్టాలని లారస్ ల్యాబ్స్ యాజమాన్యం నిర్ణయించింది. కేఆర్‌కేఏ డీ.డీ., నోవో మెస్తో, స్లొవేనియా కూడా తన వాటా కింద 5 మిలియన్ యూరోల పెట్టుబడి పెడుతుంది. ఈ కంపెనీలో ప్రస్తుతం లారస్ ల్యాబ్స్‌కు 49%, కేఆర్‌కేఏకు 51% వాటాలున్నాయి. హైదరాబాద్‌లో 19 ఎకరాల స్థలంలో ఈ సంయుక్త సంస్థ నిర్మిస్తున్న ఎఫ్‌డీఎఫ్ ఔషధాల యూనిట్ 2027 నాటికి అందుబాటులోకి వస్తుంది.

ఐటీసీ రూ.20,000 కోట్ల పెట్టుబడులు

- ఆన్‌లైన్ ఆహార సేవల్లోకి ప్రవేశిస్తాం
- కంపెనీ సీఎండీ సంజీవ్ పురి

కోల్‌కతా: మధ్యకాల వ్యవధిలో పలు వ్యాపారాల్లో రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఐటీసీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) సంజీవ్ పురి ప్రకటించారు. తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, వర్ధమాన విభాగాల వృద్ధికి ఈ పెట్టుబడులను వినియోగించనున్నారు. దృశ్యమాధ్యమ పద్ధతిలో జరిగిన కంపెనీ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో వాటాదార్లను ఉద్దేశించి సంజీవ్ మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అనుగుణంగా.. 8 ప్రపంచ స్థాయి తయారీ కేంద్రాలపై కంపెనీ ఇటీవల రూ.4,500 కోట్ల పెట్టుబడులు పెట్టిందని వెల్లడించారు. కొత్త విభాగాలపై దృష్టి పెట్టామని, పలు వ్యాపార విభాగాలపై రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెడతామన్నారు. 2024 ఏజీఎంలోనూ ఆయన ఈ పెట్టుబడుల ప్రణాళికనే ప్రకటించడం గమనార్హం. ఎఫ్ఎమ్‌సీజీ, సస్టెయినబుల్ ప్యాకేజింగ్, ఎగుమతుల



కోసం విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులపై నూతన పెట్టుబడులు ఉండే అవకాశం ఉంది. ప్రతిపాదిత మూలధన వ్యయాల కోసం కచ్చిత సమయాన్ని పురి వెల్లడించలేదు. 'ఐటీసీ నెక్స్ట్' వ్యూహానికి అనుగుణంగా గుర్తించిన విభాగాల్లో పెట్టుబడులు ఉంటాయని, భవిష్యత్తుకు అవసరమైన పోర్ట్‌ఫోలియోను నిర్మించేందుకు వెచ్చిస్తామని వివరించారు.

ఎఫ్ఎమ్‌సీజీ వృద్ధిపై దృష్టి

ప్రస్తుతం స్థూలఆర్థిక ఒడుదొడుకులు ఉన్నప్పటికీ.. ఎఫ్ఎమ్‌సీజీ వ్యాపారంలో దీర్ఘకాల వృద్ధి, లాభదాయకతపై ఆశావహంగా ఉన్నామని సంజీవ్ పురి పేర్కొన్నారు. ఐటీసీ ఎఫ్ఎమ్‌సీజీ వ్యాపారం ఉన్నత శిఖరాలను, సామర్థ్యాలను సాధించిందని అన్నారు. ఈ విభాగ వ్యాపారం దాదాపు రూ.5 లక్షల కోట్లుగా ఉందని, పరిశ్రమలో ఇదే అత్యధికమని వివరించారు.

సరైన సమయంలో ఐటీసీ ఇన్ఫోటెక్‌పై నిర్ణయం

ఐటీసీ ఇన్ఫోటెక్ సహా పలు వ్యాపారాలపై వ్యూహాత్మక అవకాశాల మదింపును కొనసాగిస్తామని సంజీవ్ పురి స్పష్టం చేశారు. ఇందుకు పోటీ పరిస్థితులు, వ్యాపార అనుభవం, అవకాశాలు, మొత్తంగా విలువ సృష్టి వంటి వాటిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. హోటళ్ల వ్యాపారాన్ని విడదీసినట్లు, ఐటీసీ ఇన్ఫోటెక్‌పై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

5 నగరాల్లో 60 క్లౌడ్ కిచెన్‌లు

వేగంగా విస్తరిస్తున్న ఆన్‌లైన్ ఆహార సేవల విభాగాల్లోకి, ఫుడ్ టెక్ ప్లాట్‌ఫామ్ ద్వారా అడుగుపెట్టే యోచనలో ఐటీసీ ఉందన్నారు. ఆహారం, హోటల్స్, డిజిటల్ సాంకేతికతను అనుసంధానం చేసి, ఈ సేవలకు వినియోగిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే 5 నగరాల్లో 60 క్లౌడ్ కిచెన్‌లను ఐటీసీ మాస్టర్ చెఫ్ క్రియేషన్స్, ఆశీర్వాద్ సోల్ క్రియేషన్స్, సన్‌ఫీస్ట్ బేక్డ్ క్రియేషన్స్, సన్‌షో బై ఐటీసీ మాస్టర్ చెఫ్ బ్రాండ్ల కింద సంస్థ నిర్వహిస్తోందని గుర్తు చేశారు. ప్రస్తుత ఆన్‌లైన్ ఫుడ్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా, ఈ బ్రాండ్ల కింద ఆహారోత్పత్తులు డెలివరీ చేస్తున్నారు.

ఈనాడు బిజినెస్

ఎంజీ మోటార్ సైబర్‌స్టర్ ఎలక్ట్రిక్

ధర రూ.74.99 లక్షలు



దిల్లీ: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ లగ్జరీ విభాగం ఎంజీ సెలెక్ట్, అత్యంత వేగవంతమైన విద్యుత్తు కారు సైబర్‌స్టర్‌ను విపణిలోకి విడుదల చేసింది. ఈ కారు ధరను రూ.74.99 లక్షలుగా నిర్ణయించారు. ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వారు రూ.72.49 లక్షలకు పొందొచ్చు. 0-100 కి.మీ వేగాన్ని ఈ కారు 3.2 సెకన్లలోనే అందుకుంటుందని కంపెనీ తెలిపింది. ఇందులోని డ్యూయల్ మోటార్ ఆల్ వీల్ డ్రైవ్ పవర్‌ట్రైన్ 510 పీఎస్, 725 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. 77 కిలోవాట్ అవర్ అల్ట్రా థిన్ బ్యాటరీ ప్యాక్‌తో, ఒకసారి ఛార్జింగ్‌తో 580 కి.మీ ప్రయాణించొచ్చని ఎంజీ మోటార్ వెల్లడించింది. ఎలక్ట్రిక్ సిజర్ డోర్లు, సాఫ్ట్ టాప్ రూఫ్, ఏడీఏఎస్, రియల్ టైమ్ డ్రైవర్ మానిటరింగ్ వ్యవస్థ, డ్యూయల్ సైడ్ ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్లు ఉన్నాయి.

అభ్యంతరాల నడుమ సోనా బీఎల్‌డబ్ల్యూ ఏజీఎం

ముంబయి: సంస్థ ప్రమోటర్ కపూర్ కుటుంబ ప్రతినిధులుగా కొందరు డైరెక్టర్ల నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ఏజీఎంను వాయిదా వేయమని సోనా గ్రూప్ మాజీ ఛైర్‌పర్సన్ రాణి కపూర్ కోరినప్పటికీ, వాహన విడిభాగాల సంస్థ సోనా బీఎల్‌డబ్ల్యూ (ప్రెసిషన్ ఫోర్జింగ్స్) శుక్రవారం నిర్వహించింది. గత నెలలో మరణించిన సంస్థ ఛైర్మన్ సంజయ్‌కపూర్‌కు రాణి కపూర్ తల్లి. సోనా గ్రూప్ మాజీ ఛైర్మన్ సురీందర్ కపూర్‌కు భార్య కూడా. తన కుమారుడు సంజయ్ కపూర్ బ్రిటన్‌లో అకస్మాత్తుగా మరణించడంపైనా చాలా అనుమానాలున్నాయని ఆమె ఆరోపించడంతో పాటు, తాను సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్ బోర్డులో ఏ వ్యక్తినీ అధికారికంగా నియమించలేదని ఒక లేఖ ద్వారా ఆమె తెలిపారు. నియంత్రణ సంస్థల నిబంధనలను పాటించే ఏజీఎం నిర్వహించినట్లు సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్ తెలిపింది. రాణి కపూర్ 2019 నుంచి కంపెనీలో వాటాదారుగా లేనందున.. ఆమె డిమాండ్ మేరకు ఏజీఎంను వాయిదా వేయాల్సిన అవసరం లేదని నిర్ణయించినట్లు పేర్కొంది.

సెయిల్ లాభం రూ.745 కోట్లు

దిల్లీ: ప్రభుత్వ రంగ ఉక్కు సంస్థ సెయిల్, జూన్ త్రైమాసికంలో రూ.744.58 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదుచేసింది. 2024-25 ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.81.78 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మెరుగైన నిర్వహణ సామర్థ్యం, బలమైన విక్రయాల వృద్ధి ఇందుకు దోహదపడ్డాయి. మొత్తం ఏకీకృత ఆదాయం రూ.24,174.80 కోట్ల నుంచి రూ.26,083.90 కోట్లకు వృద్ధి చెందింది. మొత్తం వ్యయాలు రూ.23,871.60 కోట్ల నుంచి రూ.25,189.19 కోట్లకు చేరాయి.


స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌పై రూ.3.39 కోట్ల పెనాల్టీ

దిల్లీ: స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్‌పై బీమా నియంత్రణాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ రూ.3.39 కోట్ల అపరాధ రుసుము విధించింది. 'ఇన్ఫర్మేషన్ అండ్ సైబర్ సెక్యూరిటీ గైడ్‌లైన్స్ 2023'లోని వివిధ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తన ఆదేశాల్లో తెలిపింది. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు 14,000 నెట్‌వర్క్ ఆసుపత్రులు, 913 కార్యాలయాలు, 7,75,000 లైసెన్స్‌డ్ ఏజెంట్లు, 17,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

ఆ నిర్ణయానికి ఎంతో ఒత్తిడికి గురయ్యా

- ఏఐ మార్పుల కోసం తప్పలేదు
- 15,000 ఉద్యోగాల కోతపై మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల

దిల్లీ: మైక్రోసాఫ్ట్‌లో ఇటీవల చేపట్టిన 15,000 మందికి పైగా ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని కంపెనీ సీఈఓ సత్య నాదెళ్ల సమర్థించుకున్నారు. ఎంతో కష్టంపై, తీవ్రమైన ఒత్తిడిలోనే ఈ నిర్ణయాన్ని తీసుకున్నానని వివరించారు. సంస్థను కృత్రిమ మేధ (ఏఐ) దిశగా నడిపేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. 2 లక్షల మందికి పైగా కంపెనీ ఉద్యోగులకు రాసిన లేఖలో ఈ విషయాలను ఆయన విశదీకరించారు. 'సంస్థ భవిష్యత్తు వృద్ధి కోసం తీసుకోవాల్సి వచ్చిన అత్యంత కష్టతరమైన నిర్ణయాల్లో ఇది ఒకటి. మనతో పాటు పనిచేసిన సహోద్యోగులు, సహచరులు, స్నేహితులను ఈ నిర్ణయం ప్రభావితం చేస్తుంది' అని నాదెళ్ల వెల్లడించారు. కంపెనీ నుంచి నిష్క్రమించిన ఉద్యోగులు, ఇప్పటివరకు సంస్థ ఉన్నతికి అందించిన సహకారానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఖాతాదారులు, వినియోగదారుల ఆకాంక్షలను అందుకోవడం, వారి అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని, కొత్త విభాగాలను సృష్టిస్తామని వివరించారు. సాఫ్ట్‌వేర్ ఫ్యాక్టరీ నుంచి ఇంటెలిజెన్స్ ఇంజిన్‌గా మారనున్న మైక్రోసాఫ్ట్.. ఏఐ మౌలిక వసతుల కోసం 80 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోందని పేర్కొన్నారు.



✦ కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 7 శాతం మందికి ఇటీవల లేఆఫ్ ప్రకటించింది. 2014 తర్వాత మైక్రోసాఫ్ట్‌లో ఇంత భారీగా ఉద్యోగులను తొలగించడం ఇప్పుడే. అయినా కొత్త చేరికల ఫలితంగా, ఉద్యోగుల సంఖ్యలో మార్పు లేదు. భారీగా ఉద్యోగుల తొలగింపు చేపట్టినా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు మైక్రోసాఫ్ట్ షేరు 21% పరుగులు తీసి రికార్డు స్థాయిలో 500 డాలర్ల ఎగువకు చేరింది. గత మూడు త్రైమాసికాల్లో 75 బి.డాలర్ల నికర ఆదాయాన్ని సంస్థ నమోదుచేసింది.

ఇంటెల్ 25,000 ఉద్యోగాల కోత!

దిల్లీ: చిప్ తయారీ దిగ్గజ సంస్థ ఇంటెల్, ఈ ఏడాది చివరకు 25,000 ఉద్యోగాల కోత విధించాలని భావిస్తోంది. ఫలితంగా తమ ఉద్యోగుల సంఖ్య 75,000కు పరిమితం అవుతుందని అంచనా వేస్తోంది. ఇందువల్ల వ్యయాలు భారీగా తగ్గించుకోవచ్చని, ఇటీవలి నష్టాల నుంచి కోలుకోవచ్చన్నది సంస్థ ఆలోచన. ఐరోపాలో కొన్ని ఫ్యాక్టరీల నిర్మాణ పనులను సంస్థ ఆపివేయనుంది. దీంతోపాటు అమెరికా విస్తరణ కార్యకలాపాల్లోనూ నిదానించాలని యోచిస్తోంది. కొన్ని కార్యకలాపాలను ఆసియా దేశాలకు బదిలీ చేయాలనీ భావిస్తోంది. ఇటీవలి అంతరాయాల నుంచి కోలుకుని, పోటీసంస్థలకు దీటుగా నిలవాలంటే సామర్థ్యాలను గణనీయంగా మెరుగు పరచుకోవాలన్నది సంస్థ ప్రణాళిక. ఇందుకోసమే తాజా ప్రణాళికలు రూపొందిస్తోంది.

రూ.460 కోట్ల ఇష్యూకు రూ.49,400 కోట్ల బిడ్లు

జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీఓకు అద్భుత స్పందన

దిల్లీ: ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌లను రీఫర్బిషింగ్ చేసే కార్యకలాపాలను మనదేశంతో పాటు అమెరికా, ఐరోపాల్లోనూ నిర్వహిస్తున్న జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ తొలి పబ్లిక్ ఆఫర్‌కు (ఐపీఓ) విశేష స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,41,88,644 షేర్లను రూ.225-237 ధరల శ్రేణిలో జారీ చేయాలని కంపెనీ నిర్ణయించింది. ఇంతకు 146.90 రెట్లు అధికంగా 2,08,43,32,446 షేర్లకు బిడ్‌లు వచ్చాయి. గరిష్ఠ ధర ప్రకారం చూసుకుంటే, దాదాపు రూ.49,400 కోట్ల విలువైన బిడ్లు లభించాయన్నమాట. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తంగా రూ.460.43 కోట్లు సమీకరించనుంది. అర్హులైన సంస్థాగత కొనుగోలుదార్ల (క్యూఐబీ) విభాగంలో 266.21 రెట్లు, సంస్థాగతేతర మదుపర్ల (ఎన్ఐఐ) విభాగంలో 226.45 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగం నుంచీ 45.32 రెట్ల స్పందన లభించింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,700 కోట్లకు పైగానే నమోదుకావచ్చని అంచనా వేస్తున్నారు.

కోడి గుడ్డు

26న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	425
వరంగల్	427
విజయవాడ	475
గోదావరి	455
విశాఖపట్నం	465
చిత్తూరు	503

సిప్లా లాభంలో 10% వృద్ధి

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఔషధ సంస్థ సిప్లా, రూ.1298 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.1,178 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ. భారత, ఐరోపా, ఆఫ్రికాల్లో బలమైన అమ్మకాల వృద్ధి ఇందుకు దోహదపడింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.6,694 కోట్ల నుంచి రూ.6,957 కోట్లకు చేరింది. భారత్‌లో కంపెనీ విక్రయాలు రూ.2,898 కోట్ల నుంచి 6% వృద్ధితో రూ.3,070 కోట్లకు పెరిగాయి. ఉత్తర అమెరికా విక్రయాలు 7% తగ్గి రూ.1933 కోట్లకు పరిమితమయ్యాయి. వర్ధమాన మార్కెట్లు, ఐరోపాలో అమ్మకాలు రూ.779 కోట్ల నుంచి 11% అధికమై రూ.861 కోట్లుగా నమోదయ్యాయి. ఆఫ్రికా విక్రయాలు 14% పెరిగి రూ.871 కోట్లకు చేరాయి.

బీఓబీ లాభం రూ.4,541 కోట్లు

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) నికర లాభం రూ.4,541 కోట్లుగా నమోదైంది. 2024-25 జూన్ త్రైమాసికంలోని రూ.4,458 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 1.9% అధికం. ఇదే సమయంలో నిర్వహణ లాభం 15% వృద్ధి చెంది రూ.8,236 కోట్లకు చేరుకుంది. వడ్డీయేతర ఆదాయం 88% మేర పెరిగి రూ.4,675 కోట్లుగా నమోదు కావడం ఇందుకు సహకరించింది. అయితే నికర వడ్డీ ఆదాయం మాత్రం 1.4% తగ్గి రూ.11,435 కోట్లకు పరిమితమైంది.

✦ స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) 10.7% తగ్గి రూ.27,572 కోట్లకు పరిమితం అయ్యాయి. దీంతో ఎన్‌పీఏ నిష్పత్తి 2.88% నుంచి 2.28 శాతానికి తగ్గింది. నికర ఎన్‌పీఏ నిష్పత్తి సైతం 9 బేసిస్ పాయింట్లు తగ్గి 0.60 శాతంగా ఉంది.

✦మొత్తం వడ్డీ ఆదాయం 4.9% వృద్ధితో రూ.31,091 కోట్లకు చేరుకుంది.

సంక్షిప్తంగా..

✦ చైనా సంస్థ లాంగ్‌ఛీర్‌తో కలిసి సంయుక్త సంస్థను నెలకొల్పేందుకు భారత ప్రభుత్వం నుంచి **డిక్సన్ టెక్నాలజీస్**కు అనుమతులు లభించాయి. ఇరు సంస్థల మధ్య నిర్దేశిత ఒప్పందాల ప్రక్రియ ముగిస్తే, ఈ సంయుక్త సంస్థను డిక్సటెల్ ఇన్ఫోకామ్‌గా వ్యవహరిస్తారు.

✦ భారత సైన్యానికి ఎయిర్ డిఫెన్స్ కంట్రోల్ రాడార్లు అందించేందుకు **భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్**తో రూ.2,000 కోట్ల ఒప్పందాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ కుదుర్చుకుంది. ఫైటర్ విమానాలు, హెలికాప్టర్లు, శత్రువుల డ్రోన్ల నుంచి ఎదురయ్యే అన్ని రకాల ముప్పును ఈ రాడార్లు గుర్తించగలుగుతాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

✦ రెన్యువల్ రుసుము చెల్లించడంలో విఫలమవ్వడంతో, పెట్టుబడి సలహాదార్లుగా 13 సంస్థల రిజిస్ట్రేషన్‌ను సెబీ రద్దు చేసింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
టాటా కెమికల్స్	316	175	3,719	3789
ఓరియెంట్ సిమెంట్	205.37	36.71	866.47	696.27
ఎస్‌బీఐ కార్డ్స్	556	594	5,035	4,483
శ్రీరామ్ ఫైనాన్స్	2,156	1,981	11,542	9,610
ఎన్‌డీటీవీ	(70.31)	(47.11)	107.65	93.92
ఓరియెంట్ ఎలక్ట్రిక్	17.52	14.34	769.08	754.86
హెచ్ఎఫ్‌సీఎల్	(32.24)	111.30	871	1,158
మహీంద్రా లైఫ్‌స్పేస్	51.26	12.74	40.61	206.70
ఆధార్ హౌసింగ్	237	200	851	7,413
తమిళనాడు మెర్కంటైల్	305	287	1,617	1,515

బ్రిటన్ ఒప్పందంతో ఆర్థికానికి ఊతం

మరిన్ని ఎఫ్‌టీఏలు అవసరం
ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

ముంబయి: బ్రిటన్‌తో మనదేశం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకోవడాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆహ్వానించారు. మన ఆర్థిక వ్యవస్థలో పలు రంగాలకు ఇది ఊతమివ్వగలదని శుక్రవారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన తెలిపారు. ఇదే తరహా ఒప్పందాలు మరిన్ని మనదేశానికి అవసరమని అన్నారు. బ్రిటన్‌తో ఒప్పందం వల్ల తయారీ- సేవలరంగాలకు మద్దతు లభించగలదనే భావిస్తున్నట్లు పేర్కొన్నారు.



మాల్దీవులతోనూ ఇదే తరహా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలనుకుంటున్న'ట్లు వివరించారు.

పావెల్‌కు మల్హోత్రా మద్దతు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ దేశ కేంద్ర బ్యాంకు అయిన ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ విధానాలను బాహాటంగా విమర్శిస్తున్న తరుణంలో.. పావెల్‌కు మల్హోత్రా మద్దతు ప్రకటించారు. 'ఆయన (పావెల్) మంచి పనే చేస్తున్నారు. ఒక కేంద్ర బ్యాంకు స్వతంత్రతను కాపాడడం చాలా ముఖ్యమైన అంశమ'ని మల్హోత్రా పేర్కొన్నారు. మనదేశంలో క్రిప్టో కరెన్సీ నిబంధనల రూపకల్పనకు ప్రభుత్వం నియమించిన సంఘం పనిచేస్తోందన్నారు. 'రూపాయి రూపేణ వాణిజ్యం విషయంలో యూఏఈతో భారత్ ఒప్పందం కుదుర్చుకుంది.

రేట్ల కోతకు ద్రవ్యోల్బణం, వృద్ధి అంచనాలే కీలకం

జూన్‌లో ధరల్లో పెరుగుదల బాగా అదుపులో ఉన్నట్లు గణాంకాలు వెలువడిన నేపథ్యంలో మల్హోత్రా స్పందించారు. కేవలం రిటెయిల్ ద్రవ్యోల్బణ గణాంకాలపై ఆధారపడలేమని, ద్రవ్యోల్బణం, వృద్ధి అంచనాల ఆధారంగా భవిష్యత్తులో రేట్ల కోత అంశాన్ని నిర్ణయిస్తాయని స్పష్టం చేశారు. రేట్ల కోత వల్ల ఎటువంటి 'అసెట్ బబుల్స్' ఏర్పడవని, ఆర్థిక వ్యవస్థకు చేదోడుగా నిలిచేందుకు రేట్ల కోతకు మించిన విధానాలు తమ వద్ద ఉన్నాయన్నారు.

సెన్సెక్స్.. మూడేళ్లలో లక్ష పాయింట్లకు

- 43,876 పాయింట్లకు ఎన్ఎస్ఈ నిఫ్టీ
- వెంచురా సెక్యూరిటీస్ అంచనా

ఈనాడు, హైదరాబాద్: బీఎస్ఈ (బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్) సెన్సెక్స్ వచ్చే మూడేళ్లలో లక్ష పాయింట్లను మించుతుందని స్టాక్ బ్రోకింగ్ సేవల సంస్థ వెంచురా సెక్యూరిటీస్ అంచనా వేసింది. స్టాక్‌మార్కెట్‌కు అన్నీ అనుకూలించే ఆకర్షణీయ పరిస్థితులుంటే, 2028 మార్చికి సెన్సెక్స్ 1,15,836 పాయింట్లకు చేరొచ్చని ఈ సంస్థ వివరించింది. అదే సమయంలో ఎన్ఎస్ఈ (నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా) నిఫ్టీ 43,876 పాయింట్లకు చేరొచ్చని పేర్కొంది. ఒకవేళ కొన్ని అడ్డంకులు, అవాంఛనీయ పరిస్థితులు ఎదురైన పక్షంలోనూ సెన్సెక్స్ 1,04,804 పాయింట్లు, నిఫ్టీ 39,697 పాయింట్ల వద్ద నిలిచే అవకాశం ఉందని పేర్కొంది.



✦ ఈ సంస్థ అంచనాల ప్రకారం 2027-28 ఆర్థిక సంవత్సరానికి సెన్సెక్స్ ఈపీఎస్ రూ.5,516, నిఫ్టీ ఈపీఎస్ రూ.2,089 నమోదవుతాయి. దీనికి 19 నుంచి 21 పీఈ నిష్పత్తి (ప్రైస్ ఎర్నింగ్ రేషియో) ప్రకారం సెన్సెక్స్, నిఫ్టీ స్థాయిలను నిర్ధారించింది.

✦ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సెన్సెక్స్ ఈపీఎస్ రూ.3,823, నిఫ్టీ ఈపీఎస్ రూ.1,448 ఉన్నాయి.

✦ గత పదేళ్లలో మన ఆర్థిక వ్యవస్థ అధిక వృద్ధి సాధించడమే కాకుండా, ఎన్నో సవాళ్లను తట్టుకుని నిలిచిందని వెంచురా సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ వినిత్ బోలింజ్‌కర్ అన్నారు. మొండి బాకీల సమస్య, కొవిడ్-19 పరిణామాలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ట్రంప్ టారిఫ్‌ల వడ్డన.. తదితర ఇబ్బందులను అధిగమిస్తూ ముందుకు సాగినట్లు తెలిపారు. 2030 నాటికి 7.3% వృద్ధి రేటు సాధించే అవకాశం మన దేశానికి ఉందని, ఫలితంగా మనదేశంలో ఎంతో సంపద సృష్టి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తు ఎంతో ఆశావహంగా కనిపిస్తోందన్నారు. మూలధన లభ్యత, పెట్టుబడుల సమీకరణ బాగా పెరుగుతుందని, తద్వారా స్టాక్‌మార్కెట్ కార్యకలాపాలు గణనీయంగా విస్తరిస్తాయని వివరించారు.

2 రోజుల్లో రూ.8.67 లక్షల కోట్లు ఆవిరి

కొనసాగిన ఎఫ్ఐఐల అమ్మకాలు

ఎఫ్ఐఐ అమ్మకాలు రూ.1979.96 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు రూ.2138.59 కోట్లు

సెన్సెక్స్ ▼721 81463
నిఫ్టీ ▼225 24837

సమీక్ష

మన స్టాక్ మార్కెట్ వరసగా రెండో రోజూ నష్టపోయింది. బజాజ్ ఫైనాన్స్ (4.73%)తో పాటు ఐటీ, చమురు- గ్యాస్ షేర్లకు తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదురవ్వడం ఇందుకు నేపథ్యం. విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐలు) అమ్మకాలు కొనసాగడమూ ప్రభావం చూపింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు తగ్గి 86.52 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.12% తగ్గి, 69.11 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా మినహా మిగతా దేశాల సూచీలన్నీ నష్టాలతో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ శుక్రవారం రూ.6.50 లక్షల కోట్లు తగ్గి రూ.451.67 లక్షల కోట్ల (5.22 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. గత రెండు రోజుల్లో కలిపి మదుపర్ల సంపద రూ.8.67 లక్షల కోట్లు ఆవిరవ్వడం గమనార్హం.

ఆద్యంతం నష్టాల్లోనే...: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 82,184.17) 118 పాయింట్ల నష్టంతో 82,065.76 పాయింట్ల వద్ద ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ 81,397.69 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 721.08 పాయింట్ల నష్టంతో 81,463.09 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 225.10 పాయింట్లు కోల్పోయి 24,837 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,806.35 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 25,010.35 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 294.64 పాయింట్లు; నిఫ్టీ 131.40 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

రెండే లాభాల్లో..: సెన్సెక్స్ 30 షేర్లలో సన్‌ఫార్మా (0.38%), భారతీ ఎయిర్‌టెల్ (0.05%) మినహా మిగతా కంపెనీల షేర్లన్నీ నష్టాలతో ముగిశాయి. పవర్‌గ్రిడ్ 2.49%, ఇన్ఫోసిస్ 2.44%, టెక్ మహీంద్రా 2.44%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.29%, ట్రెంట్ 2.17% టాటా మోటార్స్ 1.9%, ఎన్‌టీపీసీ 1.65% తగ్గాయి. బీఎస్ఈ రంగాల విషయానికొస్తే.. యుటిలిటీస్ 2.37%, విద్యుత్ 2.36%, చమురు- గ్యాస్ 2.11%, ఇండస్ట్రియల్స్ 1.88%, భారీయంత్రపరికరాలు 1.83%, ఐటీ 1.65% డీలాపడ్డాయి. ఆరోగ్య సంరక్షణ రంగ సూచీ ఒక్కటే లాభాల్లో ముగిసింది.



తోలు, ఔషధ, జౌళి రంగాల షేర్లకు కొనసాగిన లాభాలు: బ్రిటన్ ఒప్పంద ప్రభావంతో తోలు ఉత్పత్తులు, ఔషధాలు, జౌళి రంగాల షేర్లకు లాభాలు కొనసాగాయి. తోలు ఉత్పత్తుల రంగానికి సంబంధించి మీర్జా ఇంటర్నేషనల్ 8.78%, ఏకేఐ ఇండియా 4.92%, సూపర్‌హౌస్ 3.85%, సూపర్ టానరీ 1.56%, మెట్రో బ్రాండ్స్ 1.26% చొప్పున పెరిగాయి. ఔషధ రంగంలో సిప్లా 2.95%, టోరెంట్ ఫార్మా 2.62%, డాక్టర్ రెడ్డీస్ 0.97%, ఫైజర్ 0.96%, అరబిందో ఫార్మా 0.8%, సన్‌ఫార్మా 0.52%, జైడస్ లైఫ్‌సైన్సెస్ 0.41%, లుపిన్ 0.32% రాణించాయి. జౌళి సంబంధిత షేర్ల విషయానికొస్తే.. గోకాక్ టెక్స్‌టైల్స్ 4.7%, ట్రైడెంట్ 0.13% లాభపడ్డాయి.

✦ ఇండిక్యూబ్ స్పేసెస్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) చివరి రోజు ముగిసేసరికి 12.33 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,71,48,335 షేర్లను జారీ చేయనుండగా.. 21,14,96,292 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 12.55 రెట్ల స్పందన లభించింది.

✦ ఐదు బోయింగ్ 737 విమానాలను లీజుపై తీసుకునేందుకు ఒప్పందాన్ని **స్పైస్‌జెట్** ఖరారు చేసుకుంది. ఈ విమానాలు అక్టోబరులో స్పైస్‌జెట్‌కు అందుతాయి.

✦ మన **విదేశీ మారకపు నిల్వలు** జులై 18తో ముగిసిన వారంలో 1.183 బిలియన్ డాలర్లు పెరిగి 695.489 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే విదేశీ మారకపు నిల్వలో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 1.201 బిలియన్ డాలర్లు తగ్గి 587.609 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. పసిడి నిల్వలు 150 మిలియన్ డాలర్లు పెరిగి 84.499 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఐపీఓ సమాచారమ్

కంపెనీ	ధరల శ్రేణి	ప్రారంభం- ముగింపు
ఎన్ఎస్‌డీఎల్	రూ.760- 800	జులై 30- ఆగస్టు 1
ఎంఅండ్‌బీ ఇంజినీరింగ్	రూ.366- 385	జులై 30- ఆగస్టు 1

నేటి బోర్డు సమావేశాలు: కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, లోధా డెవలపర్స్, రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్, ప్రీమియర్ ఎనర్జీస్, జెన్ టెక్నాలజీస్, బాలకృష్ణ ఇండస్ట్రీస్



కాలేజీ కహానీ

టీకప్పులో విమానం

అప్పుడు నేను డిగ్రీ సెకండియర్. మా మ్యాథ్స్ లెక్చరర్.. బోర్డు మీద ఏదో కాంప్లెక్స్ ఈక్వేషన్ రాస్తూ సీరియస్‌గా క్లాసు తీసుకుంటున్నారు. నేను, స్వాతి, అనిల్ ఆఖరి బెంచీలో కూర్చొని కబుర్లు, జోకులు చెప్పుకొంటున్నాం. అప్పుడే మా పక్క బెంచీలో సందీప్ పేపర్ ప్లేన్ తయారు చేస్తూ కనిపించాడు. 'రేయ్ సందీప్.. ఆ ప్లేన్ ముందుకు విసురు. రెండో బెంచీలోని నా ఫ్రెండ్ కావ్య దగ్గర పడితే నీకు క్యాంటీన్‌లో సమోసాలు తినిపిస్తా' అంటూ రెచ్చగొట్టింది స్వాతి. సందీప్ వెంటనే విసిరాడు. అయితే ఆ ప్లేన్.. సరిగ్గా సర్ కోసం అటెండరు అప్పుడే తీసుకొచ్చి టేబుల్‌పై పెట్టిన టీకప్పులో పడింది. టీ ఒలికిపోయింది. సర్ కోపంతో 'ఈ పిచ్చి పని చేసిన గాడిద ఎవడ్రా?' అని అరిచారు. సందీప్ భయం భయంగా స్వాతివైపు చూశాడు. తను వెంటనే నిలబడి 'సర్.. మీ ఈక్వేషన్ చూస్తే మా మైండ్ గాల్లో తేలిపోయింది. అందుకే పేపర్ ప్లేన్ పైకెగిరింది' అంది కూల్‌గా. దాంతో సర్ కూడా చల్లబడిపోయారు. క్లాసంతా నవ్వులతో మోగిపోయింది. ఈ సంఘటనని మా కాలేజీ గ్రూపులు అన్నింట్లో పంచుకున్నాం.

– శ్రీమాన్, వరంగల్

కలిసుంటే.. విడిపోరా?

చిన్నచిన్న వివాదాలకే చిర్రుబుర్రులాడటం.. తేలిగ్గా సమసిపోయే మనస్పర్ధలకే కలిసి ఉండలేమని తీర్మానించేయడం... సెలెబ్రిటీలే కాదు, సామాన్య జంటలదీ ఇదే తీరు! దీంతో పదికాలాలు నిలవాల్సిన పెళ్లిళ్లు మూణ్నాళ్ల ముచ్చటవుతున్నాయి. దీన్ని ఆపేదెలా? అంటే 'పెళ్లికి ముందే సహజీవనం' పరిష్కారం అంటోంది యూత్. ఈ మధ్య కాలంలో ఈ తీరు జోరందుకుంటోంది.

పెళ్లైతేనే ఒకమ్మాయి, అబ్బాయి కలిసి ఉండాలనే కట్టుబాటు ఉన్న సమాజం మనది. కానీ కాలాలు మారినకొద్దీ ఆ విధానాలు పలుచనవుతున్నాయి. ఇప్పుడైతే పెళ్లికి ముందు సహజీవనం తప్పేమీ కాదని బలంగా వాదిస్తున్న యువత తయారు అవుతున్నారు. దానికి రుజువే లయన్స్‌గేట్ ప్లే అనే అధ్యయనం. అవకాశం వస్తే మేమూ ఆ బంధంలో ఒదిగిపోతామని 26శాతం మంది మిలీనియల్స్, జనరేషన్ జడ్ సెలవిచ్చారు. హైదరాబాద్ లాంటి మెట్రోపాలిటన్ నగరాలే కాదు.. వైజాగ్, విజయవాడ, వరంగల్‌లాంటి చోట్లా ఈ ధోరణి పెరుగుతోంది. దీని వెనక కారణాలు బోలెడు.

అదీ సంగతి...

చూపులు కలుసుకోవడం.. మనసులు పెనవేసుకోడం ఒకప్పుడు నెమ్మదిగా సాగేది. కలుసుకోవడం, పెద్దల్ని ఒప్పించడానికి ఏళ్లు పట్టేది. ఇప్పుడు ఏఐ యుగం. అంతా ఇన్‌స్టంట్. పరిచయం మొలకెత్తడానికి, ప్రేమలు ఉరకలు వేయడానికి సామాజిక మాధ్యమాలున్నాయి. జంటలకు వెంటనే మీటింగ్‌లు ఏర్పాటు చేయడానికి డేటింగ్ యాప్‌లు వచ్చి చేరాయి. అలాఅలా స్వైప్ చేసేస్తే చాలు. మరి అంత వేగంగా ప్రేమించుకొని, పెళ్లిపీటలెక్కిన జంటలు.. తేడాలొస్తే రెట్టింపు వేగంతోనూ బంధానికి బై చెప్పేస్తున్నాయి. 'విరిగిన మనసుతో సర్దుకుపోయి కలిసి ఉండాల్సిన అవసరం మాకేంటి?' అనే మనస్తత్వాలూ పెరిగిపోతున్నాయి. ఇద్దరిలో ఆర్థిక స్వాతంత్ర్యమూ బంధాలు తెగతెంపులు చేసుకోవడానికీ కారణమవుతోంది. అన్నింటికీ మించి విడాకులు తీసుకోవడం అంటే ఒకప్పటిలా నామోషీగా భావించే పరిస్థితి లేదు. ఫస్ట్ పెళ్లి పెటాకులైనా, బెస్ట్ భాగస్వామి ఇంకెక్కడైనా దొరక్కపోరు అనుకునే ఆశావహులూ పెరిగిపోతున్నారు. ఫలితమే.. ఎన్నడూ లేనంతగా విడాకులు పెరిగిపోతున్నాయి. మరి దీన్ని ఆపేదెలా అనే ప్రశ్న తలెత్తినప్పుడు యువత పఠిస్తున్న మంత్రమే సహజీవనం, లివిన్ రిలేషన్‌షిప్. అలా చేస్తే...

- కష్టాలు, ఆపదలు, ఇబ్బందులు, బాధ్యతలు, ఆర్థిక విషయాల్లో భాగస్వామి ఎలా స్పందిస్తున్నారు? వాళ్ల అసలు రంగు ఏంటో తెలిసిపోతుంది.
- అతడి/ఆమె వ్యవహారశైలి, స్పందించే విధానం, నిర్ణయాలు తీసుకునే తీరు, మనస్తత్వం.. అన్నీ అర్థమవుతాయి. అలాంటి వ్యక్తితో జీవితాంతం కలిసి ఉండగలనా.. లేదా? తేలికగా తెలుసుకోవచ్చు.
- కొన్నాళ్లు కలిసి ఉంటే ఇద్దరి మధ్యా మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఏర్పడతాయి. పెళ్లి తర్వాత పొరపొచ్చాలకు తావుండదు.
- లివిన్ రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు అవతలివారు నచ్చకపోతే తేలికగా విడిపోవచ్చు. బంధాలు, బంధుత్వాలు, సమాజ ఒత్తిళ్లు.. ఏవీ ఉండవు.

ఇలాంటి సానుకూలతలు ఎన్నో ఉన్నాయంటోంది సహజీవనం సమ్మతమేననే యూత్. జీవితాంతం కలిసి బతకాలి అనుకున్నప్పుడు కొన్నాళ్లు కలిసి ఉంటే తప్పేం కాదన్నది వాళ్ల వాదన.

గ్యారెంటీ లేదు

మరి సహజీవనం చేసి, పెళ్లి చేసుకుంటే.. వాళ్ల బంధం ఎప్పుడూ విడిపోనంత దృఢమవుతుందా? అంటే దీనికి గ్యారెంటీ ఇచ్చేవాళ్లు లేరు. 'సహజీవనం అంటే ఒకమ్మాయి, అబ్బాయి కేవలం ఒక గదిలో కలిసి ఉండటం, వాళ్ల తాత్కాలిక అవసరాలు తీర్చుకోవడం కాదు. భవిష్యత్తులో వాళ్లు నలభై, యాభై ఏళ్లపాటు కలిసికట్టుగా ఉండటానికి ఒక పునాది వేసుకోవడం, ఒకర్నొకరు అర్థం చేసుకోవడం. ఇలా చేస్తే జంటల మధ్య అవగాహన, సంతృప్తి, స్థిరత్వం ఉండొచ్చు. కొన్నిసార్లు అది ఆ ఇద్దరి మధ్య సహజీవన జడత్వానికి దారి తీస్తుంది. అంటే భవిష్యత్తులో వీళ్లు అనుబంధాలు, ప్రేమలు, బాధ్యతలకన్నా.. సౌలభ్యాల కోసమే పెళ్లి చేసుకుంటారు. పైగా ఈ బంధంలో అంత సీరియస్‌నెస్ ఉండదు. బాధ్యతలు పట్టవు. బంధానికి కట్టుబడి ఉండాలి అనుకోరు. కొన్నేళ్లు కలిసి ఉన్న తర్వాత సహజంగానే ఒకరిపై ఒకరికి మోజు తీరుతుంది. ఏమాత్రం తేడా వచ్చినా బంధానికి బైబై చెప్పేస్తారు. లేదా పెళ్లిపైనే శాశ్వతంగా వ్యామోహం తీరిపోతుంది' అంటూ ఇందులోని రెండో కోణం లేవనెత్తుతున్నారు సైకాలజిస్ట్ ధీరజా పాండే. ఈ ధోరణికి సానుకూలు, ప్రతికూలతలు రెండూ ఉన్నా.. సహజీవనం చేసే జంటలు మాత్రం రోజురోజుకీ పెరిగిపోతూనే ఉన్నాయి. అయినా పాశ్చాత్య దేశాలతో పోలిస్తే, మనదేశంలో ఈ పరిస్థితి ఇంకా అదుపులోనే ఉండటం సంప్రదాయవాదులు హర్షించదగ్గ విషయం.



పశువైద్యం నుంచి ఐఎఫ్ఎస్ వరకూ!



కుర్రాడు చదువులో టాపర్.. అది పూర్తవగానే మంచి ఉద్యోగం దక్కించుకున్నాడు. అయినా దానితో సంతృప్తి చెందితేగా! భారీ లక్ష్యంపై కన్నేశాడు.. మొదటి ప్రయత్నంలో విఫలమయ్యాడు. నిరాశ దరి చేరనీయలేదు! రెండోసారి మరింత కసిగా ముందుకెళ్లాడు.. ఈసారి గురి తప్పలేదు. తనకెంతో ఇష్టమైన 'ఇండియన్ ఫారెస్ట్ సర్వీసు' సాధించాడు. తనే చింతకాయల లవకుమార్.

లవకుమార్‌ది కాకినాడ జిల్లా ములగపూడి. సన్నకారు రైతు కుటుంబం కావడంతో పశుపక్ష్యాదులతో అనుబంధం ఉండేది. దాంతో పశువైద్యం అభ్యసించాడు. పట్టా అందుకోగానే పశువైద్యాధికారిగా ప్రభుత్వ ఒప్పంద కొలువు దక్కింది. మంచి జీతం, తనకిష్టమైన మూగ జీవాలకు వైద్యం చేసే పని.. అయినా అక్కడితో ఆగిపోవద్దని భావించాడు. తనకి మొదట్నుంచీ అటవీ పరిసరాలంటే తగని మమకారం. సొంతూరే కాదు, ఉద్యోగం చేసే అల్లూరి జిల్లా కూడా అటవీ ప్రాంతం కావడంతో ఆ శాఖపై ఆసక్తి ఎక్కువైంది. అదే ఐఎఫ్ఎస్ కావాలనే లక్ష్యాన్ని ప్రోది చేసింది. తాను చదివిన వెటర్నరీ సైన్స్‌తోపాటు, తనకెంతో ఇష్టమైన ఫారెస్ట్రీని ఐచ్ఛికాలుగా ఎంచుకొని యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. కఠినంగానే సాధన చేశాడు. కానీ మొదటిసారి ప్రిలిమ్స్ దాటలేక పోయాడు. అయినా వెనక్కి తగ్గలేదు.

అన్నీ సొంతంగానే..

జాతీయస్థాయి పోటీల్లో నెగ్గాలంటే దిల్లీ, హైదరాబాద్‌లాంటి నగరాల్లో ఉండాలి.. నిపుణులు, అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవాలి.. రోజులో అత్యధిక గంటలు చదవాలి.. పరీక్షార్థుల్లో ఎక్కువమందికి ఇలాంటి అభిప్రాయమే ఉంటుంది. అది తప్పని నిరూపించాడు లవకుమార్. తను సాధన మొదలు పెట్టినప్పుడు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఓ చిన్నగది అద్దెకు తీసుకున్నాడు. ఉద్యోగం కోసం చింతపల్లికి రోజూ రాకపోకలు సాగించాడు. ఆహారం వండుకోవడం, ఇతర పనులన్నీ సొంతంగా చేసుకునేవాడు. ఇవన్నీ పోను మిగిలిన కొద్ది సమయంలోనే యూపీఎస్సీకి ప్రిపరేషన్ కొనసాగేది. ఆరునెలలు గడిచాక మరింత సీరియస్‌గా చదవాలని భావించాడు. అప్పుడు చేస్తున్న ఉద్యోగం వదిలేశాడు. స్నేహితులు, ఆన్‌లైన్ నుంచి పుస్తకాలు తెప్పించుకొని చదవడం ప్రారంభించాడు. టెలిగ్రామ్ గ్రూప్‌లలో సీనియర్ల సలహాలు తీసుకున్నాడు. మొదటిసారి ఎదురైన ఓటమి నుంచి అనుభవ పాఠాలు నేర్చుకున్నాడు. 2024లో రెండోసారి విజయవంతంగా ప్రిలిమ్స్, మెయిన్స్ దాటాడు. నెలరోజుల్లో ఇంటర్వ్యూ ఉందనగా దిల్లీ వెళ్లి ఆంధ్రాభవన్‌లో మకాం ఏర్పాటు చేసుకున్నాడు. గత విజేతల్ని కలిసి, వాళ్ల అనుభవాలను ఆకళింపు చేసుకున్నాడు. అన్ని కోణాల్లో, సమగ్రంగా సంసిద్ధం కావడంతో చివరి మెట్టును సైతం అవలీలగా జయించాడు. జాతీయస్థాయిలో 49వ ర్యాంకుతో ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యాడు.

లవకుమార్

పశువైద్య విద్యను అభ్యసిస్తున్నప్పటి నుంచే వినూత్నంగా ఆలోచించేవాడు. 2019లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాళ్ల విశ్వవిద్యాలయంలో ఒక కార్యక్రమానికి వచ్చారు. అప్పుడు విద్యార్థులతో ముచ్చటించారు. ఆ సమయంలో పశుమాంస ఉపఉత్పత్తులతో కలిగే ప్రయోజనాల గురించి లవకుమార్ చంద్రబాబుకి వివరించాడు. ఆ ఆలోచనకు గాను 'బెస్ట్ ఇన్నోవేటివ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అవార్డు'ను సీఎం చేతుల మీదుగా అందుకున్నాడు.

– బొడ్డల పైడిరాజు, కాకినాడ



అంతేగా

చెప్పేదొకటి.. చేసేదొకటి!

జెన్ జీ.. అంటే సరదాల ల్యాండ్‌మైన్లు, ప్రపంచాన్ని అరచేతిలో చుట్టేసే మాంత్రికులు. అందులో సందేహమే లేదు కానీ అప్పుడప్పుడు వాళ్ల మాటలు, చేతలకు పొంతనే ఉండదు. అదెలాగో సరదాగా ఇలా చెప్పుకొంటే...

చెప్పేది: మెంటల్ హెల్త్ నాకు చాలా ముఖ్యం మామా.. దాన్ని పోగొట్టే ఏ పనీ చేయను.
చేసేది: ఇన్‌స్టా రీల్స్ స్క్రోల్ చేస్తూ, యూట్యూబ్ షార్ట్స్ చూస్తూ రాత్రంతా మేల్కొనే ఉండటం.. మూడింటికి 'ఐ ఫీల్ ఎంప్టీ' అని స్టేటస్ పెట్టడం.

చెప్పేది: ఫిట్‌నెస్ అంటే ప్రాణం.. పక్కా డైట్ పాటిస్తాను.
చేసేది: చిన్న అవకాశం దొరికినా జింజర్ బర్గర్లు, పెరిపెరి ఫ్రైలు, కోక్‌లు లాగించేయడం.

చెప్పేది: 'రిలేషన్‌షిప్' అంటేనే తలనొప్పి గురూ.. వాటికి నేను దూరం.
చేసేది: 'క్రష్' పెట్టిన ప్రతి పోస్టుకి లైక్ కొడతారు. టాలెంట్‌నంతా చూపిస్తూ కామెంట్లు చేస్తారు. ఇంప్రెస్ చేసే ఏ అవకాశాన్నీ వదులుకోరు.

చెప్పేది: ఉన్నదాంట్లో సర్దుకుపోవడమే నాకిష్టం. అవసరం లేని దానివైపు కన్నెత్తైనా చూడను!
చేసేది: అవసరం లేకపోయినా, అప్పు చేసైనా.. కొత్తగా వచ్చిన ఫోన్, మెగా సేల్‌లో నచ్చిన గ్యాడ్జెట్ కొనే తీరతారు.

చెప్పేది: నేను ఇంట్రావర్ట్‌ని, ఒంటరిగా ఉండటమే ఇష్టం.
చేసేది: సోషల్‌మీడియాలో రెచ్చిపోతుంటారు. కంటికి నచ్చినవారితో పులిహోర కలపడం, గంటలకొద్దీ సోది వేయడం మామూలే.

చెప్పేది: వేరేవాళ్ల ఒపీనియన్స్‌తో నాకు అవసరం లేదురా. నేనెవర్నీ పట్టించుకోను.
చేసేది: వాట్సప్‌లో పెట్టిన స్టేటస్‌ని, ఇన్‌స్టాలో చేసిన పోస్టుకి ఎన్ని లైక్‌లు, వ్యూస్, కామెంట్లు వచ్చాయని పదేపదే లెక్కేసుకోవడం.

చెప్పేది: ఈ పెద్దవాళ్లకేం పన్లేదు. పెళ్లెప్పుడని ప్రాణం తినేస్తుంటారు.
చేసేది: పెళ్లిలో కలిసిన ప్రతి ఫ్రెండ్‌నీ 'తర్వాత నువ్వే కదా' అని విసిగిస్తుంటారు.

– **చిట్టంపల్లి అంజలి,** మడిపల్లి

నీరు తాగండి గురూ!




రోజూ తగినంత మంచినీరు తాగడం తేలికైన, అత్యంత ఉపయుక్తమైన పని. కానీ మన యూత్‌కేమో బోలెడు వ్యాపకాలాయే! ఆ పనిలో పడి మర్చిపోతుంటారు. ఇలాంటప్పుడే 'వాటర్‌మైండర్' సమర్థంగా పని చేస్తుంది. మనం నీరు ఎప్పుడు తాగాలి? ఇంకా ఎంత తాగాలి? శరీరం హైడ్రేషన్‌లో ఉండాలంటే ఏం చేయాలి? అన్నీ గుర్తు చేస్తుంది. సందేశాలు పంపుతుంది. ఆ వివరాలన్నీ అనుసంధానం చేసుకున్న ఫోన్, స్మార్ట్‌వాచీ తెరలపై ఒక గ్రాఫిక్‌లా చూపిస్తుంది. ఎలాంటి పానీయాలు, ద్రవపదార్థాలు తీసుకోకూడదో కూడా హితవు చెబుతుంది. మరి ఆలస్యమెందుకు? డౌన్‌లోడ్ చేసుకోండి వెంటనే.

శునకాల వాకింగ్‌తో.. రూ.4.5లక్షలు

'పోకిరి' సినిమాలో మహేశ్‌బాబు ఫేమస్ డైలాగ్‌ని కాస్త మార్చేసి 'ఏం చేశామన్నది కాదన్నయ్యా... ఎంత సంపాదించాం అన్నదే ముఖ్యం' అనుకోవడం నేటి యువతకి బాగా ఇష్టం. ముంబయిలోని ఓ యువకుడు అనడం, వినడం కాదు.. పక్కాగా చేసి చూపిస్తున్నాడు. ఇంతకీ తనేం చేస్తాడో తెలుసా? పెంపుడు శునకాల్ని పొద్దున, సాయంత్రాలు సరదాగా బయటికి తీసుకెళ్తాడు. వాటి యజమానుల నుంచి కొంతమొత్తం వసూలు చేస్తాడు. ఇలా 38 శునకాలకు కేర్‌టేకర్‌గా ఉంటూ తను ఎంత సంపాదిస్తున్నాడో తెలుసా? అక్షరాలా నెలకి రూ.4.5లక్షలు. ఈ మొత్తం సగటు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డాక్టర్ల కన్నా ఎక్కువ! అంతెందుకు.. ఎంబీఏ పూర్తి చేసిన తన సోదరుడు సంపాదిస్తోంది నెలకు రూ.75వేలే. ఇంతకీ తను చదివిందేమో మామూలు డిగ్రీ. అతడి పూర్తి వివరాలు అందుబాటులో లేవుగానీ.. తను పెంపుడు కుక్కల్ని బయటకి తీసుకొచ్చినప్పుడు ఒక ఔత్సాహికుడు వివరాలవీ కనుక్కొని ఈ స్టోరీని ఆన్‌లైన్‌లో పెట్టేశాడు. ఈ పోస్ట్ బాగా వైరల్ అవుతోంది. భారత్‌లో ఈ పెట్ కేర్ ఇండస్ట్రీ విలువ వచ్చే ఏడాదికల్లా రూ.7,600 కోట్లకు చేరుతుందట. మరి ఇంకెందుకు ఆలస్యం ఈ హాట్ ఇండస్ట్రీలో మీరూ దండిగా సంపాదించుకునే అవకాశం దొరుకుతుందేమో చూడండి మరి.



కొంటె కొటేషన్



- అసలే అది ఫ్లైట్...
మింగేస్తే అవుతుందేమో క్రాష్!
– జితేంద్ర తిర్లంగి, ఈమెయిల్

- కుర్రాడిది బకాసురుడి ఆకలి...
అయ్యిందిగా విమానం బలి!
– ఎం. దుష్యంత్‌కుమార్, హైదరాబాద్


- మింగలేవు బాలకా...
అది విమానం ట్రిక్ గనకా!
– వెల్మల రాంరెడ్డి, పూడూరు

- విమానం రెక్కలు...
నీ నోట్లో దూరితే ముక్కలు!
– కృష్ణమోహన్, బెంగళూరు


- తినొద్దురా ఆ ఫ్లైట్...
మార్చుకోరా నీ డైట్!
– కావుటూరి శ్రీలత, నెల్లూరు

- ఫ్లైట్‌ది యమా జోరు...
దాన్ని మింగలేదు నీ నోరు!
– ఎ.రాంబాబు, ఈమెయిల్

- అది ప్లేన్ అనుకుంటున్నావా...
పానీపూరీలా భావిస్తున్నావా?
– వినయ్, కొత్తపల్లి



అందం, నటనకు 'సయ్యారా' సై!



☛ ఎవరీ భామ? మన పేజీలోకి ఎందుకొచ్చినట్టు?
పేరు **అనీత్ పడ్డా.** బాలీవుడ్ తాజా బ్లాక్‌బస్టర్ 'సయ్యారా' సినిమాలో అహాన్ పాండేకి జోడీగా నటించింది ఈ ముద్దుగుమ్మ.

☛ యాక్టింగ్ ఇరగదీసింది అంటున్నారు.. ఇదే మొదటి చిత్రమా?
కాదు.. 'సలాం వెంకీ'తో తెరంగేట్రం చేసింది. అంతకుముందు నెస్కఫే, క్యాడ్‌బరీ డెయిరీమిల్క్, అమెజాన్, పేటీఎంలాంటి వాణిజ్య ప్రకటనల్లోనూ నటించింది.

☛ నేపథ్యమేంటి? ఎక్కడమ్మాయి...?
పంజాబీ మూలాలున్నాయి. సొంతూరు అమృత్‌సర్. ఎటువంటి సినిమా నేపథ్యం లేదు. పట్టుబట్టి, అష్టకష్టాలకోర్చి అవకాశాలు అందిపుచ్చుకుంది.

☛ చదువు సంగతేంటి? బాలీవుడ్‌కి అడుగులెలా పడ్డాయి?
దిల్లీ యూనివర్సిటీలో చదువుతున్నప్పుడే మోడలింగ్ మొదలుపెట్టింది. భారీగా అవకాశాలు వచ్చిపడటంతో ఉన్నత చదువుల్నీ పక్కన పెట్టేసి ముంబయి రైలెక్కింది.

☛ మొదటి అవకాశం సంగతేంటి?
వాణిజ్య ప్రకటనల్లో మెరవడంతో 'సలాం వెంకీ' దర్శకుడి దృష్టిలో పడింది. ఉన్నది కాసేపే అయినా మెప్పించింది. అమెజాన్ ప్రైమ్‌లో ఆడిన 'బిగ్ గర్ల్స్ డోన్ట్ క్రై'తో తనకి పెద్ద బ్రేక్. పూజాభట్, రైమా సేన్‌లాంటి సీనియర్లతో పోటీపడి నటించింది.

☛ మోడలింగ్, సినిమాలేనా? అమ్మడిలో ఇంకేమైనా ప్రతిభ ఉందా?
లేకేం.. మార్షల్ ఆర్ట్స్‌లో దిట్ట. మంచి సింగర్ కూడా. గతేడాది 'మాసూమ్' పేరుతో సింగిల్ పాడింది. సాంగ్‌రైటర్ కూడా. ఇది జనాలకి బాగానే చేరువైంది. రెండు సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పని చేసింది అనీత్.

☛ 'సయ్యారా'తో కుర్రాళ్ల గుండెల్లో తిష్ట వేసిందిగా.. ఆ లక్కీఛాన్స్ ఎలా?
యశ్‌రాజ్ ఫిల్మ్స్ అంటే ప్రతిష్ఠాత్మక బ్యానర్. నటనలో అనుభవం ఉన్నా.. వందలమందితో కలిసి ఆడిషన్స్ ఇచ్చింది. దర్శకుడు మోహిత్ సూరికి నచ్చాకే.. నాయికగా ఎంపికైంది. అందం, నటన రెండూ సూపర్‌గా ఉండటంతో బాలీవుడ్‌లో స్టార్ అవుతుంది అంటున్నారంతా.

☛ మంచి పనులేవైనా..
వయసు చిన్నదే అయినా అనీత్‌కు సామాజిక స్పృహ ఉంది. మానసిక వికలాంగ పిల్లలకు సాయం చేసే ఒక స్వచ్ఛంద సంస్థతో కలిసి పని చేస్తోంది.

తొలి మధ్యయుగం

తొలి మధ్యయుగంలో నెలకొన్న రాజకీయ అనైక్యత కారణంగా దేశంలో అనేక రాజ్యాలు ఏర్పడ్డాయి. ఇది దేశ ఐక్యతకు అడ్డంకిగా మారింది. ఉత్తర భారతదేశంలో రాజపుత్రుల తర్వాత పాలవంశం, సేన వంశాలు పరిపాలన సాగించాయి. ఈ కాలంలో అనేక చారిత్రక కట్టడాల నిర్మాణం, సాహిత్య అభివృద్ధి జరిగింది. వీరికాలంలో విదేశీ దండయాత్రలు, రాజ్య విస్తరణ యుద్ధాలు జరిగాయి. దక్కన్‌పై ప్రాబల్యాన్ని పెంచుకుంటూ ఏకఛత్రాధిపత్యం సాగించిన రాష్ట్రకూటులు, ఆపై వారి సామ్రాజ్యాన్ని అంతమొందించి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకున్న కళ్యాణి చాళుక్యుల గురించి పోటీపరీక్షార్థులకు అవగాహన ఉండాలి.

గొప్ప చక్రవర్తిగా కీర్తిగడించి..
సల్లేఖన వ్రతంతో పరమపదించి!



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

పాల వంశం (750 - 1095)

ఈ వంశంవారు బిహార్, బెంగాల్‌ను 3 శతాబ్దాలకు పైగా పరిపాలించారు. ప్రారంభంలో పాటలీపుత్రం రాజధానిగా పాలించి, ఆ తర్వాత మాంఘీర్ (బిహార్)కు మార్చారు. పాలరాజులు వజ్రయాన బౌద్ధమతాన్ని ఆదరించారు. వీరు దేశంలో బౌద్ధమతాన్ని ఆదరించిన చివరి రాజులు.

గోపాల: ఇతడు 750లో పాలరాజ్యాన్ని స్థాపించాడు. ప్రజలే ఇతడిని రాజుగా ఎన్నుకున్నట్లు చరిత్రకారుల అభిప్రాయం.

ధర్మపాల (780–815): ఇతడు పాలవంశంలో అందరి కంటే గొప్పవాడు. బిహార్‌లో అనేక వజ్రయాన బౌద్ధ విశ్వవిద్యాలయాలను స్థాపించాడు. వీటిలో విక్రమశిల విశ్వవిద్యాలయం, ఉద్దంతపురి విశ్వవిద్యాలయం, సోమపుర విశ్వవిద్యాలయం, జగద్దల విశ్వవిద్యాలయం ముఖ్యమైనవి. నలంద విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించి అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాడు. దాదాపు 200 గ్రామాల ఆదాయం ఈ విశ్వవిద్యాలయానికి వచ్చేదని తెలుస్తోంది.

దేవపాల (815–855): ఇతడు పాల వంశానికి చెందిన రాజుల్లో ప్రముఖుడు. నలంద తామ్ర శాసనాన్ని వేయించాడు. దీనిప్రకారం ఇండోనేసియా రాజు బలపుత్ర దేవుడు నిర్మించిన నలంద విహారానికి అయిదు గ్రామాలను దానం చేశాడు. ఇతడి ఆస్థానంలోని బౌద్ధ పండితుడు వజ్రదత్త 'లోకేశ్వరశతక' అనే కావ్యాన్ని రచించాడు.

మహిపాల: 1021-23 మధ్య మొదటి రాజేంద్రచోళుడు మహిపాలుడిని ఓడించి గంగైకొండ (గంగను జయించినవాడు) అనే బిరుదును పొందాడు.

రామపాల: ఇతడి ఆస్థానకవి సంధ్యాకరనంది రచించిన రామచరిత ప్రకారం బెంగాల్‌లో కైవర్త రైతులు తిరుగుబాటు చేయగా ఇతడు వారిని అణచివేశాడు.

మదనపాల: ఇతడు పాల వంశంలో చివరివాడు. విజయసేన అనే అధికారి ఇతడిని చంపి పాలవంశాన్ని అంతమొందించి సేన వంశాన్ని స్థాపించాడు.

సేన వంశం (1095 - 1194)

వీరు బెంగాల్‌లోని లక్నౌతి రాజధానిగా తూర్పు భారతదేశాన్ని ఒక శతాబ్దంపాటు పరిపాలించారు. వీరి పూర్వీకులు కన్నడ దేశం నుంచి వలస వెళ్లి పాలరాజుల ఆస్థానంలో పనిచేశారు.

విజయసేన: సేన వంశ రాజ్యస్థాపకుడు. ఇతడు రాజషాహిలో ప్రద్యుమ్నేశ్వర ఆలయాన్ని నిర్మించాడు.

భల్లాలసేన: ఇతడు సంస్కృతంలో గొప్ప పండితుడు. దానసాగర అనే ధర్మశాస్త్ర, అభూతసాగర అనే ఖగోళశాస్త్ర గ్రంథాలను రచించాడు.

లక్ష్మణసేన: ఈ వంశంలో చివరివాడు. ఇతడి ఆస్థానంలో పంచరత్నాలు అనే అయిదుగురు కవులు ఉండేవారు. వారు జయదేవ, గోవర్ధన, ధోయి, హలాయుధ, శ్రీధరదాస.

- జయదేవ - గీతగోవిందంను రచించాడు. ఇది వైష్ణవులకు అత్యంత ప్రామాణిక, పవిత్ర గ్రంథం.
- 1194లో మహమ్మద్ ఘోరీ సేనాని భక్తియార్ ఖిల్జీ బెంగాల్‌పై దండెత్తగా లక్ష్మణసేనుడు పారిపోయాడు. ఎలాంటి ప్రతిఘటన లేకుండానే తురుష్కులు బెంగాల్, బిహార్‌ను జయించారు.
- భక్తియార్ ఖిల్జీ నలంద విశ్వవిద్యాలయంతో పాటు బిహార్‌లోని అన్ని బౌద్ధ విశ్వవిద్యాలయాలను ధ్వంసం చేసి, దేశంలోని చివరి బౌద్ధులను అంతం చేశాడు. దీంతో 12వ శతాబ్దపు చివరి దశకంలో బౌద్ధం భారతదేశంలో కనుమరుగైంది.

కళ్యాణి చాళుక్యులు

కర్ణాటకలోని కళ్యాణి (బీదర్ జిల్లాలోని బసవకళ్యాణ్) రాజధానిగా రెండు శతాబ్దాల పాటు వీరు దక్కన్‌ను పరిపాలించారు. రాజ్య స్థాపకుడు తైలపుడు-II.

జయసింహ-II జగదేకమల్ల: ఇతడు మస్కి యుద్ధంలో మొదటి రాజేంద్రచోళుడి చేతిలో ఓటమిపాలయ్యాడు.

సోమేశ్వర-I అహమల్ల: ఇతడు రాజధానిని మాన్యఖేటం నుంచి కళ్యాణికి మార్చాడు. పుండూరు యుద్ధంలో చోళరాజు రాజాధిరాజ చేతిలో ఓడిపోయాడు. కొప్పం యుద్ధంలో రాజాధిరాజను ఓడించి, అంతమొందించాడు. చివరికి కూడలిసంగం యుద్ధంలో వీరరాజేంద్ర చోళుడి చేతిలో ఓడిపోయాడు.

విక్రమాదిత్య-VI (1076–1126): ఇతడు కళ్యాణి చాళుక్యుల్లో అందరి కంటే గొప్పవాడు. ఇతడి ఆస్థానంలో బిల్హణుడు, విజ్ఞానేశ్వరుడు అనే సంస్కృత పండితులు ఉండేవారు.

సోమేశ్వర-III: ఇతడు మానసోల్లాస లేదా అభిలషితార్థ చింతామణి అనే కావ్యాన్ని రచించి సర్వజ్ఞ బిరుదును పొందాడు.

సోమేశ్వర-IV: ఇతడు కళ్యాణి చాళుక్య వంశంలో చివరివాడు. యాదవరాజు భిల్లమ ఇతడిని ఓడించి, కళ్యాణి చాళుక్య రాజ్యాన్ని అంతం చేశాడు. ఫలితంగా దక్కన్‌లో స్వతంత్ర యాదవ, కాకతీయ రాజ్యాలు వెలిశాయి

రాష్ట్రకూటులు (755 - 973)

దక్కన్‌పై ఏకఛత్రాధిపత్యం సాధించి, తమ ప్రాబల్యాన్ని బలపరుచుకుని రెండు శతాబ్దాలకుపైగా పరిపాలన సాగించిన గొప్ప పాలకులు రాష్ట్రకూటులు. ఎల్లోరాను రాజధానిగా చేసుకుని, అద్భుతమైన సైనిక విజయాలు సాధించారు. ఎల్లోరాలో హిందూ, బౌద్ధ, జైన మతాలకు చెందిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 34 గుహాలయాలను నిర్మించారు.

దంతిదుర్గ: ఇతడు రాష్ట్రకూటుల వంశస్థాపకుడు. ఎల్లోరాలో దశావతార (విష్ణు), రావణ్ క ఖై (శైవ) అనే గుహాలయాలను నిర్మించాడు. కైలాస శిఖరాన్ని ఎత్తిన రావణాసురుడి శిల్పం ఉండటం వల్ల రావణ్ క ఖై అనే పేరు వచ్చింది. మాళ్వాను జయించి, విజయ చిహ్నంగా హిరణ్యగర్భ యాగం చేశాడు.

కృష్ణ-I: ఇతడు ఎల్లోరాలో కైలాసనాథ గుహాలయాన్ని (ఏకశిలా నిర్మితం) నిర్మించాడు. దీన్ని కంచిలోని కైలాసనాథ ఆలయ నమూనాలో సహ్యాద్రి పర్వతాన్ని తొలిచి, నిర్మించారు. ఈ ఆలయాన్ని నిర్మించడానికి 100-150 ఏళ్లు పట్టింది. యునెస్కో దీన్ని అత్యంత గొప్ప గుహాలయంగా, ప్రపంచ వారసత్వ కేంద్రంగా గుర్తించింది.

అమోఘవర్ష (814–78): ఇతడు రాష్ట్రకూట రాజులందరి కంటే గొప్పవాడు. ఆరు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ పరిపాలన చేశాడు.

- ఈయన మాన్యఖేటం (కర్ణాటకలోని మాల్ఖేడ్) అనే నగరాన్ని నిర్మించాడు. రాజధానిని ఎల్లోరా నుంచి మాన్యఖేటంకు మార్చాడు.
- సంస్కృత, కన్నడ భాషల్లో గొప్ప పండితుడు. రెండు గ్రంథాలు రచించి 'కవిరాజ' అనే బిరుదును పొందాడు. ఈయన ఆస్థానంలో జినసేన, శాక్తాయన, మహావీరాచార్య, హరిసేన అనే సంస్కృత జైన కవులు ఉండేవారు. తమ రాజ్యంలో క్షామాన్ని నివారించేందుకు కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారికి తన చేతివేళ్లను నరికి నైవేద్యంగా సమర్పించాడు. ఇతడు జైన మతస్థుడు, సల్లేఖన వ్రతం ఆచరించి మరణించాడు.
- ఇతడి సామ్రాజ్యాన్ని సందర్శించిన అరబ్బు యాత్రికుడు సులేమాన్ ప్రపంచంలోని నలుగురు గొప్ప చక్రవర్తుల్లో అమోఘవర్షుడు ఒకరని కీర్తించాడు. మిగతా ముగ్గురు చైనా చక్రవర్తి, ఈజిప్ట్ చక్రవర్తి, ఖలీఫా.

కృష్ణ-III (936–963): ఇతడు రాష్ట్రకూట రాజుల్లో చివరి గొప్ప చక్రవర్తి. 949లో తక్కోళం యుద్ధంలో పరాంతకచోళను ఓడించి 'తంజావూర్ కొండ' అనే బిరుదు పొందాడు. ఈ విజయానికి గుర్తుగా రామేశ్వరంలో విజయస్తంభాన్ని నాటించాడు.

కర్క-II: రాష్ట్రకూటుల్లో చివరివాడు. వీరి సామంత రాజైన తైలపుడు-II ఇతడిని చంపి, కళ్యాణి చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

722 Word of the Day

Conceive

Telugu meaning: పురుడు పోసుకొను, గర్భం దాల్చు

English meaning: The word conceive (కన్సీవ్) is a verb that describes the act of forming an idea or plan in the mind.

Synonyms: Devise, Envision

Antonyms: Dismiss, Ignore

Usage: **1.** It's hard to conceive how much technology has changed our lives in just a few decades.

2. The scientist conceived a new method to store solar energy efficiently.

కరెంట్ అఫైర్స్



భారత్, బ్రిటన్ దేశాల మధ్య 2025, జులై 24న చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) లాంఛనప్రాయంగా కుదిరింది. దీంతో రెండు దేశాల ఉత్పత్తులకు పరస్పర మార్కెట్ ప్రవేశం సులభతరం కానుంది. బ్రిటన్‌కు భారత ఎగుమతుల్లో 99% ఉత్పత్తులపై సుంకాల భారం తగ్గనుంది. ఫలితంగా కార్మిక ఆధారిత రంగాలకు దాదాపు 23 బిలియన్ డాలర్ల అవకాశాలు రానున్నాయి.



అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన 'మిలాన్ ఫెస్టివల్'లో పాల్గొనేందుకు తెలంగాణ చేనేత కళాకారుడు జి.విజయ్ రాజేంద్రవర్మను కేంద్ర ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ ఎంపిక చేసింది. ఈ విషయాన్ని చేనేత సేవా కేంద్రం డైరెక్టర్ అరుణ్‌కుమార్ 2025, జులై 23న తెలిపారు. ఈ మేళా డిసెంబరు 6 నుంచి 14 వరకు ఇటలీలో జరగనుంది. ఇందులో పాల్గొనే అవకాశం తెలంగాణకు దక్కడం ఇదే తొలిసారి.


భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఛైర్మన్‌గా అజయ్ సేథ్‌ను నియమిస్తున్నట్లు ప్రభుత్వం 2025, జులై 24న ప్రకటించింది. వచ్చే మూడేళ్లు లేదా ఆయనకు 65 ఏళ్లు వచ్చే వరకు లేదా తదుపరి ఉత్తర్వుల వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది. 1987 బ్యాచ్ కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారి అయిన అజయ్ సేథ్ 2025, జూన్‌లో ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా నాలుగేళ్ల పాటు పనిచేశాక, పదవీ విరమణ చేశారు.

కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన - నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద ప్రారంభించిన లఖ్‌పతి దీదీ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో 17,41,362 మంది మహిళలు నమోదు చేసుకున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ 2025, జులై 22న తెలిపారు. మహారాష్ట్ర (22,69,981 మంది) తర్వాత అత్యధిక మంది లఖ్‌పతి దీదీలు ఏపీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవవైవిధ్యం - పరిరక్షణ కార్యక్రమాలు



జీవుల మనుగడకు జీవవైవిధ్యం ఎంతో కీలకం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జీవవైవిధ్యం ప్రమాదంలో పడింది. దీని ప్రాముఖ్యతను గుర్తించిన అంతర్జాతీయ సమాజం జీవవైవిధ్య పరిరక్షణకు చర్యలు చేపట్టింది. దీనికోసం వివిధ కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తోంది. జీవవైవిధ్య పరిరక్షణకు ప్రపంచ దేశాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి.

కన్వెన్షన్ ఆన్ బయోలాజికల్ డైవర్సిటీ

జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో భాగంగా అంతర్జాతీయంగా 1992 నుంచి కన్వెన్షన్ ఆన్ బయోలాజికల్ డైవర్సిటీ ఆధ్వర్యంలో జీవవైవిధ్య సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 1994, నవంబరులో మొదటి జీవవైవిధ్య సదస్సు - కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (COP) పేరుతో బహమాస్‌లో నిర్వహించారు.

COP - 28

కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ - 28వ సదస్సును యూఎన్ఎఫ్‌సీసీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (సంయుక్తంగా దుబాయ్‌లో నిర్వహించాయి. ఈ సమావేశాలు 2023, నవంబరు 30 నుంచి డిసెంబరు 12 వరకు జరిగాయి.

కాన్ఫరెన్స్ అఫ్ పార్టీస్ (COP) – 11, కాప్ – 15 తీర్మానంలోని ముఖ్యాంశాలు, నగోయా ప్రోటోకాల్ – ముఖ్యాంశాలు, ఐచీ లక్ష్యాలు, గ్లోబల్ స్టాక్ టేక్ (GST) ప్రోగ్రాం, ఓజోన్ పొర పునరుద్ధరణ, వన్యప్రాణి సంరక్షణ సవరణ చట్టం, 2022 మొదలైన అంశాలతో

సహ పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ–బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ–బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కార్గిల్ విజయ్ దివస్

జులై 26
చరిత్రలో ఈనాడు

పాకిస్థాన్‌పై 1999 కార్గిల్ యుద్ధంలో భారత్ సాధించిన విజయానికి గుర్తుగా ఏటా జులై 26న 'కార్గిల్ విజయ్ దివస్'గా నిర్వహిస్తారు. భారత్ నుంచి పాకిస్థాన్‌ను విడదీసి ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేసిన 1947లోనే రెండు దేశాల మధ్య జమ్మూకశ్మీర్ కోసం మొదటి యుద్ధం జరిగింది. దీన్నే 'మొదటి కశ్మీర్ యుద్ధం' అంటారు. జమ్మూకశ్మీర్‌లో మూడింట రెండొంతుల భూభాగాన్ని భారత్ స్వాధీనం చేసుకోగా, మిగతాది పాక్ నియంత్రణలో ఉండిపోయింది. ఇదే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే). దీనివల్లే నియంత్రణ రేఖ (లైన్ ఆఫ్ కంట్రోల్-ఎల్‌వోసీ) ఏర్పాటైంది. నాటి నుంచి దాయాది దేశం జమ్మూకశ్మీర్‌పై దశాబ్దాలుగా వివాదాన్ని రాజేస్తూనే ఉంది. ఈ ప్రాంతాన్ని హస్తగతం చేసుకోవడంతోపాటు మన దేశంపై దాడులు చేసేందుకు సైన్యాన్ని, సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. మొదటి కశ్మీర్ యుద్ధం నుంచి ఆపరేషన్ సింధూర్ వరకు భారత్ ప్రతిసారీ వారి సైన్యం, ఉగ్రమూకతో పోరాడుతూనే ఉంది. నేడు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ ఆక్రమణకు పాక్ చేసిన కుట్ర, భారత సైన్యం దాన్ని తిప్పికొట్టిన విధానం గురించి తెలుసుకుందాం..!

- 1998, అక్టోబరులో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌గా నియమితులైన పర్వేజ్ ముషారఫ్ కశ్మీర్‌ను ఆక్రమించడానికి పథకాలు రచించాడు. దీని కోసం మొదట కార్గిల్‌ను హస్తగతం చేసుకోవాలని భావించాడు. దీనిలో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన మేజర్ జనరల్ జావెద్ అహ్మద్, లెఫ్టినెంట్ జనరల్ మెహమూద్ అహ్మద్, 10వ కోర్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ అజీజ్ ఖాన్‌లు ఆపరేషన్ కోహ్-ఇ-పైమాకు (పర్వతాన్ని ఎక్కడం) ప్లాన్ చేశారు.



- శత్రు దళాలు కార్గిల్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వెంట భారత భూభాగంలోకి చొరబడ్డాయి. 1999, మే 3న తాషి నామ్‌గ్యాల్ అనే గొర్రెల కాపరి బటాలిక్ పర్వత ప్రాంతాల్లో చొరబాటుదార్లను గుర్తించి, సైన్యానికి విషయాన్ని తెలియజేశాడు. మన సైన్యం "ఆపరేషన్ విజయ్" పేరుతో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రారంభించింది. ఈ పోరాటానికి భారత వైమానిక దళం "ఆపరేషన్ సఫేద్ సాగర్" పేరుతో సహకారం అందించింది.
- జూన్ 9 నాటికి బటాలిక్‌లోని కీలక స్థావరాలను భారత్ స్వాధీనం చేసుకుంది. భారత దళాల దాడి తీవ్రతకు బటాలిక్, ద్రాస్, టైగర్ హిల్స్‌లో పాక్ సైన్యం వెనక్కు తగ్గింది. జులై 5న పాక్ సైన్యం కార్గిల్ నుంచి వైదొలగుతున్నట్లు నవాజ్ షరీఫ్ ప్రకటించారు. మరోవైపు బటాలిక్ సెక్టార్‌లోని మిగిలిన స్థావరాలను కూడా భారత్ స్వాధీనం చేసుకోవడంతో జులై 14న ఆపరేషన్ విజయవంతమైందని భారత ప్రధాని వాజ్‌పేయీ ప్రకటించారు. జులై 26న పాక్ సైన్యాన్ని తరిమికొట్టినట్లు ఇండియన్ ఆర్మీ ప్రకటించింది.
- 1999 మేలో ప్రారంభమైన ఈ యుద్ధం జులై వరకు జరిగింది. ఏటా జులై 26న "కార్గిల్ విజయ్ దివస్"ను పాటిస్తారు.

నోటిఫికేషన్స్

యూపీఎస్సీలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో బోటనిస్ట్, అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోలర్, జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 33. దరఖాస్తు ఫీజు రూ.25. అర్హులైన అభ్యర్థులు 2025, జులై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

రామన్ కాంత్ ముంజాల్ స్కాలర్‌షిప్ 2025-26

రామన్ కాంత్ ముంజాల్ స్కాలర్‌షిప్ హీరో ఫిన్‌కార్ప్ మద్దతు ద్వారా భారతదేశంలో అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ చదవాలనుకుని ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు సహాయం అందిస్తుంది. ఫైనాన్స్ సంబంధిత కోర్సుల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం, వారికి సాధికారత కల్పించడం ఈ స్కాలర్‌షిప్ లక్ష్యం. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 31 జులై 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జులై 26) చివరి తేదీ

- డీఆర్‌డీవో హైదరాబాద్‌లో పోస్టులు. బీఏ/బీఎస్సీ/బీసీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఎయిమ్స్ రిషికేశ్‌లో వెబ్‌సైట్ ప్రోగ్రామర్ పోస్టులు. బీటెక్, ఎంఎస్సీ, ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగ అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఎన్‌హెచ్‌ఏఐలో అడ్వైజర్ పోస్టులు. బీటెక్ (సివిల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Mathematics

Ages

1. Two years ago, the ratio of Riya's age to Diya's age was 4 : 5. Four years from now, their ages will be in the ratio 5 : 6. What is Diya's present age?
A) 20 B) 32 C) 24 D) 36

2. The total age of 5 siblings born at intervals of 2 years each is 70 years. What is the age of the youngest sibling?
A) 10 years B) 11 years
C) 12 years D) 13 years

3. The ages of three siblings are in the ratio 4 : 7 : 9. If the sum of their ages is 160 years, what is the age of the youngest sibling?
A) 24 years B) 32 years
C) 36 years D) 40 years

4. The present ages of Ramesh and Suresh are in the ratio 7 : 5 respectively. Five years later, the ratio of their ages will become 9 : 7. What is Suresh's present age?
A) 30 years B) 12.5 years
C) 17.5 years D) 20 years

5. The average age of a father and his daughter is 30 years. The ratio of their current ages is 9 : 1 respectively. What will be the daughter's age after 6 years?
A) 14 years B) 12 years
C) 15 years D) 18 years

6. The difference in the ages of two sisters is 18 years. Four years ago, the elder sister was twice as old as the younger one. What are their present ages?
A) 40 years, 22 years
B) 42 years, 24 years
C) 38 years, 20 years
D) 36 years, 18 years

7. When Neel was born, his father was 28 years older than his brother, and his mother was 22 years older than his sister. If Neel's brother is 5 years older than Neel and his mother is 4 years younger than his father, how old was Neel's sister when Neel was born?
A) 10 years B) 9 years
C) 8 years D) 7 years

8. If two times the son's age is added to the father's age, the sum is 84 years. If twice the father's age is added to the son's age, the total becomes 108 years. What is the father's age?
A) 40 years B) 42 years
C) 44 years D) 46 years

9. Ravi was born three years after his parents got married. His mother is six years younger than his father but 18 years older than Ravi, who is currently 12 years old. At what age did Ravi's father get married?
A) 21 years B) 24 years
C) 27 years D) 30 years

10. Ten years ago, the father's age was four times the age of his daughter. Ten years from now, the father's age will be double the age of his daughter. What is the ratio of their present ages?
A) 3 : 1 B) 5 : 2
C) 7 : 3 D) 9 : 4

11. Eight years ago, the ratio of the ages of Arjun and Bhargav was 5 : 4. Six years from now, the ratio of their ages will be 7 : 6. What is Bhargav's current age?
A) 36 years B) 30 years
C) 28 years D) 24 years

12. Five years ago, Meera's age was four times the age of her brother Raj. The sum of their current ages is 30 years. What will be Raj's age after 6 years?
A) 14 years B) 15 years
C) 16 years D) 17 years

13. In a family, the father's age is four times the son's age, and the mother is three years younger than the father. If the average age of all three is 41 years, what is the ratio of the ages of son, father, and mother?
A) 7 : 28 : 25 B) 6 : 44 : 21
C) 15 : 20 : 17 D) None of these

14. Ravi's current age is (x + 7) years. Two years from now, the ratio of Ravi's age to Meera's age three years ago will be 7 : 5. If Ravi is 6 years older than Meera, then what is the present age of Tara, whose age is 3 years less than the average of Ravi and Meera's current ages? (In yrs)
A) 30.5 B) 29
C) 31.5 D) 32

15. The present age ratio of Rahul and Kiran is 3 : 4. The ratio of Nitin's age after 5 years to Kiran's age 1 year ago is 4 : 3. Also, four times the difference of ages between Kiran and Rahul is one more than Nitin's present age. What is the average of the present ages of Rahul and Kiran? (In yrs)
A) 12 B) 13
C) 14 D) 15

Scan the QR code for Key

These model questions were prepared by subject experts



దేశమంతా ఒకే పన్ను విధానం ఉండాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న అతిపెద్ద ఆర్థిక సంస్కరణే వస్తు సేవల పన్ను. విస్తృత శ్రేణిలో ఉన్న పరోక్ష పన్నులన్నింటినీ కలిపి ఒకే గొడుగు కిందకు తెచ్చింది. పన్నుల వ్యవస్థలో పారదర్శకతతో అటు దేశ ఆర్థిక స్థితిగతుల బలోపేతానికి, ఇటు ప్రజలకు, వ్యాపారులకు ఎన్నోరకాల ప్రయోజనాలను అందించేందుకు దోహదపడుతోంది. రాష్ట్రాల మధ్య స్వేచ్ఛగా సరకుల రవాణా, సులభతరంగా పన్ను చెల్లింపులు, పన్నుపై పన్ను తొలగింపు మొదలైన పెను మార్పులకు కారణమైన ఈ సరికొత్త పన్ను గురించి పోటీ పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. జీఎస్టీ నేపథ్యం, అమలు విధానం, లక్షణాలు, ప్రయోజనాలు, విజయాలతో పాటు ఇందులోని పన్ను స్లాబులు, వాటిని నిర్ణయించే అంశాలు సహా దీని పరిధిలోకి రాని వస్తువుల వివరాలనూ తెలుసుకోవాలి.


సరళం.. సమర్థం.. పారదర్శకం!

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

జీఎస్టీ (వస్తుసేవల పన్ను)

(అర్థం, పరిణామం, ప్రయోజనాలు, ఇటీవలి విజయాలు)

'ఒకే దేశం, ఒకే మార్కెట్, ఒకే పన్ను' అనే నినాదంతో భారత దేశంలో అమలవుతున్న ఏకీకృత పరోక్ష పన్ను విధానమే జీఎస్టీ. దేశాన్ని ఆర్థిక సమాఖ్యగా మార్చేందుకు చేపట్టిన అతి ముఖ్యమైన ఆర్థిక సంస్కరణగా నిలిచింది. 2017, జులై 1న జీఎస్టీని ప్రవేశపెట్టగా, 2025, జులై 1 నాటికి ఎనిమిదేళ్లు పూర్తయ్యాయి. వస్తువులు, సేవలపై ఉన్న బహుళ పన్నులను తొలగించి మొత్తం దేశాన్ని ఒకే పన్ను విధానంలోకి తీసుకురావడమే దీని ఉద్దేశం. జీఎస్టీలో జీ అంటే గుడ్ (మంచి), ఎస్ అంటే సింపుల్ (సరళమైన) అని, న్యూ ఇండియాకు ఇదో గొప్ప చట్టమని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు.


అసీమ్‌దాస్ గుప్తా

పరిణామ క్రమం: ✪ 2000లో అసీమ్‌దాస్ గుప్తా ఆధ్వర్యంలో ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు తర్వాత తొలిసారిగా జీఎస్టీని ప్రతిపాదించారు. ✪ 2003లో విజయ్ కేల్కర్ నేతృత్వంలోని కమిటీ భారతదేశంలో పన్ను నిర్మాణాన్ని మెరుగుపరిచేలా జాతీయ స్థాయిలో జీఎస్టీ ఉండాలని సిఫార్సు చేసింది. ✪ 2006లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ బిల్లును ప్రవేశపెడుతూ 2010, ఏప్రిల్ 1 నాటికి జీఎస్టీని అమలు చేయాలని ప్రతిపాదించింది. కానీ అమలు కాలేదు. ✪ 2014, డిసెంబరు 19న జీఎస్టీ అమలు కోసం లోక్ సభలో రాజ్యాంగ సవరణ బిల్లు-122ను ప్రవేశపెట్టారు. ✪ 2015, మే 6న లోకసభ జీఎస్టీ బిల్లును ఆమోదించింది. ✪ 2016, ఆగస్టు 3న రాజ్యసభ ఆమోదం పొందింది. ✪ 2016, సెప్టెంబరు 8న రాష్ట్రపతి సంతకంతో 101వ రాజ్యాంగ సవరణ చట్టం కింద జీఎస్టీ ఆమోదం పొందింది. ✪ 2017, జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. జులై 1ని 'జీఎస్టీ డే'గా వ్యవహరిస్తున్నారు.


విజయ్ కేల్కర్

జీఎస్టీ ముఖ్య లక్షణాలు

ఒకే దేశం, ఒకే పన్ను: జీఎస్టీ విస్తృతశ్రేణి పరోక్ష పన్నులను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. ఎక్సైజ్ సుంకం, సేవా పన్ను, వ్యాట్ (వీఏటీ), ఇతర సుంకాలను భర్తీ చేసింది. దేశవ్యాప్తంగా పన్ను వ్యవస్థలో స్థిరత్వాన్ని తీసుకురావడానికి ఇది సహాయపడుతుంది.

ద్వంద్వ నిర్మాణం: జీఎస్టీని ద్వంద్వ నమూనాతో రూపొందించారు. ఇందులో రాష్ట్రంలోని లావాదేవీలకు సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ), స్టేట్ జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ), రాష్ట్రాల మధ్య వాణిజ్యానికి ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐ-జీఎస్టీ)లు ఉంటాయి.

గమ్యస్థాన ఆధారిత పన్ను: జీఎస్టీని మూలం వద్ద కాకుండా వినియోగ స్థానంలో వసూలు చేస్తారు. ఆ విధంగా తుది వినియోగదారులకు పన్ను భారాన్ని తగ్గిస్తుంది.

ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ): వ్యాపారాలు, ఇన్‌పుట్‌లకు సంబంధించి పన్నుపై పన్నును నిరోధిస్తుంది. ఉత్పత్తి, సరఫరా గొలుసు అంతటా ఖర్చులను తగ్గిస్తుంది.

కాంపోజిషన్ స్కీం: ఈ పథకం నిర్ణీత పరిమితి కంటే తక్కువ టర్నోవర్ ఉన్న చిన్న పన్ను చెల్లింపుదారుల కోసం ఉద్దేశించింది. ఇది వారి టర్నోవర్‌పై స్థిరరేటులో జీఎస్టీ చెల్లించడానికి వీలు కల్పిస్తుంది.

ఆన్‌లైన్ వర్తింపు: జీఎస్టీ రిజిస్ట్రేషన్, రిటర్న్ ఫైలింగ్, చెల్లింపులతో సహా సంబంధిత ప్రక్రియలన్నీ 'జీఎస్‌టీఎన్' పోర్టల్ ద్వారా జరుగుతాయి. ఈ డిజిటల్‌విధానం వ్యాపారసామర్థ్యాన్ని, సౌలభ్యాన్ని మెరుగుపరుస్తుంది.

రంగాలవారీ మినహాయింపులు: ఆరోగ్య సంరక్షణ, విద్య లాంటి రంగాలకు మినహాయింపు లేదా తక్కువ రేట్లకు పన్ను విధిస్తుంది. ఇది అవసరమైన సేవలను అందరికీ అందుబాటులో ఉంచుతుంది.

ఖాతాల పరిష్కారం: కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆదాయ భాగస్వామ్యాన్ని జీఎస్టీ సజావుగా నిర్దేశిస్తుంది. ఆర్థిక సమతౌల్యత, సహకారాన్ని కొనసాగించడానికి క్రెడిట్ బదిలీలు సజావుగా జరుగుతాయి.

జీఎస్టీ వ్యవస్థ నిర్మాణం

భారతదేశంలో జీఎస్టీ రేట్లను జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయిస్తుంది. ఇందులో కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు ఉంటారు. ప్రస్తుత జీఎస్టీ విధానంలో 0%, 5%, 12%, 18%, 28% స్లాబ్‌లు ఉన్నాయి. ఈ రేట్లు దేశవ్యాప్తంగా అధిక శాతం తయారీ వస్తువులు, సేవలకు వర్తిస్తాయి.



ప్రధాన స్లాబ్‌లతోపాటు మూడు ప్రత్యేక రేట్లు ఉన్నాయి. బంగారం, వెండి, వజ్రాల ఆభరణాలపై 3 శాతం; కట్ చేసిన, పాలిష్ చేసిన వజ్రాలపై 1.5%; ముడివజ్రాలపై 0.25% విధిస్తారు. పొగాకు ఉత్పత్తులు, మోటారు వాహనాల లాంటి ఎంపిక చేసిన వస్తువులపై వివిధ రేట్ల మేరకు జీఎస్టీ పరిహార సెస్ కూడా విధిస్తారు. జీఎస్టీ విధానంతో రాష్ట్రాలకు కలిగే ఏదైనా నష్టాన్ని భర్తీ చేయడానికి ఈ సెస్ ఉపయోగపడుతుంది.

ప్రయోజనాలు

ఎంఎస్ఎంఈలకు మద్దతు: జీఎస్టీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు పెద్ద ఉపశమనం కలిగించింది. గతంలో వ్యాట్, ఇతర రాష్ట్ర పన్నుల కింద మినహాయింపుల పరిమితి చాలా తక్కువగా ఉండేది. జీఎస్టీ రాకతో వారికి మినహాయింపు పరిమితి పెరిగింది. ప్రారంభంలో రూ.20 లక్షలుగా నిర్ణయించిన వ్యాపార పరిమితిని తర్వాత రూ.40 లక్షలకు పెంచారు.



✪ పన్ను భారాన్ని మరింత తగ్గించడానికి జీఎస్టీ ఒక కాంపోజిట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం వార్షిక టర్నోవర్ రూ.1.5 కోట్ల వరకు వస్తువులు, రూ.50 లక్షల వరకు సేవలను కవర్ చేస్తుంది.



✪ ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంట్ సిస్టమ్ (TReDS) అనేది జీఎస్టీ క్రెడిట్‌ను సులభంగా పొందేందుకు వీలు కల్పిస్తుంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల వాణిజ్య రిసీవబుల్స్ ఫైనాన్స్ తగ్గింపునకు ఒక వేదిక.

✪ ఎంఎస్ఎంఈల కోసం ఇతర చొరవలు.. రూ.50 లక్షల వరకు టర్నోవర్ ఉన్న సర్వీస్ ప్రొవైడర్ల కోసం ఒక కాంపోజిట్ స్కీమ్ ప్రవేశపెట్టింది.

✪ రూ.5 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న చిన్న పన్ను చెల్లింపుదారులు, ఇప్పుడు ప్రతి నెలా కాకుండా మూడు నెలలకోసారి రిటర్న్‌లు దాఖలు చేయవచ్చు.



రవాణా, లాజిస్టిక్ రంగానికి ప్రోత్సాహం: జీఎస్టీ సరకు రవాణా రంగాన్ని సంస్కరించింది. రాష్ట్ర సరిహద్దుల్లో వస్తువులు ఇప్పుడు వేగంగా, స్వేచ్ఛగా కదులుతున్నాయి. పలు అధ్యయనాల ప్రకారం సరకు రవాణా సమయం 33% పైగా తగ్గింది.

వినియోగదారులకు మేలు

జీఎస్టీ అనేది వినియోగదారులకు అనుకూలమైన సంస్కరణ. బహుళ పన్నులు తొలగించడం, మెరుగైన సమ్మతితో సగటు పన్ను రేట్లు తగ్గాయి. దీనివల్ల పన్ను చెల్లింపుదారుల సంఖ్య 60 లక్షల నుంచి 1.5 కోట్లకు పెరిగింది.



✸ తృణధాన్యాలు, తినదగిన నూనెలు, చక్కెర, స్నాక్స్, స్వీట్స్ వస్తువులపై ప్రస్తుతం తక్కువ పన్ను రేట్లే ఉన్నాయి.

✸ ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన అధ్యయనంలో జీఎస్టీ వల్ల కుటుంబాల నెలవారీ ఖర్చుల్లో కనీసం 4% ఆదా అవుతున్నట్లు పేర్కొంది.

విజయాలు

✪ జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పన్ను వసూళ్ల సేకరణ, పన్ను సెస్ విస్తరణలో బలమైన వృద్ధిని చూపింది. ఇది భారతదేశ ఆర్థిక స్థితిని క్రమంగా బలోపేతం చేసింది. పరోక్ష పన్నులను మరింత సమర్థంగా, పారదర్శకంగా మార్చింది.

✪ 2024-25లో జీఎస్టీ రూపంలో స్థూలంగా రూ.22.08 లక్షల కోట్లు వసూలయ్యాయి. వార్షిక వృద్ధి 9.4% నమోదైంది. నెలవారీ వసూళ్ల సగటున రూ.1.84 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఈ వసూళ్లు ఆర్థిక కార్యకలాపాల్లో స్థిరమైన వృద్ధిని ప్రతిబింబిస్తున్నాయి. డెలాయిట్ సర్వే ప్రకారం సరళీకృత ప్రక్రియలు-మెరుగైన క్రెడిట్ ప్రవాహం, బలమైన డిజిటల్ మౌలిక సదుపాయాలను ఉదహరిస్తూ 85% పరిశ్రమల నుంచి జీఎస్టీ విధానానికి ఆమోదం లభించినట్లు పేర్కొంది.



రచయిత: వవరపల్లి రమణయ్య

మాదిరి ప్రశ్నలు

కరెంట్ అఫైర్స్

✿ కమిల్ అల్ – తైబ్– ఇద్రిస్ ఇటీవల ఏ దేశ నూతన ప్రధానిగా నియమితులయ్యారు?



(సూడాన్ సైన్యాధికారి జనరల్ అబ్దెల్–ఫత్తా బుర్హాన్ ఈయనను దేశ ప్రధానమంత్రిగా నియమించారు.) **జ:** సూడాన్

✿ నేపాల్‌లోని ఏ హిమానీనదాన్ని ఇటీవల అధికారికంగా 'చనిపోయినట్లు' ప్రకటించారు?

జ: యాలా హిమానీనదం

(నేపాల్‌లోని లాంగ్‌టాంగ్‌లో ఉన్న యాలా హిమానీనదం 1970 నుంచి దాని ద్రవ్యరాశిలో 66 శాతం కోల్పోయి 784 మీటర్ల వెనక్కి వెళ్లిన నేపథ్యంలో దీన్ని అధికారికంగా 'చనిపోయినట్లు' ప్రకటించారు.)

✿ ఏ సంవత్సరం నాటికి సంప్రదాయ బార్‌కోడ్‌ల స్థానంలో తదుపరి తరం క్యూఆర్ కోడ్‌లను ప్రవేశపెట్టాలని గ్లోబల్ స్టాండర్డ్స్ సంస్థ 'జీఎస్1' ఇటీవల నిర్ణయించింది?

(50 ఏళ్ల కిందట మొదటి బార్‌కోడ్ వ్యవస్థను గ్లోబల్ స్టాండర్డ్స్ వన్ (జీఎస్1) సంస్థ ప్రవేశపెట్టింది.) **జ:** 2027

✿ ఏ రెండు దేశాలు ఇటీవల తమ ఉమ్మడి సైనిక విన్యాసాలను 'గోల్డెన్ డ్రాగన్–2025' పేరిట నిర్వహించాయి?

(ఈ రెండు దేశాల మధ్య ఏడో ఉమ్మడి సైనిక విన్యాసాలను కాంబోడియాలో నిర్వహించాయి.)

జ: చైనా - కాంబోడియా

✿ ప్రపంచ తేనెటీగల దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి ఏటా ఏ రోజున నిర్వహిస్తోంది?

('బీ ఇన్‌స్పైర్డ్ బై నేచర్ టు నరిష్ అజ్ ఆల్' అనే థీమ్‌తో ఈ ఏడాది 'వరల్డ్ బీ డే'ను నిర్వహించారు.)

జ: మే 20

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



☛ ఐఏఎఫ్ అగ్నివీర్ వాయు ఉద్యోగాలు
చివరి తేదీ: 31.07.2025

☛ ఇంటెలిజెన్స్ బ్యూరోలో 3,717 ఖాళీలు
చివరి తేదీ: 10.08.2025

అందం అంటే భయపడితే కాలో ఫోబియా!

జనరల్ స్టడీస్ - బయాలజీ

రోగనిరోధక వ్యవస్థ

మానవ దేహంలో అంతర్లీనంగా ఉండే అద్భుతమే రోగనిరోధక వ్యవస్థ. సూక్ష్మజీవులు, వ్యాధికారకాల నుంచి ఆరోగ్యాన్ని నిరంతరం కాపాడే కవచం. కణాలు, వివిధ అవయవాలు, ప్రతిరక్షకాలతో కూడిన ఈ వ్యవస్థ, శరీరంలోకి ప్రవేశించే హానికరమైన వాటిని గుర్తించి ఎదుర్కొంటుంది. శరీర కణజాలం నుంచి అనవసరమైన పదార్థాలను వేరుచేసి వ్యాధుల నుంచి రక్షిస్తుంది. పుట్టుకతో వచ్చే రోగనిరోధక వ్యవస్థకు తోడు మనిషి పెరిగేకొద్దీ నిర్దిష్ట వ్యాధి కారకాలను ఎదుర్కోవడానికి టీకాలు అవసరమవుతాయి. విస్తృత పరిధి ఉన్న ఈ అంశంపై పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. పలు అంటురోగాలు, ప్రాణాంతక వ్యాధులు, జన్యుపరమైన రుగ్మతలు, వాటి గుర్తింపు, నిర్ధారణ పరీక్షలు, నివారణకు వాడే మందులు, చికిత్స విధానాలు, సంబంధిత శాస్త్రవేత్తల గురించి తెలుసుకోవాలి.




ఎడ్వర్డ్ జెన్నర్

1. వ్యాక్సిన్‌ల పితామహుడు?
   1) ఎడ్వర్డ్ జెన్నర్
   2) లూయీపాశ్చర్
   3) విలియం హార్వే
   4) 1, 2

2. ఇమ్యునిటీ అంటే?
   1) మినహాయింపు
   2) దీవి
   3) స్వేచ్ఛ
   4) 1, 3

3. కింది వాటిలో సత్యవాక్యాన్ని ఎన్నుకోండి.
   ఎ) ప్రథమ రక్షణ రేఖ: హానికర సూక్ష్మజీవులు దేహంలోకి ప్రవేశించినప్పుడు శ్లేష్మస్తరం, లాలా జలం, కన్నీరు... వాటి ప్రవేశాన్ని ఆపుతాయి.
   బి) ద్వితీయ రక్షణ రేఖ: వ్యాధిజనక జీవులను భక్షక కణాలు, ప్రతి సూక్ష్మజీవ ప్రొటీన్లు.. జ్వరం, ఉజ్వలనం లాంటి చర్యలతో నాశనం చేస్తాయి.
   సి) తృతీయ రక్షణ రేఖ: లింఫోసైట్లు సూక్ష్మజీవులతో పోరాడి రక్షణ కల్పిస్తాయి.
   డి) ప్రథమ, ద్వితీయ రక్షణ రేఖలు విశిష్టతను కలిగి ఉంటాయి.
   1) ఎ, బి, సి 2) ఎ, బి
   3) ఎ, బి, సి, డి 4) ఎ

4. కింది వాటిలో చిన్న లింఫోసైట్లు కానివి?
   1) బి - కణాలు 2) టి - కణాలు
   3) ఎన్‌కె - కణాలు 4) పైవన్నీ

5. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
1) మిసెంగియల్ కణాలు	ఎ) ఊపిరితిత్తులు
2) హిస్టియోసైట్లు	బి) సైనోవియల్ ద్రవం
3) సైనోవియల్ కణాలు	సి) మూత్రపిండాలు
4) డస్ట్ కణాలు	డి) సంయోజక కణజాలం

   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
   3) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ 4) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి

6. కింది వాటిలో పెర్‌ఫోరిన్ అనే ప్రొటీన్లను ఉత్పత్తి చేసేవి?
   1) సహజ హంతక కణాలు 2) బి-లింఫోసైట్లు
   3) టి-లింఫోసైట్లు 4) 1, 2

7. కింది వాటిలో థైమస్ గ్రంథిలో పరిణతి చెందే కణాలు?
   1) టి - కణాలు 2) బి - కణాలు
   3) ఎన్‌కె - కణాలు 4) శోష కణాలు

8. బి – కణాలు ఏ జీవుల్లో బర్సాఫాబ్రిసియస్‌లో పరిణతి చెందుతాయి?
   1) క్షీరదాలు 2) పక్షులు
   3) సరీసృపాలు 4) ఉభయచరాలు

9. కింది వాటిలో ప్రతిదేహాలతో సంబంధం లేకుండా ప్రతి చర్యను చూపేవి?
   1) బి - కణాలు 2) టి - కణాలు
   3) ఎన్‌కె - కణాలు 4) పైవన్నీ

10. వాదన–ఎ: దీర్ఘకాలంగా జీవించే మానవుడు క్యాన్సర్‌కు గురవుతాడు.
    కారణం–బి: సహజ హంతక కణాల క్రియాశీలత వృద్ధుల్లో తగ్గిపోతుంది.
    1) ఎ సత్యం, బి అసత్యం. 2) ఎ, బి లు అసత్యాలు.
    3) ఎ, బిలు సత్యాలు; కానీ ఎకు, బి సరైన వివరణ కాదు.
    4) ఎ, బి లు సత్యాలు; ఎ కు బి సరైన వివరణ.

11. ఆల్వియోలార్ మాక్రోఫేజ్‌ల ఉత్పత్తి స్థానం?
    1) ఊపిరితిత్తులు 2) మెదడు
    3) ఎముకలు 4) రక్తం

12. కింది వాటిలో అలర్జీని కలగజేసే కణాలు?
    1) ప్రతిజనక సమర్పక కణాలు 2) మాస్ట్ కణాలు
    3) రక్త ఫలకికలు 4) 2, 3

13. అస్థిమజ్జలో మెగాకారియోసైట్స్ నుంచి ఏర్పడేవి?
    1) మాస్ట్ కణాలు 2) రక్త ఫలకికలు
    3) ప్రతిజనక కణాలు 4) 1, 2

14. భక్షక కణాలను దేని ఆధారంగా రెండు రకాలుగా వర్గీకరించారు?
    1) కేంద్రక త్వచం 2) జీనోమ్
    3) కేంద్రకం 4) రిక్తిక

15. కింది వాటిలో బహుకేంద్రక కణం కానిది?
    1) న్యూట్రోఫిల్స్ 2) మోనోసైట్స్
    3) బేసోఫిల్స్ 4) ఎసినోఫిల్స్


16. కింది వాటిలో బలహీన భక్షక కణాలు ఏవి?
    1) బేసోఫిల్స్ 2) ఎసినోఫిల్స్
    3) న్యూట్రోఫిల్స్ 4) పైవన్నీ

17. రక్తం వడపోత పరికరంగా ఉపయోగపడేది?
    1) ప్లీహం 2) లింఫ్ గ్రంథి
    3) సైనోవియల్ 4) 1, 2

18. కింది వాటిలో సత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
    ఎ) ఇంటర్ ల్యూకిన్ - రోగనిరోధక కణాలు విస్తృత విభజనలో పాల్గొనడం.
    బి) ఇంటర్‌ఫెరాన్‌లు - ఇవి వైరస్ సంక్రమణ కణాలు ఉత్పత్తి చేసే ప్రతి వైరల్ ప్రొటీన్లు.
    సి) బి-లింఫోసైట్‌ల నుంచి ప్రతిదేహాలు/ప్రతిరక్షకాలు ఏర్పడతాయి.
    డి) ప్లాస్మాలో, కణత్వచ ఉపరితలంపైనా అచేతనంగా ఉండే ప్రొటీన్లను 'పరిపూరక ప్రొటీన్లు' అంటారు.
    1) ఎ, బి 2) ఎ, బి, సి 3) ఎ, బి, సి, డి 4) ఎ, డి

19. కింది వాటిలో భౌతిక అవరోధాన్ని గుర్తించండి.
    1) చర్మం 2) శ్లేష్మస్తరాలు
    3) రోమాలు 4) 1, 2

20. కింది వాటిలో సత్య వాక్యాన్ని గుర్తించండి.
    ఎ) శరీరధర్మ పరమైన అవరోధానికి ఉదాహరణ - జీర్ణాశయంలో స్రవించే హైడ్రోక్లోరిక్ ఆమ్లం, లాలాజలం.
    బి) కణపరమైన అవరోధాలు - ల్యూకోసైట్లు, మోనోసైట్లు.
    సి) జీవులన్నింటికీ పుట్టుకతో ఉండే రోగనిరోధక శక్తిని సహజ లేదా స్వాభావిక రోగనిరోధకత అంటారు.
    డి) పుట్టిన శిశువుకు ఆర్జిత రోగ నిరోధకత అనేది తల్లి చనుబాల నుంచి లభిస్తుంది.
    1) ఎ, బి 2) సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి


రోడ్నీ పోర్టర్

21. కింది వారిలో ప్రతిదేహ మూల నిర్మాణాన్ని ప్రతిపాదించింది?
    1) రోడ్నీ పోర్టర్
    2) ఎడ్వర్డ్ జెన్నర్
    3) లూయీపాశ్చర్
    4) రాబర్ట్ కోచ్

22. కింది వాటిలో అసత్య వాక్యాన్ని గుర్తించండి.
    1) స్వేచ్ఛా చలనాలను నిరోధించేది - అవరోధం
    2) ప్రణాళిక కణ మరణాన్ని అపోప్టొసిస్/అప్సోనైజేషన్ అంటారు.
    3) కణ విచ్ఛిత్తి - సైటోలైసిస్
    4) లింఫాటిక్ కణజాలపు ముద్దలను 'టాన్సిల్స్' అంటారు.

23. ఎయిడ్స్‌ను కలిగించే వైరస్‌లో జీనోమ్‌కు ఇరువైపులా ఉండే ఎంజైమ్?
    1) రివర్స్ ట్రాన్స్ క్రిప్టేజ్ 2) సైటోకైనేజ్
    3) లైసిన్ 4) ల్యూసిన్

24. హెచ్‌ఐవీ మానవ శరీరంలో ప్రవేశించిన వెంటనే ఏ కణాలపై దాడిచేస్తుంది?
    1) మాక్రోఫేజ్‌లు 2) డెండ్రైట్‌లు
    3) ఇంటర్‌ఫెరాన్‌లు 4) 1, 2

25. హెచ్‌ఐవీ వైరస్‌ను గుర్తించే పరీక్ష?
    1) వెస్టర్న్ బ్లాట్ 2) పీసీఆర్
    3) చైన్ లింక్డ్ పరీక్ష 4) 1, 2

26. కింది వాటిలో సత్య వాక్యాన్ని గుర్తించండి.
    ఎ) 1952లో జోనస్ సాక్ పోలియోకు టీకాలు కనుక్కున్నారు.
    బి) 1957లో ఆల్బర్ట్ సాబిన్ పోలియో చుక్కల మందు కనుక్కున్నారు.
    సి) అద్భుత ఔషధ సృష్టికి మంత్రగాడు - యల్లాప్రగడ సుబ్బారావు
    డి) ప్రపంచంలో మొదటి అద్భుత ఔషధం - పెన్సిలిన్
    1) ఎ, బి 2) సి, బి, డి
    3) ఎ, బి, సి, డి 4) సి


జోనస్ సాక్

27. కిణ్వన ప్రక్రియలో వెలువడే వాయువు?
    1) CO_2 2) O_2 3) NO_2 4) H_2O

28. టెట్రాసైక్లిన్ ఏ వ్యాధులను నియంత్రిస్తుంది?
    1) టైఫాయిడ్ 2) క్షయ
    3) ప్లేగు 4) పైవన్నీ

29. 'వాక్సిన్' అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
    1) ఆంగ్లం 2) లాటిన్ 3) గ్రీకు 4) జర్మన్

30. కింది వాటిలో అసత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
    1) 1796 లో ఎడ్వర్డ్ జెన్నర్ మశూచికి వాక్సిన్ కనుక్కున్నారు.
    2) 1929 లో పెన్సిలిన్‌ను కనుక్కున్నది అలెగ్జాండర్ ఫ్లెమింగ్.
    3) ప్లాస్మోడియం జీవికి ఆడ క్యూలెక్స్ దోమ వాహకం.
    4) మలేరియా వ్యాధిపై ప్రయోగాలు చేసింది - రొనాల్డ్ రాస్.

31. నీటిని మరిగించడం వల్ల సూక్ష్మజీవులు చనిపోతాయని మొదటగా గుర్తించింది?
    1) లూయీపాశ్చర్ 2) రొనాల్డ్ రాస్
    3) స్పెల్లాంజని 4) కోచ్

32. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
1) రేబిస్	ఎ) జోన్
2) బీసీజీ	బి) లూయీపాశ్చర్
3) తట్టు	సి) లియోస్ కాల్‌మైట్
4) పోలియో	డి) ఆల్బర్ట్ సాబిన్

    1) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి 2) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
    3) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ 4) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి

33. శిశువు పుట్టినప్పుడు మొదటిసారిగా ఇచ్చే వ్యాక్సిన్?
    1) పోలియో 2) పెంటా వాలెంట్
    3) బీసీజీ 4) పీపీటీ

34. బయోటెక్నాలజీ ద్వారా మొదట తయారు చేసిన వ్యాక్సిన్?
    1) రేబిస్ 2) హెపటైటిస్-బి 3) బీసీజీ 4) 1, 2

35. కింది వాటిలో సత్య వాక్యాన్ని గుర్తించండి.
    1) సూక్ష్మజీవ నాశకాన్ని కనుక్కున్నది - వ్యాక్స్‌మాన్
    2) సూక్ష్మజీవ నాశకాన్ని వాడింది - బేట్స్
    3) క్లోరోమైసిన్ అనే మందు టైఫాయిడ్‌ను తగ్గిస్తుంది.
    4) పైవన్నీ

36. అందం అంటే భయపడటాన్ని ఏమంటారు?
    1) కాలో ఫోబియా 2) కొనియో ఫోబియా
    3) గెట్టో ఫోబియా 4) రూసో ఫోబియా

37. జాతీయ టీకాల దినోత్సవం?
    1) మార్చి - 15 2) మార్చి - 18
    3) మార్చి - 16 4) మే - 31

38. శరీరంలో మైక్రోగ్లియల్ కణాలు ఉండే ప్రాంతం?
    1) కాలేయం 2) మెదడు
    3) ఎముక 4) క్లోమం

39. శరీరంలో సంక్రమణ జరిగిన ప్రాంతంలో ఏర్పడిన చీములో అధిక సంఖ్యలో ఉండే కణాలు?
    1) బేసోఫిల్స్ 2) మోనోసైట్స్
    3) ఎసిడోఫిల్స్ 4) న్యూట్రోఫిల్స్

40. శిశువుకు జన్మనిచ్చిన స్త్రీల చనుబాలలో ఉన్న ప్రొటీన్?
    1) కొలస్ట్రమ్ 2) ప్రోలాక్టిన్
    3) లాక్టిన్ 4) జైమోజన్



రచయిత: వట్టిగొనళ్ల పద్మనాభం

సమాధానాలు

1-1; 2-4; 3-3; 4-3; 5-2; 6-1; 7-1; 8-2; 9-3; 10-4; 11-1; 12-4; 13-2; 14-3; 15-2; 16-2; 17-1; 18-3; 19-4; 20-4; 21-1; 22-2; 23-1; 24-4; 25-1; 26-3; 27-1; 28-4; 29-2; 30-3; 31-3; 32-1; 33-3; 34-2; 35-4; 36-1; 37-3; 38-2; 39-3; 40-1.



'అమరావతి శిల్ప సంపద' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో పున్నా కృష్ణమూర్తి

'అమరావతి శిల్ప సంపద' పుస్తకావిష్కరణ

ఈనాడు, అమరావతి: సీనియర్ పాత్రికేయుడు పున్నా కృష్ణమూర్తి రచించిన 'అమరావతి శిల్ప సంపద' పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆవిష్కరించారు. ధరణికోట-నాగార్జున కొండ శిల్పసంపదల సచిత్ర వ్యాస సంకలనంతో ఈ పుస్తకాన్ని రూపొందించారు.

పీ-4 మోడల్‌లో బీసీ వసతి గృహాల అభివృద్ధి: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోన్న పీ-4 మోడల్‌లో బీసీ సంక్షేమ వసతి గృహాలను అభివృద్ధి చేయనున్నట్లు ఆ శాఖ మంత్రి సవిత వెల్లడించారు. ఇందుకు దాతలు, విదేశీ విద్యా పథకం కింద ప్రభుత్వ లబ్ధి పొంది ఉన్నత స్థితిలో ఉన్న విద్యార్థుల సాయం తీసుకుంటున్నామని శుక్రవారం ఓ ప్రకటనలో వివరించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం ద్వారా లబ్ధి పొందిన చాలా మంది విద్యార్థులు ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. వారు తమ వంతుగా వసతి గృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సాయం అందించడానికి ముందుకు రావాలని కోరారు.

నేడు డీజీపీ ఎదుట ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు!

ఈనాడు, అమరావతి: మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు రాష్ట్ర కమిటీ సభ్యులు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఎదుట లొంగిపోనున్నారు. ఏపీకి చెందిన వీరిద్దరూ ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో పని చేస్తున్నారు. శనివారం వీరిని మీడియా ముందుకు హాజరు పరుస్తారు. ఇటీవల పెద్ద ఎత్తున లొంగిపోయిన మావోయిస్టులకు చెక్కుల పంపిణీ చేయడంతో పాటు స్వాధీనం చేసుకున్న ఆయుధాలను ప్రదర్శించనున్నారు.

ఆల్కహాల్‌ను పక్కదారి పట్టనివ్వకండి: ఎక్సైజ్ శాఖ

ఈనాడు, అమరావతి: పరిశ్రమలు, ఇతర అవసరాల కోసం ఉత్పత్తి అవుతున్న ఆల్కహాల్ పక్కదారి పట్టకుండా అన్ని డిస్టిలరీల వద్ద కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, కమిషనర్ నిషాంత్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఏ), రెక్టిఫైడ్ స్పిరిట్, ఆర్ఎస్‌ల దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు వీలుగా డిస్టిలరీల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

'ఆటో మ్యుటేషన్' పారదర్శకంగా అమలు చేయాలి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 17 నగరపాలక సంస్థల్లో ఆగస్టు 1 నుంచి అమలులోకి వచ్చే 'ఆటో మ్యుటేషన్'ను పారదర్శకంగా అమలు చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన నగరపాలక సంస్థల కమిషనర్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అధికారులతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'ప్రజలకు సత్వరం సేవలందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ మేరకు లక్ష్యం నెరవేరేలా కిందిస్థాయి అధికారులను సమాయత్తం చేయాలి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖతో సమన్వయం చేసుకుని కమిషనర్లు ముందుకెళ్లాలి' అని సురేశ్‌కుమార్ ఆదేశించారు.



మీ పురోగతిపై సంతృప్తి లేకపోతే..

ప్రస్తుతం చేస్తున్న అనుత్పాదక పనినే రోజూ చేస్తూ మీ జీవితంలో మెరుగైన మార్పులను కోరుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. మీ పురోగతిపై మీరు సంతృప్తిగా లేకపోతే.. వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టండి. మీ చుట్టూ కొత్త పని వాతావరణాన్ని ఏర్పాటుచేసుకోండి. కొత్త వ్యక్తులను కలవండి. సరికొత్తగా ఇంకేదైనా ప్రయత్నించండి. కొత్త అలవాట్లు నేర్చుకోండి. కంఫర్ట్ జోన్‌ను వీడేందుకు తటపటాయించకండి.

– మకెంజీ స్మిత్, మైండ్‌సెట్ కోచ్

ప్రొఫెసర్ పొరపాటు.. 138 మంది ఫెయిల్

సరిదిద్దిన జేఎన్‌టీయూ అధికారులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జవాబుపత్రాలు దిద్దడంలో ఓ ప్రొఫెసర్ చేసిన పొరపాటుతో మూడు కళాశాలలకు చెందిన 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఓ విద్యార్థి ద్వారా తప్పిదాన్ని గుర్తించిన అధికారులు సరిచేసి ఫలితాలను ప్రకటించారు. జేఎన్‌టీయూ నాలుగో ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షలు గత నెలలో జరిగాయి. ఫలితాలు ఈ నెల 17న ప్రకటించారు. చివరి ఏడాదిలో క్రెడిట్ బేస్డ్ సబ్జెక్టు ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్(ఈఐఏ) ఉంటుంది. ఈ సబ్జెక్టులో శ్రీదత్త, మల్లారెడ్డి, షాదన్ కళాశాలలకు చెందిన విద్యార్థులు అనుత్తీర్ణులయ్యారు. శ్రీదత్త కళాశాల విద్యార్థి జేఎన్‌టీయూ పరీక్షల విభాగం అధికారులకు మెయిల్ చేసి.. ఈఐఏ సబ్జెక్టులో ఎక్కువ మంది ఫెయిల్ కావడానికి అవకాశంలేదని మరోసారి ఫలితాలను చెక్ చేయాలని కోరాడు. అప్రమత్తమైన అధికారులు 138 మంది ఫెయిల్ అయ్యారని గుర్తించి.. వారి జవాబు పత్రాలను పరిశీలించగా దిద్దిన ప్రొఫెసర్ పొరపాటు చేసినట్లు తేల్చారు. పరీక్ష ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌లో వేర్వేరు ప్రశ్నపత్రాలతో నిర్వహించారు. ప్రొఫెసర్ ఉదయం ప్రశ్నపత్రంతోనే సాయంత్రం జవాబు పత్రాలనూ దిద్దినట్లు గుర్తించారు.

స్వదేశీ మైక్రో చిప్ సిద్ధం

- ఓయూలో స్వీయ ఆధారిత సెమీకండక్టర్ రూపకల్పన

ఈనాడు, హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల రూపొందించిన స్వదేశీ మైక్రోచిప్ సిద్ధమైంది. స్వీయ ఆధారిత సెమీకండక్టర్ చిప్‌ను ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం శుక్రవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని సీబీఐటీ సహకారంతో ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ నేతృత్వంలో పరిశోధనలు నిర్వహించారు. పంజాబ్‌లోని మొహాలి ఎస్‌సీఎల్(సెమీకండక్టర్ ల్యాబొరేటరీ) ప్రయోగశాలలో ఈ చిప్ పనితీరును అక్కడి శాస్త్రవేత్తలు పరిశీలించి ఆమోదించడంతో స్వదేశీ మైక్రోచిప్‌పై అధికార ముద్ర పడింది. దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో స్వదేశీ మైక్రోచిప్ తయారుచేసిన తొలి వర్సిటీగా ఓయూ చరిత్ర సృష్టించిందని ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం తెలిపారు. సూక్ష్మస్థాయిలో పరిశోధనలు నిర్వహించి విజయం సాధించిన ఆచార్యులు, విద్యార్థులను ఆయన అభినందించారు.

బ్లూటూత్ ఫ్రీక్వెన్సీ ఆధారంగా..

బ్లూటూత్ ఫ్రీక్వెన్సీ ఆధారంగా పనిచేసే ఈ సెమీకండక్టర్ చిప్.. గడియారం.. స్మార్ట్‌ఫోన్.. రాకెట్‌లలోని యంత్రాల అంతర్గత సామర్థ్యం పెంచుతుంది. 'ఫ్రీక్వెన్సీ సింథసైజర్' పేరుతో దీన్ని వ్యవహరిస్తున్నారు. 'చిప్ టు స్టార్టప్' పథకం కింద ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఇక డిజిటల్ పద్ధతుల్లో పనిచేసే వాహనాలు, పరికరాలు, ఇతర వస్తువుల అంతర్గత సామర్థ్యాన్ని ఈ మైక్రోచిప్ పెంచుతుంది. భవిష్యత్‌లో వీటిని ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలున్నాయి. ఫ్రీక్వెన్సీ సింథసైజర్ చిప్‌లు మన ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల రూపకల్పనలో గేమ్‌ఛేంజర్. మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 90 శాతం మైక్రోచిప్‌లను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం బ్లూటూత్ పరిజ్ఞానంతో పరిమితంగా సమాచారాన్ని, వీడియోలను, ఫైళ్లను ఇతరులకు పంపే వీలుండగా.. ఈ చిప్ ఉంటే అపరిమిత డేటాను బదిలీ చేయవచ్చని ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పి.చంద్రశేఖర్ వివరించారు.



మైక్రోచిప్‌ను ఆవిష్కరిస్తున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఇంజినీరింగ్ కళాశాల డీన్ కృష్ణయ్య, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్

మద్యం కుంభకోణంలో ఏ కంపెనీకి ఎంత సొమ్ము

ఈనాడు–అమరావతి: మద్యం కుంభకోణంలో 16 కంపెనీల నుంచి రూ.1,677.68 కోట్ల మేర వసూలు చేసినట్లు సిట్ గుర్తించింది. వాటి వివరాలను ప్రాథమిక అభియోగ పత్రంలో ప్రస్తావించింది.

ఏ కంపెనీకి ఎంత సొమ్ము జమచేశారు? వారి నుంచి ఎంత ముడుపులుగా తీసుకున్నారు? అనే వివరాలివి. (రూ. కోట్లలో)

డిస్టిలరీ/సరఫరా కంపెనీ	ఏపీఎస్‌బీసీఎల్ నుంచి జమైన సొమ్ము	ముడుపులుగా చెల్లించిన సొమ్ము
1. ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్	2,365.42	350
2. ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్	1,569.51	267
3. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్	1,472.57	218
4. బీఆర్‌కే స్పిరిట్స్	902	148
5. శర్వాణి ఆల్కో బ్రూ	894.11	133
6. అంబర్ స్పిరిట్స్	823	138
7. అదాన్ డిస్టిలరీస్	732.71	135
8. లీలా డిస్టిలరీస్	453.87	62
9. బీ9 బెవరేజెస్	360	43
10. పీవీ స్పిరిట్స్ అండ్ డిస్టిలరీస్ ఎల్ఎల్‌పీ	271.65	37.92
11. జీఎస్‌బీ అండ్ కో ఎల్ఎల్‌పీ	229	39
12. యూవీ డిస్టిలరీస్, హైదరాబాద్	224.53	29.80
13. బృందావన్ మార్కెటింగ్ ఏజెన్సీస్	221	27
14. వాహిని డిస్టిలరీస్	124	18
15. వర్సుసో బెవరేజెస్	105	15.96
16. ట్రోపికల్ ఇన్ బెవ్	89	16

ధ్రువీకరించిన ఉత్తర్వులను మా ముందు ఉంచండి

- జనసేన అధినేత వ్యాఖ్యల విషయంలో పిటిషనర్లకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వారాహి యాత్ర సందర్భంగా వాలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల విషయంలో ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు అనుమతినిస్తూ గుంటూరు కోర్టు ఇచ్చిన ఆదేశాలకు సంబంధించి ధ్రువీకరించిన ఉత్తర్వులను తమ ముందు ఉంచాలని పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు సింగిల్ జడ్జి శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చారు.

● నిఘా వర్గాల సమాచారం మేరకు రాష్ట్రంలో పలువురు యువతులు, మహిళలు అదృశ్యమయ్యారని అప్పట్లో పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. వాలంటీర్లు సేకరిస్తున్న సమాచారం కొంత మంది అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్లి మహిళలను అపహరిస్తున్నారన్నారు. ఈ వ్యాఖ్యలపై (పవన్ కల్యాణ్‌పై) నాటి వైకాపా ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో ఐపీసీ సెక్షన్ 499, 500 కింద గుంటూరు న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) ద్వారా క్రిమినల్ కేసు దాఖలు చేసింది. కేసు వేయడానికి అప్పట్లో ఆమోదం తెలిపిన ఐదుగురు వాలంటీర్లు.. తాజాగా అఫిడవిట్లు దాఖలు చేస్తూ వైకాపా నేతలు తమ నుంచి సంతకాలు తీసుకొని కోర్టులో పిటిషన్ వేశారన్నారు. పవన్ వ్యాఖ్యల వల్ల తమ ప్రతిష్ఠ దెబ్బతినలేదన్నారు. ఈ విషయాన్నే న్యాయాధికారి ముందు వాంగ్మూలం ఇచ్చారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్‌పై ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని పీపీ గుంటూరు కోర్టులో పిటిషన్ వేశారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న న్యాయాధికారి..జనసేన అధినేతపై ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు అనుమతిస్తూ గతేడాది నవంబర్ 18న ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ కె.సరళ మరో ముగ్గురు దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ కేసు శుక్రవారం హైకోర్టులో విచారణకు వచ్చింది.

హరిహర వీరమల్లులోని అభూతకల్పనలపై పవన్ స్పందించాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: 'హరిహర వీరమల్లు' సినిమా కథలోని అభూత కల్పనలపై ఆ చిత్ర కథానాయకుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి, చారిత్రక వాస్తవాలను ప్రజలకు తెలపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. 'ఏపీ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతాయుత పదవిలో ఉన్న ఆయన నటుడిగా అభూత కల్పనలతో కూడిన సినిమా తీయడం ఆక్షేపణీయం. చారిత్రక వాస్తవాలను వక్రీకరించి చిత్రాన్ని నిర్మించడం విచారకరం. కట్టు కథతో మతాల మధ్య అపోహలు పెరిగేలా చిత్ర కథాంశం ఉండటం సరికాదు. 1618లో జన్మించిన ఔరంగజేబు 1687లో గోల్కొండపై దండయాత్ర చేసినట్లు చరిత్ర చెబుతోంది. హరిహర వీరమల్లు చనిపోయి అప్పటికి 200 ఏళ్లపైనే అయ్యింది. ఇలాంటి పరిస్థితుల్లో ఔరంగజేబుతో వీరమల్లు యుద్ధం ఎలా చేశారు?' అని ప్రశ్నించారు.



పవనన్న పునాదిరాయేసినా.. పట్టించుకోరా..!

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: *రహదారి నిర్మాణాలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేసినా పనులు మొదలు కాకపోవడంపై అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం మద్రేబు, దాయర్తి గ్రామాల ఆదివాసీలు ఆందోళన బాటపట్టారు. శుక్రవారం సుమారు 3 కిలోమీటర్ల దూరం గుర్రాలతో యాత్ర చేసి నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, గిరిజనులు మాట్లాడుతూ.. అనంతగిరి మండలంలోని పినకోట, పెదకోట, జీనబాడు పంచాయతీల పరిధిలోని 11 పీవీటీజీ గ్రామాల్లో 2,500 మంది గిరిజనులు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతేడాది డిసెంబరులో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్.. గుమ్మంతి- రాచకీలం, రాచకీలం- రెడ్డిపాడు, బల్లగరువు- వాజంగి, పీచుమామిడి- గుమ్మంతి రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు. నేటికి 7 నెలలు కావస్తున్నా పనులు ప్రారంభించలేదని చెప్పారు. ఇక్కడి గిరిజనులు రేషన్ సరకులు పొందాలంటే కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందారు.*

డిగ్రీలో ప్రవేశాలకు మన్మోహన్‌సింగ్ వర్సిటీ ఆహ్వానం

పాల్వంచ, న్యూస్‌టుడే: తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణలో డిగ్రీలో బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బీఎస్సీ జియాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ ఓఎస్‌డీ జగన్‌మోహన్‌రాజు శుక్రవారం తెలిపారు. రెండు కోర్సుల్లో కలిపి 120 సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 31 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, ఆగస్టు 3న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

ఎస్‌ఎల్‌బీసీని సందర్శించిన కల్నల్ పరీక్షిత్ మెహ్రా

ఈనాడు, మహబూబ్‌నగర్: ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లిలోని ఎస్ఎల్‌బీసీ ఔట్‌లెట్ సొరంగాన్ని ఆర్మీ లెఫ్టినెంట్ కర్నల్ పరీక్షిత్ మెహ్రా శుక్రవారం పరిశీలించారు. ఔట్‌లెట్ ప్రాంతాలు పరిశీలించి.. ప్రమాదం జరిగిన ప్రాంతం వద్ద ప్రస్తుత పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. డీఈఈ చక్రపాణి, ఏఈఈ మహేందర్, జేపీ సంస్థ అధికారులు పాల్గొన్నారు.



టన్నెల్‌లో ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, నీటిపారుదలశాఖ అధికారులు

శాఖాపరమైన పరీక్షల వాయిదా

ఈనాడు, అమరావతి: వచ్చేనెల 1న ఉద్యోగులకు నిర్వహించాల్సిన శాఖాపరమైన రెండు పరీక్ష (పేపర్ కోడ్ నంబర్ 165, 166)లను వాయిదా వేసినట్లు ఏపీపీఎస్సీ తెలిపింది. వీటి నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

అంగన్‌వాడీల నిర్మాణానికి రూ.10 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: 2025-26కు గానూ రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి రూ.10 కోట్లు విడుదల చేస్తూ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ నిర్మాణాలు చేపట్టనున్నారు.

క్రీడా దినోత్సవం నిర్వహణపై సమీక్ష

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో క్రీడా రంగంలో సాధించిన ప్రగతి, క్రీడాకారులకు అందిన ప్రోత్సాహకాలు ప్రజలకు తెలియజేసేలా ఆగస్టు 29న క్రీడా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. దీనిపై విజయవాడలోని ఏపీటీడీసీ కార్యాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, శాప్ ఎండీ అజయ్‌జైన్, శాప్ ఛైర్మన్ రవినాయుడు అధికారులతో శుక్రవారం సమీక్షించారు. క్రీడా విజయాలు, తెచ్చిన సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రదర్శిస్తూ ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయాలని.. జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయిల్లో క్రీడాపోటీలు నిర్వహించాలని నిర్ణయించారు.

బదిలీలు, పదోన్నతులు పొందినా డీఎస్సీ టీచర్లు వచ్చాకనే రిలీవ్

ఈనాడు, అమరావతి: బదిలీలు, పదోన్నతులు పొందినప్పటికీ పాత పాఠశాలల్లోనే పని చేస్తున్న ఉపాధ్యాయులను డీఎస్సీ టీచర్లు వచ్చిన తర్వాత రిలీవ్ చేయనున్నారు. ఉపాధ్యాయ సంఘాలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పాఠశాల విద్యాశాఖ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. పదో తరగతి పరీక్షలను తెలుగు మాధ్యమంలోనూ రాసే అవకాశం కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి: ఏపీజీఈఏ

ఈనాడు, అమరావతి: ఉద్యోగుల బకాయిలు రూ.25 వేల కోట్లు చెల్లించాలని, పీఆర్సీకి విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో త్రిసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు సంఘ ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణ, రమేష్‌కుమార్ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 'రాష్ట్ర సచివాలయ ఉద్యోగులతో సమానంగా సీఆర్‌డీఏ పరిధిలో పని చేసే ఉద్యోగులందరికీ ఇంటి అద్దె భత్యం చెల్లించాలి. పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ బకాయిలు చెల్లించడంతో పాటు గత ప్రభుత్వంలో ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల నుంచి దొంగతనంగా తీసుకున్న రూ.500 కోట్ల సొమ్ముపై విచారణ జరిపించి, నివేదిక బహిర్గతం చేయాలి' అని విజ్ఞప్తి చేశారు.

నారసింహ క్షేత్రంలో శ్రావణమాసం ఆరాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీపంచనారసింహ క్షేత్రంలో సనాతన సంప్రదాయాలకు దర్పణం పట్టే దివ్యమైన శ్రావణమాసం వేడుకలు శుక్రవారం మొదలయ్యాయి. హరిహర ఆలయాల్లో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. పెంచిన సత్యనారాయణస్వామి వ్రతం టికెట్ ధరను ఆలయ ఈవో వెంకట్రావు, ధర్మకర్త నరసింహమూర్తి దంపతులు కొనుగోలు చేసి వ్రతంలో పాల్గొన్నారు. ఈ మొక్కును తీర్చుకునే దంపతులకు లక్ష్మీనరసింహస్వామి, సత్యదేవుడితో కూడిన రాగి ప్రతిమ, ఉత్తరీయం అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రసాదాల కొనుగోలులో భక్తులకు ఇబ్బంది కలగకుండా, గతంలోని టికెట్ కౌంటర్లను ఆలయ మాఢవీధిలోకి మార్చి ప్రారంభించారు. కొండ కింద వైకుంఠ ద్వారం కూడలికి హనుమాన్ సర్కిల్‌గా నామకరణం చేశారు.



భక్తులకు అందజేసే రాగి ప్రతిమ

గవర్నర్‌ను కలిసిన జస్టిస్ దేవానంద్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను జస్టిస్ బట్టు దేవానంద్ తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి శుక్రవారం గవర్నర్ బంగళాలో కలిశారు. జస్టిస్ దేవానంద్‌తోపాటు ఆయన సతీమణి పద్మకుమారి, కుమార్తెలు మౌని, కీర్తి ఉన్నారు. మద్రాసు హైకోర్టు నుంచి జస్టిస్ దేవానంద్ బదిలీపై ఏపీ హైకోర్టుకు తిరిగి వచ్చిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం 10 గంటలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్.. జస్టిస్ దేవానంద్‌తో ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేయించనున్నారు.

కార్గిల్‌లో భారత సైన్యం తెగువ స్ఫూర్తిదాయకం: గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: దేశ సార్వభౌమత్వం కాపాడటానికి భారత సైన్యం చూపిన పరాక్రమం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం అని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో దేశం కోసం తమ ప్రాణాలు అర్పించిన భారత అమరులకు 'కార్గిల్ విజయ్ దివస్' సందర్భంగా నివాళులర్పించారు. 'అత్యంత ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ భారత సాయుధ దళాలు ప్రదర్శించిన అచంచల ధైర్యం, దృఢ సంకల్పానికి శక్తిమంతమైన చిహ్నంగా కార్గిల్ యుద్ధం నిలిచింది' అని గవర్నర్ తెలిపారు.

● 'ఫిడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకున్న భారత చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఫైనల్‌లోనూ ఆమె విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని గవర్నర్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

● 'కర్నూలులోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ నుంచి యూఎల్‌పీజీఎం-వీ3ని విజయవంతం కావటంలో భాగమైన డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, వారి బృందానికి నా అభినందనలు. ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఈ అధునాతన రక్షణ ప్రాజెక్టులో భాగస్వామి కావడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణం' అని గవర్నర్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

దేశ రక్షణలో ఏపీ భాగస్వామ్యం గర్వకారణం

- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: దేశ రక్షణ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ భాగస్వామి కావడం గర్వకారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన యూఏవీ లాంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మిసైల్ (యూఎల్‌పీజీఎం-వీ3)ను కర్నూలు జిల్లాలోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజిలో విజయవంతంగా పరీక్షించడంపై హర్షం వ్యక్తం చేశారు. అందులో భాగమైన శాస్త్రవేత్తలు, రక్షణ నిపుణులకు 'ఎక్స్' వేదికగా సీఎం అభినందనలు తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని యూఎల్‌పీజీఎం-వీ3 ప్రతిబింబిస్తోందన్నారు.

● ప్రతిష్ఠాత్మక ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్‌కు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి చేరడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు. 'ఎక్స్' వేదికగా శుక్రవారం ఆమెకు అభినందనలు తెలిపారు. ఆమె దీక్ష, పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఫైనల్‌లో ఆమె విజయం సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

● ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్‌కు తెలుగమ్మాయి, గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి చేరడంపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఫిడే ఫైనల్‌కు ఇద్దరు భారతీయులు చేరడం చరిత్రాత్మకమని 'ఎక్స్' వేదికగా శుక్రవారం వారికి అభినందనలు తెలిపారు.

మద్యం కుంభకోణంలో సూత్రధారికీ శిక్ష తప్పదు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ప్రధాన సూత్రధారికీ శిక్ష తప్పదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 'వైకాపా నాయకులు ప్రజాధనాన్ని దోచుకుని, ప్రజారోగ్యంతో ఆటలాడారు. ప్రపంచ చరిత్రలో ఇలాంటి మద్యం కుంభకోణం ఎవరూ చూడలేదు. నాసిరకం మద్యం వల్ల 2020 తర్వాత దీర్ఘకాల కిడ్నీ కేసుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కొత్తగా 91 వేల కేసులు వచ్చాయి. కాలేయం దెబ్బతిన్న కేసులు 14వేల నుంచి 29వేలకు పెరిగాయి. బ్రెయిన్ స్ట్రోక్ కేసులు 2020లో 380 మాత్రమే ఉంటే.. 2024 నాటికి 7,680కి పెరిగాయి. ఈ పరిస్థితికి మద్యమే ప్రధాన కారణం. గత ప్రభుత్వం తెచ్చిన ఎక్సైజ్ పాలసీలోకి గోవిందప్ప ఎందుకు వచ్చారో.. ముడుపులు తీసుకుని ప్యాలెస్‌లో ఎవరికి ఇచ్చారో తేలాలి' అని మంత్రి వ్యాఖ్యానించారు. 'అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ కాదు.. ఆక్వా వ్యాలీ' అంటూ వైకాపా నాయకుడు కేతిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందిస్తూ.. 'గతంలో కేతిరెడ్డి ఉదయాన్నే వెళ్లి ఖాళీ స్థలాలు చూసి కబ్జాలు చేసుకునేవారు. ఇప్పుడు ఓడిపోయి.. పనీ పాటా లేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రపంచంలో మారుతున్న సాంకేతికతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిపుచ్చుకుంటున్నాయి. రాష్ట్రానికి రూ.కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. రాజకీయాల కోసం రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసే ప్రయత్నం చేయవద్దు' అని మంత్రి విమర్శించారు.

ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో రాష్ట్రానికి నష్టం లేదు

- ట్రైబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలు

ఈనాడు, హైదరాబాద్: 'తెలంగాణలో నిర్మాణంలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి, ఎస్సెల్బీసీతో పాటు కృష్ణా బేసిన్‌లోని కరవు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు నీటి కేటాయింపులు చేయాలి. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నష్టం వాటిల్లదు. ఇప్పటికే ఆ రాష్ట్రం.. ఇతర బేసిన్లలోని అవసరాలకు సరిపోను జలాలు తీసుకెళ్తోంది' అని కృష్ణా జలాల పునఃపంపిణీపై విచారణ నిర్వహిస్తున్న ట్రైబ్యునల్ ఎదుట శుక్రవారం తెలంగాణ వాదనలు వినిపించింది. 'ఏపీ ఇప్పుడు తరలిస్తున్న కృష్ణా జలాల కన్నా తక్కువే ఆ రాష్ట్రానికి సరిపోతాయి. వాస్తవానికి తెలంగాణ ప్రాంతానికి గ్రావిటీ ద్వారా నీళ్లు రాకుండా ఉమ్మడి రాష్ట్రంలో అన్యాయం చేశారు. దీంతో ఎత్తిపోతల పథకాల నిర్మాణం అనివార్యంగా మారింది' అని పేర్కొంది.

మద్యం కేసులో 12 మందిపై ఎన్‌బీడబ్ల్యూల జారీకి సిట్ పిటిషన్

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో పరారీలో ఉన్న పలువురు నిందితులను అరెస్టు చేసేందుకు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని కోరుతూ సిట్ అధికారులు శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేశారు. 12 మంది నిందితులకు ఎన్‌బీడబ్ల్యూలు జారీ చేయాలని కోరారు. ఏ7 ముప్పిడి అవినాష్‌రెడ్డి, ఏ9 ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏ10 షేక్ సైఫ్ అహ్మద్, ఏ40 పురుషోత్తం వరుణ్‌కుమార్, ఏ41 సైమన్ ప్రసన్న, ఏ42 బొల్లారం శివకుమార్, ఏ43 ముప్పిడి అనిరుధ్‌రెడ్డి, ఏ44 మోహన్, ఏ45 అనిల్‌కుమార్‌రెడ్డి తుమ్మల, ఏ46 కొమ్మారెడ్డి అవినాష్‌రెడ్డి, ఏ47 బెహరూన్ సజన్ షేక్, ఏ48 పింగళి రాజీవ్‌ప్రతాప్‌లకు జారీ చేయాలని కోరారు. దీనికి తగిన ఆధారాలను అందజేయాలని సిట్‌ను ఆదేశిస్తూ.. తదుపరి విచారణను న్యాయాధికారి ఈనెల 28కి వాయిదా వేశారు.

చెవిరెడ్డి ఫిజియోథెరపీ పిటిషన్‌పై..

ఈనాడు, అమరావతి: తనకు తిరుపతిలోని స్విమ్స్‌లో ఫిజియోథెరపీ చేయించుకునేందుకు అనుమతించాలని కోరుతూ మద్యం కేసు నిందితుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. అన్ని వసతులు ఉన్న ఆసుపత్రులు ఉన్నాయని సిట్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. స్విమ్స్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. తదుపరి విచారణను కోర్టు ఈనెల 29కి వాయిదా వేసింది.

వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌ల పిటిషన్లపై..

ఈనాడు, అమరావతి: ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, నాటి ఎక్సైజ్ శాఖలో ఓఎస్డీగా పనిచేసిన సత్యప్రసాద్‌లు ముందస్తు బెయిల్ కోరుతూ ఏసీబీ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు సిట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది. ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న చాణక్య, దిలీప్‌లు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై కోర్టు విచారణ జరిపింది. కౌంటర్ దాఖలుకు ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది సమయం కోరడంతో.. విచారణను 29కి వాయిదా వేసింది.